# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## మహాసభల సంచిక- 2016




## 2016 జూన్ 10, 11, 12 - గుంటూరు

















తమిళ,
ఒరియా గాయకులు
పైన

'పోలికేక'
నాటిక దృశ్యాలు

# వ్యత్యాసం

మహాకవి శ్రీశ్రీ

అదృష్టవంతులు మీరు
వెలుగును ప్రేమిస్తారు,
ఇరులను ద్వేషిస్తారు,
మంచికీ చెడ్డకీ నడుమ
కంచుగోడలున్నాయి మీకు

మంచి గదిలోనే
సంచరిస్తాయి మీ ఊహలు
ఇది వరకే ఏర్పడిందా గది
అందుకే వడ్డించిన విస్తరి మీ జీవితం
నిశ్చల నిశ్చితాలు మీవి

మంచిని గురించి,
మర్యాద, మప్పితం గురించి,
నడతా, నాణ్యం, విలువల విషయం
నిశ్చల నిశ్చితాలు మీవి
మీ కన్నుల చూపులు సరళరేఖలో!
రేఖ చెదిరితే గొల్లుమని పోతారు.
రేఖ కవతలివారంతా నేరగాళ్ళు.
రేఖను రక్షించడానికే
న్యాయస్థానాలు, రక్షకభట వర్గాలు,
చెరసాలలు, ఉరికొయ్యలు.
రేఖను కాపాడక తీరదు.

అభాగ్యులం మేము,
సరిహద్దులు దొరకని
సంధ్యలలో మా సంచారం
అన్నీ సమస్యలే, సందేహాలే మాకు
వెలుగులోని చీకట్లే
ఇరులలోని మిణుగురులే చూస్తాం
నూరుదోషాలలోని ఒక సుగుణం
నూరు పుణ్యాలలోని ఒక ఘోరం!
వ్యత్యాసాలూ, వ్యాఘాతాలే
అడుగడుగునా మాకు
మా వంట మేమే వండుకోవాలి

ఒక్కొక్క మారు విస్తరే దొరకదు
జీవితపు సన్నని సందులకే
ఆకర్షణ మాకు.

మా దృష్టిది వర్తుల మార్గం
ఆద్యంత రహితం
సంధ్యాజీవులం, సందేహభావులం
ప్రశ్నలే, ప్రశ్నలే,
జవాబులు సంతృప్తి పరచవు

మాకు గోడలు లేవు
గోడలను పగులగొట్టడమే మా పని

అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం
ముళ్ళూ, రాళ్ళూ, అవాంతరాలెన్ని ఉన్నా
ముందు దారి మాది

ఉన్న చోటు చాలును మీకు
ఇంకా వెనక్కి పోతామంటారు కూడా
మీలో కొందరు

ముందుకు పోతాం మేము
ప్రపంచం మా వెంట వస్తుంది

తృప్తిగా చచ్చిపోతారు మీరు
ప్రపంచం మిమ్మల్ని మరిచిపోతుంది

అభిప్రాయాల కోసం
బాధలు లక్ష్యపెట్టనివాళ్ళు
మాలోకి వస్తారు

అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించేవాళ్ళు
మీలోకి పోతారు

# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## రాష్ట్రమహాసభల సంచిక 2016

వెల: 30/-

ప్రతులకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్
విజయవాడ-2

రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, కృష్ణలంక
విజయవాడ-10

ప్రచురణ: కా॥ఎస్.ఝాన్సీ, కె.కోటయ్య, అధ్యక్ష-కార్యదర్శులు, రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, కృష్ణలంక, విజయవాడ-10

# విషయసూచిక


1. ముందుమాట 4
2. మహాసభల రిపోర్టు 6
3. స్వాగతోపన్యాసం 8
4. అధ్యక్షుల తొలిపలుకులు 17
5. బహిరంగసభలో వక్తల ఉపన్యాసాలు
    I. కా॥అరవింద్ సిన్హా 18
    II. కా॥ గుర్రం విజయకుమార్ 20
    III. కా॥ పి.అంజయ్య 24
    IV. కా॥ ఎస్.డి.బోస్ 25
    V. మోదుగుల పాపిరెడ్డి 26
    VI. కా॥శంభు మహతో 26
    VII. కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు 28
6. ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సందేశాలు
    I. కా॥వింధై వేందన్ 29
    II. కా॥ మల్లిఖార్జునరెడ్డి 29
    III. కా॥ బాబూరావ్ కుంబర్‌గావ్ 31
    IV. కా॥ శ్యాంసుందర్ భగత్ 32
    V. కా॥ భూతం వీరయ్య 32
    VI. కా॥ భీమ్రేడ్ శేషు 33
7. సోదర సంఘాల ప్రతినిధుల సందేశాలు
    I. కా॥పెద్దన్న 34
    II. కా॥ ఎం.లక్ష్మి 36
    III. కా॥ ఎస్.కె.బాషా 37
    IV. కా॥ ఎస్.కె.బాజీ సైదా 38
    V. కా॥ దివికుమార్ 39
    VI.కా॥ హనుమంతరావు 40
    VII. కా॥పాండురంగ వరప్రసాద్ 41
8. వ్యవసాయరంగం పై సామ్రాజ్యవాదుల పట్టు-పెరుగుతున్న సంక్షోభం - కా॥ ఎస్.ఝాన్సీ 42
9. అభివృద్ధి పేరుతో భూమి నుండి, అడవి నుండి గెంటి వేయబడుతున్న రైతుకూలీలు ఆదివాసులు-పెరుగుతున్న వలసలు -కా॥ జె.కిశోర్‌బాబు 48
10. కునారిల్లుతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతుకూలీలు, కార్మికులు - కా॥ ఎస్.ఝాన్సీ 50
11. విప్లవ భూసంస్కరణల ఆవశ్యకతను తెలుపుతున్న వ్యవసాయరంగ సంక్షోభం - కా॥పి.జశ్వంతరావు 53
12. రాష్ట్ర కార్యకలాపాల నివేదిక - కా॥ ఎస్.ఝాన్సీ 55
13. తీర్మానాలు 69
14. మహాసభల కరపత్రం 72
15. ఆహ్వానసంఘం కరపత్రం 74
16. డా॥బి.డి.శర్మకు నివాళి 76
17. అమరులకు జోహార్లు 78
18. జిల్లా మహాసభల ఫోటోలు 79

# ముందుమాట

2016 జూన్ 10, 11, 12 తేదీల్లో గుంటూరులో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల సావనీర్‌ను వెలువరిస్తున్నాం.

2014లో దేశవ్యాపితంగా ఎన్నికలతోపాటు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రెండు రాష్ట్రాలుగా విభజన జరిగింది. కేంద్రంలో, రెండు తెలుగు రాష్ట్రాలలో నూతన పాలకులు అధికారంలోకి వచ్చారు. కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఎన్‌డిఏ, ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టిడిపి, బిజెపిలు ఐక్యంగా విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాధికారంలోకి రాగా, తెలంగాణా రాష్ట్రంలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కేంద్రంలో ఇరు రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన ఈ పార్టీలన్నీ ఎన్నికల సందర్భంగా రైతుల, చేనేత కార్మికుల, డ్వాక్రా సభ్యుల రుణాలు రద్దుచేస్తామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మలుస్తామని రైతాంగానికి, ప్రజానీకానికి ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చినవే! గద్దెనెక్కిన తర్వాత వీరంతా ఈ వాగ్దానాలను పలు రూపాల్లో నీరుగార్చే ప్రయత్నం చేయటమే గాకుండా, గత పాలకుల వ్యవసాయ వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను మరింత పకడ్బందీగా అమలుచేస్తూ వస్తున్నారు.

వ్యవసాయంతోసహా భారతదేశంలోని సమస్త రంగాలను సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టివేసేందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు పూనుకొని వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ ఉత్పాదకాల ధరలు పెంచి, సంస్థాగత రుణాలను తగ్గించివేసి, సబ్సిడీలు దిగ్గోసి, పండిన పంటలకు న్యాయమైన ధర లేకుండాచేసి, రైతులు రుణభారంతో కూరుకుపోయే విధానాలను కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తూ వస్తున్నారు. ఈ రుణభారంనుండి బయటపడే మార్గంకానక రైతులు-ముఖ్యంగా కౌలురైతులు గత దశాబ్దకాలంలోనే లక్షలాదిమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయాన్ని గిట్టుబాటుగాకుండా చేసిన పాలకులు, రైతులు తమ భూములను వదలి పారిపోయే పరిస్థితులను కల్పిస్తున్నారు. ఇదే అదునుగా పట్టణ ప్రాంతాల బడా సంపన్నవర్గాలు, బహుళజాతి కార్పొరేటు సంస్థలు డబ్బాశచూపి లక్షలాది ఎకరాల భూములను రైతులనుండి కొనుగోలు చేస్తున్నారు. కాగా పాలకులు మరింతగా బరితెగించి ప్రాజెక్టులు, విమానాశ్రయాలు, పోర్టులు, బహుళవరుసల రహదార్లు, సెజ్‌లు తదితర పేర్లతో ముక్కారు పంటలు పండే భూములతోసహా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను రైతులనుండి బలవంతంగా గుంజుకొని కార్పొరేటు శక్తులకు కట్టబెడుతున్నారు. కార్పొరేటు, కంపెనీ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆహారపంటల దిగుబడిని తగ్గించి, విదేశీ దిగుమతులపై ఆధారపడేట్లుగా వ్యవసాయాన్ని మలిచే సామ్రాజ్యవాదుల వ్యూహాన్ని పాలకులు అమలుచేస్తున్నారు.

భూసేకరణ చట్టం-2013 కంటే తన భూసమీకరణే రైతులకు ప్రయోజనకరమైనదని రైతులను ఒకవైపు ప్రలోభపెడుతూ, మరోవైపు బెదిరింపులకు గురిచేస్తూ చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణంకోసమని గుంటూరుజిల్లా కృష్ణానదీతీర ప్రాంతంలోని సారవంతమైన భూములతోసహా రైతుల భూములను 33వేల ఎకరాలు గుంజివేసుకుంది. 'స్విస్ ఛాలెంజ్' విధానంలో ఈ భూములను సింగపూర్ కంపెనీకి కట్టబెట్టి రైతుల భూములతో రియల్‌ఎస్టేట్ వ్యాపారంజేస్తోంది. శ్రీకాకుళంలో-ప్రమాదకరమైన అణువిద్యుత్ కర్మాగారంకోసం, విజయనగరంజిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణంకోసం, గోదావరి జిల్లాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట, పెట్రో కారిడార్, ఆక్వాపార్క్‌లపేరిట; కృష్ణాజిల్లాలో పోర్టు, 'మచిలీపట్నం ప్రాంత అభివృద్ధి సంస్థ' (మడ) పేరున... ఈ విధంగా అన్ని జిల్లాలలో భారీగా భూములను గుంజివేసుకునే ప్రక్రియ సాగుతోంది. పోలవరం మునక గ్రామాల ప్రజలకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించకుండా లక్షలాదిమంది ఆదివాసులను అడవులనుండి గెంటివేస్తున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా కొండమొదలు ప్రాంత గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను గుంజుకొంటున్న ప్రభుత్వం, ఆ భూములు గిరిజనుల పేరిట లేవనే సాకుతో ఆ భూములకు పరిహారాన్ని భూస్వాములకు కట్టబెట్టేందుకు పూనుకోవటం పాలకుల వర్గస్వభావాన్ని వెల్లడిచేస్తూంది. మునక బాధితుల పక్షాన అడవికి అడవి, భూమికి భూమి నినాదంతో సంఘం నిరంతర కార్యాచరణలో వుంది. ప్రభుత్వాల భూసమీకరణ/ సేకరణ విధానాలను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో ప్రచార ఆందోళన సాగుతోంది. అభివృద్ధి పేరుతో పాలకులు

సాగిస్తున్న ఈ విధ్వంసాన్ని ప్రశ్నిస్తూ, కీలకమైన భూమి సమస్యను ఎజెండాపై నిలిపి 'దున్నేవానికే భూమి' ఆవశ్యకతను చాటిచెప్తూ బాధితుల పక్షాన వీలైన అన్నిరూపాలలో ప్రచార, ఆందోళనను సాగిస్తూవస్తున్నాం. అభివృద్ధి పేరుతో ఆదివాసులను అడవి నుండి గెంటి వేసి వలస కూలీలుగా మారుస్తున్నారీ పాలకులు.

వ్యవసాయరంగం సంక్షోభంలో వుండగా, వ్యవసాయంపై ఆధారపడిన రైతుకూలీలు, గ్రామీణ పేదలు ఉపాధికి దూరమై పొట్టచేతబట్టుకొని అసంఖ్యాకంగా వలసలు వెళ్తున్నారు. రైతుకూలీలకు, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించటంకోసమని ప్రభుత్వాలు కొనసాగిస్తూవస్తోన్న 'గ్రామీణ ఉపాధి హామీ పథకం' వలసలను ఆపలేకపోయింది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించలేకపోయింది. ప్రజల కొనుగోలుశక్తిని పెంచలేకపోయింది. పీకలలోతు అవినీతిలో కూరుకుపోయిన ఈ పథకం, అధికార రాజకీయ పార్టీల దిగువస్థాయి నాయకుల జేబులు నింపే పథకంగా మారిపోయింది. సంక్షేమ పథకాల పేరున ప్రభుత్వాలు అమలుచేసే విధానాలన్నీ, ప్రజలను నిరంతరం భ్రమలలో ముంచి, వారిని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారిగా పాలకుల బిక్షకోసం ఎదురుచూసేవారిగా మలుస్తున్నారనేది స్పష్టం.

మరోవైపున గ్రామీణ ప్రాంతాలలో దళితులు, బలహీనవర్గాలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. దళితులపై దాడులను ఖండిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని, దళితులపై దాడులకు మూలమైన కీలకమైన భూమి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ కలిసివచ్చే దళిత, ప్రజాస్వామిక శక్తులతో కలసి రైతుకూలీసంఘం నిర్దిష్ట కార్యాచరణ సాగిస్తూవస్తోంది. ఈ క్రమంలో కరపత్రాలు, రైతుకూ లీసంఘం బులిటెన్లతోపాటుగా, 'అణచబడ్డ దళితులంతా తిరగబడండి' పుస్తకాన్ని తెలుగుతోపాటుగా ఇంగ్లీషు, హిందీ భాషల్లో ప్రచురించింది. ఆధిపత్య కులశక్తులనుండి విడగొట్టుకొని అన్ని కులాలలోని పీడితులు, శ్రమజీవులు, దళిత శక్తులతో కలసి ఐక్యఉద్యమం సాగించాలనే అవగాహనతో రైతుకూలీసంఘం నిరంతర కార్యాచరణ సాగిస్తోంది.

మనదేశంలో విప్లవ భూసంస్కరణలు అమలుచేయటంద్వారా, దేశంలోని భూమి, వాతావరణం, నీటివనరుల లభ్యతపై ఆధారపడి మన ప్రజల అవసరాల ప్రాధామ్యంలో పంటలు పండించటంద్వారా, వ్యవసాయంపై ఆధారపడిన పరిశ్రమలను నెలకొల్పటంద్వారా వ్యవసాయం లాభసాటిగా మారటంతోపాటు, వ్యవసాయ కూలీలకు, గ్రామీణ పేదలకు, పట్టణ శ్రామికులకు ఉపాధి గ్యారంటీ చేయటంద్వారా నిజమైన అర్థంలో అభివృద్ధి, ప్రజల కొనుగోలుశక్తిని పెంచటం సాధ్యమౌతుంది. కానీ ప్రజాకర్షణ పథకాల ద్వారా ప్రజలలో కొనుగోలు శక్తి పెరగదు.

దేశంలో భూస్వామ్యవిధానాన్ని తమ సామాజిక పునాదిగావున్న సామ్రాజ్యవాదుల కబంధహస్తాలనుండి దేశాన్ని విముక్తిచేసే నూతన ప్రజాస్వామిక విప్లవం లక్ష్యంగా రైతుకూలీసంఘం స్పష్టమైన అవగాహనతో నిర్దిష్ట ప్రాంతాలలో నిలకడైన కృషి సాగిస్తోంది. (2010 రాష్ట్రమహాసభల నుండి 2016 రాష్ట్ర మహాసభల మధ్యకాలంలో కార్యకలాపాల సంక్షిప్త నివేదికను ఈ సంచికలో చూడగలరు)

గత మహాసభలనుండి ఈ మహాసభల మధ్యకాలంలో సంఘం రాష్ట్రనేతలు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలనేకమందిని కోల్పోయాం. ముఖ్యంగా పీడిత రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలకు ఎల్లవేళలా అండదండగా నిలిచిన ప్రజాతంత్ర మేధావి డా॥బి.డి.శర్మగారిని ఈ కాలంలో కోల్పోయాం. వీరందరికీ సంఘం తరపున జోహార్లర్పిద్దాం.

2001, 2005, 2010 సం॥లలో ప్రచురించిన రాష్ట్రమహాసభల సావనీర్లనూ, 2002, 2003, 2007, 2013 సం॥లలో ప్రచురించిన వార్షిక సంచికలను విస్తృత రైతాంగం మధ్యకు, మేధావుల నడుమకు తీసుకెళ్ళిన విధంగానే 2016 రాష్ట్రమహాసభల సావనీర్‌ను కూడా సంఘనిర్మాణ కృషికి ఉపయోగిస్తారని ఆశిస్తున్నాం.

రాష్ట్ర మహాసభల విశేషాలతో ఈ 'రాష్ట్ర మహాసభల సంచిక-2016' వెలువరిస్తున్నాం. గత వార్షిక సంచికలవలెనే ఈ సంచికనూ ఆదరిస్తారని ఆశిస్తూ, ఈ సంచిక రూపకల్పన, ముద్రణలలో తోడ్పడిన సహచరులు, కార్మిక మిత్రులకు, ముద్రాపకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**విజయవాడ** **రాష్ట్ర కార్యవర్గం**

**10-8-2016** **రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**

# 'వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల రధచక్రాలకు కట్టివేయడాన్ని ప్రతిఘటిద్దాం'

## రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలలో వక్తల ఉద్ఘాటన

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)** రాష్ట్ర మహాసభలు 2016 జూన్ 10, 11, 12 తేదీల్లో విజయవంతంగా జరిగాయి. 10-6-16 సా॥ 4 గం॥కు స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జెండాను రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ ఆవిష్కరించారు.

అనంతరం రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన వేలాదిమంది రైతుకూలీలు, ఆదివాసులు-ఎర్రజెండాలు, బ్యానర్లు చేబూని నినాదాలు చేస్తూ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన విజ్ఞానమందిరం నుండి బయలుదేరి మున్సిపల్ ఆఫీసు, జిన్నాటవర్, కొత్తపేట, నాజ్ సెంటర్‌ల మీదుగా బహిరంగ సభాస్థలికి చేరుకుంది. ఊరేగింపు ముందుభాగాన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్స్ యస్. ఝాన్సి, కె. కోటయ్య మరియు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీకాకుళం తప్పెట గుళ్ళ కళాకారుల విన్యాసాలు, డప్పు నృత్యాలు, ఆదివాసుల సాంప్రదాయ 'కిందిరి' నృత్యాలతో క్రమశిక్షణా యుతంగా సాగిన ఊరేగింపు నగరవాసులను ఆకట్టుకుంది.

ప్రదర్శన అనంతరం బళ్ళారి రాఘవ ఓపెన్ ఆడిటోరియంలో సభ ప్రారంభానికి ముందుగా భూపాల్‌గారు రచించగా, రౌతు వాసుదేవరావుగారు దర్శకత్వం వహించిన విజయనగరంజిల్లా ప్రజా కళాకారులు ప్రదర్శించిన 'పొలికేక' రైతు నృత్య రూపకం ప్రజానీకాన్ని ఆకట్టుకుంది. రాష్ట్ర మహాసభల సందర్భంగా జరిగిన బహిరంగసభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు యస్. ఝాన్సీ అధ్యక్షత వహించారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) గుంటూరుజిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

సభలో తొలుత మహాసభల ఆహ్వాన సంఘం **అధ్యక్షులు డా॥ కొల్లా రాజమోహన్** మాట్లాడుతూ జాతీయోద్యమకాలం నుండి పోరాట వారసత్వం కలిగిన గుంటూరు జిల్లాలో ఈ మహాసభలు నిర్వహించుకోవడం సముచితంగా వుందని పేర్కొన్నారు.

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్. ఝాన్సీ** మాట్లాడుతూ నేడు వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభానికంతటికీ పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద లొంగుబాటు విధానాలే కారణమన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) ప్రధాన కార్యదర్శి అరవిందసిన్హా మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పాలకులందరూ వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద రధచక్రాలకు మరింత గట్టిగా ముడివేస్తున్నారన్నారు. దేశంలో లక్షలాది మంది రైతాంగం-ప్రధానంగా కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇవన్నీ సారాంశంలో పాలకుల హత్యలేనన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ పాలకుల మీద ప్రజలు భ్రమలు తొలగించుకొని, ప్రజా వ్యతిరేకులని నిర్ణయించుకొని పోరాటం చేయటంతప్ప మరోమార్గం లేదనే దృఢనిశ్చయంతో కార్మిక - రైతాంగ పోరాటాలను జమిలిగా సాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్.పి.ఐ రాష్ట్ర అధ్యక్షులు పి. అంజయ్య మాట్లాడుతూ 'దళిత సమస్య పరిష్కారానికి వామపక్ష, దళిత శక్తులు సమైక్యంగా పోరాటం సాగించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.

ఇంకా ఈ సభలో సోషలిస్టు ప్రజా ఫ్రంట్ నాయకులు మోదుగుల పాపిరెడ్డి, శంభు మెహతొ (ఝార్ఖండ్), యస్.డి.బోస్ (బీహార్), విందైవేందన్ (తమిళనాడు), కృష్ణన్‌కుట్టి (కేరళ), శ్రీకాంత్ మొహంతి (ఒడిషా), బాబూరావ్ కుంబర్‌గావ్ (మహారాష్ట్ర), భూతం వీరయ్య (తెలంగాణ), చాగనూరు మల్లికార్జున రెడ్డి (కర్ణాటక) మొదలుగా 8 రాష్ట్రాల నుండి ఏఐకెఎమ్‌కెఎస్ ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొని సందేశమిచ్చారు.

బహిరంగసభ ముగింపులో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఈ మహాసభలకు సహకరించినవారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. (చూడండి ప్రసంగ పాఠం) ప్రజా కళాకారుల పాటలు, బాల కళాకారుల నృత్యాలు ప్రజానీకాన్ని ఆకట్టుకున్నాయి.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవరోజున (11-6-16న) స్థానిక ఎన్‌జీవో కళ్యాణ మండపంలో **'వ్యవసాయరంగంపై బిగుస్తున్న సామ్రాజ్యవాదుల పట్టు - రైతుకూలీల కర్తవ్యాల'**పై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య అధ్యక్షత వహించారు.

గత మహాసభల నుండి ఈ మహాసభల మధ్య కాలంలో అమరులైన సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజాతంత్ర వాదులందరికీ జోహార్లర్పిస్తూ సంఘం రాష్ట్ర కోశాధికారి వై.సోని సంతాప తీర్మానాన్ని

ప్రవేశపెట్టారు. (చూడండి తీర్మానం పూర్తి పాఠం) సంతాపసూచకంగా ప్రతినిధులంతా లేచి నిలబడి 2 నిముషాలు మౌనం పాటించారు.

సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన కా॥ యస్. ఝాన్సీ వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టివేస్తున్న పాలకుల విధానాలను తన ప్రసంగంలో తీవ్రంగా విమర్శించారు. (చూడండి ప్రసంగ పాఠం)

ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు సి.పెద్దన్న, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్. లక్ష్మి, ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి. హనుమంతరావు, ఎన్‌వైయస్ రాష్ట్ర కార్యదర్శి యస్.కె.బాషా, పిడిఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి యస్.కె. బాజీసైదా, జనసాహితి రాష్ట్ర కార్యదర్శి దివికుమార్, ఏపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. పాండురంగ వరప్రసాద్, భీమ్రేడ్ శేషు మరియు ఇతర రైతు సంఘాల ప్రతినిధులు రాష్ట్ర మహాసభలు విజయ వంతం కావాలని, రైతు-కూలీ ఉద్యమాలకు అండదండలుగా నిలుస్తామని చెపుతూ సందేశా లిచ్చారు.

'వ్యవసాయరంగంపై బిగుస్తున్న సామ్రాజ్యవాదుల పట్టు - రైతు, కూలీల కర్తవ్యాలు'పై రాష్ట్ర సదస్సు మధ్యాహ్నం సెషన్‌లో **"అభివృద్ధి పేరుతో భూమి నుండి, అడవి నుండి గెంటివేయబడుతున్న రైతుకూలీలు, ఆదివాసులు-పెరిగిపోతున్న వలసలు"** అంశంపై రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు మాట్లాడారు. ఈ సెషన్‌కు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఎం.ఎస్. నాగరాజు అధ్యక్షత వహించగా ఈ అంశంపై తీర్మానాన్ని రాష్ట్రకార్యవర్గ సభ్యులు కా॥ బి. రఘు ప్రవేశపెట్టారు.

**'కునారిల్లిపోతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు - ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతుకూలీలు, కార్మికులు'** అనే అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. ఝాన్సీ ప్రసంగించారు. ఈ సెషన్‌కు సంఘం రాష్ట్ర కోశాధికారి కా॥ వై.సోని అధ్యక్షత వహించగా, ఈ అంశంపై తీర్మానాన్ని రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ బి. సాంబశివరావు ప్రవేశపెట్టారు.

**'విప్లవ భూసంస్కరణలే పరిష్కారమని చాటి చెప్తున్న వ్యవసాయరంగ సంక్షోభం'** అంశంపై 'జనశక్తి' సంపాదకులు డా॥ పి. జస్వంతరావు ఉపన్యసించగా, ఈ సెషన్‌కు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥డి.వర్మ అధ్యక్షత వహించారు; రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ లలిత ఈ అంశంపై తీర్మానం ప్రవేశపెట్టారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభల చివరిరోజైన ఆదివారం (12-6-16) సంస్థాగత కార్యక్రమాల సమీక్ష, నూతన కార్యవర్గ ఎన్నికతో పాటు రాష్ట్రంలో గ్రామీణ పేదలు, కష్టజీవు లెదుర్కొంటున్న పలు సమస్యలపై మహాసభ తీర్మానాలను ఆమోదించింది. ఈ ప్రతినిధుల సభకు అధ్యక్షవర్గంగా సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ వర్మ, లలిత, సునీత, యస్. లక్ష్మారెడ్డి, వై.సోని, బి.తిమ్మారెడ్డిలను ప్రతిపాదించగా, సభ ఆమోదించింది.

స్టీరింగ్ కమిటీగా కామ్రేడ్స్ ఝాన్సీ, కె.కోటయ్య, కిషోర్‌బాబు, రమణయ్య, నాగేశ్వరరావు, వీరబాబు, కోటేశ్వరరావు, ఇల్లా రామిరెడ్డి వ్యవహరించారు.

శ్రీకాకుళంజిల్లా లక్ష్మింపేటలో కుల దురహంకారులు మారణాయుధాలతో దళితులపై దాడిచేసి ఐదుగురిని బలిగొని (12-6-16) నాలుగు సం॥లు అయిన సందర్భంగా ప్రతినిధుల సభ ప్రారంభంలోనే దళిత అమరులకు జోహార్లర్పిస్తూ ప్రతినిధులంతా లేచి నిలబడి మౌనం పాటించారు.

ఒంగోలులో జరిగిన గత మహాసభల నుండి ఈ మహాసభల మధ్యకాలంలో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ముఖ్యమైన కార్యక్రమాలు, ఆందోళనలను, అవగాహన ఆచరణలను రాష్ట్ర కార్యవర్గం తరపున కామ్రేడ్ ఝాన్సీ వ్రాత పూర్వకంగా నివేదికను అందజేసి వివరించారు. చర్చ అనంతరం ప్రతినిధులు ఈ నివేదికను ఆమోదించారు.

సింహాద్రి ఝాన్సీ అధ్యక్షులుగా, ముత్తిరెడ్డి శ్రీరాములు (గుంటూరుజిల్లా), బి.తిమ్మారెడ్డి (అనంతపురం జిల్లా) ఉపాధ్యక్షులుగా; కె. కోటయ్య కార్యదర్శిగా, యద్దనపూడి సోని (కృష్ణాజిల్లా), డి. వర్మ (విజయనగరం జిల్లా) సహాయ కార్య దర్శులుగా, యస్.లలిత (ప్రకాశం జిల్లా) కోశాధికారిగా, 10 జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే 23 మంది కార్యవర్గ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకొంది. అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది.

**విస్తృతంగా సాగిన మహాసభల సన్నాహక కృషి**

**రాష్ట్ర** మహాసభలకు దాదాపు నెలరోజుల ముందుగానే గుంటూరు నగరంలోను, జిల్లాలోనూ ప్రముఖులు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు, వివిధ సోదరసంఘాల ప్రతినిధులు దాదాపు 100 మందితో మహాసభల నిర్వహణకు ఆహ్వానసంఘం ఏర్పడింది. ఈ ఆహ్వానసంఘానికి గౌరవా ధ్యక్షునిగా నాగార్జునా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్స్‌లర్ శ్రీ దావులూరి రామ కోటయ్య, అధ్యక్షులుగా డా॥ కొల్లా రాజ మోహన్ వ్యవహరించారు.

మహాసభల సన్నాహకంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ, ప్రత్యేకించి గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతోపాటు, నగరంలోని పలు శ్రామికపేటలలో మండు టెండలను సైతం లెక్కచేయక సంఘ కార్యకర్తలు, విద్యార్థి యువజన వలంటీర్లు విస్తృత ప్రచార కృషిచేశారు. కరపత్రాలు, పోస్టర్స్, మైక్ ప్రచారాలతోపాటు దళ ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా నగరంలోని పలు ప్రధాన కూడళ్ళలో తోరణాలు, బ్యానర్లు, జెండాలతో మహాసభకు నిండైన వాతావరణం తీసుకురావటానికి మంచి కృషి చేశారు.

# స్వాగతోపన్యాసం

డా॥ కొల్లా రాజమోహన్

**సభకు నమస్కారం**

ప్రతినిధులకు, అధ్యక్ష, కార్యదర్శులకు, ఆసీనులయి వున్న పెద్దలకు, యిరుగు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన నాయకులకు, సౌహార్ద్ర ప్రతినిధులకు, ప్రజాకళాకారులకు స్వాగతం. ఉద్యమాలకు పుట్టినిల్లు; త్యాగశీలురయిన కార్యకర్తలకు, నాయకులకు జన్మనిచ్చిన ఈ గడ్డ; వివిధ జిల్లాల నుంచి వచ్చిన గ్రామీణ పేదలకు, రైతుకూలీసంఘ ప్రతినిధులకు ఆతిథ్యమిచ్చే అవకాశం లభించినందుకు గర్వపడు తున్నది.

గుంటూరు ప్రాంతానికి ఆంధ్ర దేశంలోని కొన్ని జిల్లాలకున్నట్లే ఈ జిల్లాకు అనేక ప్రత్యేక ప్రాముఖ్యతలున్నాయి. మొట్ట మొదటిగా ఇది రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలకు పుట్టినిల్లు. వర్గపోరాటాలకు పెట్టనికోట.

**సోదరీ సోదరులారా!**

భారత స్వాతంత్ర్య పోరాట ప్రథమ పోరాట ఘట్టమైన 1857కు పూర్వమే గుంటూరు ప్రాంతంలోని నాదెండ్లలో స్వతంత్ర సమరం సాగి జయప్రదంగా ముగిసింది. **'నాగలిసమ్మె'**గా బ్రిటీష్ రికార్డులలో పేర్కొన్నారు.

17వ శతాబ్దంలో ఈ ప్రాంతమంతా నిజాం పాలనలో వుండేది. తర్వాత నిజాం నుండి బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. ఆనాడు కృష్ణాజిల్లాలో వున్న ఈ ప్రాంతం ఇపుడు గుంటూరుజిల్లా చిలకలూరిపేట దగ్గరలో వున్నది. వరుసగా రెండేళ్ళ కరువు వలన తాగటానికి నీరులేక, తినటానికి తిండిలేక, భూమి నెర్రెలిచ్చి, వటవృక్షాలు సహితం ఎండిపోతున్న దశలో పన్నులు కట్టమని అధికారులు నిర్బంధించారు. రైతుల ఆస్తులను జప్తు చేయటానికి సైన్యంతో వచ్చారు. రైతుల ఇండ్లలోని చెంబూ, తపేలా బయటవేసి పశువులను కట్లు ఇప్పేసి బయటకు తోలటం ప్రారంభించారు. పన్నులు వసూలు చేసే స్థానిక సముతు చౌదరి అభ్యర్ధించినా ఆలకించలేదు. రైతులు ఎదురు తిరిగారు. రైతులందరూ సమావేశమై రవాణా సదుపాయాలను స్తంభింపచేశారు. చౌదరి పిలుపు మేరకు వ్యవసాయ పని ముట్లన్నిటినీ–నాగలి, గొర్రు, గుంటక, పలుగు, పార కట్టగట్టి మంచెలపై పెట్టారు. నూటికి నూరుమంది రైతులేగాక, వ్యవసాయ కార్మికులు, చేతిపనివారు కూడా సమ్మెలో పాల్గొన్నారు. ఈ వార్త తెలుసుకొని హైద్రాబాద్‌లోని పాలకులు దిగివచ్చి పన్నులు రద్దుచేసి రైతులతో రాజీపడ్డారు. పరాయి పాలనకు వ్యతిరేకంగా రైతుకూలీలు సమైక్య పోరాటం సాగించి విజయం సాధించారు.



**చిన్నప్పరెడ్డి:**

1909 సం॥ శివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళలో చిన్నప్పరెడ్డి ప్రదర్శించిన వీరత్వం చరిత్రలో బుర్ర కథలుగా ఊరూరా చెప్పేవారు.

**"పుట్టింది రెడ్డిపాలెంలో**
**పెరిగింది చేబ్రోలులో**
**రెడ్డీ! సైరా! చిన్నపరెడ్డీ**
**నీ పేరే బంగారు కడ్డీ**

ప్రభ కట్టుకొని కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చిన చేబ్రోలు రెడ్డిపాలెం గాదె చిన్నపరెడ్డి ఎడ్లు బెదిరిపోయాయి. బెదిరిన ఎడ్లను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్న చిన్నప రెడ్డి, ఆయన అనుచరులు చూస్తుండగానే పోలీసులు తుపాకితో ఎడ్లను కాల్చి చంపేశారు. ప్రేమతో పెంచుకొన్న ఎడ్లను కాల్చివేసినందుకు చిన్నపరెడ్డి పోలీసులపై తిరగబడ్డాడు. విచక్షణారహితంగా ఎడ్లను కాల్చివేయటం అమానుషంగా భావించిన ప్రజలు కూడా తిరగబడ్డారు. వందేమాతరం అని నినాదాలు చేస్తూ పోలీసులతో తల పడ్డారు. కొంతమంది పోలీసులు, పోలీసుల కాల్పులలో కొంతమంది ప్రజలు చని పోయారు. కోటప్పకొండ రణక్షేత్రంగా మారింది. అదనపు పోలీసు బలగాలు వచ్చి ప్రజలను హింసించి కేసులు పెట్టారు. చిన్నపరెడ్డికి మరణదండన విధించారు. పోలీసుల దమనకాండను ఎదిరించినందుకు ఉరితీశారు. పల్లెలలో చిన్నపరెడ్డిని వీరునిగా కొలుస్తూ పాటలూ, పద్యాలూ, బుర్రకథలూ చెప్పుకున్నారు. **'వందేమాతరం–మనదే రాజ్యం'** అనే నినాదం పల్లెల్లో మారు మ్రోగింది.

జాతీయ ఉద్యమంలో మరువలేని మూడు పోరాటాలు గుంటూరు జిల్లాలోనే జరిగాయి. ప్రపంచయుద్ధంలో బ్రిటీష్ ప్రభుత్వ మిలటరీకి అయిన ఖర్చులన్నీ రైతులనుండి వసూలు చేయటానికి పూను కొన్నారు. పెరిగిన పన్నుల భారానికి నిరసనగా రైతుకూలీలు తిరగబడ్డారు.

## పెదనందిపాడు: పర్వతనేని వీరయ్య:

**పెదనందిపాడు** ఫిర్కాలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించింది. పెదనంది పాడు కేంద్రంగా వంద గ్రామాల రైతులు పథకం ప్రకారం ఉద్యమాన్ని సాగించారు. మంచి గాయకుడైన పర్వతనేని వీరయ్యగారు అన్ని గ్రామాలూ తిరిగి రైతులను ఉత్తేజ పరిచారు. 4000 మంది వాలంటీర్లతో 'శాంతిసేన' ఏర్పాటు చేశారు. గ్రామాధికారులు రాజీనామా చేశారు. పోలీసుల అరెస్టులకు, నిర్బంధాలకు, దౌర్జన్యాలకు రైతులు చలించలేదు. ఇంటి సామానులు జప్తు చేసినా, భూమిని వేలం వేసినా జంకలేదు. వేలం వేస్తే కొనేవారే లేరు. అంతటి ఐకమత్యంతో ఉద్యమం నడిచింది. సైన్యాన్ని గ్రామాలలో దించి కవాతులు చేసి ప్రజలను భయభ్రాంతులను చేశారు. సైనిక దళాల ఖర్చులు ప్రజలే భరించాలన్న ప్రభుత్వ ఆర్డర్లను అమలు పరిచేవారే లేరు. క్రమశిక్షణతో స్వపరిపాలన సాగించు కొన్నారు. బ్రిటీష్ పార్లమెంటు పెదనంది పాడు సహాయ నిరాకరణను గురించి

చర్చించింది. ఎలాగోలా అణచి వేయమని కలెక్టరు రూథర్ ఫర్డుని ప్రభుత్వం పంపించింది. కాంగ్రెసు నాయకులలో కొంతమంది ఉద్యమాన్ని నీరుకార్చే ప్రయత్నం చేశారు. ఉద్యమం శాంతి యుతంగా సాగుతుందా? లేక హింసా మార్గానికి మారుతుందా అనే చర్చను ప్రారంభించి, గాంధీగారి వద్దకు వెళ్ళారు. గాంధీగారు ఒక కమిటీ వేసి విషయం తేల్చ మన్నారు. ఇప్పటివరకూ ఉద్యమం శాంతి యుతంగా, ఆదర్శంగా నడుస్తున్నది కానీ భవిష్యత్ గురించి అనుమానంగా వుందన్నారు. గాంధీగారు ప్రజలను సంప్ర దించకుండానే ఏకపక్షంగా పెదనందిపాడు ఉద్యమాన్ని ఆపేయమని టెలిగ్రాం ఇచ్చారు.

**పుల్లరి వ్యతిరేక పోరాటం-కన్నెగంటి హన్మంతు:**

అటవీ సంపదపై నీ పెత్తనమేమిటి? అని ప్రశ్నించిన పోరాటమే పల్నాటి **పుల్లరి వ్యతిరేక పోరాటం.** భూమి, నీరు, అడవులపై ప్రజలకే హక్కులుండేవి. ప్రజల సంపదగానే పరిగణింపబడ్డాయి. బ్రిటీష్‌వారు ప్రవేశించిన తరువాత భూమి, అడవి ప్రభుత్వానిదే అన్నారు. పల్నాడు అటవీ ప్రాంతంలో పశువులను మేపుకునేందుకు పుల్లరి కట్టాలన్నారు. అడవి నుండి కట్టెలు కొట్టడంపైనా, పశువుల మేతపైనా ఆంక్షలు విధించారు. పన్నులు వేశారు. పశువుకు రెండు రూపాయలు పన్ను కట్టమన్నారు. అదే కాలంలో ఉన్నవ లక్ష్మీనారాయణ తదితరులు పల్నాడు ప్రాంతంలో పన్నుల నిరాకరణోద్యమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' నవల వ్రాశారు. తక్కెళ్ళ జగ్గడి పాత్ర ద్వారా సమసమాజ స్థాపన గురించి తెలుగులో ఆంధ్ర ప్రజలకు కమ్యూనిస్టు భావాలను పరిచయం చేశారు. జాతీయోద్యమ ప్రభావంతో పల్నాడు ప్రాంతంలో పుల్లరి కట్టమని ప్రజలు తిరగబడ్డారు. పశువులను అడవులలోకి తోలారు.

ప్రజలు శిస్తులు, సుంకం చెల్లించడం మానేశారు. కన్నెగంటి హనుమంతు ఈ పోరాటానికి నాయకత్వం వహించి రైతులను సమైక్యపరచి వారికి అండగా నిలిచాడు. ప్రజలపైన అత్యాచారాలు, దాడులు ఎక్కువయ్యాయి. పశువులను బందెల దొడ్లకు తోలుకుపోయి బంధించారు. అడ్డు వెళ్ళిన ప్రజలను హింసించారు. ఫారెస్టు అధికారుల, పోలీసుల ఆగడాలను అరి కట్టాలని హనుమంతుడు వచ్చాడు. కోలగుంట్ల సమీపంలోని వాగువద్దకు నిరాయుధుడిగా, ప్రజలతో వచ్చిన హనుమంతునిపై మిలటరీ తుపాకీ గుళ్ళ వర్షం కురిపించింది. తుపాకీ తూటాలతో రక్తం కారుతుండగా 'ప్రజలపై కాల్చవద్దు-వందేమాతరం' అని అరుస్తూ పడిపోయాడు. కొన ఊపిరితో వున్నంతవరకూ 'వందే మాతరం' అని నినదిస్తూ ప్రాణాలను వదిలాడు. పోలీసులు శవాన్ని కూడా బంధువులకు ఇవ్వలేదు. కోలుగుట్ల సమీపం లోని దంతెవాగు ఒడ్డున శవాన్ని పూడ్చి పెట్టారు.

**చీరాల-పేరాల: దుగ్గిరాల గోపాల కృష్ణయ్య:**

ఆనాటి గుంటూరుజిల్లాలోని పంచాయితీ గ్రామాలైన **చీరాల-పేరాలను**, రెంటినీ కలిపి మున్సిపాలిటీగా మార్చి అలివిగాని పన్నులు విధించారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారి నాయకత్వంలో ప్రజలు పన్నులు కట్ట నిరాకరించారు. గ్రామాలను ఖాళీ చేసి పొలిమేరలకు చేరి గుడిసెలను వేసుకొని స్వతంత్ర జీవనం సాగించారు. 1000 మందితో 'రామదండు' అనే దళాన్ని ఏర్పరచి, చుట్టుపక్క గ్రామాలలో స్థానిక ఉద్యమానికి, జాతీయ ఉద్యమానికి మద్దతుగా రైతులను సమీకరించారు. సామాన్య రైతులు, చేనేత కార్మికులు ఈ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. కాంగ్రెసు సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విరమించటంతో ప్రజలు నిరాశ పడ్డారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ధైర్యంగా ఎదుర్కొని తమ పోరాట సన్నద్ధతను, స్వాతంత్ర్య కాంక్షను వెలి బుచ్చాడు. బలవంతమైన సామ్రాజ్యవాదాన్నె దిరించి చరిత్రకెక్కారు.

1922లో ఈ మూడు వుద్యమాలకు కొనసాగింపుగా మన్యంలో అటవీ చట్టాలకు వ్యతిరేకంగా మొట్టమొదటిసారిగా అంధ్రదేశంలో గెరిల్లా పోరాటం సాగింది. భూమి మాదంటూ బ్రిటీష్ ప్రభుత్వంపై అల్లూరి సీతారామరాజు నాయకత్వాన 2 సంవత్సరాలు గిరిజన సాయుధ పోరు సాగించారు.

**గాజుల్లంక వియ్యమ్మ:**

చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా 1937లో సాగిన **గాజుల్లంక లంక భూముల కోసం** జరిగిన పోరాటంలో వియ్యమ్మను పోలీసులు బాయనెట్లతో పొడిచి, చివరకు కాల్చి చంపేశారు. తుది శ్వాస విడిచే వరకూ జమీందారీ విధానం నశించాలని ఎలుగెత్తి చాటిన **'వియ్యమ్మ'** వీరనారిగా పేరుపొందింది.

**ప్రధమ రాజకీయ పాఠశాలలు**

1933లోనే గుంటూరుజిల్లా నిడుబ్రోలులో వ్యవసాయదారుల రాజకీయ పాఠశాలను ప్రారంభించారు. కార్యకర్తల కోసం **1937లో జరిగిన కొత్తపట్నం** రాజకీయ పాఠశాలకు విద్యార్థులుగా మోటూరు హనుమంతరావు, కొల్లా వెంకయ్య, కనగాల కుటుంబరావు తదితరులు విద్యార్థులు. ప్రిన్సిపాల్ పులుపుల శివయ్యగారు. పాఠాలు చెప్పేందుకు జాతీయ నాయకులు ఇందూలార్ యాజ్ఞిక్, సజ్జాద్ జహీర్, దినకర్ మెహతా తదితరులున్నారు. 15 రోజుల తరువాత ఆ రాజకీయ పాఠశాలను నిషేధించి, లాఠీఛార్జీ జరిపి, అరెస్టు చేసి ఒంగోలు వరకు విద్యార్థులను మే నెల ఎండలో నడిపించి జైలులో పెట్టారు. **1938 వేసవిలో మరింత** ఉత్సాహంతో మంతెనపాలెంలో రాష్ట్ర రాజకీయ పాఠశాల జరిగింది. కేంద్ర కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అంతా రాజకీయ పాఠశాలకు ఉపాధ్యాయులుగా వచ్చారు.

ప్రసిద్ధి చెందిన ఈ రెండు రాజకీయ పాఠశాలలకు ఆతిథ్యం ఇచ్చింది గుంటూరు జిల్లా. ఆంధ్రదేశానికి రైతుకూలీ నాయకుల నందించిన ఘనత ఈ రాజకీయ పాఠశాలలదే.

1935లో కూలీ రక్షణ సమితిని ప్రారంభించింది గుంటూరులోనే. **"కూలీలందరూ ఏకమైతే కూటికి కరువేమిరా"** అని రాసిన పెండ్యాల లోకనాథం గారు రైతుకూలీ ఉద్యమ ప్రారంభకులలో

ఒకరు. **"ఎగరాలి ఎగరాలి మన ఎర్రజెండా"** అని రాసిన తుమ్మల వెంకట్రామయ్యగారు ఇక్కడి వారే.

డిసెంబర్ 26, 1936లో ఏర్పడిన **అఖిల భారత కిసాన్ సభకు** గుంటూరుజిల్లా నిడుబ్రోలుకు చెందిన ఆచార్య. ఎన్.జి. రంగాగారు అధ్యక్షత వహించారు. ఫైజ్‌పూరు కిసాన్ సభ అధ్యక్షోపన్యాసం ఈనాటికి కూడా రైతులకు ఆచరణీయ కార్యక్రమమే. "సోషలిస్టు రాజ్యాన్నీ, సమాజాన్ని ఏర్పరచు కునే ధ్యేయంతో మనం తయారవ్వాలి. ఈనాటి అన్ని విధాల ప్రజలను దోచే సంస్థలు, వాటి ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేస్తేనే తప్ప అలాంటి సమాజం ఏర్పడదు. ఇతర దేశాల్లోని కార్మికవర్గాలు తమ రాజకీయ స్వాతంత్ర్యాన్ని అను భవిస్తున్నారు. కానీ మనం అటు బ్రిటీషు సామ్రాజ్యవాదులతోను, ఇటు మధ్యయుగం నుంచీ కొనసాగుతున్న దుస్సంప్రదాయాల తోను దీర్ఘకాల పోరాటాలు సాగించాల్సి వుంది. స్వరాజ్యం కోసం జరిపే మన పోరాటానికి ప్రతిదశలోనూ, జమీందార్లు, పెట్టుబడిదార్లు అడ్డంకులు సృష్టిస్తున్నారు ...... సోషలిస్టు ప్రభుత్వాన్ని సాధించేందుకు బాధలను అనుభవిస్తూ పోరాటాలను సాగించే రైతుల, కార్మికులదే భవిష్యత్తు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ఉన్న కార్మికులు జరిపే పోరాటాల్లో, వాటితో ప్రతిరైతూ చేయి కలపడం పవిత్ర కర్తవ్యంగా భావించాలి. సమష్టి కృషితో ఎంతో సాధించవచ్చు. 1948లో ఆంధ్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షులైన తర్వాత రంగాగారు రైతు సంఘాలు అవసరం లేదన్నారు.

## రైతు రక్షణ యాత్ర

రాజకీయ పాఠశాలలో పాల్గొని సైద్ధాంతిక జ్ఞానాన్ని పొందిన నిస్వార్థ యువకులు, చైతన్యంతో రైతు సమస్యలపై కేంద్రీకరించారు. రైతుసంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలను స్థాపించారు. ఆంధ్ర దేశంలో పెల్లుబుకిన రైతాంగ చైతన్యానికి ఒక నిర్దిష్ట రూపం యిచ్చేందుకు **ఆంధ్ర రైతు రక్షణ యాత్ర** తోడ్పడింది. గుంటూరు జిల్లాలో నాలుగైదు సంవత్సరాల ముందే ప్రజలను చైతన్యపరచడానికి రైతుయాత్రలను ప్రారంభించారు. అదే మార్గంలో ఆంధ్ర రైతురక్షణ యాత్ర జరిగింది.

## ఆంధ్ర రైతు రక్షణ యాత్ర:

ఈ యాత్రకు కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తిగారు, చలసాని వాసుదేవరావుగారు నాయకత్వం వహించారు. రైతు ఉద్యమంలో శిఖరాగ్రంగా నిలిచిన ఈ రైతు యాత్ర 1937 జులై 3వ తేదీన ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు 130 రోజులు సాగింది. కాలినడకన 1512 మైళ్ళు, బస్సుపై 152 మైళ్ళు ప్రయాణం చేసి 520 గ్రామాలు పర్యటించారు. 800 విజ్ఞాపనలు స్వీకరించారు. లెక్కలేనన్ని సమావేశాలు, రైతుసభలు నిర్వహించారు. నాలుగున్నర లక్షల (4, 50,000) మంది ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొన్నారు.

1938 జనవరి నెలలో గుంటూరుజిల్లాకి చేరారు. రెండు దళాలుగా చీలి, అన్ని తాలూకాలలోనూ యాత్రను నిర్వహించారు. రేపల్లె, బాపట్ల, కాకుమాను, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాలన్నిటిలో ఊరేగింపులు, ఉపన్యాసాలు జరిగాయి. జాతీయ జెండాలు, ఎర్రజెండాలతో ప్రదర్శనలు జరుపుతూ, పాటలు పాడుతూ సాగాయి. ప్రజలు ఘనంగా స్వాగతించారు. జిల్లాలో రైతు యాత్ర విజయవంతమయింది. కొన్ని వేల అర్జీలను తీసుకొని, ఏ రోజుకారోజున సమస్యల వారీగా విభజించి మద్రాసులో మార్చి 27వ తేదీన ప్రభుత్వానికి అంద చేశారు. గుంటూరుజిల్లా యాత్రలో వావిలాల గోపాలకృష్ణయ్య, మాదల వీరభద్ర రావు, ఆమంచి నరసింహారావు, డా॥ సీతా రామశాస్త్రి, కొల్లా వెంకయ్య, బాచిన సుబ్బారావు, భారతీదేవి రంగా, గోగినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ చరిత్రలో ఇంత పెద్దఎత్తున రైతాంగ సమీకరణ, సంఘటిత ఉద్యమం, క్రమశిక్షణతో జరిగిన రైతుయాత్రా అప్పటి వరకూ లేదు. కేవలం రైతుల సమస్యలకు పరిమితమయి యాత్ర చరిత్ర ప్రసిద్ధి పొందింది. రైతులలో అపూర్వ ఆసక్తిని, సంచలనాన్ని కలిగించింది. ప్రధానంగా రెండు లక్ష్యాలతో రైతుయాత్ర జరిగింది. జమీందారీ విధానం రద్దు, వ్యవసాయ రుణ విమోచన. రైతుయాత్ర ఫలితంగానే, ఎన్ని పరిమితులున్నా, మద్రాసు శాసన సభలో **1938లో రుణ విమోచన** చట్టం ఆమోదించ బడింది. ప్రకాశంగారి అధ్యక్షతన జమీందారీ విధాన రద్దు విషయమై విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. **జమీందారీ విధాన రద్దు బిల్లు** 1949 ఏప్రియల్ 19న మద్రాసు శాసనసభలో ఆమోదించబడింది. లక్షల మంది రైతులు జమీందారీ పీడన నుండి విముక్తి పొందారు. ఈనాముల రద్దు వలన 25 లక్షల ఎకరాలకు పేద ప్రజలకు పట్టాలు లభించాయి.

1947 జనవరి 22న పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్సు పేర (ప్రకాశం ఆర్డినెన్సు) క్రూరమైన నిర్బంధ చట్టాన్ని కాంగ్రెసు ప్రభుత్వం తెచ్చింది. భూమి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం కృషి చేస్తున్న రైతుకూలీ నాయకులను, కార్యకర్తలను వెంటాడి, వేటాడి హింసించారు. భూస్వాముల దౌర్జన్యాలను, అన్యాయాలను ఎదిరిస్తున్న గ్రామాలపై సామూహిక హింస కొన సాగించారు. అయినా రైతుసంఘం ద్వారా ప్రజలతో మమేకమైనారు. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి పూర్తి సహకారం అందించిన జిల్లాలలో కృష్ణాజిల్లా తరువాత గుంటూరుజిల్లానే. మైదాన ప్రాంత కమిటీ, మాదాల నారాయణస్వామి, పెదవలి శ్రీరాములు, కొల్లా వెంకయ్యగారు తెలంగాణ పోరాటానికి వెన్నుదన్నుగా సహాయ సహకారాలను సమన్వయపరిచారు. **గుంటూరు జిల్లా నుండి 200 మందికి పైగా** దళ సభ్యులు **తెలంగాణా సాయుధ పోరాటంలో** పాల్గొన్నారు. స్థానికంగా గ్రామాలలో భూస్వామ్య వ్యతిరేక పోరాట దళాలను ఏర్పరిచారు. పోలీసులు, భూస్వాముల పాశవిక నిర్బంధం వల్ల అనేకమంది రైతుకూలీ కార్యకర్తలు, నాయకులు అమరులైనారు.

1944లో **ఎన్నికల** ద్వారా, రైతుసంఘం అభ్యర్థులు పూర్తి మెజారిటీతో **మొట్టమొదటి మార్కెటింగ్ కమిటీకి** ఎన్నిక కావడం కూడా గుంటూరుజిల్లాలోనే. విదేశాలకు అమ్మే

పొగాకుకు కనీస ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేటట్లు చేయగలిగారు. కా॥కొల్లా వెంకయ్యగారు రైతుసంఘం ప్రతినిధిగా మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్‌గా నిర్వహించిన పాత్ర రైతు ఉద్యమాలకు ఎంతో పలుకు బడిని, బలాన్ని చేకూర్చింది.

**కాలువలలో పూడిక కార్యక్రమం:**

1944 సం॥ మే నెల ఎర్రని ఎండలలో రైతుకూలీ కార్యకర్తలు కృష్ణ కాలువలను బాగుచేశారు. కృష్ణా ఈస్ట్రన్ డెల్టాలో సాగవుతున్న 5 లక్షల ఎకరాలకు నీరందించే కాలువలలో సిల్ట్ పేరుకుపోయి కాలువలు పూడిపోయి పొలాలకు నీరందని పరిస్థితులలో రైతు కార్యకర్తలు ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల నుండి శారీరక శ్రమచేసి, మట్టిని తీసి, జూన్ 1 కల్లా కాలువలలోకి నీరు వచ్చేటట్లు కృషి చేశారు. జిల్లా నాయకులు మోటూరు హనుమంతరావుగారితో పాటు నాయకులు కూడా మట్టిపనిలో పాల్గొన్నారు. **కృష్ణ కాలువలు బాగు చేయటంలో** రైతుకూలీలు సఫలత చెందారు.

**బంజరు భూములు పంపకం కోసం:**

1954 సం॥లో ప్రభుత్వ బంజరు భూములను పేదలకు పంచాలని గుంటూరు జిల్లాలో మహోన్నతమైన పోరాటం సాగింది. ఈ పోరాటానికి దోనే మోషే, తురుమళ్ళ గోవిందయ్య, మాదాల నారాయణస్వామి, కొరటాల సత్య నారాయణ, కొల్లా వెంకయ్యగార్లు నాయకత్వం వహించారు. పేద ప్రజలు వేలాది ఎకరాల భూమిని సాధించుకో గలిగారు. బంజరు సత్యాగ్రహంలో పేద ప్రజలతో పాటుగా రైతు కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పాల్గొని రైతుకూలీ సంఘీభావాన్ని చాటారు. బళ్ళారి, రాయ వెల్లూరు, రాజమండ్రి జైళ్ళలో శిక్షలను భవించారు. గుంటూరుజిల్లా అనుభవంతో తూర్పుగోదావరి తదితర జిల్లాలలో బంజరు పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఈ పోరాటమే ఆంధ్ర రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వ పతనానికి కారణమై 1955 ఎన్నికలు వచ్చాయి.

**కౌలుదారీ చట్టాల అమలు కోసం:**

1957లో **కౌలుదారీ చట్టాలను** అమలు పరచాలని పోరాటం ప్రారంభమయింది గుంటూరుజిల్లాలోనే. రేటూరు, నర్సాయ పాలెం తదితర ప్రాంతాలలో చట్ట ప్రకారం తమకు రావాల్సిన ధాన్యం ఇవ్వమన్న రైతు కోరికలను భూస్వాములు నిరాకరించారు. చట్టం అమలును కోరిన రైతులను భూముల నుండి వెళ్ళగొట్టారు. దొమ్మీ, దౌర్జన్యం కేసులు పెట్టి జైలు పాల్జేశారు. జైలుశిక్షలను కూడా అనుభవించారు. కౌలుదారులపై దాడులను రైతుకూలీ కార్యకర్తలు సమైక్యంగా ఎదుర్కొన్నారు.

**విద్యార్థి ఉద్యమం:**

1966లో **హోటల్ రేట్లు** తగ్గించాలని ఉద్యమం ప్రారంభమయింది కూడా గుంటూరు నుండే. డాక్టర్ చాగంటి భాస్కర రావు, డాక్టర్ మల్లిఖార్జునుడు, సింహాద్రి సుబ్బారెడ్డి, గుర్రం విజయకుమార్, ఘంటా వెంకట్రావుగార్లు నాయకులుగా రాటుదేలింది గుంటూరులోనే.

నక్సల్‌బరీ సంఘీభావ కమిటీ ప్రారంభించింది ఇక్కడే. శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటంలో గుంటూరు జిల్లా నుండి అనేకమంది పాల్గొన్నారు. డా॥భాస్కరరావు, డా॥మల్లిఖార్జునుడు గిరిజన పోరాటంలో పాల్గొంటూ అమరులై నారు. నార్మన్ బెతూన్ లాంటి డాక్టర్లిద్దరు గుంటూరు మెడికల్ కాలేజీలో చదివి, విద్యార్థి ఉద్యమంలో పాల్గొని, శ్రీకాకుళం వెళ్ళి రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి పీడిత ప్రజల కోసం ప్రాణాలర్పించారు.

పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిలైన తేళ్ళ కృష్ణమూర్తి, ఛూటే అప్పారావు విశాఖ జైలులో 63 రోజులు నిరాహార దీక్ష జరిపి రికార్డు సృష్టించారు.

సంగడిగుంటకు చెందిన షేక్ బుడె, రేపల్లె డా॥ ఎం.ఎల్.నారాయణ, గుంటూరు విద్యార్థి డా॥మల్లిఖార్జునుడు విశాఖ జైలు నుండి పారిపోయి విప్లవోద్యమంలో చరిత్రను రాశారు.

1980లో రైతుల ఆత్మహత్యలు ప్రారంభమయింది ఇక్కడే.

అప్పులు తీర్చలేక కిడ్నీలను అమ్ముకొన్న రైతులది రెంటచింతల-గుంటూరే.

**విదేశీ కంపెనీల దోపిడీని వ్యతిరేకిస్తూ:**

మోన్‌శాంటో కంపెనీ రాయల్టీలను రద్దుచేసి, విదేశీ కంపెనీల సామ్రాజ్యవాద దోపిడీని అరికట్టాలన్న ఉద్యమ ప్రారంభం కూడా ఇక్కడే. 450 గ్రా. బి.టి. విత్తనాల ధరను 1850 రూపాయల నుండి 750 రూపాయలకు తెప్పించిన ఆందోళన గుంటూరు కలెక్టర్ ఆఫీసు ధర్నాతోనే ప్రారంభమయింది.

ఇవన్నీ చెప్తున్నానంటే సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఒక్క గుంటూరులోనే జరిగాయని కాదు. పోరాటాల స్ఫూర్తిగా రైతాంగ ఉద్యమ పురోగతికి ఈ సమాచారం ఉపయోగ పడ్తుందని చెప్పాను.

ఈనాటికీ సోంపేట, కాకరాపల్లి లాంటి చోట్ల భూమిని కాపాడుకునే పోరాటాలు ఆదర్శనీయమే. పూర్తిగా వ్యవస్థనే మార్చే పోరాటాలు ఇంకా హర్షనీయం.

**మిత్రులారా!**

**మన దేశంలో భూమి సమస్య చాలా కీలకమైనది**

భూమి కోసం జరిగినన్ని ఉద్యమాలు మరెందుకోసమూ జరగలేదు. 'నెత్తురు చిందించనిదే నేల దక్కదు' అనేది నానుడి. జానెడు నేలను దక్కించుకోవటానికీ, రక్షించు కోవటానికి రైతులనేక కష్టాలు పడ్తున్నారు. రైతుకూలీసంఘాలనేక పోరాటాలు చేశాయి.

తనకున్న భూమిని కాపాడుకోవటానికి ప్రతిరోజూ ఏదో ఒకచోట పేదప్రజలు పోరాడుతూనే వున్నారు. అక్రమకేసుల పాలై అగచాట్లు పడ్తున్నారు. నెత్తురు చింది స్తున్నారు.

వీరోచిత తెలంగాణా పోరాటంలో 4 వేలమంది అమరులైనారు. 10 లక్షల ఎకరాల భూములను పంచుకున్నారు. అతి స్వల్ప సమయంలో విప్లవాత్మక భూ సంస్కరణలను అమలు పర్చారు. పేదల పోరాటాలతోనే భూములు లభించాయి. తెలంగాణాలోనైనా, మరెక్కడైనా భూ పోరాటాలతోనే భూమి దక్కింది. కమ్యూనిస్టుల ప్రాబల్యం తగ్గించటానికి, ఉద్యమాల ధాటికి తట్టుకోలేక 1950లో

తెలంగాణాలో కౌల్దారీ రక్షణ చట్టాన్ని తెచ్చారు. 1955 ఎన్నికలలో పేదప్రజల ఐక్యతను చూసి, ఆంధ్రలో కౌల్దారుల రక్షణ చట్టం తెచ్చారు. 1958లో భూసంస్కరణ బిల్లు ప్రవేశపెట్టారు. శ్రీకాకుళ గిరిజన సాయుధ పోరాటం తరువాత 1970 సం॥లో ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి భూసంస్కరణలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 1973 జనవరి 1న ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణ చట్టం ప్రవేశపెట్టింది. భూమి మాత్రం పేదలకు దక్కలేదు. చట్టాలున్నాయి. కానీ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖ లాయర్లు అందరూ భూస్వాముల పక్షమే. కాగితాలకే పరిమితమయిన చట్టాలలో భూసంస్కరణ చట్టం మరొకటి.

హరితవిప్లవం వల్ల అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని ప్రచారం చేసి రైతుకూలీలను కొన్నాళ్ళు మాయ చేశారు. సమాజాన్ని గందరగోళపరిచి కొన్నాళ్ళు కొత్త ఆశలు కల్పించారు. అభివృద్ధికి మంత్రంగా హరితవిప్లవాన్ని స్మరించారు.

హరితవిప్లవం వలన దిగుబడులు పెరిగాయి. ధనిక రైతుల ఆదాయాలు పెరిగాయి. ఉత్పాదకాల ఖర్చు పెరిగింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతమయ్యాయి. పాలకవర్గాలు భయంభయంగానే వున్నాయి. ఆనాటి హోంమంత్రి వై.బి.చవాన్ "హరిత విప్లవంతో బాటు సామాజిక న్యాయంపై ఆధారపడిన విప్లవం ఏర్పడితే తప్ప ఈ పచ్చని విప్లవం ఎంత మాత్రం పచ్చగా వుండబోదని కాలం హెచ్చరిస్తున్నద"ని తన భయాందోళనలు వ్యక్తపరిచాడు.

పంట పంచుకునే కౌలుదార్లను పెద్ద మొత్తంగా వెళ్ళగొట్టడం ఆపివేయకపోతే ఈ హరిత విప్లవం ఎర్రగా (రెడ్) మారే అవకాశముందని (Lade Jiniske Worf) లాడె జినిస్తే భారత ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

భూసంస్కరణల చట్టాల వలన పేదలకు పంచిన భూమి చాలా తక్కువ. రైతు ఉద్యమం బలంగా వున్న ప్రాంతాలలో దేవాలయ భూములు, ప్రభుత్వ బంజరు భూములు, ఇండ్ల స్థలాలు పేదల వశమయ్యాయి. విప్లవ పోరాటాల వలన, భూస్వాములు భూములను అమ్ముకొని పట్టణాలలో పెట్టుబడులు పెట్టారు. భూస్వాములు భూములు కొనటం తగ్గింది.

జనాభా వత్తిడితో భూకమతాల సైజు చిన్న చిన్న కమతాలుగా విడిపోయింది. పేద రైతులు వారి స్వంత భూములలో పనిచేసుకుంటూ తమ శ్రమశక్తిని అమ్ముకుంటున్నారు.

సంప్రదాయకంగా వ్యవసాయం చేసే రైతుకుటుంబాలు కౌలుకివ్వటం పెరిగింది. స్వంతంగా వ్యవసాయం చేసినా నష్టం వస్తున్నపుడు కౌలుకిస్తేనే ఎక్కువ ఆదాయం వస్తుందనీ కౌలుకి ఇస్తున్నారు.

## మానవ సంబంధాలలో మార్పు

గ్రామాలలో మానవ సంబంధాలలో చాలా మార్పు వచ్చింది. రైతులకు వ్యవసాయ కూలీలకి మధ్యన దూరం పెరిగింది. రైతులకు-కూలీలకు మధ్య వైరుధ్యం మిత్ర వైరుధ్యమనే గమనం తగ్గుతూ వున్నది. ఇద్దరికీ మధ్య కూలీరేట్ల మధ్య తగాదా సహజమే. పెట్టుబడిదారీ విధానం వలన నిత్యావసర వస్తువులు పెరుగుతున్నాయనీ, వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయనే ఆలోచన రావటం లేదు. ఉమ్మడి శత్రువైన వ్యవస్థ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ సంస్కృతి మీద ఎక్కుబెట్టవలసిన పోరాటం దారి తప్పుతోంది. శ్రమ అంటే గౌరవం తగ్గుతోంది. శారీరక శ్రమను నీచ శ్రమగా గుర్తిస్తున్నారు.

## శ్రమ విలువ

వ్యవసాయ పనులలో రైతుకూలీలు చేసే శ్రమను నైపుణ్యం లేని శ్రమగా ప్రభుత్వం గుర్తించింది. సమాజం కూడా ఆమోదిస్తుందా? నాట్లు వేయటం, కోత కోయటం నైపుణ్యం లేకుండా చేస్తే నడుములు పనిచేయవు. వెన్నెముకలో వున్న నరాలు పనికి రాకుండాపోతాయి. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులూ నెలరోజులు శిక్షణ తీసుకొని వ్యవసాయ పనులు చేయమనండి. అప్పుడు వ్యవసాయ కనీస వేతనాన్ని నిర్ణయిస్తే న్యాయంగా వుంటుంది. 1917లో గాంధీగారు, ఒక కూలీ కన్నా లాయరైన నాకు ఎక్కువ ఆదాయం ఎందుకుండాలని అడిగారు. రోజు కూలీకి వచ్చే కూలీ ఎంత? ఆ గ్రామంలో గ్రామోద్యోగి రోజు జీతం ఎంత? చదువు చెప్పే ఎలిమెంటరీ స్కూలు టీచర్‌కి రోజు జీతం ఎంత? ఎమ్మెల్యే జీతం ఎంత? కలెక్టరు జీతం ఎంత? రిలయన్స్ నేత అంబానీ రోజుకెంత సంపాదిస్తున్నాడు. సంపదను సృష్టిస్తున్న రైతుకూలీల ఆదాయం, జిడిపిలో 13 శాతం మాత్రమే. ఈ ఆదాయాన్ని జనాభాలో 70 శాతంగా వున్న గ్రామీణ ప్రజలు పంచుకోవాలి. సేవారంగానిది 62 శాతం. మిగతాది పరిశ్రమల నుండి. ఫలితంగా 82 శాతం మంది వ్యవసాయదారులు అప్పుల్లో వున్నారు.

వ్యవసాయంలో కాస్తోకూస్తో మిగులు వచ్చిన ధనిక రైతులు, భూస్వాములు పట్టణాలకు చేరుకుంటున్నారు. ఎరువుల కొట్లు, ఫ్యాన్సీషాపులు, టీ షాపులు, చెప్పుల షాపులు, బార్ షాపులు, పుస్తకాల షాపులు, కిరాణా షాపులు పెట్టుకున్నారు. ఎక్కువ మిగులున్నవారు సినిమాహాలు కట్టడం, చిన్న పరిశ్రమలు స్థాపించటం చేస్తున్నారు. కొంతమంది పాలకవర్గ రాజకీయ పార్టీలలో చేరి పైరవీలు చేస్తున్నారు. ఎమ్మార్వో ఆఫీసు, పోలీసు స్టేషన్లు ప్రభుత్వ అధికారులతో అవసరాలు పెరుగుతున్నాయి. పాస్‌బుక్‌లు, ఆధార్‌కార్డులు, ఆరోగ్య కార్డులు తదితర అవసరాల కోసం ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అవినీతి గురించి సీరియస్‌గా పట్టించుకోవటం లేదు. ప్రశ్నించేవారు తగ్గిపోతున్నారు. ప్రతీ ఆఫీసుకి బ్రోకర్లు తయారైనారు. గ్రామాలలోని కొంతమంది రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా మారి కొద్ది కాలంలోనే ధనవంతులుగా అవతారమెత్తుతున్నారు. ప్రభుత్వ అవినీతిపై ధ్వజం ఎత్తాలనే ఆలోచన కరువవుతోంది.

గ్రామాలలో సగంమంది ప్రజలకు వ్యవసాయ భూమి లేదు. వ్యవసాయ కూలీలుగా కొంతమంది శ్రమను అమ్ముకుంటున్నారు. కొంతమంది వలస పోతున్నారు. పట్టణాలకు దగ్గరగా వున్న గ్రామాల నుండి రోజు కూలీలుగా టౌనుకెళ్ళి వస్తున్నారు. ఆటోలను నడిపే వారంతా చదువుకొన్న నిరుద్యోగులే. ఆటోల ప్రవేశం తరువాత వ్యవసాయ కూలీల కదలిక తేలికయింది. ఎంతదూరమయినా వెళ్ళి

రాత్రికి యింటికి రాగలుగుతున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా ఎక్కువమంది పోతున్నారు. వెసులుబాటు వున్నవారు మిగులును పోగుచేసి వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని, మహిళలకు పొలం బాధ్యతలను బదలాయిస్తున్నారు. ధనిక రైతులు కూడా భూమిని కౌలుకు తీసుకొని, యంత్రాల సహాయంతో వ్యవసాయం చేస్తున్నారు. మెట్ట పంటలలో అన్నీ వాణిజ్య పంటలే. పత్తి, మిర్చి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా తయారయ్యాయి. సుబాబుల్, శనగసాగు పెరిగింది. వ్యవసాయంలో ట్రాక్టరు వాడకం పెరిగింది. కాంట్రాక్టు కూలీ పెరిగింది. ఎకరం పత్తి తీస్తే ఇంత రేటు, ఎకరం మాగాణి నాటుకు-కట్టివేతకు-కాంట్రాక్టుగా కూలి ఇంత అని డిమాండును బట్టి నిర్ణయం జరుగుతున్నది.

## భూమిని కాపాడుకోవటం ఎలా?

భూమి విలువలు అనూహ్యంగా పెరిగాయి. వ్యవసాయంలో నష్టాలు వస్తున్నా, భూమి విలువలు పెరగటం వలన భూమి వున్న రైతులు ధైర్యంగా వుంటున్నారు. పంటలతో సంబంధం లేకుండా భూమి విలువలు పెరిగాయి. రోడ్లప్రక్కన పనికిరాని పొలాలకు రేటు ఎక్కువ వుంది. భూమి సరుకైంది. రాజకీయ నాయకులు, అమెరికాలోవున్న ఎన్ఆర్ఐలు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్థులు, డబ్బులున్న వారంతా భూమి మీద పడ్డారు. పొలాన్ని కాపాడుకోవటం చిన్న రైతుకి సాధ్యం కావటం లేదు. చిన్న కమతాలకు పెట్టుబడి సమకూర్చుకొని వ్యవసాయం చేసి గిట్టుబాటు ధరకు అమ్ముకోవటం అన్నిసార్లూ సాధ్యం కావటం లేదు. పొలం అమ్ముకోమని బ్రోకర్ల వత్తిడి పెరుగుతోంది. ఇంగ్లీషు చదువులు చదివిస్తే అమెరికా పంపించవచ్చని, కాన్వెంటు చదువులు చదివిస్తున్నారు. భూస్వామ్య కుటుంబాల నుండి చదువుకున్న ఇంజనీర్లు అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు వెళ్ళారు. ప్రతి గ్రామం నుండి పదిమందో, యాభై మందో అమెరికాలో వున్నారు. ఈ కుటుంబాల వరకు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. అందువలన అందరి చూపులూ అమెరికాపైన వున్నాయి. పల్లెలలో ఒక కొత్త మధ్యతరగతి సృష్టించబడింది. వినియోగ సంస్కృతి పెరిగి భక్తి భావాలు, ఆధ్యాత్మిక ధోరణులు, యోగా, ధ్యానం, కూటములు, చర్చిలు, మసీదులు పెరిగిపోయాయి. ప్రత్యామ్నాయ సంస్కృతిని గురించి ఆచరించేవారు, మాట్లాడేవారు కరువవుతున్నారు.

వ్యవసాయం నిలబడాలంటే భూమి సమస్యను పరిష్కరించి, వ్యవసాయం లాభసాటిగా చేయాలి. ఆహార భద్రత కావాలన్నా, దిగుబడులు పెరగాలి. దిగుబడులు పెరగాలంటే దున్నేవానికే భూమి కావాలి. శాస్త్రీయంగా ఆలోచించి, మూఢత్వం నుండి బయటకు రావాలి. అందుకోసం నిరంతరం కృషి చేసే రైతుకూలీసంఘాలు కావాలి. భూమిని కంపెనీల చేతుల్లోకి పోకుండా సమైక్య పోరాటం సాగించాలి.

## అసలు కన్నా వడ్డీ మించకూడదు-రుణాలు-రైతుల ఆత్మహ్యలు:

వ్యవసాయానికి పెట్టుబడి కీలకం. 82 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని నేషనల్ శాంపిల్ సర్వే తెలిపింది. అప్పు వసూళ్ళకు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్థులు వత్తిడులు, సహకార సంస్థలు, బ్యాంకులు నోటీసులు ఇస్తున్నారు. మరోప్రక్క ఖరీఫ్‌కు పెట్టుబడులు కావాలి. ఈ నేపథ్యంలో ఆత్మాభిమానం కలిగిన రైతులు దిక్కుతోచని స్థితిలో తమ ప్రాణం తామే తీసుకొంటున్నారు. ప్రభుత్వం, సమాజం, ఉద్యమాల అండలేకపోవటంతో మరింత కుంగిపోయి విలువైన ప్రాణాన్ని వదిలేస్తున్నారు. 2016 మే 28న హిందూ పత్రికలో ఒక హృదయ విదారకమైన వ్యాసం వచ్చింది. సట్లెజ్ నదిపై నిర్మించిన భాక్రా నంగల్ డామ్ ప్రధాన కాలువ స్లూయిస్ గేటు వద్ద రోజుకి రెండు మూడు రైతుల శవాలు కొట్టుకొస్తున్నాయట. అప్పులను వెతుక్కుంటూ కాలువ గట్ల వెంటనే వస్తున్న బంధువుల దీనావస్థను గ్రహించి, ఒక ధార్మిక సంస్థ ఒక రెస్ట్‌హౌస్‌ను కట్టించింది. స్థానిక గురుద్వారాలలో భోజనం చేసి, ఆ సత్రంలో వుండి తమ బంధువుల శవాలను వెతుక్కుంటున్నారు. శవాలను గుర్తించటానికి ఫ్లడ్ లైట్లను 13 సిసి కెమెరాలను ఆ సంస్థే ఏర్పాటు చేసింది. ఒడ్డుకొచ్చిన శవాలలో గుర్తు పట్టలేని శవాలను కుక్కలు పీక్కు తింటున్నా పట్టించుకోనటువంటి సమాజంలో మనమున్నాం.

2014 సంవత్సరంలో న్యూయార్క్ టైమ్స్‌లో ఒక వ్యాసం వచ్చింది. ఆంధ్ర ప్రదేశ్‌లో బొల్లికుంట అనే గ్రామంలో మసుకల రామిరెడ్డి అప్పు కట్టలేక ఉరి వేసుకొని చనిపోయిన గాథ.

వడ్డీ వ్యాపారస్థుల వద్ద తీసుకొన్న 4 లక్షలు అప్పును తీర్చే దారిలేక పెరిగిన వ్యవసాయ ఖర్చులు భరించలేకపోవటమే కాక, రాజకీయ నాయకులు కూడా ఓట్ల కోసం పట్టణ మధ్యతరగతి మీద కేంద్రీకరించి గ్రామీణ పేదలను విస్మస్తున్నారన్నారు. ప్రభుత్వాన్నుండి పంట రాకపోగా, ఆఫీసుల చుట్టూ తిరుగుతూ వారి చీత్కారాలను ఎలా భరించారో ఆ పత్రిక అమెరికా ప్రజలకు తెలియచేసింది. చనిపోయిన భర్త రామిరెడ్డి చేసిన వ్యవసాయ బాకీలకు కారణం ప్రభుత్వ నూతన సంస్కరణలైనా, ఆ అప్పులను భార్య లతమ్మ కట్టాలని వడ్డీ వ్యాపారులు వత్తిడి చేస్తున్నారని ఆ పత్రిక రాసింది.

## బి.డి.శర్మగారిచ్చిన మరో ఘటన

ఉత్తరప్రదేశ్‌లో గిరిజన రైతు సీతారాం 1974 సంవత్సరంలో బ్యాంకు నుండి 11 వేల రూపాయల రుణం తీసుకున్నాడు. 13,400 రూపాయలు చెల్లించాడు. 10 వేల రూపాయలను ప్రభుత్వం రద్దు చేసింది. ఇంకా 60 వేలు బాకీ వున్నాడంటూ బ్యాంకు నోటీసు పంపింది. బాకీ కట్టనందున సీతారాంను జైలుకు పంపారు. కొడుకులు ఎలాగోలా 10 వేలు కట్టారు. జైలులో తిండి ఖర్చుకు, అప్పు వసూలు ఖర్చులకు 10 వేలను జమ చేసుకున్నారు. ఈలోగా వున్న కొద్ది భూమి ప్రాజెక్టు క్రింద పోయింది. నష్టపరిహారం వెంటనే ఇవ్వలేదు. చాలా సంవత్సరాల తర్వాత లక్షన్నర రూపాయలు అప్పులకు కట్టుకొని, 75 సం॥ ముదుసలిని వదలమని కోరినా పట్టించుకోలేదు. సీతారాం అనారోగ్యంతో చనిపోతే కొడుకులకు కబురే లేదు. కొడుకులు జైలుకెళ్ళి అడిగితే ఆస్పత్రిలో వున్నాడని చెప్పారు. ఆస్పత్రికి వెళ్ళి అడిగితే నాలుగు

రోజుల క్రితం చనిపోతే, అనాధ శవంగా పారేశామన్నారు.

రుణమాఫీలతో సమస్యలు పరిష్కారం కావు. రైతు రుణగ్రస్థుడు కావడానికి గల కారణాలను పరిశీలించాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలి. తాత్కాలికంగా వెసులుబాటు కలుగుతుంది. కానీ వ్యవసాయం నష్టాల బాటను మార్చాలి. 1977లో, 2008లో, 2014 సం॥లో రుణమాఫీలు పాక్షికంగా జరిగాయి. కానీ రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. వ్యవసాయ సంక్షోభం తగ్గలేదు.

నూతన ఆర్థిక విధానాలు అవలంబించి నప్పటి నుంచీ 1995 నుండీ దాదాపు 3 లక్షలమంది రైతులు ప్రాణాలు తీసుకొన్నా రంటే పరిస్థితులు ఎంత అమానవీయంగా వున్నాయో అర్థమవుతుంది.

2013 సం॥లో దేశవ్యాపితంగా 11,772 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మహారాష్ట్రలో 3,146 మంది, ఆంధ్రప్రదేశ్‌లో 2014 మంది అందులో 460 మంది మహిళలు ఆత్మహత్యల పాలయ్యారు.

## రైతుకూలీల అదనపు శ్రమను వడ్డీ వ్యాపారస్థులు, బ్యాంకులు, ఎంఎన్‌సిలు మింగేస్తున్నాయి

ఈ పరిస్థితికి కారణాలేమిటో-ఎలా నివారించాలో మీరు చర్చించాలి. కొత్త విధానాలు వచ్చిన తరువాత భూమి పరాధీన మవుతున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీ, నీటి సదుపాయం, కౌలు అన్నీ పెరిగిపోయాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వ్యాపారాలను అమెరికా, జర్మనీ కంపెనీలకు అప్ప గించారు. కంపెనీల పేటెంటు అనీ, రాయల్టీ అనీ, రీసెర్చ్ ఖర్చులనీ రైతు నడ్డి విరక్కొడ్తున్నారు. ప్రభుత్వం ఎంఎన్‌సిలకు దాసోహం అంటున్నది. పెరిగిన ఖర్చులకు స్వంత పెట్టుబడి లేక వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయించటం అనివార్య మయింది. శ్రమిస్తున్న రైతుకూలీల అదనపు శ్రమను-అదనపు విలువను వడ్డీ వ్యాపారస్థులు, బ్యాంకులు, మోన్‌శాంటో లాంటి విత్తన సంస్థలు బేయర్ లాంటి పురుగుమందుల కంపెనీలు, కార్గిల్ వంటి వ్యవసాయ ఉత్పత్తుల (ధాన్యం, గోధుమల) వ్యాపార సంస్థలు మింగేస్తున్నాయి. గిట్టుబాటు ధర లేకుండా ప్రభుత్వమూ, దళారులూ, ఫార్వర్డ్ ట్రేడింగ్ వ్యాపారస్థులూ అందరూ కలిసి రైతు జీవనంపై దాడి చేస్తున్నారు. రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం వ్యవసాయరంగానికి 18 శాతం ప్రత్యక్ష రుణాలను ఇవ్వాలి. 22 శాతం పరోక్ష రుణాలివ్వాలి. ప్రత్యక్ష రుణాలు 12 శాతానికి మించి ఇవ్వలేదు. అందులోనూ పట్టణాలలో వుండే పెట్టుబడిదారులకు వ్యవసాయ రుణాల పేరున ఎక్కువ మొత్తాలు అప్పుగా ఇస్తున్నారు. విలాసవంతమైన కారులకు ఎంతైనా అప్పును, తక్కువ వడ్డీకి ఇస్తున్నారు. బ్యాంకు ఆఫీసర్లకు, ప్రభుత్వ అధికారులకు, శాసనసభ్యులకు, వడ్డీలలో ఎన్నో రాయితీ లిస్తున్నారు.

## పట్టణాలకు గ్రామాలు సబ్సిడీ లిస్తున్నాయి

పట్టణాలలో వున్న వారి అవసరాలకు, ఖర్చులకు గ్రామీణ వ్యవసాయదారులే సబ్సిడీ ఇస్తున్నారన్న విషయం మరుగున పడింది. ఉత్పత్తి ఖర్చులు, శ్రమతో కలుపుకుంటే వచ్చే ధరకు రైతు తన పంటనమ్ముకోవాలి. కానీ రైతు తన పంటను ఎక్కువసార్లు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి. రైతులు తమకు రావాల్సిన ధరను రాబట్టుకోలే నందున పట్టణ ప్రజలకు సబ్సిడీలో వ్యవసాయ సరుకులు అందుబాటులో వుంటున్నాయి. ప్రభుత్వం రైతులకు సబ్సిడీలన్నిటినీ ఆపేస్తున్నది. మద్దతు ధరను ఆశాస్త్రీయంగా నిర్ణయిస్తుంది. కనీసం బ్రిటీష్ వారు చేసిన రుణానికి చక్రవడ్డీ వసూలు చేయరాదన్న చట్టాన్ని కూడా మార్చేసింది. వాస్తవానికి ప్రభుత్వాలకు వస్తున్న ఆదాయం పరోక్ష పన్నుల ద్వారానే వస్తుంది. పరోక్ష పన్నులు సరుకులు వాడుకున్న ప్రతివారూ చెల్లించాల్సిందే. 70 శాతంపైగా వున్న గ్రామీణ జనాభా, పట్టణాలలో వున్న 20 శాతం నిరుపేదల నుండీ పరోక్ష పన్నులు వసూలవుతున్నాయి. ప్రతి బడ్జెట్‌లో పెంచు కుంటూ పోతున్న పరోక్ష పన్నులే ప్రభుత్వానికి ప్రాణం. టీ తాగినా, సబ్బు కొన్నా, బస్సెక్కినా పరోక్ష పన్నే. ధాన్యం అమ్మినా, బియ్యం కొన్నా, సినిమా చూసినా పన్నులు సామాన్యులే ఎక్కువ కడ్తున్నారు. పరిశ్రమలు, కార్పోరేటు సంస్థలు అనేక రాయితీలతో పన్నులు ఎగవేస్తున్నారు.

## రైతులను పీల్చి పిప్పిచేసే చక్రవడ్డీలు

బ్రిటీష్ ప్రభుత్వం కరువులు, వరదలతో, అప్పులతో సతమవుతున్న రైతుల దీనావస్థను గుర్తించి రెండు చట్టాలు చేసింది. 1883 ల్యాండ్ డెవలప్‌మెంట్ చట్టం, 1884 వ్యవసాయ రుణాల చట్టం. కాంగ్రెసును మన దేశంలో స్థాపించిన డేవిడ్ హ్యూమ్‌గారు సదుద్దేశ్యంతో ఈ రెండు చట్టాలను చేయించారు. బ్రిటీష్ ప్రభుత్వం చేసిన చట్టాలను యధావిధిగా కొనసాగిస్తున్న భారతదేశ పాలకులు ఈ రైతులకు ఉప యోగపడే ఈ రెండు చట్టాలను ఎందుకు అమలుపరచరు? చక్రవడ్డీలను ఎందుకు అనుమతిస్తున్నారు? 12 శాతం నుండి ఎంత వీలుంటే అంత లాక్కుంటున్న వడ్డీ వ్యాపారస్థులను ఎందుకు కట్టడి చేయటం లేదు? చక్రవడ్డీల చక్రం గిరగిర తిరుగుతూ రైతుల ప్రాణాలను తీస్తున్నది. లక్షలాదిమంది రైతులు రుణభారంతో చనిపోతుంటే కనీసం పరదేశీయులకున్న సానుభూతి భారత ప్రభుత్వానికి లేదా?

రైతుకూలీలను పీల్చిపిప్పిచేసి చక్రవడ్డీల పేరున గ్రామీణ ప్రాంతంలోని ఆదాయాన్ని ధనవంతులైన వడ్డీ వ్యాపారులు, సహకార సంఘాలు, బ్యాంకులు దోపిడీ చేస్తున్నాయి. నిలువునా ముంచేస్తున్నాయి. 1937లో రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు యాత్రలో ప్రధానంగా రెండు డిమాండ్లు వున్నాయి. జమీందారీ, ఈనాం విధానాల రద్దు మొదటిది కాగా రెండవది రైతురుణ విమోచన చేయమని రాజాజీకి మహజ రిచ్చారు.

1938లో వ్యవసాయ రుణవిమోచన చట్టం చేశారు. ఈ చట్టం 1883, 1884 రుణ విమోచన చట్టాల కొనసాగింపుగా అమలులోకి వచ్చింది. ఈ చట్టం ఫలితంగా చక్రవడ్డీని రైతుల నుండి వసూలు చేయ రాదు. అసలు కన్నా వడ్డీ ఏ పరిస్థితులలోనూ మించరాదు. వడ్డీ వ్యాపారస్థులు, బ్యాంకులు,

సహకార సంస్థలతో సహా అందరూ రైతుల నుండి వసూలు చేసే వడ్డీ దోపిడీని అంతం చేశారు. ఈ వెసులుబాటును ఆంధ్ర రైతాంగం ఆందోళన ద్వారా సాధించిన విజయం. ఈ చట్టం ఫలితంగా ఎంతో మంది రైతులు అప్పుల బాధ నుండి విముక్తి పొందారు. అయితే 1984లో ఈ చట్టాన్ని బ్యాంకులకు వర్తించకుండా చట్టానికి సవరణ చేసి రైతులకు అన్యాయం చేశారు. చక్రవడ్డీ ద్వారా రైతులను దోపిడీ చేయటానికి వడ్డీ వ్యాపారులకు, బ్యాంకులకు అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది. చాణుక్యుడి అర్థ శాస్త్రం ప్రకారం వడ్డీ అసలును మించరాదు. హిందూ శాస్త్రం ధర్మవడ్డీని ప్రబోధిస్తుంది. ఖురాన్ వడ్డీని పాపకర్మగా పేర్కొన్నది. నిజమైన ముస్లిం వడ్డీ తీసుకోరాదన్నారు. బైబిల్ వడ్డీని నిషేధించకపోయినా, వడ్డీని నిరసించింది.

రైతాంగ రుణవిమోచనకు 1938 వ్యవసాయ రుణవిమోచన చట్టాన్ని అమలు పరచాలి. లేదా

కేరళ రైతుల రుణవిమోచన కమీషన్ చట్టం 2006 చట్టం 1 ఆఫ్ 2007 మన రాష్ట్రంలో కూడా అమలు పరచటానికి అధ్యయం చేయాలి.

ఈ చట్టం అన్ని పంటల వడ్డీకి, బ్యాంకులకు, సహకార సంస్థలకు వడ్డీ వ్యాపారస్థులకు కూడా అన్వయిస్తుంది.

13వ సెక్షన్ ప్రకారం అసలుకు సమానమైన వడ్డీ చెల్లించినచో రుణవిముక్తు లవుతారు.

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త హెన్స్ సింగర్ (Hens Singer) మాటల్లో "రైతు అనేవాడు అప్పుల్లో పుట్టి, అప్పుల్లో పెరిగి, అప్పుల్లోనే చనిపోయి, చివరకు వచ్చే తరానికి కూడా అప్పును మిగిల్చిపోతున్నాడు" అని అన్నారు. ఈ పరిస్థితిని మార్చటం రైతుకూలీ ఉద్యమంపైననే ఆధారపడి వుంది.

## కంపెనీల గుత్తాధిపత్యం

కంపెనీలకు అవసరమైన పంటలకు ఆకర్షణీయమైన ధరలనిచ్చి రైతులను ఆకర్షిస్తున్నారు. అలవాటు పడిన తరువాత పంటల ధరలను దారుణంగా పడగొట్టటం కంపెనీల పాలసీ. ఈ పంటలకు రైతాంగం బంధించబడిన తరువాత రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. పొగాకు, పత్తి, సుబాబుల్, పామాయిల్, వేరుశనగ– ఏ వ్యాపార పంటకైనా ఇదే తంతు. మలేషియాలో అమ్ముడుపోకుండా వున్న అమెరికన్ కంపెనీల పామాయిల్ నిలువలను దిగుమతి చేసుకుంటున్నారు. మన వేరుశనగ, పామాయిల్ నూనెల ధరలను దారుణంగా పడకొడ్తున్నారు. దిగుమతుల సుంకాన్ని మన ప్రభుత్వం తగ్గించి మార్కెట్‌ను పడకొడ్తున్నారు. అమెరికా, మలేషియాలో రైతులకు సబ్సిడీ లిచ్చి, తక్కువ ధరకు ఎగుమతులను ప్రోత్స హిస్తుంటే, మన పాలకులు వారి ఆయిల్‌ని, ప్రత్తిని, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను ప్రోత్సహిస్తున్నారు. వేలకోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని వుపయోగించటానికి వెనుకాడటం లేదు. రైతులను ప్రోత్స హించటం లేదు.

ప్రపంచ వాణిజ్యసంస్థలో చేరి భారతదేశ రైతుల ప్రయోజనాలను మరిచారు. విదేశీ రైతుల, కంపెనీల ప్రయోజనాలను కాపాడటంలో వెనుకాడటం లేదు.

వ్యవసాయ పంటలలో కార్పోరేట్ కంపెనీల ప్రవేశం చాపక్రింద నీరులాగా జరిగిపోయింది. గుంటూరు, ప్రకాశం జిల్లాలో పొగాకు పంట ప్రవేశం వంద సంవత్సరాలకు మించింది. పొగాకు పంట వేసినప్పటి నుండీ ఎంఎన్‌సిల దోపిడీ కొనసాగుతూనే వుంది. పొగాకు పంటకు కనీస ధర కోసం గుంటూరు పొగాకు మార్కెటింగ్ కమిటీ, పోరాడి విజయం సాధించింది. గుంటూరు పొగాకు మార్కెటింగ్ కమిటీకి మొదటగా జరిగిన ఎన్నికలలో, రైతుసంఘ అభ్యర్థులు (1944) ఘన విజయం సాధించి, బ్రిటీష్ సామ్రాజ్య వాద రైతు వ్యతిరేక విధానాలపై పోరాటానికి తలపడ్డారు. తర్వాత కాలంలో రైతాంగ పోరాటాల ఫలితంగా పొగాకు బోర్డును సాధించుకోగలిగారు. చైనా, బ్రెజిల్ తరువాత అత్యధికంగా పొగాకు పండించేది భారత దేశమే. అందులో కూడా అధికంగా పొగాకును పండించేది ఆంధ్ర రాష్ట్రమే. పొగాకు మార్కెట్‌ను శాసించేది ఐటిసి కంపెనీ. ఐటిసికి లొంగిపోయి సరఫరా దారులుగా మారారు. ఐటిసి చెప్పిందే వేదంగా వుంది. ఐటిసికి ఎదురు లేదు. పొగాకు వ్యాపారంలో గుత్తాధిపత్యం సాధించింది.

సుబాబుల్ పంటకు అధిక ధరనిచ్చి ప్రోత్సహించారు. ఒప్పందాలనీ, బాండ్‌లనీ రైతులకు ఆశలు చూపించి ధైర్యాన్ని కల్పించారు. ఒప్పందం ప్రకారం రేటు ఇచ్చినట్లుగా రైతు ఖాతాలో డబ్బు జమచేసి, తిరిగి రైతుల దగ్గర నుండి కొంత మొత్తాన్ని తీసుకొంటున్నారు. ఒప్పందం ధరలు అమలు చేయకుండా, ఆన్‌లైన్ వ్యాపారాన్ని కూడా తమకిష్టమైన రీతిలో నడుపుతున్నారు. సుబాబుల్ కొనుగోళ్ళను శాసిస్తున్నది ఐటిసి. మరో కంపెనీ ఇంటర్నేషనల్ పేపర్ మిల్లు కొంత కొంటుంది. మొత్తం వ్యాపారాన్ని, కొనుగోళ్ళను శాసిస్తున్నది పెద్ద ఎంఎన్‌సి ఐన ఐటిసి.

**మామిడి పండ్ల** వ్యాపారంపై బడా కార్పోరేటు సంస్థల పెత్తనం పెరిగింది. బడా కార్పోరేటు పల్ప్ (గుజ్జు) ఫ్యాక్టరీలు, మామిడి పండ్ల మార్కెటును శాసిస్తున్నాయి. దేశ, విదేశీ పల్ప్ మార్కెటును కార్పోరేటు కంపెనీలు గుప్పెట్లో పెట్టుకోవడంతో రైతులే కాకుండా, చిత్తూరు జిల్లాలోని చిన్న పరిశ్రమలు (పల్ప్–గుజ్జు పరిశ్రమలు) దివాళా తీస్తున్నాయి.

**ధాన్యం వ్యాపారం** పై ప్రపంచం మొత్తంగా కార్గిల్ కంపెనీ పట్టు సాధించింది. ఆహార ధాన్యాల వ్యాపారం కేవలం 5 ఎంఎన్‌సిల చేతుల్లో వుంది.

**విత్తన వ్యాపారం** 80% మోన్‌శాంటో, సింజెంటా, బేయర్స్ చేతులలోనే వుంది. భారతదేశంలోని కంపెనీలైన మహికో, నూజివీడు సీడ్స్ లాంటి కంపెనీలతో మిలాఖతై రైతులను దోచుకుంటున్నారు. పత్తి విత్తనాలలో గుత్తాధిపత్యం సాధించిన మోన్‌శాంటో కంపెనీ వరి, మొక్కజొన్న, వంకాయ, కూరగాయల మార్కెట్‌లోకి చొచ్చుకుపోతున్నది. స్థానిక పరిస్థితులను తట్టుకొని నిలబడ్డ వెరైటీలను పక్కన పెట్టించారు హైబ్రిడ్ విత్తనాలను ప్రతి సంవత్సరం కొనేటట్లు చేశారు. మరలా పంటలో విత్తనాలు వాడరాదని పెటెంట్ చట్టాన్ని, డబ్ల్యుటివోని అడ్డం పెట్టుకొన్నారు.

దొంగలు దొంగలు ఒకటైనట్లుగా

మోన్‌శాంటో కంపెనీ మరో కంపెనీ బేయర్ కంపెనీని కలుపుకుంటోంది. మోన్‌శాంటో కంపెనీ వియత్నాంలో ఏజెంటు ఆరెంజ్ పేరున పంటలను మాడ్చే రసాయనాన్ని తయారుచేసి, పంటలపై చల్లి ఆ ప్రజలను మలమల మాడ్చిన దుష్ట కంపెనీ. అలానే మన దేశంలో పురుగుమందులు తయారు చేస్తూ భోపాల్ గ్యాస్ ప్రమాదానికి కారణ మయిన కంపెనీ. ఈ రెండు రసాయనిక కంపెనీలు విత్తనాలు తయారుచేసి వాటి పురుగుమందులు తయారుచేసి వ్యవ సాయాన్ని తమ చేతిలో పెట్టుకొంటు న్నాయి. చరిత్రలో యుద్ధాలు చేసి రాజ్యాలను ఓడించి, సంపదను పెంచుకున్నారు. ఈ కంపెనీలు వ్యవసాయలోకంలో ప్రవేశించి గుత్తాధిపత్యాన్ని సంపాదించి, ప్రభుత్వాధి నేతలను, ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. 82 శాతం చిన్న కమతాలున్న మనదేశ బక్క రైతుల జీవితాలను దుర్భరం చేసి ఆత్మహత్యలకు మళ్లిస్తున్నారు. దేశసార్వభౌ మత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని పెద్ద కంపెనీల కాళ్ళ వద్ద వుంచుతున్న ప్రభుత్వాధినేతలు విదేశీ బ్యాంకులలో డబ్బు దాచుకుంటు న్నారు.

**ముగింపు**

భూసంస్కరణలు జరిపి, ఎరువులు, విత్తనాలు పురుగుమందులపై ఎంఎన్‌సిల (బహుళజాతి కంపెనీల) పెత్తనాన్ని రూపుమాపి, సబ్సిడీలు పెంచి, పెట్టుబడిని అందుబాటులో వుంచి, చక్రవడ్డీని రద్దుచేసి, సాగునీటి సౌకర్యం కల్పించి, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి అమలుపరిస్తే ఏ రైతూ ఆత్మహత్య చేసుకోడు. ఐతే మనం జీవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో 'ధనమేరా అన్నిటికీ మూలం' అనే వ్యవస్థలో ఎవరో వచ్చి మన కోర్కెలనన్నిటినీ తీర్చరు. పాక్షిక సమస్యలపై ఆందోళనలు చేసి, పోరాడి సాధించుకోవాలి. అంతిమంగా వ్యవస్థ మార్పు కోసం కృషి చేయాలి.

గుంటూరులో రెండు రోజులూ మీరు సౌకర్యవంతంగా వుండటానికి వీలుగా ఆహ్వాన సంఘం శక్తికి తగినట్లుగా కృషి చేసింది. లోపాలుంటే క్షమించండి. సభా సమయంలో ఏమి తిన్నాము, ఎలా వున్నాము అనేది కాకుండా, చివరకు మనకు వచ్చిన అవగాహన ఏమిటి? సభా సందేశ మేమిటి? సభా నిర్ణయాలు, కార్యక్రమం ఏమిటి? ఎలా ఆచరించాలి అని ఆలోచిం చండి. నిర్దిష్ట కార్యాచరణ, ప్రణాళికతో తిరిగి వెళ్ళమని అభ్యర్థిస్తున్నాను.

చివరిగా రైతుకూలీలతో నిత్య సంబంధాలు పెంచండి. వారి జీవన విధానాన్ని పరిశీలించండి. వారి సమస్యలను అధ్యయనం చేయండి. చిన్న సమస్యలని నిర్లక్ష్యం చేయవద్దు. సమస్యల పరిష్కారం కోసం ఎంత చిన్న సమస్య అయినా పరిష్కారం కోసం సమష్టిగా కృషి చేయండి. విజయాలు సాధించండి. వర్గ దృక్పథాన్ని పెంచుతూ ఉద్యమాల ఎడల విశ్వాసం పెరిగేటట్లు చేయండి. ఇతర ఉద్యమకారుల మధ్య అంగీకృత అంశాలను వెతకండి. విరుద్ధ అంశాలు ఎక్కువగా వుంటే, వారి కార్యక్రమానికి వారిని వదిలేయండి. సూత్రబద్ధమైన ఐక్యతతో, పీడిత ప్రజల కోసం పనిచేస్తూ-మన సమస్యల పరిష్కారం ఈ వ్యవస్థ మార్పులో వున్నదనే గమనంతో కృషి చేద్దాం. అంతిమ విజయం మనదే.

డాక్టర్ కొల్లా రాజమోహన్

**10-6-2016**
**గుంటూరు**



**1970లలో ఉరిశిక్ష పడి ఉరిశిక్ష నుండి జీవిత ఖైదుకి మారి సుదీర్ఘకాలం జైలు జీవితం అనుభవించిన అన్నదమ్ములు కామ్రేడ్స్ పంచలిగంగ, కృష్ణస్వామిగార్లను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) మహాసభల వేదికపై గౌరవించింది.**

# అధ్యక్షుల తొలిపలుకులు

ఆహ్వానసంఘం అధ్యక్షులైన డాక్టర్ కొల్లా రాజమోహన్‌గార్కి, ఆల్ ఇండియా కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి అయిన కా॥అరవింద్ సిన్హాగారికి, సిపిఐ (యం-యల్) కేంద్ర నాయకులు కా॥గుర్రం విజయకుమార్‌గారు, సౌహార్ద్ర ప్రతినిధులకు, రాష్ట్రనలుమూలల నుండి వచ్చిన రైతుకూలీ, ఆదివాసీ మిత్రులకు, ప్రజాతంత్రవాదులకు, మేధావులకు గుంటూరు పట్టణ ప్రజలకు- అందరికీ రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) తరఫున నా అభినందనలు తెలియ జేస్తున్నాను.

2010 ఏప్రియల్‌లో ఒంగోలులో రైతుకూలీసంఘం మహాసభల తరువాత ఈనాడు, అంటే 2016 జూన్‌లో గుంటూరులో రాష్ట్ర మహాసభలు జరుపు కుంటున్నాము. గుంటూరు జిల్లా ఏ విధమైన పోరాటాలకు పురిటిగడ్డగా నిలిచిందో ఆహ్వానసంఘ అధ్యక్షులు డాక్టరు కా॥కొల్లా రాజమోహన్‌గారు వివరించారు. ఈ జిల్లాలో జాతీయోద్యమ కాలం నుండీ జరిగిన రైతాంగ పోరాటాల గురించి వివరించారు. ఈ పోరాటాల పురిటిగడ్డలో మనం సభలు జరుపుకుంటున్నందుకు సంతోషంగా వుంది.

మన దేశంలోను, రాష్ట్రంలోను రైతాంగ పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారు తున్నది. భూమిని నమ్ముకుని పంట పండిస్తున్న రైతును పాలకులు తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారు. కష్టపడి పంట పండిస్తున్న రైతుకు గిట్టుబాటు ధరలు లభించటం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగి పోవటంతో రైతుకు ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోయి భారంగా తయారవుతున్నాయి. మరొకప్రక్క సాగునీరు సకాలంలో అందటం లేదు. ప్రకృతి వైపరీత్యాలు కూడా రైతును ఇబ్బంది పెడుతున్నది. కౌలు రైతులకు ప్రభుత్వ రుణాలు లభించకపోవటంతో ప్రైవేటు రుణాల మీదనే ఆధారపడవలసి వస్తున్నది. వ్యవసాయపు పనులు దొరకక వ్యవసాయ కూలీలు లక్షల సంఖ్యలో పట్టణాలకు వలసలు వెళ్ళిపోతున్నారు. అప్పుల పాలైన రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మైదాన ప్రాంతాలలో రైతాంగం దుస్థితి ఈ విధంగా వుంటే అడవి మీద ఆధారపడి కొండలపై నివశిస్తున్న గిరిజనులను ఈ పాలకులు అభివృద్ధి పేరుతో అడువుల నుండి గెంటివేస్తున్నారు. సరైన పునరావాసం కూడా లభించని ఆదివాసీలు వలసకూలీలుగా పట్టణ ప్రాంతాలకు తరలిపోతున్నారు. భూమి వ్యవసాయదారుడి చేతి నుండి లాగివేయ బడుతున్నది. ఆహార పంటలు పండించే భూములలో తోటల పెంపకాలను పెంచు తున్న వర్గం రోజురోజుకీ పెరిగి పోతున్నది. పట్టణ ప్రాంతాలలో నివశిస్తూ వందల వేల ఎకరాలు కొంటున్నారు. రైతాంగాన్ని భూమి నుండి గెంటివేసే చర్యలు రోజురోజుకి పెరిగిపోతున్నది. రైతాంగానికి ఈ పాలకులు పరోక్షంగా ఇస్తున్న సూచలేమి టంటే మీరు వ్యవసాయం చేయవద్దు అప్పుల పాలవు తున్నారు కనుక మీ భూములన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కొనివేస్తూ అధికశాతం భూమిని వారి చేతుల్లో వుంచుకుంటున్నారు.

సంక్షేమ పథకాల హోరులో ప్రజలను ముంచివేస్తూ వ్యవసాయం నుండి రైతులను గెంటివేస్తున్నారు. వేల లక్షల ఎకరాలు ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు, ఈ పాలకులు అప్పగించివేస్తున్నారు. మన సహజ వనరులన్నీ విదేశీ కంపెనీలకు తాకట్టు పెడుతున్నారు.

రైతాంగం యొక్క ఇంత తీవ్ర సంక్షోభానికి పాలకుల విధానాలే కారణమని మన పరిశీలనలోను, మేధావుల పరిశీలన లోను అర్థమవుతున్నది.

ఈ సంక్షోభాల నుండి బయటపడటం ఎలా అనే ముఖ్యమైన విషయాలను చర్చించుకుని కార్యాచరణలోకి వెళ్ళటానికి మనం మూడు రోజుల మహాసభలు నిర్వహించుకుంటున్నాము. ఈ మహాసభలో విషయాలను అన్నింటిని చర్చించుకొని నిర్దిష్టమైన కార్యక్రమాన్ని చేపట్టవలసిన కర్తవ్యం మనపై వుంది.

రాష్ట్ర విభజన తరువాత కొత్త రాజధాని నిర్మాణం పేరుతో ఈ రాష్ట్ర పాలకులు 5 లేక 6 పంటలు పండించే సారవంతమైన భూములను భూసమీకరణ పేరుతో రైతుల వద్ద లాక్కొన్నారు. దేశంలోనే అత్యుత్తమ రాజధానిని నిర్మిస్తాననే పేరుతో చంద్రబాబు రైతులు భూములు లాక్కొని వాళ్ళ నోళ్ళల్లో మట్టి కొట్టారు. ఈ పాలకులే సమాజానికి అవసరమైన ఆహారపంటల విస్తీర్ణాన్ని తగ్గించివేస్తున్నారు. రైతుల వద్ద భూములు లాగేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మరొకప్రక్క ప్రజలకు నిత్యా వసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. పేదరైతుకు విద్య, వైద్యం అందటం లేదు. కొత్త పరిశ్రమలేవీ రావటం లేదు.

ఈ స్థితిలో మనం మహాసభలు నిర్వహించుకుంటున్నాం. సభకు వచ్చిన కామ్రేడ్స్ అందరు బహిరంగసభలో వక్తలు మాట్లాడే విషయాలన్నింటిని శ్రద్ధగా వినాలని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.





చదవండి

వ్యవసాయం-ప్రపంచీకరణ

కె.ఆర్.చౌదరి

# కా॥ అరవింద్ సిన్హా ఎఐఎఫ్‌టియు(న్యూ) ప్రధాన కార్యదర్శి



మహాసభకు వచ్చిన ప్రతినిధులందరికీ ఎఐఎఫ్‌టియు(న్యూ) తరపున శుభాకాంక్షలు

ఈ రోజు మహాసభ ఒక ప్రత్యేక పరిస్థితుల్లో జరుగుతోంది. ఒక ప్రక్కన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడగొట్ట బడింది. తెలంగాణా రాష్ట్రంలోనూ, రాయలసీమ, ఉత్తరాంధ్రలలో కరువు విలయతాండవం చేస్తున్నది. మహారాష్ట్రలో బొంబాయి, ఆ చుట్టుపక్కల ప్రాంతాలు దేదీప్యమానంగా ధనంతో తులతూగుతుంటే విదర్భలో రైతాంగం కరువుతో అష్టకష్టాలు పడుతున్న స్థితి. ఒకప్పుడు దేశానికి ధాన్యాగారంగా పిలువబడ్డ పంజాబ్‌లో ఈ రోజు వ్యవసాయం గిట్టుబాటుకాక రైతాంగం –ఆత్మహత్యలు చేసుకొంటున్న పరిస్థితుల నడుమ ఈ రోజు ఈ మహాసభ జరుపు కొంటున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణాలో, మహారాష్ట్రలో ప్రత్యేకించి విదర్భ ప్రాంతంలో, కర్ణాటకలో చివరికి పశ్చిమబెంగాల్‌లో కూడా రైతాంగ ఆత్మహత్యలు నిత్యకృత్య మయ్యాయి. ఈ విచిత్ర పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ఎలాంటి పరిస్థితిలో ఏర్పడింది? అన్నది మనం పరిశీలించుకోవాలి. నరసింహారావు ప్రధానమంత్రిగా, మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం మీద సంతకాలు పెట్టారు. ఇది రైతాంగానికి ప్రపంచ మార్కెట్ స్థాయి ఆదాయాన్నిస్తుంది అని ఆశపెట్టారు. పేదరికం అదృశ్యమవుతుందనీ, నిరుద్యోగం తగ్గుతుందనీ పెద్దస్థాయిలో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రచారం చేశారు. ఇది జరిగిన ఇరవై ఐదేళ్ళ తర్వాత చూసుకొంటే ఈ రోజు మనకు కనిపిస్తున్నది ఏమిటి? ఈ దేశంలో రోజుకి సగటున నలభైమంది రైతులు ఆత్మహత్య చేసుకొంటున్నారు. ఇప్పటికే దాదాపు మూడు లక్షల మంది ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడింది? వ్యవసాయరంగం మీద సామ్రాజ్యవాద కంపెనీల పట్టు పెరిగింది. బహుళజాతి సంస్థల ప్రవేశంతో, భారత పాలకవర్గాల, బడాబూర్జువాల జోక్యంతో విత్తనాల ధరలు, ఎరువుల, పురుగుమందుల ధరలు, పంటల మార్కెట్ ధరలు నిర్ణయింపబడుతున్నాయి. ఒక పక్క మన దేశంలో రైతాంగానికి ఎలాంటి సబ్సిడీలూ, సహాయము, మద్దతు అందించవద్దని ఆంక్షలు విధిస్తున్న సామ్రాజ్య వాదం తన దేశంలో రైతాంగానికి రోజుకి ఆరువేల కోట్ల రూ॥ల సబ్సిడీలను అందిస్తూ, ఆ చౌకధరల ధాన్యాలను మనదేశంలోకి పంపుతూ ఇక్కడి రైతాంగాన్ని నాశనం చేస్తున్న స్థితి, ఈ డబ్ల్యుటిఓ ఒప్పందం ద్వారా ఏర్పడింది. దీన్ని మనం అర్థం చేసుకోవాలి. ఈ ప్రభుత్వం ఎంతో బాధ్యతారహితంగా వుంది. వరుసగా గత మూడు సంవత్సరాలుగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కానీ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ఈ రోజుకీ కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించలేకపోయాయి. ఈనాటికీ–చివరికి సుప్రీంకోర్టు–ఇంత కరువు వుంటే అసలు మీరు కరువుగా ఎందుకు ప్రకటించలేదంటే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల మీద, రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం మీద చెప్పుకున్నాయి. ఇప్పటిదాకా అసలు ఈ దేశంలో కరువు వున్నట్లే, కరువుతో ప్రజలు పీడింపబడుతున్నట్లే నరేంద్రమోడీ ప్రభుత్వానికి గానీ, రాష్ట్ర ప్రభుత్వాలకుగానీ తెలియదన్నట్లే పట్టించుకోలేదు.

వీళ్ళు లేనిపోని సమస్యలతో దేశాన్ని ముంచుతున్నారు. ప్రపంచబ్యాంకులో శిక్షణ పొందిన ఆయనే ఈ దేశంలో రిజర్వ్‌బ్యాంక్ గవర్నరుగా వస్తాడు. ఈ దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టలేకపోతే రోజురోజుకీ ధరలు పెరిగి ప్రజల జీవితం అల్లకల్లోలం అవుతుంది కాబట్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయటం రిజర్వ్ బ్యాంక్ యొక్క లక్ష్యం కాబట్టి నేను దాన్ని చేస్తాను అని రిజర్వు బ్యాంకు గవర్నరు అంటాడు. ఈ దేశంలో పాలకవర్గాలు– నరేంద్రమోడీగానీ, లేదా అరుణ్‌జైట్లీ గానీ– నువ్వు వడ్డీ రేట్లు తగ్గించి పెట్టుబడిదారులకు అప్పులెందుకివ్వవు అని అతనిపై ఒత్తిడి తెస్తున్నారు. అంతకుముందు సంవత్సరం ఇదే జరిగింది. ఇప్పటికీ తక్కువ వడ్డీకి పెట్టుబడిదారులకి ఇవ్వవలసిందిగా ఆదేశిస్తున్నారు. కానీ గత సంవత్సరం 1లక్షా 14 వేల కోట్ల రూపాయలు అప్పుగా పెట్టు బడిదారులు తీసుకొని తిరిగి చెల్లించకపోతే దానిని పారుబాకీ కింద రద్దు చేసేయండని నరేంద్రమోడీ ప్రభుత్వం బ్యాంకులకు చెప్పింది. ఈ విషయమైనా మనకి ఎలా తెలుస్తోందంటే అది ఎవరో సుప్రీంకోర్టు నడిగితే సుప్రీంకోర్టు 'నువ్వు ప్రజాధనాన్ని తీసుకెళ్ళి ఉదారంగా అప్పులెగ్గొట్టిన వాళ్ళ తరపున ఎలా కడతావు? కుదరదు, నాకు లెక్క చెప్పమన్నది'–లెక్క చెప్తే వాళ్ళందరి పరువుపోతుంది, అంతమంది పెద్దవాళ్ళ పరువు తీయటం సాధ్యం కాదని లెక్కలు చెప్పబోమన్నారు. సుప్రీంకోర్టు అట్లా కుదరదని ఐదుకోట్లపైన అప్పు తీసుకొని చెల్లించని వాళ్ళ జాబితా తీసుకుంటే గత ఒక్క సంవత్సరంలోనే 1 లక్షా 14 వేల కోట్ల రూపాయలు పెట్టుబడిదారులు ఎగ్గొట్టిన సొమ్ముని మాఫీ చేసేశారని వెల్లడైంది. ఇపుడు మళ్ళీ తక్కువ వడ్డీ రేట్లకు అప్పులు ఇవ్వ వలసిందిగా రిజర్వు బ్యాంకుకు చెప్తున్నారు. ఈ ప్రభుత్వాలున్నది ఎవరి కోసం? ప్రతి ప్రభుత్వమూ–ఆనాటి పి.వి.నరసిహారావు దగ్గరనుండీ ఈనాటి నరేంద్రమోడీ వరకూ 'మేము పేద ప్రజల కోసమే పనిచేస్తున్నాము, పేద ప్రజల జీవితాలను ఉద్ధరించడానికే పని చేస్తున్నామ'ని చెప్తున్నారు. కానీ ఆచరణలో వీళ్ళు బడా బూర్జువా వర్గానికీ, దోపిడీ వర్గానికి, వాళ్ళ ప్రయోజనాలకే సేవ చేయటంలోనే తమ కాలాన్ని గడుపు

తున్నారు. ఈ రెండు సంఘటనలతోటి– ఈ ప్రభుత్వం ఎంత ప్రజా వ్యతిరేకమైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఫలితంగా పారిశ్రామిక రంగంలో లక్షలాదిమంది కార్మికులు ఉద్యోగాల్ని కోల్పోయారు. పర్మినెంటు ఉద్యోగాలనేవి ఏటికేడాది తగ్గిపోతున్నాయి. ఉన్నదల్లా కాంట్రాక్టు, క్యాజువల్ పనులే. ఔట్‌సోర్సింగ్ పేరుతో పెద్ద పెద్ద పరిశ్రమల్లో కూడా కాంట్రాక్టు కార్మికుల వ్యవస్థని బలోపేతం చేస్తున్నారు. ఉత్పత్తిలో సింహభాగం కాంట్రాక్టు కార్మికుల మీదుగానే నడుస్తోంది. కాంట్రాక్టు కార్మికుల నెత్తురు పిండి పనిచేయిస్తూ, జీతాలు తగ్గిస్తూ, ప్రభుత్వ, ప్రైవేటు రంగ కంపెనీల ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్లు ఇబ్బడిముబ్బడిగా లాభాలార్జిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఏ రకమైన పని భద్రతా లేదు. ఎటువంటి చట్టాలూ వర్తించవు.

అదే క్రమంలో ప్రజల్ని మోసపుచ్చడానికి ఒక పక్క నరేంద్రమోడీ 'నేను టీ అమ్ముకొనే వాడిని, మీ కొడుకుని' అంటాడు. ఇంకొక పక్కకెళ్ళి బిసి కులం నుండీ వచ్చాను అంటాడు. ఇంకొక పక్కకెళ్ళి 'నేను హిందూ మతాన్ని రక్షించేవాడిని' అంటాడు. ఇవేవీ మనం నమ్మకూడదు. అతను వీళ్ళెవరికీ ఏమీ చేయడు. టీ అమ్ముకొనే పేదవాళ్ళకు, పట్టణ పేదలకుగానీ, ఇటు బిసికులాల ప్రజలకుగానీ లేదా అటు హిందుమతానికి గానీ మేలు చేయటం అతని లక్ష్యం కాదు. అతనికున్న లక్ష్యం అల్లా ఈ దేశంలోని బడా బూర్జువా వర్గాల ప్రయోజనాల్ని కాపాడటమే. వాళ్ళకోసమే అతను నిలబడ్డాడు అని మనం అర్థం చేసుకోవాలి. కాబట్టే ఈ దేశంలో ప్రజల దృష్టిని మళ్ళించడం కోసం మతతత్వాన్ని రెచ్చగొడు తున్నారు. ఒక మతాన్ని ఇంకొక మతస్తులపైకి రెచ్చగొట్టటం ద్వారా ప్రజల మధ్య విద్వేషాలు కల్పిస్తున్నారు. అదే సందర్భంలో కులతత్వాన్ని పెంచి పోషించి, ఒక కులం మీదకి ఇంకొకకులాన్ని రెచ్చ గొట్టటం అనేది సాగుతోంది. దీనికి ఇటీవల కొత్త రూపాన్ని ఇచ్చారు. అగ్రకులాలుగా వున్నవాళ్ళు కూడా మాకు రిజర్వేషన్లు కావాలని వివిధ రాష్ట్రాల్లో జాట్‌లు, పటేళ్ళు కూడా పోటీకి రావటం అన్నదాన్ని తీసుకువచ్చారు. ఆ విధంగా కులతత్వాన్ని పెంచిపోషిస్తూ ప్రజల్ని విడగొట్టే స్థితిలోకి తీసుకువచ్చారు.

మనం, కార్యకర్తలం ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలు తమ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకొని తమ జీవితాలను మెరుగుపరచుకొనేందుకు పోరాడే విధంగా వారికి నాయకత్వాన్ని అందించేందుకు కార్యకర్తలు సిద్ధపడతారని ఆశిస్తూ, ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సెలవు తీసు కుంటున్నాను.



కామ్రేడ్ కానేటి మోహనరావు

**తూర్పుగోదావరిజిల్లాలో జాతీయోద్యమ నాయకులు, రైతు కూలీ ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడు, పీడిత ప్రజల పక్షపాతి, మొదటి పార్లమెంట్ సభ్యులు కామ్రేడ్ కానేటి మోహనరావు 13-6-2014న తన 92వ ఏట మరణించారు. 1956లో వ్యవసాయకూలీ సంఘానికి రాష్ట్ర నాయకుడుగా ఎదిగారు. జీవితాంతం పీడిత వర్గ దృక్పథాన్ని, సిద్ధాంతాన్ని అంటిపెట్టుకుని వున్నారు. 2011 అక్టోబరులో కాకినాడలో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కి హాజరైనారు. రైతుకూలీసంఘం కార్యాచరణ పట్ల తన పూర్తి విశ్వాసాన్ని ప్రకటించుకుని తన పేరిట "కానేటి మోహనరావు ట్రస్టు"ను రిజిస్టర్ చేసి రైతుకూలీ సంఘ నాయకులను ముఖ్య భాగస్వాములుగా ఏర్పరచి, ఆ ట్రస్టుకి తన సాహిత్యాన్నంతటిని అప్పగించారు. ట్రస్టు నిర్వహణ కోసం తను స్వయంగా సముపార్జించిన ఆస్తిని కూడా ఈ ట్రస్టు పేరు మీద వ్రాశారు. పీడిత ప్రజలకు సరైన చైతన్యాన్ని అందించుతూ, వారిలో నిరంతరం వర్గ స్పృహను కలిగించాలంటే మార్క్సిస్టు సాహిత్యం ఎంతో అవసరమని భావించారు. దీనికోసం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఈ కర్తవ్యాన్ని నిర్వహించారు.**

**పీడిత ప్రజలలో అట్టడుగు వర్గాలలో నిరంతర చైతన్య వికాసం కోసం తపించి మరణించిన కామ్రేడ్ కానేటి మోహనరావుకి విప్లవ జోహార్లు**

**కృష్ణాజిల్లాలో నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ మందాజార్జి చెప్పుల పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తూ మార్క్సిజం, లెనినిజంను స్వీకరించి విజయవాడ పట్టణంలో ఎన్నో కార్మిక, ప్రజాపోరాటాలలో నిలబడ్డ నిబద్ధ కామ్రేడ్, పార్టీ నాయకుడుగా, పశ్చిమ కృష్ణా ప్రాంతంలో అనేక రైతుకూలీ ఆందోళనలో పాల్గొన్న నాయకుడుగా, జిల్లా రైతుకూలీసంఘం అధ్యక్షులుగా ప్రముఖ పాత్ర నిర్వహించిన కామ్రేడ్ జార్జి 19.3.2016న 78 సంవత్సరాల వయసులో మరణించారు. ఆ కామ్రేడ్‌కి విప్లవ జోహార్లు**



కామ్రేడ్ మందా జార్జి

# కా॥ గుర్రం విజయకుమార్, సిపిఐ(ఎం-ఎల్) కేంద్రనాయకులు

సభాధ్యక్షులు కా॥ఝాన్సీగారు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా॥ కొల్లా రాజమోహన్ గారు, సోషలిస్ట్ ఫ్రంట్ (ఆంధ్రప్రదేశ్) కన్వీనర్ మోదుగుల పాపిరెడ్డిగారు, వేదిక మీద ఉన్న వివిధ రాష్ట్రాల రైతు సంఘాల, రైతు ఉద్యమాల నాయకులు, అట్లాగే కర్ణాటక నుంచీ వచ్చిన ప్రజాతంత్ర ఉద్యమాలకు సహాయ కారుడు, ప్రజలను నిరంతరం అంటిపెట్టుకొని ఉండే మల్లిఖార్జునరెడ్డిగారు, ఈ సభకు విచ్చేసినటువంటి రైతు, కూలీ కామ్రేడ్స్ అందరకూ, ఈ సభని నిర్వహించడానికి తోడ్పడుతూ ఆహ్వానసంఘంలో వుండి, వచ్చిన పెద్దలందరికీ ముందుగా నా అభివందనలు.

రైతుకూలీ కామ్రేడ్స్ అందరికీ స్వాగతం. స్వాతంత్ర్యోద్యమంలోను, స్వాతంత్ర్యంకోసం సాగినటువంటి పోరాటాల్లో, ఆందోళనల్లో అనేకమంది కామ్రేడ్స్ ప్రాణాలర్పించారు. జీవితాల్ని అర్పించారు. అట్లాగే స్వాతంత్రోద్యమ కాలంలోనూ రైతు, ఆదివాసీ ఉద్యమాలు నడిచినయి. రైతులు వలసవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆందోళనలు సాగిస్తే, ఆదివాసీలు తమ స్వతంత్రం కోసం, తమ భూమి హక్కుకోసం, తమ అడవి హక్కుకోసం పోరాటాలు సాగించారు. ఆ పోరాటాల్లో మరణించిన వాళ్ళందరికీ నా జోహార్లు. కమ్యూనిస్టు ఉద్యమం 1920ల్లో భారత దేశంలో ప్రారంభమయింది. కాన్పూర్‌లో 1925 డిసెంబర్‌లో ప్రారంభమైంది. దేశానికి స్వాతంత్ర్యం సంపాదిద్దామని చెప్పి, బ్రిటీష్ వాళ్ళకి వ్యతిరేకంగా పోరాడటం కోసం సహాయాన్ని సంపాదించుకొందామని తాష్కెంట్ బయల్దేరిన వాళ్ళు కొండల్నిదాటి ఆనాటి విముక్త రష్యాలోకి ప్రవేశించిన తర్వాత వాళ్ళు ఆ ప్రాంతంలో జరుగుతున్న మార్పుల్ని, వ్యవస్థ యొక్క పునఃనిర్మాణాన్ని, ఆ నిర్మాణానికి కార్మిక, కర్షక పీడిత వర్గాలు ఎట్లా నాయకత్వం వహిస్తున్నాయనేదాన్ని అధ్యయనం చేసిన వాళ్ళు కమ్యూనిస్టులుగా మారారు. అటువంటి కమ్యూనిస్టులు తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేయడానికి 1921లోనే ప్రయత్నం చేశారు. అప్పటి నుంచీ ఇప్పటివరకూ సాగిన కమ్యూనిస్టు ఉద్యమంలో ఎందరో అమరులయ్యారు. జర్మనీ, జపాన్‌లకు వ్యతిరేకంగా సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో బ్రిటిష్ పాలకులు కమ్యూనిస్టు పార్టీ యొక్క సహాయాన్ని పొందుతూ కూడా, కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొన్నందుకు, రైతుఉద్యమంలో పాల్గొన్నందుకు, రైతుఉద్యమం యొక్క డిమాండ్ల కోసం ఆందోళన సాగిస్తున్నందుకు కయ్యూరు కామ్రేడ్స్ పైన తంతుగా, బూటకంగా విచారణ జరిపి ముగ్గురు కామ్రేడ్స్‌ని ఉరితీయడానికి బ్రిటీష్ పాలకులు నిర్ణయించారు. 1943 మార్చి 23న ఉరి తీశారు. కమ్యూనిస్టులకు సంబంధించి మొదటి అమరవీరులు వాళ్ళు. అప్పటి నుండీ ఇప్పటివరకూ అమరులైన కామ్రేడ్స్ అందరికీ కమ్యూనిస్టు పతాకం కింద, వాళ్ళు ఏ కమ్యూనిస్టు పార్టీలో అయినా అయి వుండచ్చు గాక- వాళ్ళందరికీ మా జోహార్లు.

గుంటూరు జిల్లాలో ఈ మహాసభ జరుపుకొంటున్నాం. గుంటూరే మమ్మల్ని-నన్ను, మా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నటువంటి విశ్వాన్ని- మేం కమ్యూనిస్టు కుటుంబాల నుంచీ వచ్చిన మాటనిజమే, కానీ గుంటూరే మమ్మల్ని కార్యకర్తలుగా, వర్గ పోరాటాలకు నాయకత్వం వహించేవాళ్ళుగా, వర్గ పోరాటాలను ప్రోదిచేసుకొని, అనేక మందిని సమీకరించుకొని ఉద్యమాన్ని నిర్మించే వాళ్ళుగా అనుభవాల పాఠాలు మాకు నేర్పింది గుంటూరే. ఆ రకంగా గుంటూరు వాళ్ళమవుతాం మేం. గుంటూరు జిల్లా అనగానే కా॥కొల్లా వెంకయ్యగారు జ్ఞాపకం వస్తారు. కా॥ కొల్లా వెంకయ్యగారికి జోహార్లు. ఈ రైతుకూలీ సంఘం మహాసభలు మొదటి మహాసభను మేం ఇక్కడే జరిపాం. 2001 సం॥రం ఏప్రిల్‌లో మహాసభ జరిపాం. మహాసభ జరిపిన పది-పదిహేను రోజుల్లోనే రైతుకూలీ సంఘానికి అధ్యక్షుడుగా ఉన్నటువంటి మండ్ల సుబ్బారెడ్డి గారు శ్రీకాకుళంలో కోర్టుకేసుకి హాజరవుతూ గుండెపోటువచ్చి మరణించారు. కా॥ మండ్ల సుబ్బారెడ్డిగారికి,



కా॥ మానంరామారావు గారికి, కా॥మాదాల నారాయణ స్వామిగారికి, కా॥ పాతర్ల నాగయ్యగారికి, విశ్వమోహనరెడ్డిగారికి, అట్లాగే కా॥ సోమయ్య (మోషే) గారికి జోహార్లు. రైతుకూలీ ఉద్యమాన్ని నిర్మించడానికి కామ్రేడ్స్ పదుల సంఖ్యలో ఆదివాసీ ప్రాంతాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు, బాపట్ల తాలూకా నుండీ అట్లా వెళ్ళిన కామ్రేడ్ మోషే. ఆ కామ్రేడ్ తూర్పు గోదావరిజిల్లాలో ఉద్యమాన్ని నిర్మించడానికి, తన కుటుంబాన్ని వదిలిపెట్టి వచ్చారు. ఆ ఉద్యమ నిర్మాణ క్రమంలో, ఉద్యమం ఉచ్ఛ స్థాయిదాకా దానితోటి వుండి ఆ కామ్రేడ్ మరణించారు. ఆ కామ్రేడ్‌కి, అంగడి చెన్నయ్యగారికి, కొల్లిపర జగన్నాథ్, పాతూరు -ఆ కామ్రేడ్‌కి, కోలా సుబ్బారెడ్డిగారికి- ఇట్లా గుంటూరు జిల్లాలో పుట్టి, కమ్యూనిస్టు ఉద్యమంలో బాధ్యతలు నిర్వహించి, గుంటూరు జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమానికి పునాదులువేసి, పునాదులు వేయటం కోసం వాళ్ళ జీవితాలని, వాళ్ళ ప్రాణాలని అర్పించిన కామ్రేడ్స్ అందరికి మరొకసారి జోహార్లు చెప్తూ నేను ఈ సందర్భంలో కొన్ని విషయాలు మాట్లాడతాను.

ఇవాళ భారతదేశం స్వతంత్రంగా లేదు. భారతదేశంలోని మొత్తం ప్రజానీకానికి తిండిదొరికే పరిస్థితిలో భారత పాలనా వ్యవస్థగానీ, సామాజిక వ్యవస్థగానీ లేదు. ఇంత దుర్భరమైన స్థితిలో భారత దేశాన్ని పాలకులే వుంచారు. ఈ స్థితిలో పాలకులు ఉంచిన దానికి బదులుగా, దీనికి వ్యతిరేకంగా భారత ప్రజలు, ముఖ్యంగా కార్మికవర్గం, రైతాంగం, ఆదివాసీ

ప్రజానీకం, అణగారిన ప్రజానీకం భారత దేశంలో తమపాలన కోసం, తమ మనుగడ కోసం, తమ జీవనం కోసం తీవ్రంగా పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితుల్లో రైతుకూలీ ఉద్యమాల, కార్మిక ఉద్యమాల, ప్రజాఉద్యమాల యొక్క అవసరం ఎంతో వుంది. అట్లాంటి సందర్భంలో రైతుకూలీ ఉద్యమాన్ని నిర్మిస్తూ, రైతుకూలీ పోరాటాలు, ఆదివాసీ పోరాటాలు సాగిస్తూ, ఆదివాసీ పోరాటాల్లోనూ, రైతుకూలీ ఉద్యమాల్లోనూ తమ జీవితాల్ని, తమ ప్రాణాల్ని అర్పిస్తున్నటువంటి, త్యాగం చేస్తున్న కామ్రేడ్స్ అందరికీ, అట్లాగే పోరాటాల్ని కొనసాగిస్తున్న కామ్రేడ్స్ అందరికీ జేజేలు చెప్తున్నాను.

భారతదేశంలో అపారమైన యువశక్తి వున్నది. ప్రపంచంలో చైనా వాళ్ళ దగ్గర యువశక్తి లేదు. జపాన్ వాళ్ళది వృద్ధాప్య దేశంగా మారింది. యూరప్ దేశాల్లో యువశక్తి లేదు. మన దేశంలో అపారమైన యువశక్తి వుందని పాలక వర్గపార్టీలు, అధికారం కైవసం చేసు కోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేసిన బీజేపీ పార్టీకి సంబంధించిన మోడీ భారత దేశమంతా ఎన్నికల ప్రచారంలో ఉదహరిస్తూ వచ్చారు. మంచిదే. భారతదేశంలో అపారమైన యువశక్తి ఉన్న మాట నిజమే. ఈ యువశక్తి కొత్తదేశాన్నీ నిర్మించగలుగుతుంది. భారతదేశాన్ని ఏ విధంగా మలచాలంటే ఆ విధంగా మలచ గలిగిన యువశక్తే భారత దేశంలో వుంది. అయినప్పటికీ భారత దేశంలో యువశక్తికి పని ఇవ్వటానికిగానీ, పని ఇవ్వటానికి తగిన విధంగా వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ సంబంధాల్ని పునర్వ్యవస్థీకరించడానికిగానీ, భారత పారిశ్రామిక రంగాన్ని తదను గుణ్యంగా అభివృద్ధి చేయడానికిగానీ, పారిశ్రామిక రంగంలో ఉపాధి కల్పించడానికి తగిన విధానాలని గానీ మోడీ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల్లోనూ రూపొందించ లేదు. ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాల కనుగుణ్యంగా కూడా వాళ్ళు నడవట్లేదు. అట్లానే భారతదేశపు కంప్యూటర్స్ వచ్చినయి. సర్వీస్ రంగం వచ్చింది. ఈ సర్వీస్‌రంగం బాగా ఆదాయాన్ని సంపాదిస్తుంది. భారత దేశంలో ఆదాయంలో అత్యధికభాగం ఈ సర్వీస్ రంగం సంపాదించి పెడుతుంది. కనుక భారతదేశం సర్వీసుల రంగం ఆధారంగా అభివృద్ధి చెందగలుగుతుంది అని చెప్పి చాలాకాలం నుంచీ పాలకులు మాట్లాడుతున్నారు. ఏ పార్టీ వాళ్ళు పాలకులుగా మారినప్పటికీ అదే విషయాల్ని మాట్లాడు తున్నారు. పోనీ సర్వీసులరంగం ఈ రెండు సంవత్సరాల్లో కొత్త ఉపాధిని కల్పించిందా అంటే అదేమీ లేదు. భారత దేశాన్ని ఆటో పరిశ్రమకి మంచి కేంద్రంగా మలచగలుగుతామని గతంలో పాలకులు, ఇప్పుడున్న పాలకులు మాట్లాడు తున్నారు. మనమూ చూస్తున్నాం. రోడ్డు మీద చాలా చాలా కొత్త కొత్త వాహనాలు వస్తున్నాయి. చాలా కొత్త వాహనాల్ని భారత దేశంలో ప్రజలు కొంటున్నారు. వినియోగ దారులు కొంటున్నారు. వినియోగదారులు అట్లాంటి వాహనాలు కొనటానికి బ్యాంకులు జీరో పర్సెంట్ వడ్డీకి అప్పులు ఇవ్వటం కూడా మనం చూస్తున్నాం. అయినప్పటికీ ఆటో మొబైల్ రంగం కొత్త ఉపాధిని ఏమైనా కల్పించిందా? కొత్త పరిశ్రమలు ఏర్పడి కొత్త ఉపాధిని కల్పించిందా? పరిశ్రమల్లో, వ్యాపారాన్ని బ్రహ్మాండంగా పెంచుకొన్నటు వంటి వాళ్ళు, విదేశాల నుంచీ వచ్చి ఇక్కడ షాప్స్ పెట్టి, ఇక్కడ ప్రొడక్షన్ యూనిట్లో లేక అసెంబ్లింగ్ యూనిట్లో పెట్టిన వాళ్ళని పత్రికా సంపాదకులు కలిసి ఈ మాట అడిగితే–'భలేవారండీ మీరు, మమ్మల్ని చాలా విచిత్రమైన ప్రశ్నవేస్తున్నారు. కొత్త కార్మికులను నియమించుకొని, ఆ కొత్త కార్మికులకు వేతనాలిచ్చి, పెరుగుతున్న ధరల కనుగుణ్యంగా వేతనాలు పెంచుతూ పోతే మాకు లాభాలు వచ్చేనా? మాకు లాభాలు మిగిలేనా? మేం పెట్టిన పెట్టుబడికి తగిన గిట్టుబాటైన లాభాలు లభించేనా? ఇవాళ్ళ మా విధానమేంటంటే ఉన్న కార్మికశక్తిని తగ్గించి, బదులుగా వీళ్ళందరిచేత ఎక్కువ పని చేయించి, ఎక్కువ ఫలితాలు సాధించి లాభాలు సంపాదించాలని మేం ఈ దేశంలో అసెంబ్లింగ్ యూనిట్ పెట్టాము' అని చెప్పారు. కొత్తగా ఆటోమొబైల్స్ పెట్టిన వాళ్ళందరూ– వాళ్ళు మేనేజర్లు కావచ్చు, మేనేజింగ్ డైరెక్టర్లు కావచ్చు, ఎక్స్ ఛైర్మన్లు కావచ్చు–వాళ్ళందరూ కూడి ఒక సమా వేశంలో ఒక పత్రిక సంపాదకుడు అడిగిన ప్రశ్నకి ఈ జవాబు చెప్పారు. ఆ రకంగా దేశంలోకి పరిశ్రమలు ఒకటీ రెండూ కొత్తగా వచ్చినయి గానీ ఈ దేశంలోకి అసెంబుల్ చేసేందుకు మాత్రమే వచ్చాయి. అసెంబుల్ చేసేటపుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని, టెక్నాలజీని మాత్రమే తీసు కొన్నారు. కొత్తగా ఉపాధి కల్పించటానికి, కొత్తగా పనివాళ్ళకి పని ఇవ్వటానికి మాత్రం వాళ్ళు రాలేదు. ఈ సంగతి వాళ్ళే చెబు తున్నారు. కనుక భారతదేశంలో పారిశ్రామిక రంగం– ప్రభుత్వరంగం మూలబడుతున్నది. భారత దేశంలో ప్రైవేటురంగంలో ఉన్న పరిశ్రమలు విదేశాలతో కలవబోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌నే చూసుకుంటే–బహుశా '70ల తర్వాత సిమెంటు పరిశ్రమ విస్తరించింది. స్థానికులే ఏర్పాటు చేసిన సిమెంటు పరిశ్రమ–వాళ్ళు బాగానే లాభాలు సంపాదించారు. వాళ్ళ పెట్టుబడులు పెరిగినయి. ఇతర రంగాల్లోకి విస్తరించారు. అయితే ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సిమెంటు పరిశ్రమలో సమస్యలేమిటి? అవి ఇప్పుడు స్వతంత్రమైనవి కావు. దేశీయ మైనవి కావు. తెలుగువాళ్ళవి కావు. విదేశాల పరమైనయి. అటు ఫ్రాన్సువాళ్ళ పరం కావటమో, జర్మనీ వాళ్ళపరం కావటమో, యురోపియన్ దేశాలపరం కావటమో అయి పోయింది. అట్లా భారతదేశంలో స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గం లేదా దేశీయ పెట్టు బడులు విస్తరించడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఒక రకంగా సిమెంటు రంగం వాళ్ళపరమైన తర్వాత సిమెంటు ఇండస్ట్రీలోని కార్మిక శక్తిని తగ్గిస్తున్నారు. లాభాన్ని పెంచుకొంటున్నారు. సిమెంటు రేటుని విపరీతంగా పెంచి లాభాలు పెంచు కొంటున్నారు. మార్కెట్ మందకొడిగా వున్నపుడు ఉత్పత్తిని తాత్కాలికంగా స్థంభింప జేసి, మార్కెట్‌కి తక్కువ సరుకు పంపించి, సిండికేట్ అయి ఎక్కువ లాభాలు సంపా దించుకొంటున్నారు.

ఇంకొకటి–ఈ రాష్ట్రంలో మందుల పరిశ్రమ ఒకటి పుట్టి కొంతకాలం వర్ధిల్లింది. ఇవాళ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసే పరిశ్రమ ఏదీ స్వతంత్రంగా లేదు. నిన్నా

మొన్నా –ఏదో విదేశాలపరం కాబోతున్నదని చెప్పి పత్రికల్లో వార్తలొచ్చినయి. ఈ రకంగా ఇవాళ భారతదేశ పాలకులు భారత ప్రజల కోసం పరిపాలిస్తున్నామని ఒక్క పక్క ఒక మాట చెబుతూ, వాళ్ళు పరిపాలనలోకి వచ్చిన తర్వాత భారతీయ పరిశ్రమలను విదేశాలకు అప్పజెప్తున్నారు. భారతదేశ వనరుల్ని విదేశాలకు అప్పజెప్తున్నారు. భారతదేశ శ్రామికశక్తుల్ని, మేధాశక్తుల్ని విదేశాల వాళ్ళకి అప్పజెప్పి తక్కువ వేతనం తోటి పనిచేసే పరిస్థితులను సృష్టిస్తున్నారు.

ఇవాళ భారతదేశంలో చట్టాలు ఎక్కువై నాయట. చట్టాలు చాలా ఉన్నాయి. ఈ చట్టాలన్నీ కార్మికవర్గం సమష్టిగా పోట్లాడి సాధించుకున్నటువంటి చట్టాలు. ఈ చట్టాలు చాలా ఎక్కువైనాయట. ప్రతిచట్టం ప్రకారం కోర్టుకి వెళ్తున్నారు, కోర్టుకి వెళ్ళిన తర్వాత మేనేజ్‌మెంట్లు, యాజమాన్యాలు సమా ధానాలు చెప్పలేకపోతున్నాయి గనుక ఆ సమాధానం చెప్పడానికి తగిన ఖర్చుని వాళ్ళు పెట్టాల్సి వస్తోంది. కనుక, వాళ్ల ఇష్టం వచ్చినట్లుగా కార్మికుల్ని తీసివేయడానికీ, నియమించుకోవడానికీ, చట్టం అమలు జరపకుండా ఉండడానికి తగిన అవకాశాలు కల్పిస్తూ, ఉన్న చట్టాలను కూడా మార్చ డానికి, ఉన్న చట్టాలను ఏకీకరణ చేసే పేరు తోటి కొత్తగా యాజమాన్యాలకు అనుకూల మైన చట్టాల్ని తయారుచేసే పనిలో పాలకులు ఉన్నారు.

అట్లానే వ్యవసాయరంగానికొద్దాం. భారత దేశంలో తీవ్రమైన కరువులు వలసపాలనా కాలంలో చూశాం. డొక్కల కరువు అని గుంటూరు జిల్లాకే వచ్చిన కరువు కూడా మనందరం చరిత్రలో చదువుకొన్నాం. అయితే విచిత్రమేమిటంటే పంటలు పండు తున్నాయి. వ్యవసాయ దిగుబడులు వస్తున్నాయి. ప్రతిసంవత్సరం కౌలు రైతులో, రైతులో, వ్యవసాయదారులో పెట్టుబడులకి, వచ్చినటువంటి రాబడికి పొంతన కుదరక ఆత్మహత్యలు చేసుకొనేటటువంటి పరిస్థితి వుంది. ఆ రకంగా వలస పాలనా కాలంలో వుండిన దుర్మార్గమైన, దుర్భరమైన పరిస్థితిని నేడు మన వ్యవసాయరంగం చూస్తోంది. ఈ వ్యవసాయరంగంలో పరిస్థితి ఎట్లా ఉందంటే చంద్రబాబు భూసేకరణ చట్టం అమలు జరప కుండా భూసమీకరణకు వెళ్ళాడు. ఇవాళ గుంటూరుజిల్లాకి వచ్చి ఎకరానికి కోటి రూపాయలు వంతులు వారీగా, హద్దుల వారీగా ఇస్తానంటే, భూసమీకరణలో కొట్టుకుపోవడానికి సిద్ధమైన పరిస్థితులు ఇవాళ ఆంధ్రదేశం లోనూ, గుంటూరు జిల్లాలోనూ రైతాంగానికి ఉంది. ఇంత దుర్భరంగా ఇవాళ వ్యవసాయ రంగం పరిస్థితి వుంది. అన్ని రంగాల్లో భారత పాలకులు ఇంత దుర్భరమైన పరిస్థితిని కల్పించి, ఈ దుర్భర మైన పరిస్థితి నుండి బైటపడవేయటానికి కావలసినటు వంటి చర్యల్ని వాళ్ళేమీ తీసుకోలేదు.

డా॥కొల్లా రాజమోహన్‌గారు ఆచార్య రంగాగారి ఉపన్యాసాల నుంచి ఒక భాగాన్ని తన స్వాగతోపన్యాసంలో ఉదహరించారు. బాగుంది. స్వాతంత్రోద్యమ కాలంలో రైతు పంట పండించగలిగేవాడు, రైతు తినగలిగే వాడు. తన పక్కన వాళ్ళకి సహాయం చేయ గలిగేవాడు. ఆ రైతు స్వతంత్రత కావాలని జెప్పి, స్వతంత్రం కావటమేగాదు, సమష్టి జీవితంతో కూడిన నూతన వ్యవస్థ కావాలని జెప్పి, ఈ నూతన వ్యవస్థలోకి పోవాలంటే వలస పాలన పోవాలని చెప్పి ఆనాడు ఆయన కోరారని ఉపన్యాసంలో ఉద హరించారు. ఇవాళ మన పాలకులు వలస పాలనను కోరట్లేదు గానీ బహుళజాతి సంస్థలకి కావలసిన సేవలన్నీ చేసి పెడు తున్నారు. ఇక్కడ చంద్రబాబు ఒక పక్కన స్వర్ణాంధ్ర గురించి మాట్లాడతాడు. మరో పక్కన చైనావాళ్ళకు సేవచేస్తానంటాడు. జపాన్‌వాళ్ళకు సేవ చేస్తానంటాడు, స్విట్జర్లాండుకి వెళ్ళి అక్కడి నుండీ పెట్టు బడుల్ని రమ్మంటాడు. ఇంకెక్కడి నుండో పెట్టుబడులు రమ్మంటాడు. మీ క్కావలసిన సేవలన్నీ మేం అందిస్తామంటాడు. కె.సి.ఆర్ అక్కడ బంగారు తెలంగాణ నిర్మించడానికి చైనా వాళ్ళను పెట్టుబడులతో రమ్మంటాడు. జపాన్‌వాళ్ళను పెట్టుబడులతో రమ్మంటాడు. సింగపూర్ నుండీ పెట్టుబడులతో రమ్మంటాడు. అలాగే కేంద్రంలో పరి పాలకుడు మోడీ–ఈ దేశంలో ప్రజల యొక్క కష్టాల్ని, ప్రజల యొక్క సమస్యల్ని పరిష్కరించటానికి ఇక్కడి మేధావులతో కూర్చోవటం లేదు. కూర్చోవడానికి సమయం లేదు. పార్లమెంటులో చర్చించ టానికి సమయం లేదు. బజార్లో చర్చించ టానికి సమయం లేదు. ఆయనిచ్చే సందేశాల్లో ప్రజాసమస్యల్ని ప్రస్తావించటానికి ఆయనకేమీ బుద్ధి పుట్టటం లేదు. కానీ విదేశాలకు పోయి–'మేకిన్ యిండియా'– రండి! మీ పెట్టుబడులతో రండి. మీ క్కావలసిన సదుపాయాలన్నీ కల్పిస్తాం అని మాట్లాడుతున్నాడు. నేనొకటి అడుగు తున్నాను. వాళ్ళు ఈ దేశంలోకి పెట్టుబడులు తీసుకురాగలుగుతారా? మోడీ అత్యంత దుర్మార్గంగా, అత్యంత నీచంగా, విదేశాల నుంచీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాడు. ఆహ్వానిస్తున్నాడంటే కొత్త పరిశ్రమల కోసం కాదు, కొత్త అభివృద్ధి కోసం కాదు, కొత్త ఉపాధి కల్పన కోసం కాదు. వాళ్ళకి దళారీలుగా వుంటూ వాళ్ళకు సంపదను కట్టబెట్టడం ద్వారా కమీషన్లు పోగేసు కొనేందుకే, ఈ విధంగా రమ్మంటున్నాడు. ఎన్నికల్లో ఇచ్చిన నినాదాలు వేరు. అమలులోకి వచ్చేటప్పటికి జరుగుతున్నది వేరు. వాళ్ళు ఎన్నికల్లో నినాదాలిచ్చే రోజునే వాళ్ళకి స్పష్టంగా తెలుసు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశ ప్రజల కోసం, ఈ దేశ ప్రజల అభివృద్ధి కోసం, ఈ దేశ ప్రజల తిండికోసం, ఈ దేశ ప్రజలకు పని కల్పించటం కోసం తాము ఏమీ చేయ బోవట్లేదని తాము ఏమీ చేయాలని తలంచటం లేదని! బహుళజాతి సంస్థలకు మాత్రం సేవలందిస్తాం, సేవలందించటం కోసమే పరిపాలనలోకి వస్తున్నామన్న సంగతి వాళ్ళకి తెలుసు. ముందటి యుపిఎ పరిపాలనగానీ, ఎన్‌డిఎ పరిపాలనగానీ, దాని ముందు సాగిన ఎన్‌డిఎ పరిపాలన గానీ, ఇదే పరిస్థితి.

భారతదేశంలో తారతమ్యాలు విపరీతంగా పెరిగిపోయినయి. భారతదేశంలో ఉన్న జనాభాలో 77%, అంటే 90 కోట్లకు మించిన జనాభా రెండు పూటలా పుష్టిగా ఆహారం తీసుకోలేని స్థితిలో వున్నారు. ఆహారం తీసుకోలేనందువల్ల వీళ్ళకి వైద్యం లేదు. ఆహారానికే ఖర్చు పెట్టలేని పరిస్థితి వుండటం వల్ల, వాళ్ళకి విద్యలేదు. కనుక ప్రాథమిక సదుపాయాలేవీ, ప్రాథమిక అవసరాలేవీ తీరని పరిస్థితిలో 80–90 కోట్ల

ప్రజానీకం వుంటున్నారు, అని అర్జున్‌సింగ్ గుప్తా నాయకత్వంలో ప్రభుత్వం నియమించిన పార్లమెంటరీ సంఘమే చెప్పింది. వాళ్ళ సమస్యల్ని యుపిఏ పరిష్కరించలేదు. ఎన్‌డిఏ పరిష్కరించబోవటం లేదు. ఎన్‌డిఏ చేస్తున్న పనేమిటంటే ఈ దేశంలో 30-35 కోట్లమంది ఎంతకైనా ఖర్చు పెట్టగలిగిన వినియోగదారులున్నారు. వాళ్ళకి కావలసిన ఆటోమొబైల్స్, వాళ్ళకి కావాల్సిన ఎలక్ట్రానిక్సు, వాళ్ళకి కావాల్సిన సమస్త సదుపాయాల్ని కల్పిస్తూ, భారత దేశంలో షేర్ మార్కెట్ విజృంభించడానికి, షేర్ మార్కెట్‌లో లాభాలు పొందేదానికి కావలసినవి చేస్తామని, వాళ్ళ ప్రణాళికలో రాసుకున్నారు. ఆ విధంగా సాగుతున్నారు. కనుక భారత దేశంలో వున్న వ్యవస్థల గురించి, భారతదేశంలో ఉన్న సమాజాన్ని గురించి, భారతదేశ ప్రజల కష్టాన్ని గురించి మనకి మనం ఆలోచించుకోవాల్సిందే. పాలకులు ఆలోచించరు. పాలకవర్గ పార్టీలు ఆలోచించవు. పాలకపార్టీలు దొరికితే ప్రజల నుంచి భూమిని కొట్టేస్తాయి. ఆదివాసుల నుంచి అడవిని కొట్టేస్తాయి. చిన్న పారిశ్రామికవేత్త నుండి పరిశ్రమను కొట్టి వేస్తాయి. లేదా చిన్న పరిశ్రమను నాశనం చేస్తాయి. కనుక ఈ పాలకులు ప్రజల వ్యతిరేకులనేది నిర్ణయించుకొని ఈ పాలకులకు వ్యతిరేకంగా మనం ఉద్యమాన్ని నిర్మించుకోవాలి. ఇవాళ కార్మికుల ఉద్యమాన్ని, రైతు ఉద్యమాన్ని, ఆదివాసీ ఉద్యమాన్ని మనం నిర్మించుకోవలసినటువంటి అవసరం ఎంతో వుంది. ఇవాళ ఏనాటికంటే కూడా అలాంటి అవసరం మన ముందుకు వచ్చింది. భారత దేశ పాలకులకు ఎప్పుడో, బహుశా ఆర్యులు వచ్చి వేదాలు పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ భారతదేశంలో కులవ్యవస్థ వున్నది. వర్గ సంబంధాలను స్థిరీకరించడానికే, వ్యవస్థీకరించటానికే ఈ కులవ్యవస్థను వాళ్ళు సృష్టించారు. ఇప్పుడు కొనసాగిస్తున్నారు. పాలకులు తమ కులాల చుట్టే తాము వ్యవహారాలు నడుపుతూ వుంటారు. మరోపక్క బజార్లోకి వచ్చి దానికి భిన్నంగా, దానికి వ్యతిరేకంగా మాట్లాడుతారు. మరొకవైపు నుంచీ ఈ కులం అభివృద్ధికి రిజర్వేషన్లు పెడతామన్నారు. ఆ కులం అభివృద్ధికి ఫైనాన్స్ క్రియేట్ చేస్తాం, కమీషన్లు ఏర్పాటు చేస్తాం, ఆ కమీషన్ల ద్వారా మీక్కావలసింది తెచ్చిస్తామని అంటున్నారు. దీనిద్వారా కులాల మధ్య తగాయిదాలు పెట్టటం వీళ్ళ ఉద్దేశ్యం. కులాల మధ్య తప్పుడు తగాయిదాలు పెడితే, ఈ నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ ఈ విధంగానే వుంటుంది, వర్గపోరాటాలకు ఇది అడ్డంకిగా వుంటుంది, తమ ఇష్టారాజ్యంగా పరిపాలన సాగించుకోవచ్చని ఈ పాలకులు అనుకొంటున్నారు. పాలకుల యొక్క సామాజిక ఆలోచనలకు వ్యతిరేకంగా కూడా, పాలకుల యొక్క విధానాలకు వ్యతిరేకంగా, ఆర్థిక విధానాలకి వ్యతిరేకంగా, సామాజిక విధానాలకు వ్యతిరేకంగా, రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా మనం పోరాటాలు సాగించటం తప్ప మనకి మరొక ప్రత్యామ్నాయం లేదు. మనం జీవనం సాగించాలంటే, మనం మనుగడ సాగించాలంటే ఈ పాలకులకు వ్యతిరేకంగా, ఈ వ్యవస్థకి వ్యతిరేకంగా పోరాటం తప్ప మరొక మార్గం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక కర్షక పోరాటాలు జమిలిగా సాగాలి. కలిసి సాగాలి. అదే సమయంలో గ్రామీణ ప్రాంతపు ప్రజానీకాన్ని, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయంలో కునారిల్లిపోతున్నటువంటి వారిని, వ్యవసాయాన్ని వదిలిపెట్టి పోతున్న వాళ్ళని, అడవిలో బతకడానికి అవకాశం లేకుండా పోతున్న ఆదివాసులందరినీ సమీకరించి ఈ పోరాటానికి, సంఘర్షణకి, ఆందోళనకి నడిపించాల్సిన కర్తవ్యం ఇవాళ మన ముందు ఉన్నది, కమ్యూనిస్టులందరి మీద వున్నది.

నేను కమ్యూనిస్టు పార్టీ తరపున మాట్లాడుతున్నాను. ఒక కమ్యూనిస్టు పార్టీ కాదు. వర్గ సిద్ధాంతం, వర్గ విభజన, మార్క్స్-ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళికని ఆమోదించినటువంటి ప్రతి కమ్యూనిస్టుకి, ప్రతి కమ్యూనిస్టు పార్టీకి ఇవాళ భారతీయ సమాజంలో పేదలను, పీడితులను అందరినీ సమీకరించి, రైతుకూలీలందరినీ సమీకరించి, కార్మికులందర్ని జతచేసుకొని ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉన్నది. అలాంటి ఉద్యమాల్ని నిర్మిస్తున్నటువంటి రైతుకూలీ సంఘం యొక్క నాయకత్వానికి, రైతుకూలీ సంఘం కార్యకర్తలందరికీ, రైతుకూలీ సంఘం సభ్యులందరికీ మరొకసారి జేజేలు తెలుపుతున్నాను. మీతోపాటు ఇతర పీడితుల్ని సమీకరించుకోవడానికి, వర్గ ప్రాతిపదికన ఆలోచించేటటువంటి వివిధ శక్తులను సమీకరించుకోవడానికి, సమాజాన్ని పురోగామి మార్గంలో నడిపించాలనే శక్తుల్ని, ప్రజాతంత్రశక్తుల్ని సమీకరించుకొని, ఈ పోరాటం మరింత ముందుకు సాగించటానికి, నిరంతరం మీతో పాటే వుంటాము. మీ అందరి యొక్క సహకారం తీసుకొని ఒక బృహత్తరమైన ఉద్యమాన్ని మనం నిర్మిద్దాం. నిర్మించడానికి మీరందరూ కూడి ఆలోచన చేస్తున్నందుకు, అనుభవాలు పంచుకొంటున్నందుకు, అనుభవపాఠాలు తీసుకొని మరిన్ని కార్యక్రమాలకు వెళ్ళబోతున్నందుకు మరీ మరీ అభినందనలు తెలియజెప్తున్నాను.






## కా॥పి.అంజయ్య, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ యిండియా, రాష్ట్ర అధ్యక్షులు

సభాధ్యక్షులు, ప్రియమైన పెద్దలారా! గతంలో శ్రీకాకుళం జిల్లా సాలూరులో జరిగిన రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) మహాసభలో నేను పాల్గొన్నాను. విజయ నగరంజిల్లా బొబ్బిలిలో జరిగిన మహాసభలో కూడా నేను పాల్గొన్నాను. అదే విధంగా గతంలో హైదరాబాదులో, కొల్లేరు భూములపై రైతుల పక్షాన జరిగిన సదస్సులో, మంగళగిరిలో జరిగిన సదస్సులో కూడా నేను పాల్గొని మాట్లాడటం జరిగింది. ఈ వేళ ఎంతో ఘనంగా, ఇంత ఉన్నతంగా, భారీస్థాయిలో జరుగుతున్న రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలో రిపబ్లిన్ పార్టీ ఆఫ్ యిండియా తరఫున నన్ను పిలిచినందుకు మొదటిగా నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వాస్తవంగా నేనుగాదు ఈ సభలో పాల్గొని మాట్లాడవలసింది. అనేక సంవత్సరాలుగా ఎంతో సన్నిహితంగా రైతుకూలీసంఘంతో అనుబంధం ఉన్నటువంటి గౌరవనీయులు బొజ్జా తారకంగారు పాల్గొనవలసిన, మాట్లాడవలసిన సభ ఇది. ఆయన ఆరోగ్యం బాగోలేనందువల్ల, ఆ బాధ్యతను నేను తీసుకొని మీ ముందుకు రావడం జరిగింది.

ముఖ్యంగా ఇవాళ ప్రధానమైనటువంటి భూమి సమస్య, కూలీల సమస్య, వాటి పరిష్కారం కోసం రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) చేస్తున్న పోరాటానికి మా మద్దతు ఎప్పుడూ వుంటుందని తెలియ జేస్తున్నాను. కలసి పనిచేయడమే కాకుండా– గతంలో లక్షింపేట సంఘటన కానివ్వండి, చుండూరుపై వచ్చినటువంటి తీర్పు సందర్భంగా గానివ్వండి, ఆందోళనను గ్రామస్థాయి నుంచి, ఢిల్లీస్థాయి వరకు తీసుకుపోవడంలో రైతుకూలీసంఘం ఝాన్సీ గారి నాయకత్వం మహోన్నతమైన పాత్ర పోషించిందని కూడా నేను ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను.

అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఉన్నటువంటి ఇద్దరి విధానాలనూ మనం పరిశీలిస్తే ఇవాళ దళిత, ఆదివాసీ, బలహీన వర్గాల హక్కుల్ని కాలరాసే విధంగా వారి కార్యక్రమాలు, వారి నిర్ణయాలు ఉన్నాయనేది స్పష్టమౌతోంది. నేను చిత్తూరు జిల్లా తిరుపతి నుండీ వచ్చాను. తిరుపతిలో భారతదేశంలో భూస్వాములకే భూస్వామి అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి తిరుపతిలోనే వున్న విషయం మీ అందరికీ తెలుసు. ఆయన పేరిట లక్ష ఎకరాలపైన భూములు ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర అనే ఒక్క విగ్రహంపైన లక్ష ఎకరాలకు అధికంగా భూమి వుంది. ఈ గుంటూరు జిల్లాలోనే ఇటీవల ఒక పెద్ద మనిషి వంద ఎకరాలు ఆ దేవస్థానానికి ఇచ్చాడు. ఇవాళ దళితులు, ఆదివాసీలు కిలో రూపాయి బియ్యం కోసం లైన్లో నిలబడే దుస్థితి మన కళ్ళ ముందు ఉంది. రేషన్ కార్డులు ఎన్ని లక్షలు కావాలన్నా ఇవ్వడానికి తమ ప్రభుత్వాలు సిద్ధంగా వున్నాయని పాలకులు చెప్తున్నారు తప్ప మౌలిక సమస్యల్ని పరిష్కరించటం లేదు. ఇవాళ భూమిలేనటువంటి నిరుపేదలు భూమి లేనటువంటి ఆదివాసీలు అడవిలో చెట్లు, ఆకులు, లేదంటే మట్టిని నమ్ముకొని బతికే టటువంటి లక్షలాది మంది ఆదివాసీలు ఎంత దుర్భరమైన జీవితాలు కొన సాగిస్తున్నారో మనకి తెలుసు. అదే మీరు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని ఒక్కసారి పరిశీలించినట్లయితే ఆ అడవిలో వున్న 40 లక్షల చెట్ల ఎర్రచందనాన్ని ఉన్నతవర్గాలు, అధికారంలోకి వచ్చిన అగ్రవర్ణ, భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు దోచుకొని లక్షల కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివాసీలకు దక్కవలసిన అటవీ సంపదను దోచుకొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు రాజధానికి అమరావతి అని ఒక పేరుపెట్టి, ఈ రోజు అమరావతిని ఆదివాసీల, బలహీన వర్గాల సమున్నతి కోసం, వారి జీవితాల్లో వెలుగులు తీసుకు రావటం కోసం అంటూ చెప్పే మాటలన్నీ కూడా ఒట్టి బూటకం. అమరావతిలో తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని తీసు కొచ్చి వందకోట్లతో గుడికట్టబోతున్నారు. సామ్రాజ్యవాద సంస్కృతిని ఒకవైపు, మరో వైపు ఈ సమాజాన్ని మళ్ళీ మూర్ఖత్వం వైపు



తీసుకెళ్ళేటటువంటి కుట్రను, అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం–రెండూ కూడా సాగిస్తున్నాయి. ఆదివాసీలను, బలహీన వర్గాలను, దళితుల్ని మళ్ళీ వంద సంవత్సరాలు వెనక్కి నెట్టే ప్రయత్నం ఇది. ఆంధ్రప్రదేశ్‌లోకి లక్షల కోట్ల పెట్టుబడి తీసుకురావాలని విదేశాలకు వెళ్ళిన చంద్రబాబునాయుడు; విదేశీ, స్వదేశీ కంపెనీలకు ఈ రాష్ట్రంలో ఉన్న లక్షలాది ఎకరాల భూముల్ని ధారాదత్తం చేసి పదహైదు రోజుల్లో, వాళ్ళకి అన్ని రకాలైన లైసెన్సులూ ఇచ్చి, పెట్టుబడులు పెట్టు కోవడానికి అవకాశం ఇచ్చిన చంద్రబాబు నాయుడు–ఆ పెట్టుబడుల్లో ఎస్సీ, ఎస్టీల కోసం రిజర్వేషను తీసుకురావడానికి ఒక్క చిన్న ప్రతిపాదన కూడా పెట్టే పరిస్థితి లేదని ఈ సందర్భంగా నేను గుర్తు చేస్తున్నాను.

ప్రభుత్వ సంస్థలన్నింటినీ దివాళా తీయిస్తూ, ప్రభుత్వసంస్థలన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ, ప్రభుత్వ సంస్థలన్నింటినీ కూడా మూసివేసే కార్యక్రమం ఒకవైపు తీసుకొంటున్నారు. మరోవైపు ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తూ, ప్రైవేటు సంస్థల్ని తీసుకువచ్చే క్రమంలో దళితులు, ఆదివాసులు మళ్ళీ వందసంవత్సరాలు వెనక్కి వెళ్ళి– కూలీలుగా కూడా గాకుండా, బానిస జీవితాలకు అంటగట్టే దుస్థితిని మోడీ చంద్రబాబు నాయుడు తీసుకొస్తున్నా రన్న వాస్తవాన్ని మనం అందరం కూడా గుర్తించాలి.

కాబట్టి ఆ కోణంలో మనం ఈ సమాజంలో ఉన్నటువంటి, ఆది నుంచీ కూడా భూమిని నమ్ముకొని బ్రతికే బడుగు జీవుల కోసం, పీడితుల కోసం, దళితుల కోసం, వివక్షతతో పీడింపబడే దళితులను

విముక్తి చేయటం కోసం రైతుకూలీసంఘం పని చేస్తోందనే ఆశతో మేమున్నాం. అందులో భాగంగానే ఇవాళ దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా జరిగేటటువంటి పోరాటాల్లో గానివ్వండి, సామాజిక ఉద్యమాల్లో గానివ్వండి అందరం కలిసి మరింత సీరియస్‌గా పనిచేయాలి. ఆదినుండీ కూడా అగ్రవర్ణ భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు భూమిని, అధికారాన్ని, సంపదను తమ గుప్పిట్లో పెట్టుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల ఆవేశాన్ని అణచడానికి రూపాయికి కిలో బియ్యము, రేషను కార్డులు, ఉచిత గ్యాసు ఇచ్చేటువంటి బూటకపు మాటలకు వ్యతిరేకంగా వామపక్ష శక్తులు కూడా దళిత శక్తులతో కలవాల్సిన అవసరం వుందని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ప్రియమైన మిత్రులారా! మనం ఈ సమాజాన్ని సరైన కోణంలో అర్థం చేసుకోవాలి. ఈవేళ కులం ఈ దేశంలో, రాష్ట్రంలో ప్రధాన పాత్ర పోషిస్తా వుంది. ప్రధానపాత్ర పోషిస్తున్నటువంటి ఈ కులాన్ని, ఈ కులఅడ్డుగోడల్ని తొలగించటం కోసం కమ్యూనిస్టులు ప్రముఖ పాత్ర పోషింవలసిన అవసరం వుంది. అందుకు దళిత శక్తులు కూడా మీతో కలిసి ప్రయాణం చేయడానికి కూడా సిద్ధంగా వున్నాయని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఎందుకంటే ఈ రోజు ఆంధ్ర ప్రదేశ్ విభజన తర్వాత తుళ్ళూరులో 33 వేల ఎకరాలు బీడుబడిపోయి వుంది. అక్కడ భూమి ఉన్న టువంటి వాళ్ళందరూ కూడా డబ్బు తీసు కోవడమో, భూమికి భూమి తీసుకోవడమో ఒకవైపు జరిగింది. మరి ఆదినుండీ కూడా ఆ భూమి మీద బతికే కూలీలు-ఆ భూమిని నమ్ముకొన్న కూలీలు, ఆ భూమిలో శ్రమ చేసినటువంటి కూలీలు, ఆ భూమిపై ఆధారపడి తమ జీవితాల్ని గడిపి, తమ బిడ్డల్ని చదివించుకొనే కూలీలు ఇవాళ పక్కగ్రామాలకు, పక్క రాష్ట్రాలకు వలసవెళ్ళే స్థితి తుళ్ళూరులో వుంది. అదేమంటే రెండున్నర వేల రూపాయల్ని దళితుల కుటుంబాలకు, భూమిలేని వాళ్ళకు నెలజీతంగా ఇస్తామంటున్నారు. అది కూడా నెలవారీ కాదు. దళితుల, ఆదివాసీల, బలహీనవర్గాల దుస్థితి తుళ్ళూరు ప్రాంతంలో, రాజధాని ప్రాంతంలో చాలా దయనీయంగా వుంది. కాబట్టి సమాజంలో ఆది నుంచీ కూడా ఆర్థికంగా, సాంఘికంగా, సామాజికంగా దోపిడీకి గురవుతున్న ప్రజల్ని ఈ సమాజంలో సమాన స్థాయి, సంపదలో సమాన వాటా తీసుకు రావటానికి కమ్యూనిస్టులు, దళితులు కూడా యుద్ధం చేయాలి-వారితో కలిసి ప్రయాణం చేయడానికి ముందుకు వస్తారని ఆశిస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) పెద్దలందరికీ కూడా ఒకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను. నమస్తే.

**కా॥ఎస్.డి.బోస్, ఎఐకెఎమ్‌కెఎస్ అఖిల భారత సభ్యులు**



అధ్యక్షవర్గం, మిత్రులారా!

2010లో ఒంగోలులో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలో కూడా నేను భాగస్వామిని అయ్యాను. రైతుల సమస్యలపై నా అభిప్రాయాలను మీ ముందుంచుతాను. గత యుపిఎ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్‌డిఎ పాలకులు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలన్నీ అమలు చేస్తున్నారు. పాలకులు అన్ని రంగాలను సంక్షోభంలోకి నెట్టివేశారు. అలాగే వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేస్తున్నారు. ఫలితంగా రైతాంగం చాలా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. పంట ఉత్పత్తి ఖర్చులు ప్రతీ సంవత్సరం పెరుగుతూ పోతున్నాయి. పండిన పంట అమ్మితే ఉత్పత్తి ఖర్చులు కూడా రావడంలేదు. అప్పుల పాలౌతున్న రైతాంగం-వడ్డీవ్యాపారస్తులకు, పెత్తం దారులకు భూమిని తెగనమ్ము కుంటున్నారు. గ్రామాల్లో వ్యవసాయరంగం సంక్షోభంలో వుండటంతో బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్ రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున రైతు బిడ్డలు, యువత వలసలు వెళుతున్నారు. బాంబే, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్-ఎక్కడెక్కడికో వలసలు వెళుతున్నారు. 2007లో యుపిఎ ప్రభుత్వ హయాంలో బెంగాల్లో వామపక్ష సిపిఎం అధికారంలో వున్నప్పుడు సింగూరు, నందిగ్రామ్ రైతుల భూమిని బలవంతంగా సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు ఇవ్వడానికి ప్రయత్నించగా ప్రజానీకం పెద్దఎత్తున పోరాడి, బలిదానాలుచేసి అడ్డుకున్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో అక్కడ వామపక్ష ప్రభుత్వం, కేంద్రంలో యుపిఎ ప్రభుత్వాలు ఓడిపోయాయి. ప్రస్తుతం అధికారంలో వున్న ఎన్‌డిఎ ప్రభుత్వం కూడా అవే విధానాలను అమలుచేస్తూ వస్తున్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం, ప్రజానీకం పెద్దఎత్తున పోరాడుతున్నారు. భూమికోసం పోరాటాలు సాగుతూనే వున్నాయి. భారత దేశంలో ఎన్నో పోరాటాలు భూమికోసం ముందుకొచ్చాయి. ఇప్పటికీ భూమి కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకరించబడి వుంది. తెలంగాణాలో నైజాం నవాబు దోపిడీకి వ్యతిరేకంగా 1947లో రైతాంగం భూమికోసం పోరాడారు. అదే విధంగా నక్సల్బరీ పోరాటంలో కూడా రైతాంగం ప్రధానంగా భూమికోసం, ఫ్యూడల్ దోపిడీ పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడారు. ఈ రెండు పోరాటాల ముఖ్య ఉద్దేశ్యం "దున్నేవానిదే భూమి హక్కు". ఉండటానికి దేశంలో రైతు సంఘాలు చాలా వున్నాయి. కానీ ఇవి రైతాంగాన్ని మోసం చేస్తున్నాయి. పాలకవర్గాలకు ఊడిగం చేస్తున్నాయి. మన రైతుకూలీ సంఘం ఆ సంఘాల నుండి విడగొట్టుకొని, రైతాంగం యొక్క మౌలిక సమస్యలపై పోరాడాలి. "దున్నేవానిదే భూమి హక్కు'' కేంద్ర నినాదంగా నూతన ప్రజాతంత్ర విప్లవం దిశగా రైతుకూలీ ఉద్యమాలు సాగాలని, ఆ వైపుగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) పనిచేస్తున్నదని, మరింతగా ఆ లక్ష్యం వైపుగా పురోగ మించాలని ఆకాంక్షిస్తూ, బీహార్ రైతు-కూలీల తరపున ఈ మహాసభలు విజయ వంతం కావాలని కోరుకుంటున్నాను.

## మోదుగుల పాపిరెడ్డిగారు,
ప్రజాతంత్రవాది



అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీగారు, ఈ సభకు ప్రజలు, నాయకులు అనేక మంది అనేక రాష్ట్రాల నుంచి వచ్చారు. సోషలిస్టులు, కమ్యూనిస్టులు అపూర్వ సహోదరులు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియాగారు ఒకమాట చెప్పేవారు, ఆఖరి సమానత్వం వరకు నేను పని చేస్తాను కమ్యూనిస్టులతో కలసి అని.

ఒక్కో విషయంలో ఒక్కో పార్టీతో కలసిపని చేయాలి. భారతదేశంలో డా॥ రామ్ మనోహర్‌లోహియాగారు మూల సూత్రాల గురించి చెప్పారు. ఆర్థిక సమానత్వం సాధించాలని చెప్పారు. అప్పుడు 1963లో భారతదేశంలో 43 కోట్లమంది ప్రజలున్నారు. వారిలో 27 కోట్లమంది ప్రజలు రోజూ మూడు అణాల ఆదాయం మీద బతుకుతున్నారు. అంటే మూడొంతుల్లో రెండొంతులమంది అంతతక్కువ ఆదాయంతో బతుకుతున్నారు.

'అదే సమయంలో కొంతమంది మూడు లక్షలు సంపాదిస్తున్నారు. నేనేమీ సొంత లెక్కలు చెప్పటంలేదు నీ ప్రభుత్వం ప్రకటించిన లెక్కలే ఇవి' అని డాక్టర్ లోహియాగారు ఆనాటి ప్రధాని నెహ్రూకి చెప్పారు. ఇంతకు ముందు మాట్లాడిన సిన్హాగారు భారతదేశంలో రోజుకి 40 మంది రైతులు చనిపోతున్నారని చెప్పారు. ఇదా రైతుకూలీ రాజ్యం–? ఇవాళ పార్లమెంటులో వున్నది ఎవరండి? అందరూ వ్యాపారస్తులు, బిల్డర్లు. డబ్బుపెడితేగానీ ఎలక్షన్లలో గెలవలేరు. జనతాపార్టీ టైములో ఒక ఊపువచ్చింది. చిన్న బుల్లెట్ కారు ఉన్న వాళ్ళు సంజయ్‌గాంధీని ఓడించారు. అప్పుడు ప్రజా ఉద్యమంలో సామాన్య కార్యకర్తలు గెలిచారు. ఇప్పుడు ఆ వాతావరణం లేదు. తిరిగి జనతా ఉద్యమంలాగా ఒక ప్రజా ఉద్యమం వస్తేగానీ మార్పురాదు. ఇవాళ మన యొక్క వాయిస్ వినపడటం లేదు.

ఇటువంటి సభలు మరి ఎన్నో జరిపి, అణగారిన జనం యొక్కవాణిని వినిపించాలి. అది జరగటం లేదు. కొట్టుకోవటం, వాణ్ణీవీణ్ణీ విమర్శించుకోవటం...... ఇదే జరుగుతోంది.

మన సోదరి ఝాన్సీగారు ఎన్నోకష్టాలు పడి పనిచేస్తూ వుంది. ఆమె ఎంతో చక్కగా ఈ కార్యక్రమాన్ని నడుపుతున్నారు. గుర్రం విజయకుమార్‌గారిని కలిస్తే నాకెంతో సంతోషంగా వుంటుంది. ఈ యొక్క వీరులు, త్యాగమూర్తులు జన్మించిన, నడిపిన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహాసభ విజయవంతం కావాలి. నాగిరెడ్డిగారి సిద్ధాంతాలను మీరంతా ముందుకు తీసుకు వెళ్తున్నందుకు సంతోషం. ఇక ముందు కూడా మీతో కలిసి పనిచేయడానికి మీతో వుంటానని చెప్తూ మీ మహాసభలో ఈ నాలుగు మాటలు చెప్పడానికి అవకాశం ఇచ్చినందుకు నా కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను.

## కా॥శంభు మహతో, ఎఐకెఎమ్‌కెఎస్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు, ఝార్ఖండ్



సభాధ్యక్షులు, వేదికపై వున్న ఆహ్వాన సంఘ అధ్యక్షులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులకు, సిపిఐ(ఎం–ఎల్) పార్టీ నాయకులకు, మహాసభకు విచ్చేసిన రైతుకూలీసంఘం కార్యకర్తలకు, రైతుకూలీ ప్రజానీకానికి ఝార్ఖండ్ హుల్ క్రాంతిదళ్ (రైతుకూలీసంఘం)–ఎఐకెఎమ్‌కెఎస్ అనుబంధ సంస్థ తరఫున విప్లవాభి వందనాలు.

మన దేశంలో అపారమైన సంపదలు వున్నాయి. విస్తారమైన భూమి వుంది. నదులున్నాయి. భూమి లోపల ఎంతో విలువైన ఖనిజ సంపద, అటవీ సంపద వుంది. భూముల్లో, పరిశ్రమల్లో–అన్నిటిలో రైతు–కూలీలు, కార్మికులు ఉదయం నుండీ రాత్రి వరకు ఎంతో శ్రమ చేస్తున్నారు. పాలకులందరూ మన దేశపు జిడిపి పెరిగిపోతోందని, భారత ప్రజల రోజువారీ వేతనాలు కూడా పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. ఈ రకంగా అంకెల గారడీ నడుస్తోంది. ఆకలితో మరణిస్తున్నవారి సంఖ్యను ఎక్కడ చెప్పారు? పెరుగుతున్న జిడిపికి–ఆహారం దొరక్క చనిపోతున్న వారికి, నిరుద్యోగంతో అలమటిస్తున్న యువతకి ఏ విధమైన సంబంధం లేదు. జిడిపి పెరిగినంత మాత్రాన పేదప్రజల సమస్యలు పరిష్కారం కావు. ఆకలి సమస్య తీరదు, నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదు. ఈ విషయాలన్నీ ఆలోచించాల్సిన అవసరం వుంది.

ఈ రోజు భారతదేశపు సగటు మనిషి సమస్య తిండి, బట్ట, ఇల్లు. 1947లో మనకు స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్నారు. కానీ ఆకలితో అలమటించే వారికి స్వాతంత్ర్యం దొరికిందా? 5 వేల రూపాయల నెలసరి వేతనం కోసం కాళ్ళరిగేలా తిరుగుతున్న నిరుద్యోగులకి స్వాతంత్ర్యం దక్కిందా? మనదేశంలో ఒకవైపు పెట్టుబడిదారుల, మరికొంత మంది వ్యక్తుల సంపద పెరుగుతోంది. మరోవైపు అధికశాతం మంది ప్రజలు పేదరికంలోకి కూరుకు పోతున్నారు. మన దేశానికి రాజ్యాంగాన్ని, అంతకు ముందు వున్న బ్రిటీష్ ప్రభుత్వం నుండి తీసుకున్నారు. ఇందులో కేవలం పది శాతమేఇతర దేశాల నుండి తీసుకోబడింది. మిగిలిన తొంభై శాతం చట్టాలు బ్రిటీష్ ప్రభుత్వం 1830 ముందు నుండి చేసినవే. ఇది మన దేశానికి వున్న రాజ్యాంగం. ఇది పేదవాళ్ళకి తిండి, బట్ట, ఇల్లు ఇవ్వదు. సామాన్య ప్రజలపై బ్రిటీషు ప్రభుత్వం తన దోపిడీని, దమనకాండను ఏ విధంగా

సాగించిందో, అదే విధంగా ఇప్పటివరకు మనల్ని పాలిస్తున్న పాలకులు కూడా ఇదే దోపిడీని, దమనకాండను సాగిస్తున్నారు. ప్రస్తుత భారతదేశంలో వున్న న్యాయవ్యవస్థ బ్రిటీషు వారి నుండి తీసుకున్నదే. ఇదే న్యాయవ్యవస్థ భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించింది. ఇటువంటి న్యాయవ్యవస్థ ఇప్పుడు మన ప్రజల సమస్యల్ని ఏ విధంగా పరిష్కారం చేస్తుంది? అందుకని మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. మనదేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థగా వుంది. నేటికీ కొద్దిమంది చేతుల్లో వేల ఎకరాల భూములున్నాయి. మనదేశ జనాభాలో యాభై శాతం రైతాంగానికి భూమి లేదు. పేద రైతాంగం పండించే పంట సంవత్సర మంతా వారి ఆకలిని తీర్చలేదు. దీంతో తమ ఆకలిని తీర్చుకోవడానికి పనికోసం వెంపర్లాడాల్సిన పరిస్థితి, వలసలు వెళ్ళాల్సిన పరిస్థితి దాపురించింది. అందువల్ల మనకు అసలైన స్వాతంత్ర్యం రాలేదు. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం ఉత్పత్తిలో అధికశాతం విదేశాలకు వెళ్ళిపోతుంది. మన దగ్గర పెట్టుబడి లేదని పాలకులందరూ చెబుతున్నారు. దానికోసం గత పాలకులు, ప్రస్తుత పాలకులు, ప్రధానమంత్రి మోదీ విదేశాలకు వెళుతున్నామని చెబుతున్నారు. వాస్తవమేమి టంటే, ఇతర దేశాల నుండి వస్తున్న పెట్టుబడి (ఫైనాన్స్ పెట్టుబడి) కంటే మన దేశం నుండి మరిన్ని రెట్ల పెట్టుబడిని సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు తీసుకెళ్ళిపోతున్నాయి. బ్రతుకుదెరువు కోసం ఇతరదేశాలకు వలసవెళ్ళిన వాళ్ళు కడుపు కట్టుకొని సంపాదించిన విదేశీమారక ద్రవ్యమే వాస్తవంగా మనదేశంలోకి పెట్టుబడి రూపంలో వస్తుంది. మిగిలినదంతా అబద్ధం, బూటకం.

పాలకులు ప్రతిదీ అభివృద్ధి అని చెబు తున్నారు. నిజంగా ఇప్పుడు జరుగుతున్నది అభివృద్ధా లేకా విధ్వంసమా? జరుగుతున్నది ఖచ్చితంగా విధ్వంసమే. ఎందుకంటే పేదరికమూ, నిరుద్యోగమూ పెరుగు తున్నాయి. నదులు, ఆఖరికి గాలి కూడా కలుషితమయ్యాయి. మన పాలకులు చైనాలాంటి అభివృద్ధి కోరుకుంటున్నారు. కానీ చైనాలో పరిస్థితి ఏంటి? షాంఘైలోకి ఆక్సిజన్ సిలెండర్లు ఆఫ్రికా దేశాల నుండి వస్తున్నాయి. షాంఘై ప్రజలు గాలిని కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మనం ఈ రకమైన అభివృద్ధిని కోరుకుందామా? ఇరవై సంవత్సరాల క్రితం మనం ఊహించలేదు, నీటిని కొనాల్సివస్తుందని! కానీ ఈ రోజు నీటిని కొనుక్కొంటున్నాము. అదే విధంగా భవిష్యత్తులో మనం కూడా ఆక్సిజన్ సిలండర్లు కొనాల్సిన దౌర్భాగ్య పరిస్థితి రాబోతోంది. అందుకని ఇప్పుడు జరుగు తున్న 'అభివృద్ధి' గురించి చాలా లోతుగా చర్చించాలి. లోతుగా పరిశీలించాలి. నూటికి తొంభై మందికి తిండి, బట్ట, ఇల్లు, పనిని గ్యారంటీగా ఇచ్చే అభివృద్ధిని మనం కోరు కుందాం. ఆ అభివృద్ధి కోసం నిలబడదాం. భారతదేశంలో డెబ్బై శాతం మంది వ్యవసాయం పై ఆధారపడి వున్నారు. వీరి జీవితాలు అభివృద్ధికాకుండా దేశం అభివృద్ధి చెందడం సాధ్యమౌతుందా? వ్యవసాయ శాస్త్రవేత్త డా॥స్వామినాధన్ కమిటీ వ్యవసాయరంగం సంక్షోభం గురించి చెప్పింది. కానీ పాలకులు ఆ సిఫార్సులను అమలు చేయలేదు. గత యాభై సంవత్సరాల కాలంనుండి పాలకులు వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు చేస్తూ వస్తున్నారు. సామ్రాజ్యవాదుల విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు ఇక్కడ అమ్ముడవుతున్నాయి. హరిత విప్లవం ఫలితంగా దిగుబడులు ప్రారంభంలో పెరుగుతూ వున్నాయి. కానీ ఆ దిగుబడి క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఈ హరిత విప్లవం పేరుతో దేశంలోకి సామ్రాజ్యవాద దోపిడీని పాలకులు యధేచ్ఛగా అను మతించారు. దీన్నే పాలకులు వ్యవసాయ రంగ అభివృద్ధి అంటున్నారు.

ప్రపంచంలో మరో చిన్న దేశం క్యూబా. క్యూబాలో కూడా వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద దోపిడీని ఆహ్వానించారు. ఆ తరువాత జరిగిన నష్టాన్ని పసిగట్టిన క్యూబా దేశం అంతటా భూమి మీద మూడు అడుగులలోతు వరకు మట్టిని తొలగించారు. అటువంటి క్యూబాదేశం నేడు వ్యవసాయ రంగ ఉత్పత్తులను పెంచింది. ఆ ఉత్పత్తులను అమ్మి తన దేశానికి కావాల్సిన చమురును కొనుక్కుంటోంది.

భారతదేశంలో ఎన్నో చట్టాలున్నప్పటికీ దున్నేవానికే భూమిని ఎందుకు పంచరు? భూమి హీనులకు భూమి ఎందుకు దక్క లేదు? భూమికోసం పోరాటాలు, ఆందోళనలు ముందుకు వచ్చినపుడు పాలకులు కొన్ని చట్టాలను తెస్తున్నారు తప్ప ఆ చట్టాల అమలు పట్ల పాలకులకు చిత్త శుద్ధి లేదు. పంచాయితీ అధికారాలను గ్రామ సభలకు ఇస్తూ తెచ్చిన చట్టం అటువంటిదే. 'ఈ చట్టం మీకు అనేక అధికారాలను ఇస్తుంది. ఇక ఆందోళనలు విరమించండి' అన్నారు. ఈ చట్టాలు కాగితాలపై వుంటున్నాయే గానీ ఎక్కడా వీటిని పూర్తిగా అమలు చేయలేదు. దేశంలో 8 గంటల పనిచట్టం, కనీస వేతన చట్టాలున్నాయి. కాని కార్మికులచేత 10 నుండి 12 గంటల వరకు పనిచేయించుకుంటున్నారు. కనీస వేతనం కూడా దక్కడంలేదు. న్యాయవ్యవస్థ వుంది, లేబర్ కమీషన్ వుంది. పోలీసులు వున్నారు. కానీ ఈ వ్యవస్థలన్నీ కార్మికుల కోసమా? యజమానుల ప్రయోజనాల కోసమా? భారతదేశంలో మొత్తం ప్రజానీకం కోసం చేస్తున్నామంటున్న చట్టాలన్నీ కేవలం ప్రదర్శన కోసమే (ఏనుగుదంతాలు కనిపించే విధంగా) తప్ప అమలు కోసం కాదు. ఎక్కడైతే రైతాంగం, ఆదివాసులు పోరాటాలు చేస్తారో ఆ ప్రాంతాల్లో కొంతమేరకు చట్టం అమలవుతుంది. అది కూడా పూర్తిగా కాదు. ప్రజలు పోరాటాలు చేస్తున్నపుడు పోలీసులు ప్రజలపక్షం వహించరు. భూస్వాముల, పెత్తందారుల, పెట్టుబడిదారుల పక్షం వహిస్తారు. వాళ్ళ దగ్గర డబ్బులు తీసు కుంటారు. బీహార్-ఝార్ఖండ్ విడిపోక ముందు ఎక్కడైనా భూస్వాముల భూముల్లో ఎర్రజెండా పాతితే వారిపై కాల్పులు జరపం అని అప్పటి ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ ప్రకటించారు. ప్రకటించిన కొద్ది రోజుల్లోనే బుదియా జిల్లాలో ఆదివాసీ ప్రజానీకం ఎర్రజెండా నాయకత్వాన పెద్ద ఎత్తున పోరాడింది. అక్కడ వున్న ఒక భూస్వామి దగ్గర 10 వేల ఎకరాల కంటే ఎక్కువ భూమి వుంది. ఆ భూమి కోసం

పోరాడుతున్న ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో చాలామంది చని పోయారు. ఝార్ఖండ్ విడిపోయిన తరువాత అధికారంలోకి వచ్చిన నితీష్‌కుమార్ ప్రభుత్వం బందోపాధ్యాయ అనే రిటైర్డ్ ఐఎఎస్ అధికారితో కమిటీని వేసింది. ఈ కమిటీ బీహార్ మొత్తం తిరిగి తన నివేదికను ప్రభుత్వానికి ఇచ్చింది. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరగాల్సిన తరుణంలో ఎర్రజెండా పార్టీలు మినహాయించి మిగిలిన అన్నీ పార్టీలు నితీష్‌కుమార్‌ని బెదిరించాయి. ఈ నివేదికను చర్చకు అంగీకరిస్తే మేం ప్రభుత్వాన్ని పడగొడతామని పాలక పార్టీలన్నీ బెదిరించాయి. అసెంబ్లీలో, ప్రభుత్వాల్లో భూస్వాముల పట్టు ఎంత బలంగా వుందో మనకు ఈ ఉదాహరణ స్పష్టపరుస్తుంది. ఆ రిపోర్టు ఇప్పటికీ బీరువాలో బంధించబడి వుంది.

భారతదేశం నేటికీ వ్యవసాయదేశమే. అధిక శాతం ప్రజానీకం గ్రామాల్లోనే వున్నారు. భూసంస్కరణలు అమలు జరగాలి. దున్నేవానికే భూమి దక్కాలి. అదే విధంగా వ్యవసాయరంగ సమస్యలపై పోరాడాలి. అప్పుడే భారతదేశం మారుతుంది. గ్రామాల పరిస్థితి, తద్వారా దేశం పరిస్థితి మెరుగవు తుంది. సామ్రాజ్యవాదం దేశదేశాలపై తన దోపిడీని సాగిస్తోంది. భూమిని, వనరులను, చమురును సామ్రాజ్యవాదులు దురా క్రమిస్తున్నారు. ఈ రోజు అమెరికా అభివృద్ధి చెందిందీ అంటే మన దేశం నుండి, ఇంకా అనేక దేశాల నుండి పెట్టుబడి అమెరికాకి వెళ్ళింది. ప్రపంచ దేశాలన్నింటినీ దోచు కుంటున్న అమెరికా అతిపెద్ద సామ్రాజ్యవాద దేశం అయినప్పటికీ అక్కడ కూడా సంక్షోభం వచ్చింది. మన దేశంలో ఎవరైనా బుద్ధి జీవులు ఇతర దేశాల నుండి పెట్టుబడులు వస్తే అభివృద్ధి చెందుతుందని అనుకుంటే అది పొరపాటు. ఈ రోజు మన దేశ ప్రజానీకం ముందు పెద్ద సమస్య వుంది. అదేమిటంటే సామ్రాజ్యవాద దోపిడీ. సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. ఈ పోరాటాలను దేశవ్యాప్తం చేయాలి. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్ని సంఘటితపరచాలి. బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రైతాంగం, కార్మికులు ఎవరికి వారు ఒంటరిగా పోరాడలేరు. ఉత్పత్తి శక్తులైన రైతాంగం, కార్మికులు ఐక్యంకావాలి. వివిధ సెక్షన్ల ప్రజానీకాన్ని కలుపుకొని పోరాడాలి. అప్పుడే విప్లవ జ్వాల రగులు తుంది.

మిత్రులారా! మిగిలిన పార్టీలన్నింటికీ విజ్ఞప్తి చేస్తున్నాము. మన దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. వస్తే పోరాడే ప్రజలపై పోలీసుల, ప్రభుత్వాల దమనకాండ ఈ రకంగా సాగదు. ప్రభుత్వాలు యజమానుల పక్షం వహించవు. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. విప్లవం వర్ధిల్లాలి.

## కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు,

**రైతుకూలీసంఘం (ఆంధ్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**



అధ్యక్షా, వేదికమీద వున్న కామ్రేడ్స్, రైతుకూలీసంఘం మహాసభలు గుంటూరు పట్టణంలో నిర్వహించాలని మా సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు పట్టణంలోను, జిల్లాలో వున్న అనేకమంది ప్రముఖులను, ప్రజాతంత్రవాదులను వివిధ ప్రజాసంఘాల నాయకులను కలసి ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశాం. మహాసభల నిర్వహణలో ఆహ్వానసంఘం మాకెంతో సహాయ సహకారాలను అందించింది. ఈ మహాసభకు ఉపన్యాసకులను, సౌహార్ద్ర ప్రతినిధులను, మా ఆహ్వానాన్ని మన్నించి ఇంతటి ఎండలో వచ్చినందుకు వారందరికీ మా రాష్ట్ర సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన మా రైతుకూలీలకు, ఆదివాసీలకు కనీసపాటి సౌకర్యాలను కలుగ జేయటానికి ఈ జిల్లాలో సహకరించిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ సభలు విజయ వంతం చేయటానికి రాత్రింబవళ్ళు శ్రమించిన విద్యార్థి, యువతీ, యువకులకు మా కమిటీ తరపున ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. మహాసభలో మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా వేలాదిమంది ప్రజలతో వందలాదిమంది కళాకారుల ప్రదర్శనలతో గుంటూరు పట్టణంలో ఊరేగింపు జరుపుకున్నాం. ఈ ఊరేగింపు ద్వారా మన పోరాట నినాదాలను తెలియ జేశాం. మొదటిరోజు ఈ మహాసభను విజయవంతంగా జరుపుకోవటానికి సహకరించిన వారందరికీ పేరుపేరున మరొక్కసారి ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

### వాడు

**అందరం కలిసి చేసిన ఈ**
**అందమైన వస్తుసముదాయం అంతా**
**ఎక్కడో ఒక్కడే వచ్చి**
**ఎత్తుకు పోతూఉంటే చూచి,**
**"అన్యాయం, అన్యాయం!"**
**అని మేమంటే-**
**"అనుభవించాలి మీ కర్మం" అంటాడు.**

**పొద్దుపొడిచి పొద్దుగడిచేదాకా**
**ఎద్దుల్లాగ పనిచేసే మమ్మల్ని**
**మొద్దుల్నీ మొరటుల్నీ చేసి**
**ముద్దకి కూడా దూరంచేశాడు**
**"ఘోరం ఇది, దారుణం ఇదంటే"-**
**ఆచారం! అడుగు దాటరా దంటాడు.**

**భరించడం కష్టమైపోయి,**
**పనిముట్టు మేము క్రిందను పడవైచి-**
**"చెయ్యలేం, చస్తున్నాం మేము,**
**జీవనానికి ఆసరా చూపించ"మంటే-**
**నోరుమూసి, జోడుతీసికొట్టి**
**"దౌర్జన్యానికి దౌర్జన్యం మందంటాడు".**

మహాకవి శ్రీశ్రీ

# ఇతర రాష్ట్రాల ప్రతినిధుల సందేశాలు

**కా॥వింధై వేందన్**, ఏఐకెఎమ్‌కెఎస్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు, తమిళనాడు



వేదికమీద, ముందున్న వారందరికీ విప్లవాభివందనాలు. నేను తమిళనాడు వాసిని. నేను గత 45 సం॥ల నుండీ వర్గ ఉద్యమాలలో వుండి పనిచేస్తున్నాను. 1979లో కా॥చారుమజుందార్ ప్రకారం వర్గశత్రు నిర్మూలనా కార్యక్రమానికి పిలుపు నిచ్చాం. ఈ పిలుపు, ఆచరణలో భాగంగా ఎక్కువమందిని సమీకరించాం.

1979లో మేము తమిళనాడు రైతుకూలీ సంఘాన్ని ఏర్పాటు చేశాం. వేలల్లో ప్రజలను, రైతుకూలీలను కదిలించాం. ధర్మ పురిలో 20వేలమందికి పైగా కదిలించాం. కోర్టులను ధిక్కరించాం. భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా వేలాది మందిని కదిలించగలిగాం కానీ, ప్రజల చైతన్యస్థాయి కనుగుణంగా, ప్రజాయుద్ధ పంథా బాటలో మేము ఆ ఉద్యమాన్ని నడిపించలేకపోయాం. వర్గశత్రువుపై కసిని పెంచాంగానీ, వర్గ శత్రువుకు వ్యతిరేకంగా ఎలా పోరాటం చేయాలో రాజకీయ స్థాయిలో ప్రజలలో చైతన్యం తీసుకురాలేక పోయాం. ప్రజల చైతన్యస్థాయితో సంబంధం లేని మా దుస్సాహసిక చర్యలతోటి ఉద్యమం ముందుకు సాగలేదు. తీవ్రమైన నష్టాలు పొందాం. ఈ తప్పుడు విధానాలతో 22 మంది కామ్రేడ్స్ 'ఎన్‌కౌంటర్' అయ్యారు. మేము తప్పుడు విధానాలతో ఉద్యమాన్ని నిర్వహించటంతో అనేక బలిదానాలు గావించవలసి వచ్చింది. ఈ క్రమంలో మేము ఏం చెయ్యాలో తెలియక, ఎలా కదలాలి, ఎలా సాగాలి అన్న సందిగ్ధ స్థితిలో పడిపోయాం. మేము తీసుకున్న తప్పుడు పంథా ఫలితంగానే ఉద్యమానికి తీవ్రమైన నష్టం జరిగిందని గ్రహించటానికి మాకు కొంతసమయం పట్టింది. అయితే మేము ఈ నష్టాలు, కష్టాలతో నిరుత్సాహానికి గురై ఆగిపోలేదు. ఈ దేశంలో ప్రజాయుద్ధ పంథాను అమలు చేస్తూ ఉద్యమాలు నిర్వహిస్తున్న సంస్థలెవరు, నాయకత్వ మెవరినే వెతుకులాటలో పడ్డాం. కొంత అధిక సమయమే పట్టింది. మేము అలా వెతికే క్రమంలో ఎన్నో సంస్థలతో, ఎంతో మందితో చర్చలు కొనసాగిస్తూ వచ్చాం. ఈ క్రమంలోనే మీతోటి మాకు పరిచయమైంది. 2011 డిశంబరు 19న శ్రీకాకుళంలో జరిగిన అఖిల భారత రైతుకూలీ సదస్సుకు మేము తమిళనాడు నుండి హాజరయ్యాము. అప్పటి నుండి మేము ఎఐకెఎమ్‌కెఎస్ అనుబంధ సంఘంగా వుంటూ పని చేస్తున్నాము. మీ రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రణాళికను ఇంగ్లీషు నుండి తమిళంలోకి అనువదించుకున్నాం. మీ వేదిక మీద నేను వచ్చి మాట్లాడుతున్నది-ఇది మూడవసారి. మీ సంఘం ప్రణాళిక, మీ ఆచరణ, ప్రజలను సమీకరించే తీరు మాకు ఉత్సాహాన్నిచ్చింది. మరింత రాజకీయ చైతన్యంతో మేము తమిళనాడులో రైతుకూలీలను, ఆదివాసీలను సంఘటితపరిచే కార్య క్రమంలో నిమగ్నమౌతామని సభాముఖంగా తెలియ జేస్తున్నాం. మేము ఈ నిర్ణయం తీసు కోవటంలో ఈ మహాసభలో పొందిన ఉత్తేజం ముఖ్యమైనది. మరొక్కసారి ఈ మహాసభలు విజయవంతం కావాలని, ఈ సభలకు హాజరైన మన రైతుకూలీలకు, మేధావులకు, ఇతర రాష్ట్రాలనుండి వచ్చిన సౌహార్ద ప్రతినిధులకు తమిళనాడు కామ్రేడ్స్ తరఫున నా అభినందనలు తెలియ జేస్తున్నాను.

**కా॥మల్లిఖార్జున్‌రెడ్డి**, ప్రజాతంత్రవాది, కర్నాటక



మన భారతదేశం సంపద్వంత దేశం. కానీ దురదృష్టం ఏమిటంటే అంతా పేద వారమే. మన దేశం సుసంపన్నమైన సహజ వనరులతో కూడుకున్నది. ఎంత సంపన్న దేశం అంటే మన దేశంపై దోపిడీ చేసి సంపదని, ఐశ్వర్యాన్ని, సహజ వనరుల్ని కొల్ల గొడుతున్నా కూడా తరగనటువంటి దేశ మిదని తరతరాలుగా చరిత్ర చెబుతోంది. గజ్నీ, ఘోరీలు దాడిచేసి సంపదను దోచు కోవటం నుండి మొన్నమొన్నటి బ్రిటీష్ పాలన వరకు కూడా ఈ దోపిడీ జరుగు తూనే వుంది. మరి ప్రజాస్వామ్యం అని నామకరణం చేసుకొని, యిది ప్రజలపాలనే, మన పాలనే అని చెబుతూ "ప్రజా ప్రభుత్వాలు" ఏర్పడ్డా కూడా ఈ దోపిడీ జరుగుతూనే వుంది. బ్రిటీష్ ప్రభుత్వ పరిపాలనకు ముందు దోపిడీ, దొంగతనాలు జరిగేవి, యితర దేశాల నుండి వచ్చి దోచు కెళ్ళేవారు. బ్రిటీష్ పాలనలో ఈ దోపిడీ చట్ట బద్ధమైంది. తద్వారా 'దోపిడీ' అనే ముసుగు కూడా లేకుండా మన దేశసంపదని కొల్ల గొట్టడానికి, తమ దేశాలకు తరలించుకు వెళ్ళడానికి కొత్త కొత్త చట్టాలను చేశారు. ఆ చట్టాల్లో భాగమే 'భూస్వాధీన' చట్టమని చెప్పొచ్చు. 1870లో ఆనాటి భూస్వాధీన చట్టం ఉంది. ఈ చట్టం ద్వారా భూమిని పోగొట్టుకున్న రైతులకి ఎక్కువ డబ్బు యివ్వ వలసి వస్తుందని చెప్పి, దానివల్ల మేం నష్ట పోతాం అని బ్రిటీష్ పాలకులు 1894లో కొత్త చట్టాన్ని తెచ్చారు. రోడ్లు వేస్తాం, రైల్వే

లైన్లు వేస్తాం అని రైతాంగాన్ని మభ్యపెట్టి, భూముల నుండి వేరు చేసి బలవంతంగా ఆక్రమించుకొన్నారు. బ్రిటీష్ పాలకులు ఈ దేశసంపదని తీసుకెళ్ళడానికి, వాళ్ళ ప్రయోజనాల కోసం రోడ్లు వేసుకున్నారు. 1947 దాకా యిలా సంపదను కొల్లగొడు తూనే వున్నారు.

1894లో భూస్వాధీన చట్టం ఏర్పడింది. ఆ చట్టం రైతులకి సహాయకారిగా లేదు, ఇది బలవంతపు భూస్వాధీన చట్టం, రైతు భూములను లాక్కొనే చట్టం, దీనిని మార్చాలని చెప్పి సుమారు 120 సంగలుగా రైతులు పోరాటం చేస్తున్నా, వివిధ సంఘాలు పోరాటం చేస్తున్నా, అది మారలేదు. 120 సంగల తర్వాత ఏదో కంటితుడుపు చర్యగా 2013లో ఒక క్రొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. అంతకు మునుపు ప్రజా ప్రయోజనాల పేరుతో ప్రతి ఒక్కరి దగ్గర నుండి భూమి లాక్కోవటం ఉండేది. ప్రజా పోరాటాలు తీవ్రమైనపుడు, ప్రజలు తిరగబడి నపుడు, సంఘాలు ఏర్పడి ప్రభుత్వంపై తిరుగు బాటుకు పూనుకున్నపుడు భయపడి రైతులకు న్యాయం చేయాలని చెప్పి కొన్ని మార్పులు చేశారు. రైతుల సమ్మతి ఉంటేనే భూమిని ఆక్రమించాలని, అవసరం అయితే తప్ప నీటి పారుదల భూములు తీసుకో కూడదు అనే సవరణలతో 2013లో చట్టం తెచ్చారు. యింత కష్టపడి జరిపిన కృషిలో భాగంగా వచ్చిన ఆ ఫలాల్లో ఒక్క ఫలాన్నైనా రైతులు భుజించలేదు. దానిలో లాభాలు ఒక్క రైతుకు కూడా దక్కలేదు. అంతలోనే 2014లో మోదీ 'అచ్చేదిన్ అయేగా' అంటూ వచ్చాడు. మంచిగా పరిపాలన చేస్తాడేమో నని కొందరు ఆశిస్తుంటే వచ్చిన కొద్ది రోజుల్లోనే 2013 చట్టం సరిగా లేదని బహుళజాతి కంపెనీలకు చట్టపరంగా లబ్ధి చేకూర్చే విధంగా ప్రజల సమ్మతి లేక పోయినా భూములు ఆక్రమించుకునేలా మార్పు చేయాలన్నాడు. ప్రైవేట్ కంపెనీలకు భూములు యివ్వొచ్చు. అయితే సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ థియరీ ప్రకారం ఈ సవరణ విధానాల వలన రైతులకు కలిగే లాభాలేంటి నష్టాలేంటి అనేది యివ్వాలి. అవేం లేకుండా చట్టమార్పిడి చేయాలని ప్రకటనలు చేస్తున్నారు. చట్టమార్పిడి చేయాలంటే సవరణ చేయాలి. ఎమెండ్ మెంట్ చేయాలంటే చట్టసభలు కావాలి. వాటిలో మన మోదీగారికి ఎంత ఆత్రం అంటే చట్టసభలు జరిగే వరకు ఆగేది లేదని అంతలోనే ఆర్డినెన్స్ ద్వారా ఎమెండ్‌మెంట్ చేస్తాం అని చెప్పి చేశారు. ఎంత వ్యతిరేకత ఎదురైనా ఆర్డినెన్స్ తెచ్చారు. ఆర్డినెన్స్ ద్వారా పెట్టుబడిదారీ వర్గానికి లాభాలయ్యేట్లు చూస్తున్నారే గానీ రైతులకు లాభాలు చేకూరే విధానాలు చేయట్లేదు. ఆర్డినెన్స్ చేసిన 6 నెలలలోపు చట్టం చేయాలి. కానీ మోదీ చట్టం చేయలేదు. తర్వాత మళ్ళీ ఆర్డినెన్స్ చేశారు. రెండవసారి చట్టం చేయాలన్నపుడు రాజ్యసభ, యితర చట్టసభలు జరుగుతూ వున్నాయి. అక్కడ చేయకుండా ఎంత దుస్సాహసానికి వెళ్ళాడంటే ప్రోరోగ్ చేశారు. చట్టసభల గదులకు తాళం వేసేసి ఎవరినీ పోనివ్వకుండా చేసి మళ్ళీ ఆర్డినెన్స్ తెచ్చారు. కానీ దేశంలో వివిధ ప్రాంతాల రైతుల తీవ్ర వ్యతిరేకత వల్ల, ఒత్తిళ్ళ వల్ల దానిని వెనక్కు తీసుకున్నాడు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మోదీ రైతు వ్యతిరేకిగా పనులు ఆరంభించాడంటే ఎటు వంటి ఆలోచన వున్నట్లు! యిపుడేదో ముసలి కన్నీరు కారుస్తున్నాడు.

మామూలుగా కోర్టుల్లో సాక్షి చేత "దేవుడిపై ప్రమాణం చేసి నిజమే చెబుతాను" అని చెప్పిస్తారు. జడ్జికి తెలుసు, డిఫెన్స్ లాయరుకు తెలుసు అతను అబద్ధం చెబు తున్నాడని. కానీ ప్రమాణం చేసినందువల్ల అబద్ధాన్ని నిజమని నమ్మాలని చట్టాలు చెబు తున్నాయి. అంటే ప్రమాణానికి అంతపెద్ద విశిష్టత ఉంది. కానీ యడ్యూరప్ప దానిని అతిక్రమించాడు. కర్ణాటకలో రైతాంగ ఉద్యమాలు జరిగినవి. యాడ్యూరప్ప ఏదో అద్భుతాలు చేసేశాం అని రైతులపక్షం ఉన్నట్లుంటూ రైతులకు చాలా అన్యాయం చేశాడు. పురుగుమందులు, ఎరువులు సకాలంలో యివ్వడం లేదని పోరాటం చేస్తే వారి మీద పోలీసుల చేత కాల్పులు జరిపించాడు. రైతులకు విషయం అంతా అర్ధమయింది. గాలి జనార్దనరెడ్డి ప్రభావం వల్ల యడ్యూరప్ప బళ్ళారిలో 3వ విమానా శ్రయం ఏర్పాటు చేయాలని చెప్పి మొదలు పెట్టాడు. 1935లో బ్రిటీష్ వాళ్ళు ఏర్పాటు చేసిన విమానాశ్రయం ప్రయాణీకులు లేక మూతపడింది. తర్వాత జిందాల్ ఫ్యాక్టరీ ఏర్పడినపుడు ఎఎస్‌డబ్ల్యు వాళ్ళు వాళ్ళ కోసం మళ్ళీ విమానాశ్రయం నిర్మించారు. 3 నెలలకే వాళ్ళకి విమానా శ్రయం అక్కర్లేకుండా పోయింది. ప్రజాప్రయోజనం కోసం తిరిగి గవర్నమెంటుకి యిచ్చేశారు. మళ్ళీ మూతపడింది. అంటే ఎలాంటి డిమాండ్ లేకుండా పచ్చగా ఉండే భూములను రైతుల నుండి బలవంతంగా లాక్కొని ఎందుకు బహుళజాతి కంపెనీల కప్పగిస్తున్నారు? రైతులు చాలా పోరాటాలు చేసి కొంతవరకు భూములు మిగుల్చు కున్నారు. కోర్టుల నుండి ఉత్తర్వులు తెచ్చి మరీ, ఈ పోరాటంలో పాదయాత్రలు, పొర్లుదండాలు, బండిజాతర-130 ఎడ్లబండ్లతో ఎన్ని చేసినా.....లాభం లేదు. రైతుకూలీసంఘం వాళ్ళు ఆ పోరాటాలని గమనించి కోటయ్య గారి నేతృత్వంలో నిజ నిర్ధారణ కమిటీని పంపించి నిజంగానే అక్కడ అన్యాయం జరుగుతుందని రిపోర్టు యిచ్చినందువలన కోర్టులో అవి కొంత వరకు పాక్షిక విజయాన్ని సాధించడానికి ఉపయోగపడ్డాయి.

అదే విధంగా వైద్య సదుపాయాల మెరుగుకై 100 పల్లెలకు పైగా తిరిగి సామాన్య ప్రజల అభిప్రాయాలను సేకరించి, మన హక్కులని ఎలా కాపాడుకోవాలో చెప్తూ ఏప్రిల్ 14న అంబేద్కర్ జన్మదినోత్సవం నాడు ఒక ఊరేగింపు జరపాలని అనుకుంటే మొదట స్పందనంతగా లేకపోవటంతో కొంత భయం ఏర్పడింది. తర్వాత 2000 మందికి పైగా మండుటెండలో వచ్చారు. ముందుగానే చెప్పి వున్నాం. ఈ పోరాటంలో మీకు నీళ్ళు, చల్ది ఎవరివ్వరు, ఎవరికి వాళ్ళే తెచ్చుకోవాలంటే, మహిళలు సంచులతో, కడవలతో నీళ్ళు తీసుకొని సిద్ధమని కదిలారు. తప్పెట్ల దరువుకు అడుగు కలుపుతూ నినాదాలిస్తూ కలెక్టరాఫీసుకు వెళ్తూ వుంటే....నిజంగా కొందరికి వెన్నులో వణుకు పుట్టింది. వెంటనే సమస్యలు తీరుస్తా మంటే చర్చలకు అహ్వానించమని కోరగా

సరేనని పిలిచారు. రేపు జరగబోయే చర్చల్లో ప్రజావాణిని వినిపించబోతున్నాం. ఒక్కరోజు 2000 మంది కదిలితే దాదాపు 90 కోట్లు నిధులను స్థానిక గనుల నుండి వచ్చే ఆదాయం నుండి యివ్వవలసిందిగా సుప్రీం కోర్టు తీర్పిస్తే యిహ అది కేబినెట్‌లో ఆమోదిస్తే అది పేద ప్రజలకు కావాల్సిన కనీస వైద్య సదుపాయాలందించటంలో ఉపయోగపడుతుంది. కాబట్టి ప్రజా సమస్యలపై యిలా సంఘటిత పోరాటాలు చేస్తే ఫలితం ఉంటుందని తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**కా॥బాబూరావ్ కుంబర్‌గావ్, ఏఐకెఎమ్‌కెఎస్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు, మహారాష్ట్ర**



వేదిక మీదున్న పెద్దలకు రాష్ట్ర మహా సభలకు హాజరైన ప్రతినిధులకి విప్లవాభివందనాలు 70 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం మీద ఆధారపడే పరిస్థితే ఇవాళ చాలా దారుణమైన స్థితి. అందులో అధికారం బదిలీ అయిన తరువాత 1947 తర్వాత నూతన వంగడాలనే పేరుతో నూతనంగా ఎరువులు, పురుగుమందులనే పేరుతో, నూతన వ్యవసాయ పరికరాలనే పేరుతో, పైరుపచ్చ విప్లవం పేరుతో మొత్తం పాత రైతాంగాన్నంతా దివాళతీసే వైపుగా ఈనాడు నెట్టబడింది. అలాగే బహుళజాతి కంపెనీలు తెగలాభపడ్డాయి. ప్రజలు చాలా తీవ్రమైన పరిస్థితిలో దిగజారిపోతున్నారు. రైతుల, కూలీల పరిస్థితి దిగజారిపోయింది. మహారాష్ట్రలో మూడు సంవత్సరాలుగా కరువు తాండవిస్తుంది. ఆ కరువు తాండవిస్తున్నటువంటి వాళ్ళకి నష్టపరిహారం నూటికి 85 రూపాయల చొప్పున ఇచ్చిందన్నారు. దళిత రైతులకి, పట్టాలు వుండే వాళ్ళకి తప్ప కరువు రైతులకి, చిన్న రైతులకి పైసా అందింది లేదు. చాలా దారుణమైన పరిస్థితి వుంది. వీటిని పరిష్కరించే పద్ధతుల్లో జనతా గవర్నమెంటు వచ్చినా, లేకపోతే శివసేన గవర్నమెంటు వచ్చినా, కాంగ్రెస్ గవర్నమెంటు వచ్చినా ఏ ప్రభుత్వాలు వచ్చినా రైతాంగ పరిస్థితి దారుణాతిదారుణంగా తయారవుతోంది. అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి దాపురించింది. ఈ రకమైన పరిస్థితుల్లో బహుళజాతి కంపెనీలు వాళ్ళతో చేతులు కలిపిన మన దేశ దళారీలు బాగు పడుతున్నారు తప్ప మధ్యతరగతి రైతులు కానీ, పేదరైతులు కానీ, కౌలు రైతులు కానీ, వ్యవసాయకూలీలు గానీ తమ తమ వృత్తుల మీద ఆధారపడి బ్రతకలేక కాంట్రాక్టు కూలీలుగా వలసలు వెళ్ళి పోతున్నారు. ఈ కాంట్రాక్టు కూలీలకు ఏ చట్టాలూ వర్తించవు. కట్టుబానిసలుగా వాళ్ళు అనేక ప్రాంతాలకు తరలిపోయి వలస కూలీలుగా పని చేస్తున్నారు. ఇక్కడ దెబ్బతిన్న రైతులు, కూలీలు, వృత్తికూలీలు కూడా వున్నారు. ఇది మరింత దారుణాతిదారుణంగా వుంది. అందుకనే ఆలిండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభలో భాగమైన రైతుకూలీసంఘం ఈ అనుభవాలన్నీ తీసుకుని దేశవ్యాప్తంగానూ మా ప్రాంతంలోనూ రైతుకూలీ ఉద్యమాన్ని బలంగా నిర్మించటానికి ప్రయత్నం చేస్తూ వుందని. ఈ సభ సందర్భంలో మీకు తెలియ జేస్తూ ముగిస్తున్నాను.

**కా॥శ్రీకాంత్ మొహంతి, ఎఐకెఎమ్‌కెఎస్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు, ఒరిస్సా**

భారతదేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో ఈ సంఘం



ఏర్పడింది. ఇక్కడ రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభ జరుపుకోవటం కూడా భారత దేశంలో వున్న వ్యవసాయరంగ సంక్షోభం యొక్క తీవ్రత పరిస్థితుల దృష్ట్యానే. రైతు కూలీసంఘం ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలలోనే కాకుండా దేశం మొత్తం మీద కూడా రైతాంగ సమీకరణను కర్తవ్యంగా స్వీకరించి నడుస్తున్నది. ఈ రోజు గంటకు ఇద్దరు చొప్పున ప్రతిరోజు 50 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మన్మోహన్‌సింగ్ అధికారంలోకొచ్చినపుడు రైతుల పరిస్థితి దుర్భరంగా ఉంది. కానీ ఈ దుస్థితిని మారుస్తానంటూ వివిధ నినాదాలతో మోదీ ప్రభుత్వం వచ్చింది. మోదీ అధికారంలోకి రాకముందు రైతాంగం పండించే పంటకి సరైన గిట్టుబాటు మేం కల్పిస్తాము, ఉత్పత్తి పెంచుతాము తద్వారా రైతాంగానికి సహాయ పడతామని రైతాంగ నినాదాలతో ప్రచారం చేసి తీరా అధికారం లోకి వచ్చినాక చేసిందేమీ లేదు. ఈ రోజు భారతదేశ రైతాంగం ముందున్న ప్రధాన సమస్య దున్నేవాడికే భూమి అనేది. కానీ దాన్ని ఎత్తేసి భూసేకరణను అమలు చేసిందీ ప్రభుత్వం. తద్వారా భూములను రైతులకు కాకుండా బహుళజాతి సంస్థలకు అప్పగించే పరిస్థితి తీసుకు వస్తున్నారు. భారతదేశంలో గ్రీన్ రివల్యూషన్–అంటే పైరు పచ్చ విప్లవం, హరిత విప్లవం అన్నారు. దానివల్ల యితర దేశాల పెట్టుబడులు ఈ దేశంలోకి ప్రవహించాయి కానీ, రైతాంగానికి ఏ మాత్రం ఆ పైరుపచ్చ విప్లవం ఉపయోగపడ లేదు. ఇప్పుడింకొక కొత్త పథకాన్ని తీసుకొచ్చారు. ఈ మోదీ ప్రభుత్వం గానీ, బీహార్‌లో ఉండే నితీష్ సర్కారు గానీ, ఒరిస్సా ప్రభుత్వంగాని చెప్తుందేంటంటే 'ల్యాండ్ లివింగ్ పాలసీ' అని అంటే ఆ భూమి మీద ఎవరైతే ఖర్చు పెడతారో వాళ్ళకే భూమినివ్వాలి. పేద రైతులకు ఈ భూమి యిచ్చే పరిస్థితి లేదని చెప్తున్నారు. దాని ఉద్దేశ్యం మన దేశంలో ఉండే రైతాంగాన్ని కార్పోరేట్ కంపెనీలకు లేకపోతే కాంట్రాక్ట్ వ్యవసాయానికి తీసుకెళ్ళే వ్యాపారం చేయటం. ఇవి కాకుండా కారిడార్ పేరుమీద విశాఖ, ముంబాయి, ఢిల్లీలలో

లక్షలాది ఎకరాల భూములను తీసు కుంటున్న పరిస్థితి వుంది. వేల కోట్ల రూపాయలు ఈ 'అభివృద్ధి పేరిట' వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలో రైతాంగం అప్పులు కట్టలేక నిర్బంధాల పాలై, జైళ్ళపాలై బయటపడలేక పోతుంటే పాలకులు పెద్ద పెద్ద వాళ్ళకి లక్షల కోట్ల రూపాయలు అప్పులుగా యిచ్చి, రైతాంగాన్ని నిర్లక్ష్యం చేసి చివరికి ఆత్మహత్యలు చేసు కోవాల్సిన పరిస్థితులకు పురిగొల్పుతున్నారు. ఈ దేశంలో నూటికి ఎనభై మంది భూములు లేని పేదలున్నారు. ఒరిస్సా రాష్ట్రంలో 2/56 చట్టం ప్రకారం ఒరిస్సాలోని ఆదివాసీలకి అటవీ ప్రాంతాల్లో భూమంతా దక్కాల్సి వుండగా వారిని భూమి, నీరు, అడవి, నుండి దూరం చేస్తూ 2/56 చట్టాన్ని ప్రభుత్వమే కాలరాస్తున్నది. రైతాంగం, ఆదివాసులు తమ భూములు తమకు దక్కాలని ఛాషీమూలియా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో పూరీ జిల్లాలోని సరుబలి ఏరియాలో పోరాటం చేస్తుంటే మా నాయకుల్ని అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి యింతవరకు భూములు తిరిగివ్వలేదు. కనుక ఈ పరిస్థితుల్లో ఇక్కడుండే భూములకు సరైన భూసంస్కరణను అమలు చేయాలని బహుళజాతి కంపెనీలకు భూములు అప్పచెప్పడానికి వీలులేదని, అడవిమీద, నీరుమీద, భారత ప్రజల స్వంతమైన ఖనిజ సంపదలమీద రైతులదే హక్కు అని చెప్పి పోరాటాలని ఉధృతం చేయాలని, అటువైపుగా ఆలోచిస్తూ గుంటూరులో జరుగుతున్న ఈ మహాసభ విజయవంతం కావాలని కోరుకుంటున్నాను.

**కా॥శ్యాం సుందర్ భగత్,**
**ఏఐకెఎమ్‌కెఎస్ కేంద్ర సభ్యులు, బీహార్**



రైతుకూలీసంఘం మహాసభల్లో నిన్న ఇక్కడ వేలాదిమంది తోటి ఊరేగింపులో పాల్గొన్నాం. ఎంతో ఉత్తేజితంగా జరిగాయి. మేము వీళ్ళందరికీ, మీ రైతుకూలీ సంఘానికి అభినందనలు తెలియ జేస్తున్నాము. ఇక్కడ మనం ఈ రోజు కూర్చొని మాట్లాడుకుంటున్నాం అని అంటే రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు. రైతుల సమస్యలు ఏమిటి అనే విషయం మీదే మనం మాట్లాడుకుంటున్నాం. బ్రిటీష్ వాడు మన దేశాన్ని పరిపాలిస్తున్నప్పుడు ఈ దేశంపై వాడు పట్టు సంపాదించటం కోసం జమీందారీ వ్యవస్థను పెట్టి వేలాది ఎకరాలు ఆ జమీందారులకి ఇచ్చాడు. అయితే మనం పెద్ద ఎత్తున బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు చేసినపుడు ఆ పోరాటాలకు సమాంతరంగా ఒక ప్రక్కన గాంధీ మహాత్ముడిని, మరొక ప్రక్క వినోబాభావేని పెట్టి ఏమీ లేకుండా ప్రశాంతంగా మీ భూములన్నీ కూడా ఇచ్చేయండి, అప్ప జెప్పండి అని చెప్తే జమీందారులు వేలాది ఎకరాల భూములు దానం చేశారు. అయితే ఆ కాగితాలన్నీ కట్టలు అలానే వున్నాయి. కానీ భూములన్నీ ఈ రోజుకి కూడా పెద్దరైతుల చేతుల్లో కానీ, రైతుకూలీల చేతుల్లో లేకుండా ఆ జమీందారుల చేతుల్లోనే వున్నాయి. ఆ కాగితాలు మాత్రం అక్కడే వున్నటువంటి పరిస్థితి వుంది. అయితే వినోబాభావే, గాంధీ వీళ్ళందరూ కూడా ఆ రోజు భూ సంస్కరణల్లో, భూసమస్యకు సంబంధించి మీరు ఏమీ పోరాటాలు చేయవద్దు. వాళ్ళే దానం చేస్తారు. ఆ దానాన్నే మనం తీసు కుందాం అనే వైఖరితోటి వ్యవహరించారు. కానీ వేల ఎకరాలు ఆ విధంగానే వుండిపోయాయి. ఆ తరువాత భారత దేశంలో చెప్పుకోదగిన విధంగా భూమి సమస్య కోసం పెద్ద ఎత్తున అనేక పోరాటాలు జరిగాయి. అందులో మహత్తరమైన తెలంగాణా రైతాంగ పోరాటం, నక్సల్బరీ పోరాటం, శ్రీకాకుళ పోరాటాలు. ఈ పోరాటాల్లో పోరాడిన రైతులు చాలామంది తీవ్రమైన నిర్బంధాలను ఎదుర్కొన్నారు, జైళ్ళ పాలయ్యారు. ప్రభుత్వ కుట్రకు బలైన పరిస్థితి వుంది. అయినప్పటికీ మనకి ఈ రోజుకూ భూసమస్యనే ప్రధానమైన సమస్యగా వుంది. మన ముందున్న ఎజెండా అదే. మనం ఈ వ్యవస్థకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలి. ఏ చట్టాలు, ఏ ప్రజాస్వామిక దేశాలు, రాజ్యాలు అని చెప్పుకుంటే కుదరదు. భారతదేశంలో కార్మికులు, కర్షకులు, మేధావులు, యువతీ యువకులు ఐక్యమై ఈ భూమి సమస్యపైన పోరాటం చేయవలసినటువంటి అవసరం వుంది. తప్పకుండా పోరాటం చేసి మనం ముందుకు వెళదాం. విజయం మనదే. ఆ వైపుగా రైతుకూలీసంఘం పయనిస్తుందని ఆశిస్తూ ముగిస్తున్నాను.

**కా॥భూతం వీరయ్య, ఏఐకెఎమ్‌కెఎస్ ఆల్ ఇండియా కమిటి సభ్యులు మరియు తెలంగాణ రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి**



ఇక్కడకు విచ్చేసిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ప్రతినిధులకి, వేదిక మీదున్న యితర రాష్ట్రాల ప్రతినిధులకు, మహాసభ విజయవంతం కావటంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు. ముఖ్యంగా ఈ మహాసభ జరుపుకోవటానికి కారణమైన కొన్ని పరిస్థితులను మీ ముందుంచుతున్నాను. నేడు ప్రభుత్వాలు అవి చేసిన వాగ్దానాలను అమలుచేసే పరిస్థితుల్లో లేవు. రోజురోజుకూ పెరుగు తున్న సామ్రాజ్యవాద దోపిడీకి అనుగుణమైన పథకాలను అమలు చేసే ధ్యానలో ప్రభుత్వాలు ఉన్నాయి. రైతాంగ పోరాటాలు సీరియస్‌గా జరిగిన ఫలితంగా ప్రభుత్వాలు తప్పనిసరి పరిస్థితుల్లో చేసిన చట్టాలని కూడా ఆచరణలో అమలు చేయని పరిస్థితి వుంది. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి భూములను సామ్రాజ్యవాద కంపెనీలకు

కారుచౌకగా అప్పజెప్పే, భూసంస్కరణలు తీసుకువచ్చారు. దున్నేవానికే భూమి హక్కు కోసం మరోప్రక్క రైతాంగ పోరాటాలు సాగు తున్నాయి. ప్రభుత్వాలు కొత్త కొత్త విధానాలతో రైతుల పంట భూములు ఆక్రమించుకోవటానికి వ్యతిరేకంగా, అలాగే రాష్ట్రంలోని రైతుల్లో ఉన్న వ్యతిరేకతని అధిగమించడం కోసం ప్రాంతాల మధ్య వైరుధ్యాల్ని సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ మహాసభ జరగటం అనేది సమాజంలో పోరాట స్ఫూర్తి ఒక విశిష్ట రూపాన్ని సంత రించుకోవటానికి ఉపయోగపడుతుందని నేను అభిప్రాయపడుతున్నాను.

నేడు తెలంగాణలో, కేంద్రంలో మోదీ నాయకత్వంలో 'అచ్ఛే దిన్ ఆయేగా', 'మేకిన్ ఇండియా' పేరుతో రైతాంగానికేం ఇబ్బంది లేదంటూ వాగ్దానాలిచ్చి రెండు ప్రభుత్వాలు గెలిచాయి. అదే విధంగా ఒక ప్రాంతంలో అభివృద్ధిని చూపుతూ ప్రజల మధ్య విభేధాలు సృష్టించి ప్రాంతాలను విడగొట్టిన సందర్భంలో వేర్పాటు ద్వారా వ్యవసాయ రంగంలో, రైతు కుటుంబాలలో మెరుగుదల వుంటుంది, ఆత్మహత్యలు ఆగిపోతాయి, విద్యారంగంలో కూడా ముందడుగులేస్తాం అనే భ్రమలు కల్పించాయి యిరు ప్రాంతాల ప్రభుత్వాలు.

అలాగే ఈ రాష్ట్రంలో ఉన్న ప్రాంతాల్ని ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీతో అభివృద్ధిపరుస్తాం అనే వాగ్దానాలిస్తున్నారు పాలకులు. అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల్లో ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను ప్రక్కకు మళ్ళించటం కోసం కొత్త కొత్త విధానాలను ప్రవేశపెట్టబో తున్నారు. ఆ పథకాల భ్రమల నుండి రైతాంగాన్ని బయటకు తెచ్చి సంఘటితపరిచే క్రమంలో రై.కూ.సం(ఆం.ప్ర) ముందున్నది. అదే విధంగా దేశంలో రైతుసంఘాలను ఐక్యంచేసే క్రమంలో ఆటంకపరిచే 'మేధావులు' ఉన్నారు, వీటన్నింటిని అధిగమించి ఒక బలమైన ఉద్యమరూపం తీసుకురావటం కోసం తమ కృషి సాగిస్తారని, ఈ దేశం వ్యవసాయక దేశం కాబట్టి దాని లక్ష్యం ఎటువైపుగా ఉండాలనే దానిని చెప్పి, ఆ లక్ష్య సాధన కోసం రైతు కూలీసంఘం(ఆం.ప్ర) భవిష్యత్ కార్య క్రమాలు తీసుకుంటుందని, ఆ కార్య క్రమాలు యితర రాష్ట్ర రై.కూ.సం.లకు స్ఫూర్తినిస్తాయని తెలంగాణా రై.కూ.సంగా ఆశిస్తున్నాను. రైతాంగం మధ్య ప్రభుత్వాలు ఏర్పరుస్తున్న వైరుధ్యాలను యిరు ప్రాంతాల్లో తిప్పికొట్టి, రైతు ఉద్యమాలకు సంఘీభావం తెలుపుతూ వుండాలని కోరుతున్నాను.

**కా॥భీమ్రేడ్ శేషు, దళిత ప్రజల నాయకులు, గుంటూరు**



ప్రియమైన కామ్రేడ్లకు భీమ్రేడ్ తరఫున ఇవే నా విప్లవ సమగ్ర సామాజిక జేజేలు. భీమ్రేడ్అంటే భీమ్‌రావు తత్వం అయిన అంబేద్కర్ తత్వాన్ని సమాజానికి పంచి, పెంచి అంబేద్కర్ కోరుకున్న రాజ్యం తీసుకు రావటం కోసం పనిచేసేవాడే భీమ్రేడ్ అని నేను పదహారేళ్ళ క్రితం నామకరణం చేసుకున్నాను. కానీ నేను కామ్రేడ్‌గానే పుట్టాను. కానీ భీమ్రేడ్స్‌గా ఈ భారతదశంలో కులవ్యవస్థ వున్న సందర్భంలో భీమ్‌రావు కోరుకున్న రాజ్యాన్ని తీసుకురావాలనే బాటలో పయనిస్తున్నాను. లిస్టులో లేక పోయినా గెస్ట్‌గా వచ్చి మీకు చిన్నపాటి సందేశాన్ని ఇవ్వటానికి అవకాశాన్ని ఇచ్చిన మన సోదరి సింహాద్రి ఝాన్సీగారు మన స్త్రీ జాతికే ఒక దిక్సూచిగా, ఒక మేలు కొలుపుగా, ఒక రోల్ మోడల్‌గా నేను గమనిస్తున్న దగ్గర నుండి ఆమె భావ జాలంలో ఒక దశ భాగం వున్నా ఈ సమాజంలో మహిళలందరూ ఆ మార్గంలో పయనిస్తే విప్లవం కోరుకునే రాజ్యం తీసుకురావటం పెద్ద సమస్య కాదు అనేది నాకనిపిస్తుంది. సరే విప్లవం రావటానికి ఎన్ని ఆటంకాలున్నాయో ప్రతీదీ ఛేధించుకు రావాలని మన పెద్దన్న రెడ్డన్న చెప్పిన అవన్నీ కూడా మాకు గుండెల్లో కదులుతూ వుంటాయి. వాటినన్నింటిని ఆలోచించే ముందు అసలు ఈ సందర్భం ఎలా వుందంటే హంతకులంతా అసెంబ్లీలో, ఫాక్షనిస్టులంతా పార్లమెంటులలో హౌస్‌ఫుల్ అయిన సందర్భం ఇది. ఆ హౌస్‌ఫుల్ అయిన సందర్భంలో మనం ఆ హౌస్‌ఫుల్‌గా వున్నటువంటి హంతకులను, ఫాక్షనిస్టులను పారద్రోలాలంటే ఆర్‌డిఎక్స్‌లుగా మనం మారాల్సిన అవసరం ఈ విప్లవ శక్తులుగా వున్న మనం ఆ శక్తులుగా, ఆర్‌డిఎక్స్‌లుగా పవర్‌ఫుల్ శక్తులుగా మార్చటం కోసం ఈ రైతుకూలీ సంఘం ఈ మహాసభలను జరుపు కుంటుదని మనసారా కోరుకుంటూ అదే జరగాలని, అదే ఒక మార్గమని తన్నే వాడికే భూమి హక్కు దక్కుతుంది. కాబట్టి మనం ఆ కార్యక్రమంలోనే పోరాటమే ఏకైక మార్గమని అనుకుంటూ నిన్నటి నుండి ఆలోచించి కార్యక్రమాలు చేస్తున్నటువంటి క్రమం చూస్తుంటే అసలు తన్నకుండా భూములు దక్కవనేది ప్రోగ్రాం కనబడతా వుంది. అంటే తన్నేవాడికే భూమి దక్కు తున్నది. అదే హక్కుగా మారుతుంది. ఆ తర్వాత అంటే పోరాటం విప్లవీకరింప బడకుండా మనం ఎన్ని పోరాటాలు చేశాం, ముందు గుడిసెలు వెయ్యాలా లేదా చూసుకున్నాం. గడిసెలు కాలిపోతున్నాయి తర్వాత చూసుకుంటూ గుడిసెలు కాలి పోతున్న దానిలో ఎవరిని కాలిస్తే భూమి నిలబడుతుంది అనే స్థాయిలో మాట్లాడు తుంటే ఆనందంగా వుంది. నేను చెల్లాయి గారు ఇచ్చినటువంటి అవకాశాన్ని ఈ దరిద్రపు పాలకవర్గాన్ని ఎలా తిట్టాలో తిట్ట టానికి కూడా భాష లేదు. ఈ పాలకవర్గాలు, ఫాక్షనిస్టులను, హంతకులను ఏ భాషలో తిట్టాలో తెలియటం లేదు. నేను ఏదో ఆ విప్లవకారులు ఆ పదాలు నేర్చుకున్నాను తప్ప ఆంధ్రప్రదేశ్‌ని ఎంత దుర్మార్గంగా మార్చారో ఈ 70 ఏళ్ళ స్వతంత్ర్యాన్ని స్వాహా తంత్రంగా చెప్పారు అన్నగారు. చాలా గొప్పగా వుంది. నేనైతే 15 శాతం స్వతంత్రం వచ్చింది. ఆగస్టు 15, 15 శాతానికి అగ్రకుల స్వాతంత్ర్యదినమో, స్వాహాదినమో అది స్వాతంత్ర్యం....స్వాహాతంత్రంగా 15 శాతానికి వచ్చింది. ఆ 15 శాతం వుంది.

80 శాతాన్ని 85శాతాన్ని ఏడిపించుకు తింటున్నారు. ఇదే ప్రోగ్రాం. దాంట్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ని అంటే 23 జిల్లాలుగా వున్న ఆంధ్రాను ఏం చేశారు?

నేను మందేమాతరం అనే బుక్‌ను వ్రాస్తున్నాను. రెడీ అవుతుంది. దానిలోని రెండు చరణాలు మందేమాతరం అంటే వందేమాతరం విన్నాం గానీ మందేమాతరం వినలా. మందేమాతరం అంటే మనం ఇటువంటి స్టేజీల మీద ఓపెన్‌గా బీహార్ నుండి ముఖ్య మంత్రిని పిలిచి ఓపెన్ చేసే స్థాయికి వెళతాం. ఎవడైతే ఈ దేశంలో మద్యాన్ని నిషేధిస్తాడో వాడే ముఖ్యమంత్రిగా వుండే పరిస్థితి తీసుకువద్దాం. ఫుల్‌బాటిల్‌కి 750 ఎం.ఎల్ వుంటాయట. 750 లైన్లు వున్నాయి. కళాకారులందరూ పాడుకునే రోజు తీసుకువస్తాను. అందరం పాడు కుందాం.

మన ఝాన్సీగారి బాటలో రేపు రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో కావాల్సినటువంటి హక్కులు తన్నితే భూమి వస్తుందా, తన్నకుండా భూమి వస్తుందా చూసుకుని తన్నాల్సిన అవసరమొస్తే తన్నితేనే భూమి హక్కు వస్తుందనే అవసరాన్ని చూసుకొని, తన్నటం అంటే పదండి ముందుకు, పదండి తోసుకు అని పెద్ద పెద్దవాళ్ళు మనకు ఎప్పుడో రాశారు. మనం అవన్నీ కూడా ఆలోచించుకుని, ప్రతీ అక్షరం ఆయుధంగా మార్చుకుని, సాహిత్యం చదువుకొని అధ్యయం నుండి ఆచరణగా మారాలని ఇవే నా సమగ్ర విప్లవ సామాజిక జేజేలు తెలుపుకుంటూ ఈ రైతుకూలీసంఘం దిన దినాభివృద్ధి చెంది, ఇక ఏకైక సంఘంగా వుండేటటువంటి రాబోయేకాలంలో సంఘాలన్నీ సద్దుమణిగేటట్టున్నాయి. వీరులుగా వుండేవారు పోరు చేయాల్సిన రోజు ఆసన్నమైంది. ఆర్‌డిఎక్స్ శక్తులుగా మలచాల్సిన ఆర్‌డిఎక్స్ శక్తులు అంటే ఏమీ లేదులేండి అది ఒక అత్యవసరమైన శక్తి. ఆ శక్తే ఆర్‌డిఎక్స్ శక్తి. రాజీవ్‌గాంధీని చంపిన శక్తి కాదు. ఆర్‌డిఎక్స్ శక్తి అంటే విప్లవ శక్తే ఆర్‌డిఎక్స్ శక్తి అని భావించి నేను తప్పుగా అని అక్కడ అన్న మాటలు కావు అవి. అవసరమైన మాటలుగా నేను అనుకుంటున్నాను. ఇవే నా విప్లవ సామాజిక సమగ్ర జేజేలు.

## సోదర సంఘాల ప్రతినిధుల సందేశాలు

**కాII సి. పెద్దన్న ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు**



సభాధ్యక్షులు కామ్రేడ్ కోటయ్యగారు, రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీగారు, ఓపిడిఆర్ హనుమంతరావు గారు, స్త్రీ విముక్తి సంఘటన లక్ష్మిగారు, పిడిఎస్‌ఓ, ఎన్‌వైఎస్ నాయకులు, రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన రైతుకూలీ సంఘం కార్యకర్తలకు, అభిమానులకు ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు తెలియచేస్తున్నాను. నిన్నటి నుండి జరుగుతున్న రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభల్లో భాగంగా గుంటూరు నగరాన్ని తమ కాలిగజ్జెలతో, ఆదివాసీ నృత్యాలతో ఎరుపుగా మార్చినటువంటి రైతుకూలీ సంఘం రాష్ట్ర కమిటీకి , ఆహోరాత్రులు కష్టపడి ప్రజల్ని సమీకరించినటువంటి కార్యకర్తలకి అభినందనలు తెలియ జేస్తున్నాను. ఇప్పటికే ఎఐకెఎమ్‌కెఎస్ ఆలిండియా స్థాయిలో, 16 రాష్ట్రాల్లో రైతుకూలీ సంఘం ఉద్యమించటానికి, ఉద్యమాన్ని మిలిటెంట్‌గా ముందుకు తీసుకు పోవటానికి ఒక దిశను ఏర్పాటు చేసు కున్నారు. రాష్ట్ర కమిటీ ఈ రోజు, రేపు జరిగే ఈ సభలో తీసుకోబోయే నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్‌లోని రైతాంగ ఉద్యమానికి ఒక దిక్సూచిగా వుంటాయని నేను ఆశిస్తున్నాను.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చి 69 సంవత్సరాలు గడిచిపోయాయి. ఇందిరా గాంధీ గరీబీ హఠావో నినాదాన్ని అమలు చేసుకొచ్చింది. పి.వి.నరసింహారావు గ్లోబలై జేషన్ తీసుకొచ్చాడు. అంతకు మునుపు రాజీవ్‌గాంధీ టెక్నాలజీ అంటూ సాంకేతిక పరిజ్ఞానంతో దేశాన్ని అభివృద్ధిచేసి పేదలకు మేలు చేస్తామన్నాడు. వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్, నేడు మోదీ–వీళ్ళందరూ చెప్తున్న దొకటే –పేదరిక నిర్మూలన, పేదల కోసం మేమున్నామని. ఈ 69 సంIIల తర్వాత దేశంలో ఘోరమైన ఆకలి వుంది. 3 లక్షల 50 వేలమంది రైతులు భారతదేశంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లాలో అయితే గత 8 సంIIలుగా ఒక్క పంటకూడా పండని పరిస్థితి. అదే విధంగా మిగతా ప్రాంతాల్లో, గుంటూరులో గానీ లేకపోతే శ్రీకాకుళంలోని మెట్ట ప్రాంతాల్లో కూడా ఇవ్వాళ ఆకలి చావులు చూస్తూ ఉన్నాం. ఆకలి చావులు, ఆత్మహత్యలు–దీనికి తోడు చేనేత కార్మికుల స్థితి పరిస్థితి యొక్క తీవ్రతను తెలియజేస్తా వున్నాయి.

అనంతపురం జిల్లాలో జరుగుతున్న నిజాలు చెప్తాను నేను. అనంతపురం జిల్లాలో బ్రిటీష్ కాలంలోనే కామన్ కోడ్ కావాలని ఆనాటి నాయకులు కేకలు వేశారు. కరువు కోడ్, జానిం కోడ్ బ్రిటీష్‌వాళ్ళు పెట్టారు. పల్లెల్లో పనిలేకపోతే కనీసం తినటానికి, త్రాగటానికైనా గంజికేంద్రాల ఏర్పాట్లు ఉన్నాయి. ఈ 69 సంIIల తర్వాత ఈనాటికీ కూడా గంజికేంద్రాలు ఏర్పాటు చేయండని డిమాండ్ చేసే ఖర్మ అనంతపురం జిల్లాకు ఎందుకొచ్చిందో తెలియదు. తరిమెల నాగిరెడ్డిగారు ఎమ్మేల్యేగా ఉన్నపుడు కదిరిలో బ్రహ్మాండంగా ఉద్యమం సాగుతుంటే, ఆయన అసెంబ్లీ నుండి వచ్చి గంజికేంద్రాలు ఏర్పాటు చేస్తారా లేదా అని, అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉద్యమించారు. ఆ నినాదాలు నాకు ఈనాటికీ విన్పడు తున్నాయి. మరి ఈనాడు? కరువును తట్టుకోలేక 4 లక్షల 25వేల కుటుంబాలు ఒక్క అనంతపురంజిల్లా నుండే వలసలు వెళ్ళిపోయారు. వాళ్ళెక్కడు న్నారయ్యా అని పరిశీలిస్తే బెంగుళూరులో, కేరళలో నడిరోడ్ల మీద, గుడుల దగ్గర అడ్డాగా నిలబడి ఎవరైనా పనికి పిలిస్తే పోదామని వున్నారు. పనులు దొరక్కపోతే

తిండికోసం సాయిబాబా గుడిదగ్గర మధ్యాహ్నం పూటపెట్టే ప్రసాదంతో కడుపు నింపుకునే దుస్థితి అనంత పురం రైతాంగానికి ఎందుకు పట్టింది? ఇంకో విషయం చెప్పాలి మీకు. అన్ని జిల్లాల్లో లాగానే మా జిల్లాలో–తండ్రి బిడ్డను పిలిచి అమ్మా, నీవు సౌదీ అరేబియా పోతావా? అన్న చెల్లెల్ని పిలిచి ఓ 2, 3 ఏండ్లు సౌదీ అరేబియా పోరాయే! భర్త భార్యను పిలిచి ఓ 2 సం॥లు సౌదీ అరేబియా పో రాలేవా? .... అని అంటున్నారు. ఎందుకు సౌదీ అరేబియా పొమ్మంటా వున్నారు? అనంతపురం జిల్లాలోని కదిరి ప్రాంతాల్లో వుండే ఎస్.టిలు, బి.సిలు, ఎస్.సిలు లేదా అక్కడున్న మైనారిటీ వర్గాలు ఎందుకు వలసలు పోతున్నారు? సౌదీ అరేబియా పోలేని వాళ్ళు, వీసాలు ఫెయిల్ అయితే–వాళ్ళు రెడ్‌లైట్ ఏరియాకి పోయి బొంబాయిలో అనేక కష్టాలుపడి, రోగాలు పడి చివరకు ఎన్‌జీవో సంస్థల వల్ల తిరిగి కదిరి వచ్చే ఖర్మ నేడు వుందంటే, ఈ పాలక వర్గాలు 69 సం॥లుగా ఏమి ఒరగ బెట్టారు? ఆకలి చావుల నుండి, ఆత్మహత్యల నుండి, వలసల నుండి రైతాంగాన్ని కాపాడు కోవాల్సిన ధర్మం మనముందు వుంది.

కార్మికవర్గం ఏమన్నా బాగుందా అని ఒకసారి ఆలోచిస్తే వారు యూనియన్ పెట్టుకుంటే తొలగించే పరిస్థితి ఈనాడు వుంది. బ్రిటీష్‌వారి కాలంలోనే యూనియన్ పెట్టుకోవటానికి చట్టాలు వున్నాయి. రిజిస్ట్రేషన్‌కి చట్టం వుంది. మరి ఈ రోజు తాడిపత్రి లాంటి ఎల్ & టి సంస్థలోగాని లేదా హిందూపురం దగ్గర ఎస్.ఆర్..... కంపెనీలోగాని కార్మికవర్గం వారి యాజమాన్యం నుండి వారికి రావాల్సిన బోనస్‌లివ్వండని, పిఎఫ్ సౌకర్యం కల్పించ మని యూనియన్ రిజిస్ట్రేషన్ చేస్తే, రిజిస్టర్ చేసిన పాపానికి ఎంప్లాయిమెంటు వాళ్ళు అసిస్టెంట్ కమీషనర్ ఆఫీసు నుండి వచ్చి, తిరిగి వెళ్ళే లోపలే ఆఫీసు బేరర్స్‌ను తొలగించిన దుర్మార్గం జరుగుతోంది. ఇవ్వాళ అనంతపురంలోనే గాదు, హిందూ పురంలోనే గాదు, అనేక పరిశ్రమల్లో కార్మికులు యూనియన్ పెట్టుకోలేని పరిస్థితి వుంది. మనం మేడే సందర్భంగా కార్మిక వర్గం రైతాంగాన్ని కలుపుకుని చేయాల్సిన పోరాటాల గురించి చెప్పుకొనే ఒక ఆనవాయితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రై.కూ.సం, ఎఐఎఫ్‌టియు భుజం భుజం కలుపుకుని మేడే ప్రాముఖ్యతను గురించి చెప్పుకుంటున్నాం. అట్లాంటి మేడే, ఏ 12 గంటలో, 18 గంటలో పనిదినం వద్దని, 8 గం॥ల పనిదినం కోసం–ఆ రోజు త్యాగాలు చేసిన అమరవీరుల రక్తంతో ముంచెత్తిన జెండాను, సాధించుకున్న పనిగంటలను అనేక సౌకర్యాలను కోల్పోయారు. ఇవ్వాళ 8 గంటలు కాదు, 12 గంటలు . ఒక లారీ డ్రైవర్ డ్యూటీ ఎక్కితే, ఒక ఆర్‌టిసీ డ్రైవర్ డ్యూటీ ఎక్కితే తను ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి 10, 11 గంటల సమయం పడుతుంది. ఇప్పుడు కార్మికవర్గానికి పని గంటలు లేవు. కార్మికవర్గం సాధించుకున్న పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు లేవు. ఏ హక్కులు లేకుండా బ్రతుకుతావా లేదా అని కార్మికవర్గానికి పరీక్ష పెడుతున్నారు. మనం టీ త్రాగి ఏ విధంగా యూజ్ అండ్ త్రో కప్పులు పారేస్తున్నామో, ఇవ్వాళ కార్మికవర్గ సర్వీసుల్ని, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులను కూడా యూజ్ అండ్ త్రో పద్ధతిలో తీసి పారేస్తున్నారు. భారత దేశంలో ఈ రోజు ఎవరికీ హక్కులు లేవు. 45 కోట్లమంది కార్మికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. ఎవరికీ ఏ విధమైన హక్కులు లేని పరిస్థితుల్లో తిరిగి ఎంతో పోరాటాలు చేసి హక్కుల్ని సాధించు కోవాల్సి వుంది. అందుకనే ఈ దరిద్రానికి మూలకారణం ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న సామ్రాజ్యవాద దోపిడీ, భూస్వామ్య దోపిడీ. ఈ భూస్వాములు, దళారులు, పెట్టుబడి దారులు, ఈ పాలకవర్గాలు రా,రా,రా అని పెట్టుబడుల కోసం ఇతర దేశాలను పిలుస్తున్నారు. బ్యానర్ చూడండి బ్యానర్‌లో వున్నట్టుగానే మేక్ ఇన్ ఇండియా కమాన్ అని ఎర్రతివాచీ ఎలా పరుస్తున్నారో, పెట్టుబడిదారులకు ఈ పాలకవర్గ దళారులు ఏ విధంగా మన దేశాన్ని తాకట్టు పెడు తున్నారో ఆలోచించాల్సి ఉంది. ఓడరేవుల పేరుమీద, విమానాశ్రయాల పేరుమీద, రాజధాని పేరుమీద, ల్యాండ్ పూలింగ్ పేరుమీద లక్షల ఎకరాల్ని ఆంధ్ర దేశంలో సేకరిస్తున్నారు. అనంతపురంలో ఒక్క కంపెని లేదు. పెద్దా, పెద్దా అని తిరుగు తున్నాడు. కార్మికవర్గము, రైతాంగము, విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగులం అంతా భ్రమల్లో జీవిస్తూ ఉన్నాం. ప్రతిజిల్లాలో సాఫ్ట్‌వేర్ హబ్‌లు, కడపకొస్తే కడపలో హార్టికల్చర్ హబ్, అనంతపురం వస్తే అగ్రికల్చరల్ హబ్, అన్నీ హబ్‌లే, క్లబ్‌లే తప్ప ఈ రెండేళ్ళ పరిపాలనలో ఇక్కడ మేము ఇది చేశాము అని చెప్పుకోవటానికి ఒక్క ఉదాహరణ లేదు. చంద్రబాబునాయుడు భ్రమల్లో జీవింప చేస్తూ, మెస్మరిజం చేస్తా ఉన్నాడు. ఇవ్వాళ రైతుకూలీసంఘాలు ఈ మెస్మరిజం–ఒక కుట్ర జాగ్రత్త సుమా! అని హెచ్చరిస్తున్నారు. కార్మికవర్గం తోడై ప్రతిచోటా చేయి చేయి కలిపి ఉద్యమాలను చేస్తా వున్నాయి. తెలుగుదేశం యొక్క భ్రమలకి హెచ్చరికలు చేసే సందర్భం ఇవ్వాళ వచ్చింది.

ఒకటే మనకి పరిష్కారం. ఈ దేశంలో దున్నే వాడికే భూమి రావాల్సిందే. వ్యవసాయక విప్లవం అమలు జరగాల్సిందే. ఈ సామ్రాజ్యవాదులను తరిమి తరిమి కొట్టాలి. అసలు సామ్రాజ్యవాదులకు దళారీ పెట్టుబడిదారులే భూస్వామ్య వర్గాలే దాసోహం చేశారన్నది మనందరికీ తెలుసు. అందుకే మన ముందున్న ఎజెండా కార్మిక వర్గం ముందున్న ఎజెండా– రై.కూ.సం. పెట్టుకున్న ఎజెండా కూడా–ఇవ్వాళ ఈ దేశాన్ని విముక్తి చేయాలి. ఈ దోపిడీ వర్గాల నుంచి ప్రజలకు స్వేచ్ఛా వాయువులు ప్రసరింపచేయాలి అనుకుంటే అందుకు దున్నేవాడికే భూమి కావాలి. వేల లక్షల ఎకరాలు చేతుల్లో పెట్టుకోవటానికి దోపిడీ వర్గం ప్లాను చేస్తే ఆ భూములను పేదలకు పంచటానికి మనం గ్రామగ్రామాన్ని బలపం కట్టుకుని తిరగాలి. రైకూసంని ఆర్గనైజ్ చేసుకుంటూ దున్నేవానిదేభూమి అని ఉద్య మించాలి. ఒకసారి నాగిరెడ్డిగారు ఇళ్ళ స్థలాలు వేస్తుంటే ఒక మాట చెప్పారు. ఇళ్ళ స్థలాలను ఆక్రమించటానికి మేం మొట్ట మొదటిసారిగా ఏ అనుభవం లేనివాళ్ళుగా

పోతే ఆయన గుడిసెలు వేసుకోండి, పోండి అన్నాడు. మీరే వేసుకోండి అన్నాడు. నాగిరెడ్డిగారు ఇట్లా మాట్లాడితే ఎట్లా అని తెలిసిన ఫ్రెండ్‌తో అన్నాను. నాకేం తెలియదు అన్నాడు. నాగిరెడ్డిగారు ఎందుకు చెప్పినాడు అంటే మీ యువజనసంఘం వాళ్ళు పోయి గుడిసెలు వేస్తే మీరే నాయకులవుతారని నాయకులుగా అనుభవం గడించటానికి పంపించారు ఆ రోజు. అక్కడ ఏవో ఇబ్బందులు వస్తే మళ్ళా ఆయన దగ్గరకు పోయాం. మీరు ఎన్ని గుడిసెలు వేశారు? అన్నారు. ఓ 30 అని చెప్పాం. ఎన్నను కున్నారు అని అడిగారు. 60 గుడిసెలు వేయాలనుకున్నామన్నాం. పీకుతావుంటే వేస్తా వుండాలి. అందరూ సమష్టిగా గుడిసెలు వేయాలి అని చెప్పారు. ఇళ్ళస్థలాలు, బంజరు భూములు, గవర్నమెంటు భూములు, పోరంబోకు భూములు అన్నీ అయిన తర్వాత భూమి మీద వచ్చిన ప్రేమతో పట్టాభూమినైనా ఆక్రమించు కోవటానికి నీవు సంఘాలుపెట్టి మిలిటెంట్‌గా తయారుచేస్తే, పట్టాల భూములు ఆక్రమించుకోవటానికి పోయేదశ అప్పుడు చేతికి వస్తుంది. భూమిని రక్షించుకోవటానికి పోయే దశగా వుంటుంది అన్నారు. మేం చేసిన పనులవే. కాబట్టి అన్ని రకాల భూములను పంచటానికి, ప్రభుత్వాలకి వ్యతిరేకంగా పోరాటాలను చేయటానికి పూనుకుంటూ, అందరమూ జెండాలు పట్టుకుని పోతాము.

ఇవ్వాళ మన అనుభవంలో కొండ మొదలు నుండీ అనేక ప్రాంతాల్లో మనం భూముల్ని నిలబెట్టుకోవటానికి 40, 45 సం॥లుగా ఆ ప్రాంతాన్ని, ప్రజల్ని కలుపుకుంటూ, ఉద్యమ ప్రాంతాలను విస్తరించుకొంటూ కార్యకర్తలుగాపోయి, అమరవీరుల త్యాగాలతో ఆ ప్రాంతాలను రక్షించుకుంటున్నాం. విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, అనంతపురం అన్ని ప్రాంతాల్లో భూముల పోరాటం వైపు నడిపినటువంటి మనం మరింత, మరింతగా మిలిటెంట్‌గా ముందుకుసాగాలి. ఆ 30, 35 ఏళ్ళనాటి శ్రీకాకుళం సంగీతపు పాట, మాట ఈ రోజుకీ వింటుంటే దున్నేవాడికే భూమి కోసమని పోరాటాలలోకి పోదామనే ఉద్వేగం కలుగుతుంది. ఇప్పుడున్న ప్రస్తుత పరిపాలనలో ఎక్కడ గుడిసెలు వేద్దామని వెళ్లినా పోలీసువాడు వెంటొస్తున్నాడు. ఎవడు పోయినా పచ్చజెండా వాళ్ళు వస్తున్నారు. ఏ పాలకవర్గాలొచ్చినా కబ్జా చేసుకోవటానికే చూస్తున్నారు. ఈ సందర్భంలో మనం సరైన మిలిటెంట్ దిశగా సరైన సంఘాన్ని ఆర్గనైజ్ చేసుకుని త్యాగాలు చేయటానికి సిద్ధపడాలి. సిపిఐ, సిపిఎం వాళ్ళు నీవు కొడ్తవా కొట్టుకోమని, ఈడ్చు తావా, ఈడ్చుకోమని రోజూ ప్రదర్శనలు, ధర్నాలు చేస్తూ, ఫోటోలు వేయించుకుంటున్నారు. మన రైతుకూలీ సంఘానికి ఆ దిశ ఎప్పుడూ లేదు. మన వార్తలు పేపర్లో పడవు. మన ఉద్యమానికి మీడియా సపోర్టు చేయదు. ఎందుకంటే చాపకింద నీరులా ఈ దేశంలో జరిగే నిజమైన వర్గపోరాటానికి పునాదులు వేసేది ఈ సంఘమేనని వాళ్ళకి తెలుసు. అందుకనే కామ్రేడ్స్! ఈ సభ ఐన తర్వాత అన్ని జిల్లాల్లో నుండి వచ్చిన కామ్రేడ్స్ అందరూ త్యాగాలతో నిండినటు వంటి దీక్షాపరులై మరలా మహాసభకి వచ్చేటప్పటికి మా ప్రాంతంలో ఇన్ని వేల ఎకరాల భూమి ఆక్రమించినాం, ఇంత మిలిటెంట్‌గా సాధించినాం. ఇక దోపిడీని అరికట్టటానికి పూనుకున్నాం అనే రిపోర్టును మీరందిస్తారని ఆశిస్తున్నాను. ఈ క్రమంలో ఎఐఎఫ్‌టియు (న్యూ) కార్మికసంఘం తరఫున ప్రతి ఉద్యమానికి బాసటగా వుంటూ మీతో భుజం భుజం కలుపుతూ నడుస్తామని తెలియచేస్తున్నాను.

**కా॥ఎం.లక్ష్మి స్త్రీ విముక్తి సంఘటన కార్యదర్శి**



అధ్యక్షా, వేదిక మీద వున్న రైతుకూలీ సంఘం నాయకులు, ప్రజాసంఘాల మిత్రులు, రాష్ట్రం నలుమూలల నుండి రైతుకూలీసంఘం మహాసభకి హాజరైన ప్రతినిధులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులందరికీ స్త్రీ విముక్తి సంఘటన తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను. భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం, దున్నేవానికే భూమి హక్కు కోసం-ఈ లక్ష్యాల్ని కలిగి వున్న రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) సుదీర్ఘకాలంగా రైతుకూలీల మధ్య, రైతాంగం మధ్య, ఆదివాసీల మధ్య పనిచేస్తూ, ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ, సంఘటితం చేస్తూ, ఉద్యమ కార్యాచరణను సాగిస్తూ వున్నది. ప్రస్తుతం వున్న ఈ సంక్షోభ పరిస్థితులను అవగాహన చేసుకొని, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవటం కోసం మహాసభని జరుపుకొంటున్నది. ఈ మహాసభ విజయవంతం కావాలని స్త్రీ విముక్తి సంఘటన మనస్ఫూర్తిగా కోరుకుంటోంది.

మిత్రులారా! ఈ రోజు భారతదేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పెత్తనం ఎంత తీవ్రంగా వుందో, అది రైతాంగం మీద, పీడిత ప్రజల మీద ఎట్లా దాడి చేస్తోందో అన్న విషయాలను చాలా సూక్ష్మంగానే కామ్రేడ్స్ విశ్లేషించారు. ప్రతీ సంక్షోభం యొక్క ప్రభావం పీడిత ప్రజల మీద, అందులో మహిళల మీద చాలా తీవ్రంగా వుంటుంది. వ్యవసాయరంగ సంక్షోభం ఫలితంగా అనంతపురం లాంటి ప్రాంతాల నుండి, కడప నుండి, అలాగే రాష్ట్రంలోని చాలా ప్రాంతాల నుండి ఆడపిల్లలు అనివార్యంగా గల్ఫ్ ప్రాంతాలకు వెళుతున్నారు. రాజంపేట నుండి అయితే ఎప్పుడోనే అంటే దాదాపు 30, 40 ఏళ్ళ నుండీ గల్ఫ్ ప్రాంతాలకు వెళ్ళి అక్కడ అనేక రకాలైన అవస్థలు పడుతూ శారీరకంగా, మానసికంగా, లైంగికంగా రకరకాల వేధింపులకు, దోపిడీలకు గురౌతూ వెళ్ళలేక, బతకలేక, చావలేక కుమిలి పోతున్నారు. వ్యవసాయరంగ సంక్షోభం, దాని తీవ్రత ఫలితంగా కన్నబిడ్డల్ని, భార్యల్ని వ్యభిచార కూపంలోకి నెట్టే ఒక దుర్మార్గమైన పరిస్థితి

ఈ రోజు దాపురించింది. పండిన పంటకి గిట్టుబాటు ధర లేకపోవటం, సామ్రాజ్యవాద కంపెనీల దోపిడీ తీవ్రత ఫలితంగా ఈ రోజు రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం ఇవన్నీ రైతాంగ ఆత్మహత్యలు కాదని చెప్తోంది. వెయ్యి ఆత్మహత్యలు జరిగితే అందులో 15, 20 కూడా పరిగణనలోనికి తీసుకోవట్లేదు. పాలకులు, అధికారులు ప్రకటించిన నష్టపరిహారం కోసం తర్వాత కుటుంబాల్లో బతికున్నటువంటి స్త్రీలు, భార్యలు ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ, కలెక్టరు ఆఫీసుల చుట్టూ తిరగక తప్పటం లేదు. ఈమె భర్త చనిపోయినా తెల్లారి లేచిన దగ్గర నుండి ఈమె కలెక్టారఫీసుల చుట్టూ తిరుగుతుందన్న కువ్యాఖ్యల్ని సమాజంలో మరోవైపు ఎదుర్కొంటూ ఆ మహిళలు ఒక మానసిక వేదనని అనుభవిస్తున్నారు. భర్త చనిపోయిన తర్వాత మరలా ఆ అప్పుల్ని భార్య తీర్చాల్సి వస్తుంది. భర్త చనిపోయిన తర్వాత అది గిట్టుబాటు కాని వ్యవసాయం అయినప్పటికీ ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో మరలా ఆ వ్యవసాయన్నే పట్టుకుని భార్యలు కొన సాగించాలి. కుటుంబాన్ని నెట్టుకు రావాలి. పిల్లల బాధ్యతలు చూడాలి. కుటుంబ బాధ్యత మొత్తం నిర్వహిస్తున్న స్త్రీల మీద సమాజంలో వున్న సంక్షోభం అదనపు పీడనగా, అదనపు దోపిడీగా మరింత భారాన్ని మోపుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మెజారిటీగా వున్న శ్రామిక మహిళల మీద ఈ దోపిడీ చాలా దుర్భరంగా వుంది. ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో వున్న సంక్షోభం, వ్యవసాయరంగ సంక్షోభం గ్రామీణ ప్రజలను అనివార్యంగా పట్టణ ప్రాంతాలకి వలసకూలీలుగా అసంఘటిత రంగంలోకి నెట్టివేస్తున్నది. ఆ అసంఘటిత రంగ కార్మికులు ఎలాంటి భద్రత లేని అత్యంత ఘోరమైన పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులుగా, -పనిలేక, దిక్కులేక రైల్వేస్టేషన్ల చుట్టూ, బస్టాండ్ల చుట్టూ, పేవ్‌మెంట్‌ల చుట్టూ చిన్న చిన్న పట్టాలేసుకుని బతుకుతూ అనేక రకాల అవమానాలను, వేధింపులను ఎదుర్కొంటూ పనిచేస్తున్న పరిస్థితి వుంది. ఇటీవల జరిగినటువంటి బ్రాండిక్స్ కంపెనీ ఆందోళనలోగానీ, బెంగుళూరులో దుస్తుల కంపెనీల నుండి వేలాదిమంది రోడ్ల మీదకు వచ్చి చేసినటువంటి ఆందోళనలు కానీ, తమిళనాడులో జరిగినటువంటి ఆందోళనలు కానీ-ఇవన్నీ చూసినపుడు వీళ్ళంతా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగ సంక్షోభం ఫలితంగా అనివార్యంగా గెంటివేయబడినటువంటి మహిళలే. నాలుగు వేల రూపాయలకు పొద్దస్తమానం రోజుకి 14 గంటలు, 15 గంటలు చాకిరీ చేస్తున్నా కనీసపాటి అవసరాలు కూడా తీరనటువంటి పరిస్థితుల్లోనే కడుపు మండి ఆందోళన బాట పడుతున్న పరిస్థితి వుంది. సెజ్‌ల పేరుతోటి, కోస్టల్ కారిడార్ల పేరుతోటి, పెట్రో కారిడార్ పేరుతోటి, భారీ ప్రాజెక్టుల పేర్లతోటి వేలాదిమంది, లక్షలాది మంది రైతాంగాన్ని భూముల నుండి గెంటి వేస్తున్నారు. మరొకవైపు ఇది చాలదన్నట్టు భూబ్యాంకుల పేరుతో ప్రజల దగ్గర వున్న భూములు లాక్కొంటున్నారు. ఈ భూ బ్యాంకులను సపోర్టు చేస్తూ ఇది చాలా గొప్ప పథకం అన్నట్టు చాలా రకాల స్వచ్ఛంధ సంస్థలు, మహిళాసంస్థలు, ముందుకొచ్చి భూ బ్యాంకుల వలన చాలా ఉపయోగం వుందని మాట్లాడుతున్నారు. ఈ రకంగా ప్రజల్ని ప్రక్కదారి పట్టిస్తున్నారు. ఈ కుట్రలన్నింటినీ ఎదుర్కోవలసిన పరిస్థితుల్లో, ప్రజల జీవితాలు రోజురోజుకీ సంక్షోభ పూరితం అవుతున్న ఈ సందర్భంలో రైతుకూలీసంఘం జరుపుకుంటున్న ఈ మహాసభ విజయవంతం కావాలని కోరు కుంటున్నాను. పోరాటం తప్ప మరో పరిష్కారం లేదు అనే వాస్తవాన్ని గత పోరాటాలు కానీ, ఇప్పుడున్న పరిస్థితులు కానీ పదే పదే చాటి చెబు తున్నాయి. పోరాటమే మన ముందు వున్నటువంటి మార్గం. ఈ దేశంలో వున్న లక్షలాదిమంది శ్రామికులకు, లక్షలాదిమంది శ్రామిక మహిళలకు వున్న మార్గం పోరాట మార్గమే. ఈ పోరాటంలో ముందుండాల్సినటువంటి అవసరం, మరింత చైతన్యాన్ని అందించి, మరింత ఉద్యమ కార్యాచరణలోకి పీడిత ప్రజలందర్ని ఐక్యం చేయాల్సినటువంటి బాధ్యత విద్యార్థి, యువతరం మీద, అన్ని ప్రజా ఉద్యమ సంస్థల మీద వున్నది. బాధ్యత మరింత పెరిగినటువంటి ఈ సందర్భంలో రైతుకూలీ సంఘంతో కలిసి నడుస్తామని చెప్పి తెలియజేస్తున్నాను.

**కా॥ఎస్.కె.బాషా, నవయువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



వేదికపైనున్న రైతుకూలీసంఘం నాయకత్వానికి, ఇతర ప్రజాసంఘాల నాయకులకి, రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలో పాల్గొన్నటువంటి ప్రతినిధులకి, మేధావులందరికీ కూడా నవయువ సమాఖ్య రాష్ట్ర కమిటీ తరపున విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాం.

కామ్రేడ్స్, మిత్రులారా! సంక్షోభం పెరుగుతోంది. ప్రజల జీవితాల్ని మరింత కష్టభరితం చేసే పరిస్థితులు రోజురోజుకీ పెరుగుతున్నాయి అన్న విషయాన్ని మనందరం గమనిస్తున్న వాళ్లం. అయితే, గతంలో శత్రువు మన గ్రామంలో భూస్వామి రూపంలోనో, ఇంకో రూపంలోనో కనిపించే వాడు. వాడికి వ్యతిరేకంగా మనం తిరుగుబాటుని, పోరాటాన్ని చేసేవాళ్లం. ఈ రోజు శత్రువు ఎవరూ అనే దగ్గర శత్రువు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నాడు. అటు పెట్టుబడిదారులు కానివ్వండి, సామ్రాజ్యవాదులు కానివ్వండి, భూస్వాములు కానివ్వండి, పెత్తందారులు కానివ్వండి వీళ్ళందరూ కూడా ప్రభుత్వాన్ని ముందుపెట్టి, ప్రభుత్వం వెనుక వాళ్ళు వుంటూ మొత్తం వాళ్ళకు అనుకూలమైన విధానాల్ని తీసుకొస్తూ ప్రజల జీవితాల్ని రోజురోజుకీ మరింతగా సమస్యల సుడిగుండంలోకి నెట్టివేస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. దీని ఫలితంగా రైతు కూలీల్నే కాదు, కార్మికుల్నే కాదు, మహిళల్నే

కాదు, వాళ్ళందరితోపాటు విద్యార్థులు, యువకులు అన్ని వర్గాల ప్రజలందరూ కూడా ఈ సమస్యల సుడిగుండంలోకి నెట్టి వేయబడ్డారు. ఈ రోజు మన పిల్లలు, యువకులుగా వున్న మన వాళ్ళ పరిస్థితి చూస్తే చాలా దయనీయంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయరంగ సంక్షోభం ఫలితంగా కూలీ పనులు లేక పట్టణాలకి వలసలు వెళ్తున్నారు. ఆ పట్టణాల్లో వాళ్ళు గడుపుతున్న జీవితం ఎంతో దుర్భరంగా వుంటోంది. ఈ దేశాలు కాదు, ఈ నగరాలు కాదు, ఇతర దేశాలకు కూడా వలసలు వెళుతున్నారు. అక్కడ రెండవ శ్రేణి పౌరులుగా బ్రతుకుతూ వాళ్ళు కడుపు కట్టుకుని రూపాయి రూపాయి కూడపెట్టటానికి చేస్తున్న కష్టాన్ని మనం చూస్తున్నాం. ఎందుకు ఈ రకమైన పరిస్థితి వుంది? ఏమిటి ఈ పరిస్థితికి మూలం అన్నపుడు ఖచ్చితంగా రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) చెప్పినట్టుగా ఈ మొత్తం సమాజం దోపిడీ సమాజం. ఈ దోపిడీ సమాజాన్ని మార్చుకోకుండా, ఈ దోపిడీని అంతం చేయకుండా మనం మన సమస్యల సుడిగుండంలో నుండి బయటపడలేం.

భగత్‌సింగ్ అతి చిన్న వయసులోనే, స్వాతంత్ర్యం రాకముందే, మనకు వచ్చే స్వాతంత్ర్యం రాజీతో కూడుకుంటుంది అని చెప్పాడు. ఈ సమాజాన్ని, ఈ దోపిడీ సమాజాన్ని అంతం చేసి, ఒక కొత్త సమాజాన్ని, మనం అనుకుంటున్న నూతన ప్రజాతంత్ర వ్యవస్థని నిర్మించుకోవాలని ఏదైతే రైతుకూలీసంఘం ఆశయం వుందో, నవయువ సమాఖ్య ఆశయం కూడా అదే. ఆ వైపుగా యువతరాన్ని కూడగడుతూ యువత ఎదుర్కొంటున్న సమస్యలకి వ్యతిరేకంగా యువజన సంఘం పని చేస్తోంది. ఈ రోజు యువతరం యొక్క సమస్యలు ఏమిటి? వాళ్ళ కష్టాలేమిటి? దేశం ఎటువైపు ప్రయాణం చేస్తుంది? రేపు భవిష్యత్తు పరిస్థితి ఏమిటి అని ఆలోచింపనీయకుండా యువత ఆలోచనల్ని వివిధ రూపాలలో–ఒక పద్ధతిలోగాదు వెయ్యిన్నొక్క పద్ధతుల్లో ప్రక్కదారి పట్టించడానికి ప్రభుత్వాలు, ప్రభుత్వాల వెనుక వున్న దోపిడీ శక్తులందరూ కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మద్యం, మత్తు పదార్థాలు ఒకవైపైతే, సినిమా సంస్కృతి ఇంకోవైపైతే, జూదసంస్కృతి మరోవైపు క్రికెట్ పేరుతోటి, కెరీర్‌వంటి రకరకాల పేర్లతోటి యువతరాన్ని పక్కదారి పట్టించడానికి, ఎందుకూ పనికి రాకుండా చేయడానికి దోపిడీవర్గం చేస్తున్న ప్రయత్నాల్లో యువతరం చిక్కుకొని వుంది. ఆ విషవలయం నుండి యువతరాన్ని బయటకు తీసుకురావడం ఈ రోజు యువజన సంఘాలకి కూడా పెద్ద సవాలుగా వుంది. అందరి ముందు కూడా పెద్ద సవాలుగా వుంది. ఈ సవాలుని అధిగమించాలి. ఈ సవాలుని అధిగమించడానికి, భవిష్యత్తులో రాబోతున్న ప్రమాదాన్ని, కష్టాల్ని మన పిల్లలకి, మన యువకులకి అర్థం చేయించడానికి మనం చాలా ప్రయత్నం చేయవలసిన అవసరం వుంది. ఆ వైపుగా యువతరాన్ని మేము సంఘటిత పరిచే కృషిలో వున్నాము. భవిష్యత్తులో మొత్తం ఈ దోపిడీ సమాజాన్ని అంతం చేయడానికి, దాని స్థానంలో ఒక నూతన సమాజాన్ని నిర్మించుకోవడానికి రైతుకూలీ సంఘం సాగిస్తున్న పోరాటాల్లో నవయువ సమాఖ్య భుజం భుజం కలిపి నడవటానికి సిద్ధంగా వుందని చెప్పి తెలియజేస్తూ, ఈ మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఈ అవకాశం ఇచ్చినటువంటి రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ముగిస్తున్నాను.

**కాII ఎస్.కె.బాజీసైదా, పిడిఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకత్వానికి, రైతు, ఆదివాసీ రైతుకూలీల నుండి విచ్చేసిన ప్రతినిధులకి, ఇతర ప్రజాసంఘాల నాయకులకి పిడిఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గం తరఫున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాం. ఈ రోజు రెండు భిన్నమైన ధోరణుల మధ్య ఈ మహాసభలు జరుపుకుంటున్నాం. మీరు కోరుకుంటున్న అన్నింటిని మేం ఇస్తున్నాం మేం చేస్తున్నాం అనేటువంటి వాదనలు ఈ రోజు పాలక వర్గాలు చేస్తున్నాయి. 'దున్నేవానికే భూమి' నినాదానికి కాలం చెల్లింది అని చెప్తున్నారు. ఒక ప్రక్క రైతులకు భూములిస్తాం, ఇళ్ళు లేనటువంటి వాళ్ళకి ఇళ్ళనిస్తాం, ఎల్‌కెజీ నుండి పిజీ దాక ఉచితంగా విద్యనందిస్తాం, ఉద్యోగాలిస్తాం, కార్మికులకి కనీస వేతనాలు కల్పిస్తాం అని చెబుతున్నారు. ఇదే నేపథ్యాన్ని గనుక మనం పరిశీలిస్తే ఇవే మా సమస్యలు, ఈ సమస్యలు పరిష్కరించండి, మా సమస్యల పరిష్కారం కోసం ఏవైనా ఆలోచనలు చేయండి అని చెప్పి రైతుకూలీ సంఘం, అనేక మిత్రసంఘాలు చేస్తున్న ఆందోళనలను ఈ రోజు ఎందుకు ఉక్కు పాదాలతో అణచివేస్తున్నారు? మీరు చెప్పున్నటువంటి నినాదాల్ని ఆచరణలో అమలు చేసే వైపుగా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదు? ఎవరి తొత్తుగా పాలకవర్గాలు వ్యవహరిస్తున్నన్నారన్న విషయాన్ని మనం ఖచ్చితంగా గమనించుకోవాల్సిన అవసరం, కర్తవ్యం వుంది. ఇవన్నీ అడుగుతున్న నాయకుల మీద, ఈ రకంగా ప్రశ్నిస్తున్న నాయకత్వం మీద, కమ్యూనిస్టు నాయకులపైన, రైతుకూలీసంఘం కార్యకర్తలపైన, దున్నే వానికే భూమి ఇవ్వండి, కనీసపాటి విద్యా హక్కును కల్పించండి, నిరుద్యోగాన్ని పరిష్కరించండి అనే నాయకుల పైన ఈ రోజు దేశద్రోహుల పేరుతో, అనేక తప్పుడు కేసుల పేరుతో నిర్బంధాన్ని విధిస్తున్నారు. వీళ్ళే దేశ ద్రోహులు అని చెబుతున్నారు. ఈ రోజు మరి మీరు (పాలకులు) చేస్తున్నదేమిటి? మేం వేస్తున్న ఒకే ఒక్క ప్రశ్న- దేశ సంపదలను, భూముల్ని, వనరుల్ని, అఖరికి చదువు చెప్పే టీచర్స్‌ని, విద్యావిధానాన్ని మొత్తం శ్రమశక్తిని తీసుకెళ్ళి విదేశాలకు పాదాక్రాంతం చేస్తున్న దేశనాయకులు, రాష్ట్ర నాయకులు –వీరందరూ దేశద్రోహులు కాదా? వీళ్లే అసలు దేశద్రోహులు.

మొత్తం ప్రజల భూముల్ని దోచుకోవటానికి అవకాశాలు కల్పిస్తున్న దుర్మార్గమైన పాలక వ్యవస్థని కూల దోసేందుకు రైతుకూలీసంఘం ఆందోళన సాగిస్తున్నది. పోరాటం చేస్తున్నది. ఆ పోరాటాలలో భాగంగానే మేం ఆందోళన చేస్తున్న పరిస్థితి కూడా వుంది. ఈ రోజు విద్య కార్పోరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకుపోయి వుంది. విశ్వవిద్యాలయాల్లో సైతం విదేశీ కంపెనీలు పెట్టుకోండి, ఇక్కడ విద్యాలయాలు పెట్టుకోండి అని చెప్పి ఆహ్వా నిస్తున్నారు. మన విద్యా విధానం మన చేతుల్లో లేదు. భూములు మన చేతుల్లో లేవు. అనేక రకాల పేర్లతో భూముల్ని గుంజు కొంటున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో వేల ఎకరాల భూములు కావాలంటున్నారు. కనీసం బస్టాండ్‌లు లేనటువంటి గ్రామాలు కొన్ని వందలు వుంటే ఎయిర్‌బస్‌ల కోసం వందల ఎకరాలు సేకరణ చేస్తున్నారు. శాస్త్రీయమైన, స్వతంత్ర విద్యా విధానం కోసం, విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సమాజ ఉత్పత్తిలో ఉపయోగపడే విద్యావిధానాన్ని అందించాలని చెప్పి పిడిఎస్‌ఓగా మేం పోరాటం సాగిస్తున్నాం. ఉత్పత్తి రంగాలు–వ్యవసాయ రంగం కావచ్చు, కార్మికరంగం కావచ్చు, మొత్తంగా దేశంలో సమాజానికి అవసరమైన ఉత్పత్తిని అందిస్తున్న అనేక రంగాల యొక్క అభివృద్ధికి ఉపయోగపడే విద్యావిధానాన్ని భారతదేశంలో కొనసాగించాలి. ఆ రకమైన విద్యావిధానాన్ని అందించాలి అని చెప్పి పిడిఎస్‌ఓ పోరాటం సాగిస్తుంది. అట్లాగే ఈ వ్యవస్థ మొత్తం మారాల్సిన అవసరం వుంది. ఒక నూతనమైనటువంటి ప్రజాతంత్ర వ్యవస్థని నిర్మించుకోవాల్సిన బాధ్యత, కర్తవ్యం విద్యార్థి యువతరంపైన కూడా వుంది. ఈ బాధ్యతని చేపట్టి విద్యార్థులలో పిడిఎస్‌ఓ కృషి సాగిస్తుంది. రైతుకూలీ సంఘం యొక్క ఆశయం కూడా ఇదే. రైతుకూలీసంఘం జరిపే అనేక కార్యక్రమాలలో పిడిఎస్‌ఓ కూడా భాగస్వామి అవుతుంది, భుజం భుజం కలుపుతుంది.

## కా॥దివికుమార్, జనసాహితి కార్యదర్శి



రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఈ మహాసభకి ప్రతినిధులుగా వచ్చిన రైతుకూలీలు, అక్కలు, అన్నలు, సభలో పాల్గొనటానికి విచ్చేసిన మేధావులు, ప్రజాతంత్రవాదులు, సభను నిర్వహిస్తున్న రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) నాయకులు, కార్యకర్తలు–అందరికీ జన సాహితి తరపున ముందుగా నా విప్లవాభి నందనలు.

మిత్రులారా, కామ్రేడ్స్! సూర్యుని చుట్టూ భూమి తిరుగు, తన చుట్టూ భూమి తిరుగు. భూమి చుట్టూ తిరిగేదే వ్యవసాయక విప్లవ పోరాటం. దున్నే వానికే భూమిని సాధించటానికి సంకల్పించి నటువంటి ఈ వ్యవసాయక విప్లవ పోరాటం, ఒక ప్రజాస్వామికమైన సామాజిక మార్పుకి దోహదపడే అత్యంత కీలకమైన పోరాటం. భారతదేశంలో ప్రజా స్వామ్య సంస్కృతి నెలకొనాలంటే ఇక్కడ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయ వంతం కావాలి. దానికి ఇరుసు వంటి వ్యవసాయక విప్లవం, దానికి కీలకమైన 'దున్నేవానికే భూమి' నినాదం ఒకదానికొకటి లంకె వేయబడి వున్నాయి. ఇటువంటి ఒక సరైన అవగాహనతో పనిచేస్తున్న ఈ రైతుకూలీసంఘం మహాసభ విజయవంతం కావాలని జనసాహితి తరపున ఆకాంక్షిస్తున్నాను.

నిజాంపట్నం నుండి వేటపాలెం దాకా సముద్ర తీరాన సుమారు 27 వేల ఎకరాలకు పైగా భూమిని వాన్‌పిక్, సెజ్‌ల పేర్లతోటి బడాపెట్టుబడిదార్లకు దఖలు పరచటానికి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న ఆనాటి ప్రభుత్వం దాదాపు 14 గ్రామాల్ని అసలు లేకుండా ఎత్తి వేయటానికి చూసింది. ఆ వూళ్ళలో వాళ్ళని పంపించివేయటానికి, అసలు వుండటానికే వీల్లేదు అని నిర్ణయం చేసింది. దానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతాల్లో వున్న కొన్ని గ్రామాలవాళ్లు చాలా గట్టిగా పోరాడారు. అందులో కాంగ్రెస్ వాళ్లున్నారు. తెలుగుదేశం వాళ్లు కూడా వున్నారు. వాళ్ళకి రైతుకూలీసంఘం కార్యకర్తలు, ఉద్యమకారులు మద్దతుగా నిలిచారు. సరిగ్గా అటువంటి ఒక ఉద్యమం నడుస్తూ వుండగా తెలంగాణా నుండి కూడా రచయితలను సమీకరించి రచయితలుగా మేం సుమారు 7 జిల్లాల్లోని, 2008 నవంబరులో ఈ నిజాంపట్నం నుండి వేటపాలెం దాకా ఆ గ్రామాలన్నీ పర్యటించాం. అక్కడ వాస్తవంగా వున్న సమస్యలు ఏమిటి? వాళ్లు ఎలాంటి ఒత్తిళ్ళు ఎదుర్కొంటున్నారు. వాళ్లు ఏం కోరుకుంటున్నారు? అని మొత్తం ఒక పరిశీలన జరిపి దాని మీద 'ప్రజాసాహితి' 2009 ఫిబ్రవరి సంచికను వాన్‌పిక్ వ్యతిరేక ప్రత్యేక సంచికగా వెలువరించాము. ఆ సందర్భంగా మా ఆ పరిశీలన యొక్క సారాంశాన్ని రాష్ట్ర గవర్నరుకి ఒక మెమొరాండంగా పంపించాము. ఇక్కడ ఇది ఈ రకంగా జరుగుతున్నది. ఇక్కడ ఈ రకంగా ప్రజానీకాన్ని ఇబ్బందులు పెడుతున్నారు, ఈ సెజ్, ఈ పద్ధతి వీటన్నింటిని ఉపసంహరించుకోవాలి, ఇక్కడ గూండాలను పెట్టి బెదిరించి గ్రామాలకు గ్రామాలను తరలించాలని చూస్తున్నారు. ప్రజల భూముల్ని బల వంతంగా అమ్ముకోవాలని చూస్తున్నారు. ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఇవన్నీ కూడా మా రచయితల కళ్ళముందే జరుగు తున్నాయి అని మేము ఒక మెమోరాండం ఇచ్చాం. ఆ రకంగా ప్రజానీకం సాగిస్తున్నటు వంటి ఉద్యమాలకి 'ప్రజాసాహితి'లాంటి పత్రిక, జనసాహితి లాంటి సంస్థ మద్దతుగా నిలిచి కృషి చేస్తూ వచ్చాయి.

అంతేకాకుండా ఈ రోజు కరువు సమస్య మనల్ని వెంటాడుతూ వుంది. మరి రచయితలుగా మేమేం చేయాలి? జన సాహితీ తరపున మొన్న నెల 29వ తేదీ హైద్రాబాదులో కరువు, వలసలు, రచయితల

కర్తవ్యం అని ఒక సభను నిర్వహించాం. ఈ కరువు ఎందుకు వస్తుంది? ఏ రకంగా వస్తుంది? ప్రజల యొక్క ఈతి బాధలకి, వలసలు పోయేటటువంటి దుస్థితికి, ఒక సాంస్కృతికమైనటువంటి విచ్ఛిన్నానికి, జీవిత విచ్ఛిన్నానికి, విధ్వంసానికి రచయితలు ఏ విధంగా స్పందించాలి? ఈ పాలకులకు వ్యతిరేకంగా ఎట్లా రచనలు చేయాలి? అనే చర్చలన్నీ అక్కడ చేశాం. అట్లాంటి ఆ కరువుకి వ్యతిరేకంగా మేం ప్రత్యేక సంచికను తీసుకువచ్చాం. 1993లో కరువు మీద సంచిక తీసుకువచ్చి, కరువు ఎట్లా వుంది? సాహిత్యంలో కరువు ఎట్లా వుంది? ఎప్పుడో శ్రీకాళహస్తీశ్వర మహత్యంలో ఆనాటి కరువుని ఆయన ఎట్లా వివరించారు? మానవీయ సంస్కృతిని ఎంతగా విధ్వంసం చేస్తుందో, మనుషుల్ని మనుషులు గాకుండా ఎట్లా మారుస్తుందో ఆ కాళహస్తీశ్వర మహత్యంలో వుంటుంది. అవన్నీ గూడా ఆ సంచికలో మేం తీసుకువచ్చాం. ఇవ్వాళ మనకు రాష్ట్రంలో వున్న కరువు పరిస్థితులు ఏమిటి? కారణాలు ఏంటి? రచయితలుగా కథల రూపంలో, కవిత్వాల రూపంలో, వ్యాసాల రూపంలో ప్రజల యొక్క జీవన వాస్తవికతను సాహిత్య రూపంలో ప్రతిబింబించటం, ప్రజల యొక్క పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, పోరాట స్ఫూర్తిగా స్వీకరించి వాళ్ళకు బాసటగా నిలవటం మా కర్తవ్యాలుగా స్వీకరించాం. ఈ రకమైన కర్తవ్యాన్ని నిర్వహించే క్రమంలో మీరు, అంటే ప్రజల యొక్క జీవితం మాకు ప్రేరణ, ప్రజల యొక్క పోరాటం మాకు స్ఫూర్తి. ఆ రకమైన స్ఫూర్తిదాయకమైన రైతుకూలీసంఘం, రైతుకూలీ ప్రజానీకం స్ఫూర్తితోటి నడుస్తున్న జన సాహితి ఈ మహాసభ విజయవంతం కావాలని, ఉద్యమాలను ఉధృతం చేయాలని కోరు కుంటోంది.

ఇవాళ పాలకులు ఎంత దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారో చెప్పటానికి వీల్లేదు. ఒకప్పుడు దున్నేవానికే భూమి అంటే ఎక్క దుందిరా భూమి, మాట్లాడితే దున్నేవానికే భూమి దున్నేవానికే భూమి అని గొడవ పడతారు అనేవారు. ఎక్కడా భూమి లేదంటూనే జిల్లాకి లక్ష ఎకరాలు..... ల్యాండ్ బ్యాంకులు అంటున్నారు. ప్రజలకి పంచటానికి ఒక ఎకరా భూమి లేదు, జిల్లాకి లక్ష ఎకరాల చొప్పున విదేశీ కంపెనీలకి, కార్పొరేట్ శక్తులకి, ధనస్వామ్య శక్తులకి కట్టబెట్టడానికి లక్షల ఎకరాలు వాళ్ళ దగ్గరున్నాయి. కనుక ఇక్కడ ఈ దేశంలో వాళ్ళు అమలు పరుస్తున్న ఈ మొత్తం విధానాలకి వ్యతిరేకంగా ఒక ఆందోళన, ఒక పెద్ద పోరాటం సాగించాల్సిన అవసరం వుంది.

ఈ మధ్య సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా విడిపోయి నపుడు మేం విడిపోలేదు. మేం జనసాహితి జనసాహితే. రెండు రాష్ట్ర ప్రభుత్వాలకి ఒక విజ్ఞప్తి చేశాం. అయ్యా! మీరు గడిచిన 25 సంవత్సరాలుగా ఇంగ్లీషు మాధ్యమంలో చదువులు చెబుతున్నారు. పిల్లలకి ఇంగ్లీషు కాన్వెంటులు, ఒక్కొక్క కుటుంబం ప్రతీ సంవత్సరం 7000, 10,000, 15,000, 20,000 ఇద్దరు ముగ్గురు వుంటే ఇంకా ఎక్కువగా కేవలం చదువుల కోసం ఖర్చు పెడుతున్నారు. కుటుంబాలు ఈ చదువుల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నాయి. అప్పుల పాలౌతున్నాయి. అందుకోసం ఎన్నో సమస్యలు ఈ కుటుంబాల్లో వస్తున్నాయి. అట్లాంటి దానిని కనీసం మీరు పరిశీలించండి. మీరు ఏ విధంగా ఇంగ్లీషు మాధ్యమంలో చదువులు చెబుతున్నారో, అది ఎంత మేలుచేసింది, ఎంత కీడు చేస్తోంది అన్న దానిని పరిశీలించడానికి, అధ్యయనం చేయడానికి, నిర్ధారించడానికి ఒక కమీషన్ వేయండి అని మేము రెండు సంవత్సరాల క్రితం ఒక విజ్ఞప్తి చేశాం. రెండు ప్రభుత్వాలకీ గుర్తుచేశాం. వాళ్ళు పట్టించుకోలేదు. అయితే ఇవ్వాళ ఈ రకమైన ఉద్యమాలు, మన ప్రజాఉద్యమాలు పాలకుల్ని ఇవ్వాళ ప్రశ్నించాల్సిన అవసరం వుంది. ఇంగ్లీషు మాధ్యమం చదువులు చిన్న అంశం కాదు. మీ అందరికీ సంబంధించిన అంశం మాత్రమే కాదు మీ జీవితాలకి సంబంధించిన అంశం కూడా.

గడిచిన 25 ఏళ్ళుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ఈ గ్లోబలైజేషన్ అనే పేరుతోటి వివిధ రంగాల్లో గ్రామీణ పేదల్ని, పట్టణ కార్మికుల్ని, నిరుద్యోగుల్ని, విద్యార్థుల్ని, మహిళల్ని, సంస్కృతిని, నాటకాల్ని, కళల్ని-ఇట్లా జీవితంలో సమస్తమైన రంగాలన్నింటిని ప్రపంచీకరణ ప్రభావితం చేసింది. ఒక సాంస్కృతిక విధ్వంసాన్ని సృష్టించింది. 25 ఏళ్ళ ఈ ప్రపంచీకరణ యొక్క అనుభవాలు ఏమిటి? ప్రపంచీకరణ ఆర్థిక వ్యత్యాసాలను పెంచిందా? కలిగిన వాళ్ళను ఇంకా సంపన్నులుగా మార్చింది. పేదవాళ్ళను ఇంకా నిరుపేదలుగా మార్చింది. ఇది వాస్తవమా కాదా అని, ఈ 25 ఏళ్ళ ప్రపంచీకరణ వివిధ రంగాల్లో ఏ రకంగా పనిచేస్తుందో పాలకులని, ఈ రోజు మీడియాని మనం ఉద్యమ స్థాయిలో ఛాలెంజ్ చేయవలసినటువంటి అవసరం వుంది. ఈ సందర్భంలో ప్రపంచీకరణ మీద ఆ రకమైనటువంటి నిర్ణయాలు కూడా మీరు తీసుకుంటారని ఆశిస్తున్నాను.

**కా॥పి. హనుమంతరావు ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు**



రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలో ప్రస్తుత సెషన్‌కి అధ్యక్షత వహించిన కోటయ్యగారు, వేదికమీద వున్న ఝాన్సీ గారు, ఇతర ప్రజాసంఘాల నాయకులు, రైతుకూలీసంఘం మహాసభకి హాజరైన ప్రతినిధులు, ప్రజాతంత్రవాదులు, మిత్రులు, కామ్రేడ్స్! రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభ విజయవంతం కావాలనీ, ఇది మంచి సందేశాన్ని రాష్ట్రవ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అందించాలనీ ఓపిడిఆర్ రాష్ట్ర కమిటీ పక్షాన కోరుకుంటూ-మిత్రులారా! నేడు రైతులు కానివ్వండి, రైతుకూలీలు కానివ్వండి, ఆదివాసులు కానివ్వండి లేక సమాజంలోని అన్నివర్గాలకు కూడా వారి

వారి హక్కులు నిరాకరింపబడుతూ వున్నాయి. రైతులు భూముల నుండి పరాయీకరింపబడుతున్నారు. ఆదివాసీలు వాళ్ళ యొక్క అటవీ సంపదల నుండి దూరం చేయబడు తున్నారు. మహిళలు హక్కులకు దూరం కాబడుతున్నారు. దళితులపై దాడులు జరుగుతున్నాయి. విద్యార్థులకు విద్య పరాయీకరింపబడు తోంది. తమది కానటు వంటి విద్యని వాళ్ళకు అందిస్తున్నారు. వైద్యం దూరం చేయబడింది. వైద్యం మొత్తంగా వ్యాపార మయింది. భారతదేశంలో కానివ్వండి, ఆంధ్రప్రదేశ్‌లో కానివ్వండి ప్రజల హక్కులు నిరాకరింపబడుతున్నటువంటి ఈ రకమైన పరిస్థితుల్లో ఈ రోజున ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో రైతు కూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభ జరుగుతూ వున్న పరిస్థితి. ఏ విధంగా భూములు పరాయీకరింపబడు తున్నాయి. రైతులు, రైతుకూలీలు తమ హక్కులకు ఏ విధంగా దూరం చేయబడుతున్నారు, వాళ్ళకున్న భూమి హక్కు ఏ రకంగా నిరాకరింపబడు తున్నది అన్న విషయాలన్నీ కూడా ఈ మహాసభలో చర్చించారు. అదే విధంగా ఆదివాసులు వాళ్ళకున్నటువంటి ఆటవిక సంపద, భూగర్భ సంపద నుండి దూరం చేయబడుతున్నారు. వారి జీవన హక్కులు హరింపబడుతున్న పరిస్థితిలో ఈ రోజు భారతదేశ సమాజం వున్నది. దీని వెనుక పెద్ద ఆర్థికపరమైన కుట్ర జరుగుతూ వున్నది. మొత్తం సంపదని విదేశీ, స్వదేశీ పెట్టుబడి దారులకు, సంపన్నవర్గాలకు కట్టబెట్టే ఒక కుట్ర జరుగుతున్న ఇటువంటి పరిస్థితిలో ప్రజలందరూ కూడా వాళ్ళ హక్కులకి దూరం చేయబడుతూ వున్నారు. ఈ రకమైన పరిస్థితుల్లో రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) వంటి సంస్థలు ఆ హక్కుల్ని కాపాడు కోవటానికి ఉద్యమాలు నిర్మిస్తున్నాయి. నిర్మించవలసిన అవసరం వున్నది. ఆ రకమైన విప్లవ ఉద్యమాలను నిర్మించాల్సిన బాధ్యత వున్నది. ఉద్యమాల్ని నిర్మిస్తున్న రైతుకూలీసంఘం, రైతుకూలీసంఘం కార్యకర్తలు, ప్రజలు– వాళ్ళకి ఆ రకమైన ఉద్యమాలను నిర్మించుకునే హక్కు, ఆ ఉద్యమాల ద్వారా జీవనాన్ని మెరుగు పరచుకునే హక్కు వాళ్ళకు వున్నది అని ఎలుగెత్తి చాటటంలో ఓపిడిఆర్ ఎల్లప్పుడూ ముందు వుంటుందని చెప్పి, ఆ రకంగా ఓపిడిఆర్ రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) వంటి సంస్థలతో వాళ్ళకున్నటు వంటి హక్కుల్ని అవి కాపాడుకోవాలని, వాటిని ముందుకు తీసుకుపోవాలని చెప్పడంలో ముందు వుంటుంది, వారితో కలిసి పనిచేస్తుంది.

మిత్రులారా! హక్కుల్ని కాపాడు కోవటంలో మనం అందరం కూడా పని చేయాలి. వర్గ విప్లవ ఉద్యమాలను నిర్మించు కోవటం అనే బాధ్యత రైతుకూలీ సంఘం లాంటి సంఘాలకు వుంటుంది. ఆ పనిని, ఆ కర్తవ్యాన్ని మరింత చాక చక్యంగా, మరింత చక్కగా నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నాను. అలాంటి ఉద్యమాలు నిర్మించుకునే సమయంలో అనేక రకాలైన సమస్యలు ముందుకు వస్తుంటాయి. ఆ సమస్యలను ఎదుర్కోవలసి వుంటుంది. మొత్తం సమస్యలన్నింటినీ ఎట్లా అధిగ మించాలి, వర్గ ఉద్యమాలను, ప్రజా ఉద్యమాలను, రైతుకూలీ ఉద్యమాలను, ఆదివాసీ ఉద్యమాలను ఎలా నిర్మించు కోవాలి, మరింత పటిష్టంగా ముందుకు ఎట్లా తీసుకుపోవాలి అన్న విషయాలను ఈ మహాసభలో చర్చించుకోవాలి. ఇక్కడ ఒక సందేశాన్ని, ఒక నిర్ణయాన్ని తీసుకుని ప్రజలందరూ కూడా మరలా తిరిగి వాళ్ళ ఉద్యమ నిర్మాణ కృషిలో నిమగ్నమై పని చేయాలని, మహాసభ ఇచ్చిన సందేశాన్ని దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తి చేయాలని ఆ రకంగా చేస్తారని ఆశిస్తూ ఈ మహాసభ విజయవంతం కావాలని కోరు కొంటున్నాను.

**కా॥పాండురంగవరప్రసాద్,** ఏపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి

దేశవ్యాప్తంగా భూమిపై పాలకులకు కన్నుపడింది. పాఠశాలలు, సెజ్‌ల పేరుతో, అభివృద్ధి పేరుతో– భూసేకరణ, సమీకరణల పేరుతో ప్రజలను భూముల నుండి వేరుచేస్తున్నారు. ప్రగతిశీలురను కూడా మభ్యపెట్టేవిగా చట్టాలు తెస్తూ వున్నారు. కానీ



ప్రజలు దీనిని సహించరు. ఖచ్చితంగా త్రిప్పికొడతారు. ఉద్యమిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజల, రైతాంగ జీవితాలలో సంక్షోభం విద్యార్థులపై, వారి చదువులపై ఉపాధి లభించటమే కష్టతరమైన పొట్ట చేతబట్టుకొని అసంఖ్యాకంగా వలసలు వెళ్తున్న స్థితిలో వారి బిడ్డలు కనీసపాటి చదువుకు దూరమవుతున్నారు. మరోవైపున కాన్వెంటు స్కూళ్ళ వ్యామోహాన్ని ప్రభుత్వం పనిగట్టుకొని పెంచుతూ, ప్రభుత్వ స్కూళ్ళలో విద్యార్థుల సంఖ్య పడిపోతుందనే సాకుతో, ప్రభుత్వ పాఠశాలలను మూసివేయటం, క్రమబద్ధీ కరిచటం చేస్తోంది. కనుక గ్రామీణ పేదల, రైతాంగ, ఆదివాసీ ప్రజానీకపు జీవితాలు మెరుగుపడే ప్రజాతంత్ర విప్లవ కార్యాచరణే నేడు అత్యావశ్యకంగా వుంది. ఇలాంటి పోరాటాలకు ఏపిటిఎఫ్ క్రియా శీలకమైన మద్దతునిస్తామని తెలియచేస్తూ, రైతుకూలీసంఘం మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ముగిస్తున్నాను.

## మెట్ట వేదాంతం

పాలికాపు నుదుటి చెమట,
కూలివాని గుండె చెరువు,
బిచ్చగాని కడుపు కరువు
మాయంటావూ?

తుపానులూ, భూకంపం
తిరుగుబాట్లు, సంగ్రామం,
సంగ్రామం, సంగ్రామం,
మాయంటావూ? ఏయ్
ఏమంటావు?
నా ముద్దుల వేదాంతి ఏమంటావు?

మహాకవి శ్రీశ్రీ

ప్రారంభోపన్యాసం

# వ్యవసాయరంగం మీద సామ్రాజ్యవాదుల పట్టు ఎలా పెరుగుతున్నది

ఎస్.ఝాన్సీ



అధ్యక్షా,

మహాసభ రెండవ రోజు జరుగుతున్న సదస్సుకు హాజరైన ప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, ప్రజాతంత్రవాదులకు అందరికీ మొట్టమొదట నా అభినందనలు తెలియజేస్తున్నాను. మహాసభలో భాగంగా గుంటూరు పట్టణంలో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన రైతుకూలీలు, ఆదివాసులు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు అందరం కలిసి-ఈ మహాసభ ఎందుకు జరుపు కుంటున్నాం? ఈ మహాసభలో రైతుకూలీ సంఘంగా మన డిమాండ్స్ ఏమిటి? మనం దేని కోసం పోరాడుతున్నాం? అనే విషయాల్ని గుంటూరు పట్టణ ప్రజలకు తెలియజేసే విధంగా నిన్న మనం ఊరేగింపు జరుపుకున్నాం. ఊరేగింపుకి ముందు మనకు ఒక చిన్న అంతరాయం కలిగింది. ఊరేగింపుకి అనుమతి ఇవ్వం అని పోలీసులు వచ్చి హాలు వరకే పరిమితమై మీటింగు పెట్టుకోవాలి అని చెప్పారు. దానికి పట్టణంలో వుండే శాంతి భద్రతల సమస్య, చట్టాలకి సంబంధించిన సమస్యను వాళ్ళు కారణంగా చెప్పారు. మనం మన సమస్యని చెప్పాం. రాష్ట్రంలో నలుమూలల నుండి వచ్చి మేం ఐదు సంవత్సరాల తర్వాత జరుపు కుంటున్న మా రాష్ట్ర మహాసభకి మీరు మాకు సహకరించాల్సిందే, మీరు మాకు అనుమతి ఇవ్వాలి అని పట్టుదలగా అడిగి మనం మన ఊరేగింపుని సాగించాం. ఈ విధంగా మనం మన ఊరేగింపుని ఇక్కడ నిర్వహించు కోవటం మంచి ప్రభావాన్ని కలిగించింది. గుంటూరులో మన రైతుకూలీసంఘం ఏం చెప్తుంది? ఈ మహాసభ రైతులకు, రైతు కూలీలకు, ఆదివాసీలకు ఏం చెప్తుంది? మన డిమాండ్స్ ఇవి అని ఆలోచించటానికి కావాల్సిన విధంగానే నిన్న మనం ఊరేగింపుని నిర్వహించుకున్నాం.

మన మిత్రులు కె.ఆర్.చౌదరిగారు ఈ రోజు ప్రారంభోపన్యాసం చేయవలసి వుంది. గత మూడు, నాలుగు మహాసభల నుండి అంటే 2001, 2005, 2010సం॥రాల్లో జరిగిన మూడు రాష్ట్ర మహాసభల్లోనూ అమరులు డా॥బి.డి.శర్మగారు లేకుండా మనం ఏనాడూ సభ జరుపుకోలేదు. అదే విధంగా ప్రొ॥కె.ఆర్.చౌదరిగారు కూడా మన ఉద్యమాలకు, మన సంఘానికి ఎంతో అండదండలనిస్తూ వచ్చారు. ప్రతీ బహిరంగ సభకి ఆ మిత్రులు వచ్చి మనకి ఉపన్యాసా లివ్వటం, సందేశాలనివ్వటం జరుగుతూ వచ్చింది. కానీ చౌదరిగారు వ్యక్తిగత కారణాల వలన ఈ రోజు రాలేకపోయారు. కావున ఆ కామ్రేడ్ రాలేనటువంటి పరిస్థితిలో నేను ఈ సదస్సులో కొన్ని అంశాలు ప్రస్తావిస్తాను.

మహాసభకి ఆహ్వాన సంఘం అధ్యక్షులైన కా॥కొల్లా రాజమోహన్‌గారు నిన్న బహిరంగ సభలో మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో రైతాంగం ఏ విధమైనటువంటి పోరాటాలు చేసిందీ, ఆనాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి మిలిటెంట్ పోరాటాలు చేసిందీ, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా ఎలాంటి పోరాటాలు చేసిందీ, 1954-56 కాలంలో ఈ జిల్లాలో వున్న బంజరు భూమి సమస్యని తీసుకొని, బంజరు భూములన్నీ పేదలకు దక్కాలని చేసిన పోరాటాలు, పొగాకు రైతాంగ పోరాటం, ఇంకా అనేక సమస్యలపై ఇక్కడ రైతాంగం ఏమేమి పోరాటాలు చేసిందీ చెబుతూ పోరాటాల పురిటిగడ్డ అయిన గుంటూరుజిల్లా చరిత్ర గురించి చెప్పారు. ఇక్కడ వారు చెప్పిన వాటితో రెండు అంశాలను కలిపి ఈ జిల్లాకి, ఈ ప్రాంతానికి, రైతాంగ ఉద్యమానికి సంబంధించిన విషయాల్ని ఒక దృష్టితోటి మనం గుర్తుపెట్టుకోవలసి, పేర్కొనవలసి వున్నది. 1943 నాటికి బెంగాల్ అంతా కలిసే వుంది. బెంగాల్‌లో తీవ్రమైన కరువు వచ్చి 43 లక్షల మంది ప్రజలు ఆ కరువులో చనిపోయారు. కరువు బాధిత ప్రజలకు సహాయ సహకారాలు అందించాలి, అక్కడికి వెళ్ళాలి అని ఆ రోజు రైతుసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ ప్రాంతంలో వందలాదిమంది, వేలాదిమంది దగ్గరికి వెళ్ళి బట్టలు, ఆహారధాన్యాలు, మందులు, డబ్బులు-ఎన్నో సమీకరించి అక్కడ బెంగాల్లో క్షామానికి గురైన ఆ ప్రజలను ఆదుకున్న చరిత్ర ఇక్కడ రైతుకూలీ సంఘాలకు వుంది అనే విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. అదే విధంగా 1929లో అమెరికాలో పెద్ద ఆర్థిక మాంద్యం వచ్చింది. సామ్రాజ్యవాద దేశాలకు వలస దేశంగా వున్న మన దేశంపై కూడా ఆ ఆర్థిక మాంద్యం తీవ్రమైన ప్రభావాన్ని కలిగించింది. మన గ్రామీణ ప్రాంతాల్లో మన వ్యవసాయరంగం మీద ఆ ప్రభావం ఏ విధంగా చూపిందంటే భూమి రేట్లు తగ్గిపోయాయి, ప్రజలకు అప్పులు ఎక్కువైనాయి. రైతులు అమ్ముకోవాల్సి వచ్చే సరికి ధాన్యం, ఆహార పంటల రేట్లన్నీ తగ్గిపోయాయి. మరొక ప్రక్కన శిస్తులు పెరిగి పోయాయి. అప్పుల బాధ ఎక్కువైపోయింది. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. ఆ తీవ్రమైన ఆర్థిక మాంద్యం ఇక్కడ ఈ రాష్ట్రంలో ప్రత్యేకించి ఈ జిల్లాలో రైతాంగం యొక్క జీవితాల్ని అతలాకుతలం చేసిన

ఫలితంగా ఎంతోమంది వూళ్ళను వదిలి, గ్రామాలను వదిలి, సాగు చేసుకుంటున్న భూమిని వదిలి అప్పులు కట్టలేక పారిపోయి, ఎక్కడెక్కడికో వెళ్ళిపోయి, ఎక్కడెక్కడో జీవితాల్ని సాగించారు. అది ప్రపంచ ఆర్థిక మాంద్యంలో భాగంగా ఈ జిల్లా రైతాంగం యొక్క జీవితాల్ని ఎలా అతలాకుతలం చేసిందీ అనే విషయాన్ని కూడా మనం అర్థం చేసుకోవాల్సి వుంటుంది. ఇది గుంటూరు జిల్లాకి సంబంధించింది మాత్రమే కాదు, మొత్తం ఆంధ్రప్రదేశ్ రైతాంగ చరిత్రకు సంబంధించిన విషయం.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి ముందు నుంచీ, ఆ తరువాత జాతీయోద్యమంలోనూ ఆదివాసులు, రైతులు, రైతుకూలీలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఈ దళారీ పాలకులకు వ్యతిరేకంగా, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా అనన్య త్యాగాలు చేశారు. ఆనాటి దుస్థితి ఊహించలేనటువంటిది. ఇప్పుడు తలుచుకుంటే ఇక్కడ నిజంగా ఆ విధమైనటువంటి దోపిడీ వుందా అని మనకి ఒక్కసారి అనిపిస్తుంది. కానీ ఆ మొత్తం దోపిడీ నుండి నేటి పరిస్థితికి జరిగిన ఈ మార్పు ఏదో చట్టాల ద్వారానో, లేకపోతే అధికారంలోకి వచ్చినటువంటి పాలకులు మారిపోతేనో వచ్చినది కాదు. రైతుకూలీలు, ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకులు ఎంతోమంది ఎన్నెన్నో త్యాగాలు చేసిన ఫలితంగానే ఈ కనీసపాటి హక్కుల్ని మనం సాధించుకొన్నాం. ఇవి మా రైతాంగ సమస్యలు, మా రైతాంగ సమస్యలు మీరు పరిష్కరిస్తారా లేదా, ఈ జమీందారీ విధానం రద్దు కావాలి, దున్నేవానికే భూమి కావాలి, రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు రేటు కావాలి అని చెప్పి అడగటం, ప్రశ్నించటం, వీధుల్లోకి రావటం, సాధించుకోవటం అని చెప్పే హక్కులన్నీ కూడా మనకు ఎవరో, ఎక్కడో, ఏదో ఒక చట్టం ద్వారానో వచ్చినవి కాదు. మన రైతాంగం, రైతుకూలీ ఉద్యమాలు, రైతుకూలీసంఘం నాయకులు మొత్తం ఎన్నో త్యాగాలు చేసిన ఫలితంగా మనం సాధించుకున్న విజయాలు ఇవి అనే విషయాన్ని ఒక్కసారి మనం గుర్తుచేసుకోవాలి.

అయితే మరి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశాం. జాతీయోద్యమ కాలంలో పోరాటం చేశాం. ఆ తరువాత బంజరు భూమి కోసం పోరాటం చేశాం. మరి ఇన్ని పోరాటాలతో రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యాయా అంటే పరిష్కారం కాలేదు. ఎందుకు కాలేదు? పరిష్కారం కాకపోవటానికి పాలకులు ఏం చేస్తున్నారు? ఈ పాలకుల విధానాలకు రైతాంగ సమస్యలకి వున్న సంబంధం ఏమిటి అనే విషయాన్ని ఇక్కడ మనం ఒక్కసారి ప్రస్తావించుకోవాల్సిన అవసరం వుంది. ఒక్కసారి అధికార మార్పిడి జరిగిన తరువాత, బ్రిటీష్‌వాడు ఈ దేశాన్ని వదిలి వెళ్ళిపోయిన తరువాత మన దేశంలో వ్యవసాయరంగానికి సంబంధించి మన పాలకులు చేసినదేమిటి? ఒకటి-1973లో ఈ దేశంలో ఈ రాష్ట్రంలో భూసంస్కరణలు అవసరం ప్రతి ఒక్కరికీ వుండింది. జమీందారుల, భూస్వాముల మిగులు భూములను, బంజరు భూముల్ని, పంచుతామని చెప్పి, ఒక భూసంస్కరణల చట్టాన్ని చేశారు. అదే విధంగా మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తరువాత ఏజెన్సీ ప్రాంతాల్లో వుండే భూములన్నీ కూడా గిరిజనులకే దక్కాలని, గిరిజనేతరులకు కానీ, పెత్తందారులకు కానీ భూమి చెందటానికి వీల్లేదు అని 1/70 చట్టాన్ని చేశారు. పీసా చట్టాన్ని తెచ్చారు. కానీ ఆ చట్టాలన్నీ ఏమైనాయి? ఆ భూసంస్కరణలన్నీ ఏమైనాయి? అడవులను కాపాడుకునే చట్టాలు ఏమైనాయి అంటే పాలకులు ఈ చట్టాలన్నింటిని ప్రక్కకు పెట్టేశారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నపుడు రాజశేఖర్‌రెడ్డిగారు చెప్పిన విషయం ఏమిటి? నేను ఇక్కడ వున్న వాళ్ళందరికీ కూడా సంవత్సరానికి లక్ష ఎకరాల భూమిని పంచుతాను; ప్రతీ సంవత్సరం లక్ష ఎకరాల భూమిని పంచి నా జీవితాన్ని ధన్యం చేసుకోదలిచాను అని చెప్పారు. అప్పుడు శ్రీకాకుళానికి చెందిన మంత్రి ధర్మాన ప్రసాదరావుగారు వ్యవసాయ శాఖా మంత్రిగా వుండి 'మేము లక్ష ఎకరాలు పంచాము, మా జీవితాలు ధన్యమయ్యాయి' అని మాట్లాడారు. కానీ మేం ఆ రోజే చెప్పాం -మీరెక్కడ పంచారు? ఎక్కడో గెడ్డలో, బండలో -వ్యవసాయానికి ఏమాత్రం పనికి రానటువంటిది ఎక్కడన్నా పంచారేమో కానీ రైతుకూలీ ఉద్యమాలు ఎన్నో సంవత్సరాల నుంచి ఈ భూమి మా భూమి, మాది గిరిజనులు సాగు చేసుకునేటటువంటి భూమి ఈ భూమిని మాకివ్వాలి, మాది మాకు పంచాలి. వేం సాగు చేసుకుంటున్నాం అని చెప్పిన భూమిని ఎక్కడా ఒక్క ఎకరా కూడా ప్రభుత్వం వచ్చి ఒక పట్టా ఇవ్వలేదు అనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు ఈ రోజు గోదావరి ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురవుతున్న ప్రాంతంలో నాలుగు వేల ఎకరాల భూముల్ని మన గిరిజనులు అక్కడ సాగు చేసుకుంటున్నారు. పట్టాలకి సంబంధించిన దాంట్లో అవన్నీ కూడా భూస్వాముల పేర్ల మీదే వున్నాయి. అక్కడ గిరిజనేతరులైన పెత్తందార్ల చేతుల్లో వున్నాయి. మరి 1988, 1989 ప్రాంతాల వరకు హైకోర్టు, సుప్రీంకోర్టు, జిల్లా కోర్టు-అన్ని కోర్టులు కూడా ఆ భూములు గిరిజనులవే అని ఇచ్చిన తీర్పులు వున్నాయి. రెవెన్యూ రికార్డులో భూమి మాత్రం ఆ భూస్వాముల, పెత్తందార్ల చేతుల్లోనే వుంది అని అంటే ఏ చట్టమూ కూడా, ఏ తీర్పూ కూడా ఆచరణలో పేదప్రజల వైపు సాగటం లేదు, పేద ప్రజలకు అనుకూలంగా లేవు అని అర్థం. పేద ప్రజలకు ఏదైతే ఇవ్వాలో అది ఇవ్వకుండా మసిపూసి మాయజేసి ఏవేవో కథలు చెప్తున్నారు అనే విషయం మనకి అర్థమౌతుంది.

ఇప్పుడు చంద్రబాబునాయుడుగారు అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ భూసంస్కరణల చట్టం లేదు. 1/70 చట్టం లేదు, విశాఖ ఏజన్సీలో వుండే ప్రజలు కానీ, గోదావరి జిల్లాలో వుండే ఏజన్సీ ప్రజలు కానీ మొత్తం మీరంతా ఇక్కడ నుండి వదిలి వెళ్ళిపోండి, ఇక్కడ అనేక సంపదలున్నాయి, ఈ సంపదలన్నీ కూడా దేశానికి మన రాష్ట్రానికి పెద్ద ఎత్తున సంపద్వంతం చేసుకోవటానికి మేము ఉపయోగించుకోవాలి,

మాకు టూరిస్ట్ సెంటర్లు కావాలి, మానవ రహితమైనటు వంటి అడవుల్ని మేము తయారు చేయాలనుకుంటున్నాం, మేం పోలవరం కట్టినా, కట్టకపోయినా మొత్తం ఈ అడవి నుండి, గోదావరి నుండి, విశాఖ ఏజెన్సీ నుండి అంత ఎత్తైన పర్వతాల నుండి గిరిజనులందరూ వెళ్ళిపోవాల్సి వుంటుంది–లేకపోతే కుదరదు, అనే పరిస్థితుల్లో ఈ రోజు పాలకులు వ్యవహరిస్తున్నారు. అంటే భూసంస్కరణల చట్టం ఎగిరి పోయింది. 1/70 చట్టం ఎగిరిపోయింది.

రైతాంగ రుణాలకు సంబంధించిన దాంట్లో మనం వాస్తవంగా చూస్తున్నాం. రెండు సంవత్సరాల క్రితమే ఈ గుంటూరులోనే రైతాంగం యొక్క రుణాల విషయంలో ప్రభుత్వ వైఖరి గురించి మనం ఆ రోజు రైతుకూలీసంఘంగా ఒక అంచనా చెప్పాం. ఈ రోజు రైతాంగం ఎదుర్కొంటున్నది ప్రధానంగా ప్రైవేటు రుణాల సమస్య. ప్రభుత్వం ఇచ్చే బ్యాంకు రుణాలు తక్కువగా వున్నాయి. కాబట్టి ఈ ప్రైవేటు రుణాలను రద్దు చేయాలని, లేక ప్రత్యామ్నాయంగా రైతాంగానికి ఇవ్వవలసిన రుణాల గురించి మనం ఆనాడే చర్చించాం. చెప్పాం. కాబట్టి రైతులను ఆదుకోవడం కోసం మీరు ఇస్తున్నామని చెప్పే రుణాలు వాస్తవంగా కూడా అమలు కావు అనే విషయాన్ని కూడా మనం స్పష్టం చేశాం. అంతవరకే కాకుండా మన రైతుకూలీ సంఘం ఎన్ని జిల్లాల్లో పనిచేస్తుందో అన్ని జిల్లాల్లో కూడా, పంచాయితీల్లో కూడా మనం సర్వే చేశాం. ప్రైవేటు రుణాలు ఎంత? బ్యాంకు రుణాలు ఎంత? ఒక రైతు, చిన్న రైతు వ్యవసాయం చేసుకోవటం కోసం బ్యాంకు రుణాల మీద ఆధారపడుతున్నాడా? ప్రైవేటు రుణాల మీద ఆధారపడుతున్నాడా? అని పరిశీలిస్తే ఎక్కువ శాతం ప్రైవేటు రుణాల పైనే ఆధారపడుతున్నాడు అనేది పత్రికల సర్వేల్లో వలెనే మన సర్వేలో కూడా మనకు అర్థమైనటువంటి విషయం. మరి ఇదంతా ఎందుకు చేస్తున్నారు? అధికారంలోకి వచ్చిన పార్టీలు వ్యవసాయం, రైతాంగం, ఆత్మహత్యలు, వలసకూలీలు అని మాట్లాడుతూనే వుంటారు. ప్రతిపక్షంలో వుండే పార్టీలు కూడా రైతుకి సంబంధించిన సమస్యల్ని పదే పదే మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు రేటు కావాలి, రైతుకు రుణాలు ఇవ్వాలి, రైతులకు భూములు పంచాలి అని చెబుతూనే వుంటారు. ఇద్దరూ ఒకే రకంగా రైతు, రైతు అంటున్నారు. కానీ వాస్తవంగా ఏం జరుగుతోంది?

రాజశేఖర్‌రెడ్డి గారు అధికారంలో వున్నపుడు ప్రకాశంజిల్లాలో వాన్‌పిక్ ఉద్యమం సాగింది. వేల ఎకరాలు వాన్‌పిక్ కోసం తీసుకున్న విషయాన్ని ఎండగట్టి, రైతాంగం ఎదుర్కొన్న ఒత్తిడిని గమనించి వాన్‌పిక్ పేరిట పేద రైతుల వేల ఎకరాలను తీసుకోవటం అన్యాయం అని మనం రైతుకూలీసంఘంగా నాయకత్వం వహించి పోరాడాము. అయితే మనం కేసులు ఎదుర్కొన్నాం. ఆ రోజు ప్రతిపక్ష పార్టీగా వున్న తెలుగుదేశం వాన్‌పిక్ కోసం వేలాది ఎకరాలు తీసుకోవటం అన్యాయం అన్న చంద్రబాబు ఈనాడు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా వాన్‌పిక్ పేరుతో సమీకరించిన భూములన్నింటినీ పేద రైతులకు ఎందుకు పంపకం చేయటం లేదని మేం ప్రశ్నిస్తున్నాం. ఆ భూములను పంచినపుడే, నిజంగా ఇక్కడ ఒక ఫ్యాక్టరీనో, ప్రాజెక్టునో పెట్టినపుడే రైతాంగానికి మీరు రక్షణ కల్పిస్తున్నారు అని మేము భావిస్తాం. ఈ రోజు వాన్‌పిక్‌కు సంబంధించిన భూములు ఏ పార్టీ నాయకులకి చెందాలి అనే దాని దగ్గర సతమతమవుతున్నారే తప్ప వాస్తవంగా ప్రజలకి ఒక్క ఎకరా భూమి కూడా పంచటానికి వాళ్లు అక్కడ సిద్ధంగా లేరు. అది వాన్‌పిక్కే కాదు సోంపేటలో గానీ, కాకరాపల్లిలోగానీ ఇంకా అనేక చోట్ల సెజ్‌ల పేరుతో వేల ఎకరాలు సేకరించిన పాలకులు ఒకళ్ళ నొకళ్లు విమర్శించుకుంటున్నారే తప్ప ఈ భూములు ప్రజలకు పంచటానికి ఎక్కడా ఏ మాత్రం కూడా సిద్ధం కావటం లేదు. ఈ భూమిపై ఎవరికి పెత్తనం కావాలి అనే దగ్గరే పాలకవర్గ పార్టీలు రాజకీయం చేస్తున్నారు తప్ప, పేద రైతాంగం గురించి గానీ, ఆదివాసీల గురించి గానీ పట్టించుకోవటం లేదు. పేద ప్రజల్ని దగా చేయటంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇద్దరూ ఒకే వైఖరిని కలిగి వున్నాయి. వ్యవసాయ రంగంలో పాలకులు అనుసరిస్తున్న విధానాలు ఏంటి? ఏం చేయాలి? ఎక్కడ నుండి తీసుకోవాలి? వీళ్ళ విధానాలను మనం అర్థం చేసుకుంటే ఏ పాలకులైనా ఏం చేయబోతున్నారు, వ్యవసాయరంగాన్ని ఎక్కడ తాకట్టు పెట్ట బోతున్నారు అనే విషయం మనకు అర్థ మౌతుంది.

బ్రిటీష్‌వాడు మన భారతదేశంలో మొత్తం వ్యవసాయాన్ని తన యొక్క అభివృద్ధికి, మొత్తం తను దోచుకోవటానికి ఏ రకంగా అమరికలు చేశాడో, ఏ రకమైనటువంటి మార్పులు చేశాడో ఆ మార్పులనే అధికార మార్పిడి జరిగిన తర్వాత కూడా పాలకులు వాటినే కొనసాగిస్తూ వచ్చారు తప్ప మరొకటి కాదు. ఆనాడు బ్రిటీష్‌వాడు ఒక్కడే వ్యవసాయ రంగాన్ని దోచుకోవడానికి చూస్తే ఈ రోజు అమెరికా, అమెరికాతోపాటు మరి కొన్ని సామ్రాజ్యవాద దేశాలు వ్యవసాయం చేసే విధానాన్ని, విత్తనాలను, ఎరువులను, పురుగు మందులను, మొత్తం మన ఆహారానికి, వ్యవసాయానికి సంబంధించిన మార్కెట్‌నంతటిని కూడా దోచుకుంటున్న పరిస్థితి వుంది. కనుక ఇక్కడ రైతాంగం ఎదుర్కొంటున్న ఏ సమస్యనీ కూడా మనం విడివిడిగా చూడలేం. ఆత్మహత్యలను విడిగా చూడలేం. వలస కూలీలను విడిగా చూడలేం. ఈ గుంటూరు జిల్లాలోనే పల్నాడు ఏరియాలో సుమారు ఇరవై శాతం మంది రైతులు అప్పులు తీర్చలేక వాళ్ళ కిడ్నీలు కూడా అమ్ముకున్న పరిస్థితి వుంది. మరి వాళ్ళ పరిస్థితి కానీ, ఆత్మహత్యలు చేసు కుంటున్న లక్షలమంది రైతాంగం పరిస్థితి కానీ ఎందుకు ఇలా వుంది? మొత్తం ఇక్కడ వున్న వ్యవసాయ రంగం అంతటినీ, రైతులను సంక్షోభాలలోకి పడేసి, వ్యవసాయ రంగం ద్వారా వచ్చే లాభాలన్నింటినీ కూడా బహుళజాతి సంస్థలకు అప్పజేప్పే ఒక వైఖరిని, ఒక విధానాన్ని 1950ల నుండే ఈ పాలకులు తీసుకున్నారు. అప్పుడు 1964లో వచ్చిన పిఎల్ 480 పథకం కానీ, ఆ తర్వాత సస్యవిప్లవం కానీ, ఆ తరువాత 1991–1992లో డంకెల్ ప్రతిపాదనల

మీద మన కాంగ్రెస్ పాలకులు పెట్టిన సంతకాలు, వాణిజ్య సంస్థలకు వ్యవసాయ రంగాన్ని లోబర్చిన విధానాలు - ఇవన్నీ ఒక విధానంగా సాగుతున్నాయి. దేనినీ కూడా ఒక విడివిడి అంశంగా చూడ కూడదు. ఈ రోజు రైతు సంక్షోభంలో వున్నాడు. వ్యవసాయం అనేది రైతుకి అప్పుగా మారింది, కానీ బహుళజాతి సంస్థలకి, లాభాలను ఇచ్చేటటువంటి ఒక పెద్ద వనరుగా మాత్రం మారింది. ఇక్కడ విత్తన కంపెనీలు సంవత్సరానికి ఎన్ని వేల కోట్ల రూపాయల లాభాలను పెంచు కుంటున్నారో, ఎరువుల, పురుగు మందుల కంపెనీలు ఎన్ని వేల కోట్ల రూపాయల లాభాలను సంవత్సరానికి పెంచు కుంటున్నారో చూస్తే ఇది స్పష్టపడుతుంది. రైతాంగం పంట పండించే దానికి అత్యంత హీనమైన గిట్టుబాటు రేటు వుంటోంది.

మనం చాలామందిమి అనుకుంటాం ఉల్లిపాయల రేట్లు పెరిగాయి అంటే రైతులు పెంచారేమోనని, ధాన్యం రేటు పెరిగిందంటే రైతులు పెంచారేమోనని లేకపోతే కూర గాయల రేట్లు పెరిగాయి అని అంటే పంటలు పండటం లేదు కాబట్టి రైతులు పెంచారేమోనని! కానీ రైతులు పండించే దానికి మార్కెట్లో వచ్చే ధరలకి ఏ మాత్రం సంబంధం లేకుండా మధ్యలో మార్కెట్ శక్తులే అంతా తమ అదుపులో పెట్టు కొంటున్న పరిస్థితి వుంది. మూడు నెలల క్రితం ఉల్లిపాయల రేట్లు విపరీతంగా పెరిగాయి. 40రూ॥, 50 రూ॥ కేజీ వున్నటు వంటి ఉల్లిధర ఆ తరువాత రెండు నెలలకి కేజీ 4రూ॥, 5రూ॥లకి వచ్చింది. ఉల్లి పండించే రైతు ఆ కనీసమైన కూలీరేట్లు కూడా ఇవ్వలేక పంటనంతటినీ ఏమీ చేయలేక చేలోనే వదిలేసిన పరిస్థితిని కూడా మనం పేపర్లలో వచ్చిన వార్తల్లో చూస్తున్నాం. మన రాష్ట్రంలో వాస్తవ పరిస్థితి కూడా ఇది. ఏ రేటు ఎందుకు పెరిగిపోతుందో అనే విషయంతో రైతుకు సంబంధం లేదు. సామాన్యమైన ప్రజానీకానికి సంబంధం లేదు. మొత్తం మార్కెట్ శక్తులు తమకిష్ట మొచ్చిన పద్ధతుల్లోనే చేస్తూ వ్యవసాయం చేసే రైతును సంక్షోభంలో పడవేస్తున్నాయి. భూమి రేటును విపరీతంగా పెంచుతున్నారు. భూములన్నీ కూడా వేల ఎకరాలు, లక్షల ఎకరాలు సేకరించి ఒక్కొక్క జిల్లాకి లక్ష ఎకరాల చొప్పున మొత్తం భూబ్యాంకులు పెట్టి, బహుళజాతి సంస్థలకి మొట్టమొదట భూమి వసతిని కల్పించటం కోసం ఈ భూములన్నీ అమ్మివేస్తున్నారు. భూములతో పాటు నదిలో వున్న నీటిపై కూడా వారు హక్కు సంపాదించుకుంటున్నారు. అడవులపై కూడా వాళ్ళే హక్కులు లాగి వేసుకుని ఆదివాసులను గెంటివేస్తున్నారు. భూమిలో వుండే ఖనిజ సంపదలను కూడా వాళ్ళే చేజిక్కించుకుంటున్నారు. మరి వీటన్నింటికి కారణాలు ఏమిటి? ఎందుకు జరుగుతున్నాయి అంటే ఒక్క రాజశేఖరరెడ్డో, చంద్రబాబునాయుడో లేక మోదీనో, మన్మోహన్‌సింగో ఎవరో వ్యక్తుల వల్ల వస్తున్న సమస్య కాదు ఇది. ఇక్కడున్న అర్ధవలస, అర్ధభ్యూడల్ వ్యవస్థలో ఈ దళారీ వర్గమంతా కూడా వ్యవసాయ రంగాన్ని ఆ విధంగా బహుళజాతి సంస్థలకి, సామ్రాజ్యవాదులకి కట్టిపడవేయటానికి అమలు చేస్తున్న విధానాల ఫలితమే ఇది.

ఈ రోజు వ్యవసాయరంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. చాలామంది వలసలు వెళ్ళిపోతున్నారు. గ్రామాల్లో పనిచేసే వారు లేరు, కూలీల వల్లే మా వ్యవసాయాలు దెబ్బతినిపోతున్నాయి అని కొంతమంది రైతులు మాట్లాడుతున్నారు. కానీ అది ఏ మాత్రం వాస్తవమైనది కాదు. ఒక కూలి తనకు కావాల్సిన పని లేకపోతే, తాను బ్రతకటానికి ఒక ఆధారం లేకపోతే ఎక్కడికి వెళ్ళాలి? తన పొట్ట నింపుకోవటానికి ఎక్కడైతే నాలుగు రూపాయలు ఎక్కువ ఇస్తారో అక్కడికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందే తప్ప మరొకటి కాదు. కానీ రైతును పీడించేది కూలీ కాదు. రైతును పీడించేది విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు. ఇవి తమ ఎదుట కనపడవు. తమ ఎదుట కనిపించేది కూలీలే కనుక ఈ కూలీల వల్లే జరుగుతుందని చెప్పి కొంత మంది అమాయకంగానూ, కొంతమంది తప్పుడు ప్రచారాలలో పడీ అర్ధం చేసుకోలేని పరిస్థితి వుంది. కానీ ఒక మధ్యతరగతి రైతుని, ఒక ధనిక రైతుని, ఒక వ్యవసాయ కూలీనీ, ఒక నిరుపేదనీ, ఒక ఆదివాసీని, వ్యవసాయం మీద ఆధారపడే ఒక దళితుణ్ణి -వీళ్ళందర్నీ దోపిడీ చేసే సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాదాన్ని పెంచి పోషించే బహుళ జాతి సంస్థలు, దళారీ పాలకులు అనే విషయాన్ని మనం అర్ధం చేసుకోవాల్సిన అవసరం వుంది.

ఈ రోజు గ్రామాలలో వ్యవసాయం మీద ఆధారపడి బ్రతకటానికి కూలీలు లేరు, భూమి అవసరం లేదు, దున్నేవానికే భూమి అనే నినాదం అనవసరం అని కొంతమంది మాట్లాడుతున్నారు. మీరు అనవసరంగా ఆ నినాదం ఇస్తున్నారు, ఆ నినాదంతో మీరు పని చేయాల్సిన అవసరం లేదు, మీది తప్పుడు నినాదం అని మనల్ని అంటున్నారు. మనం వాళ్ళని ఒక్కటే ప్రశ్నిస్తున్నాం? భూమి అవసరం లేకపోతే, ఈ సామ్రాజ్యవాదులు వేల ఎకరాలు ఎందుకు తీసుకుంటున్నారు? ఈ పాలకులు లక్షల ఎకరాలు తీసుకొని ఎందుకు సెజ్‌లకు ముట్టజెప్తున్నారు? మరి భూమి ప్రజలకు అవసరం లేకపోతే వాళ్ళకెందుకు? దున్నేవానికే భూమి అని చెప్తున్నాం. ఎందుకు చెప్తున్నాం? అందరికీ నువ్వు భూమి పంచగలిగితే ఆ భూమిలో వ్యవసాయం చేసుకొని ప్రతీ రైతు జీవించ టానికి గానీ ఒక అవకాశం ఇవ్వగలిగితే మార్కెట్ సంబంధాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. ప్రజలలో కొనుగోలు శక్తి వస్తుంది. దాని మీద ఆధారపడి తనకున్న ఆదాయంలో మొత్తం తన జీవితాన్ని మార్చు చేసుకోగలిగే అవకాశం అలాంటి సమాజంలో వుంటుంది. దున్నేవానికే భూమి అని మనం చెప్తున్నాం అంటే, విప్లవ భూసంస్కరణల గురించి చెప్తున్నాం అంటే సమాజానికి, కొనుగోలు శక్తికి ఇంకా అనేక రకాలుగా సంబంధం వున్నదే తప్ప ఈ పాలకులు పంచుతామనే మిగులు భూమో లేకపోతే ఇంకోటో ఇంకోటో చేస్తే 'దున్నేవానికే భూమి' లభిస్తుందని మేము చెప్పటం లేదు. కానీ దున్నేవానికే భూమి అని చెప్తున్న వాళ్ళందరూ ఆ నినాదం కాకుండా ఏ నినాదం ఇవ్వాలి? ఎందుకు ఇంతమంది రైతుకూలీలు వున్నారు? మరి

రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? అనే ప్రశ్నలకు మాత్రం వారి దగ్గర సమాధానం లేదు. సమాధానం వాళ్ళు చెప్పలేరు. వాళ్ళ ఉద్దేశ్యం ఏమిటంటే మీరు ఈ చిన్న చిన్న వ్యవసాయాలు చేయ వద్దు. ఈ రోజు వేల ఎకరాల్లో కార్పోరేట్ వ్యవసాయం వచ్చింది. కంపెనీ వ్యవసాయాలు వచ్చినయి. కార్పోరేట్ వ్యవసాయాల్లోనూ, కంపెనీ వ్యవసాయాల్లోనూ కూడా మీరందరూ కూలీలుగా చేరండి. వాళ్ళకు కావాల్సిన కూలీలు దొరకాలంటే మీ స్వంత వ్యవసాయాలను మానివేయాలి. మొత్తం ఈ రోజు పట్టణాలలో జరుగుతున్న కట్టడాలకు వలసకూలీలుగా మీరు వెళ్ళిపోవల్సిన అవసరం వుంటుందని చెప్పి, పరోక్షంగా ఆ విషయాన్ని చెప్పకుండానే ప్రచారం చేసేటటువంటి వాళ్ళే ఈ రోజు 'దున్నేవానికే భూమి' నినాదం అవసరం లేదని చెబుతూ వున్నారు.

ఇక్కడ ఒక విషయాన్ని చెప్పి నేను ముగిస్తాను కామ్రేడ్స్. ఈ రోజు గ్రామాల్లో భూమి మీద ఈ పెత్తందారులందరికీ హక్కు కావాలి. గ్రామ మునసుబు లేక గ్రామ సర్పంచ్‌కి గ్రామాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా పరిస్థితి అంత తేలికగా లేదు. ప్రక్కనున్న పెట్టుబడిదారులు వాళ్ళందరూ ఒక సర్పంచ్‌ని గెలిపించాలి అని అంటే ఆ చుట్టుప్రక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులందరూ వచ్చి వేల, లక్షల, కోట్ల రూపాయలు ఇచ్చి అనేక రూపాల్లో తమ ప్రాబల్యం పెంచుకోవటం కోసం ఆ పంచాయితీ ఎన్నికల్లో డబ్బుల సంచులతోటి పట్టణాల నుండి దిగుతున్నటువంటి పరిస్థితిని ఈ రోజు మనం చూస్తున్నాం. అందుకనే ఎక్కువ గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ప్రజలు ఖర్చు పెడుతున్నారు. అది ప్రజలకు ఇచ్చేటటువంటి డబ్బు కాదు. అది పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు ఆ గ్రామాల మీద, ఆ గ్రామంలో వుండే సహజ వనరుల మీద పట్టు కోసమే వాళ్ళు పంచాయితీలను, అధికారాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకొంటున్నారు. సస్య విప్లవంతోటి రైతాంగానికి పెద్ద మార్పు వస్తుందన్నారు. అదేమీ లేదు. సస్యవిప్లవం అమలు జరిగిన పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ఈ రోజు గ్రామాలకు గ్రామాలే అమ్మకానికి వున్నాయని బోర్డులు పెట్టారు. రైతాంగ ఆత్మహత్యలున్నాయి. సామ్రాజ్యవాదులకు మన దేశం ఒక ప్రయోగశాలగా వుంది. ఆంధ్రదేశంలో రైతాంగాన్ని మన పాలకులు బహుళజాతి సంస్థలకు కట్టేవేయటం ఫలితంగా ఆంధ్రదేశంలో రైతాంగం పరిస్థితి కూడా రోజురోజుకీ దిగజారిపోతూ వున్నది.

పాలకులు ఇక్కడ వ్యవసాయ అభివృద్ధి కోసం కానీ, లేకపోతే రైతాంగాన్ని రుణ విముక్తి చేయటం కోసం కానీ ఏ మాత్రం ఆలోచించటం లేదు. రైతు స్వతంత్రంగా రెండెకరాల, మూడెకరాల భూమిని సాగు చేసుకుంటూ ఒక ఆత్మ గౌరవంతో జీవించే విధానాన్ని ఈ రోజు పాలకులు సహించటం లేదు. 'అది మీకు వద్దు, మీరు కూలీలుగా మారండి, పెద్ద పెద్ద కంపెనీలు ఏమి చెప్తే అది చేయండి, మన కంటే వాళ్ళు ఎంతో తెలివైనవాళ్ళు, తెలిసిన వాళ్ళు, చాలా టెక్నాలజీ వాళ్ళ దగ్గర వుంది' అని చెప్పి మనల్ని మాయ చేస్తున్నారు. ఈ రోజు ప్రత్యేక రాష్ట్రంగా, కొత్త రాష్ట్రంగా ఏర్పాటు చేసిన వెంటనే చంద్రబాబు నాయుడుగారికి రైతాంగం గురించి పట్టలేదు, మూసివేసిన ఫ్యాక్టరీల గురించి పట్టలేదు, కార్మికుల గురించి పట్టలేదు, మహిళల గురించి పట్టలేదు, మొత్తం కొత్త రాజధాని చుట్టూనే చర్చలన్నీ, కార్యక్రమాలన్నీ! రాజధాని ఎక్కడ కట్టాలి? ఏం చేయాలి? ఎవరికి ఇవ్వాలి? సింగపూర్ వాళ్ళకి ఇవ్వాలా? జపాన్‌వాళ్ళకి ఇవ్వాలా? ఇంకా ఎవరికి ఇవ్వాలి? ఇందులో ఎనిమిది పంటలు, పదిపంటలు పండే భూమి నంతటినీ కూడా, గుంటూరుజిల్లాలో, కృష్ణా నది ఒడ్డున వుండే భూమినంతటినీ కూడా, అక్కడ వ్యవసాయానికి అనుకూలంగా వుండే భూమినంతటినీ కూడా నాశనం చేసి మొత్తం లక్షల ఎకరాల్లో అక్కడ రాజధాని కడతారంట! మొత్తం భారతదేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో మూడో రాష్ట్రంగా ఇది వుండాలంట. ప్రపంచంలోనే గొప్ప రాజధానిగా ఇది వుండాలంట. ఇంకా ఏవేవో చెప్తూ మొత్తం బహుళజాతి సంస్థలు మన సమాధులపై మన శవాల మీద చేసే ఆలోచనలన్నింటికీ కూడా ఈ రోజు ఇక్కడ వున్న పాలకులు వత్తాసు పలుకుతూ, వాటిని ఎంత వేగంగా అమలు చేయాలన్న దానికోసం పరుగులు పెడుతున్నారు. దానికి ఎక్కడా వాళ్ళకు ప్రజలు ఎదురు రాకూడదు. ఎదురులేని విధంగా వీళ్ళందరూ కలిసి-దొంగలు దొంగలు కలిసి వూళ్లు పంచుకున్నట్లే ఈ దొంగలందరూ కలిసి మన దేశాన్ని, మన వ్యవసాయాన్ని, మన రైతుల రక్తమాంసాలను పంచుకుని తినటానికి సిగ్గు లేకుండా ఆత్రుతపడుతున్నారు.

సామ్రాజ్యవాదంతోటి ముడివేసుకున్న వ్యవసాయరంగం, దానితోపాటుగా వ్యవసాయానికి అనుబంధంగా వున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు కూడా ఈ రోజు రాష్ట్రంలో సంక్షోభంలో వున్నాయి. చిన్న పరిశ్రమల్ని లెక్కలేకుండా మూసివేసి పెద్ద పెద్ద కార్ల పరిశ్రమ వంటి ఏవేవో పరిశ్రమలు పెడతారంట తప్ప ఒక రెండు కోట్లు, మూడు కోట్లు ఇస్తే నిలబడే జూట్‌గానీ, పంచదారగానీ, పత్తిగానీ-ఈ మిల్లులను నడపాలని గానీ, ఆ కార్మికులకు సరైన భృతి కల్పించాలనిగానీ ఈ పాలకులకు లేదు. మనం ఏమి అడిగినా సమాధానం ఒక్కటే. మీకు మేము అప్పులిస్తాం, పెన్షన్‌లిస్తాం అని చెబుతూ ప్రజలను ఒక బిచ్చగాళ్ళగా వాళ్ళకోసం ఎదురుచూస్తూ, వనిపాటా చేసుకోవాలంటే ఏ వని చేసుకోవాలో కూడా తెలియకుండా మార్చి వేస్తున్న ఈ పాలకుల యొక్క దుర్మార్గమైన విధానాలను మనం ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమాలు నిర్మించకపోతే ప్రజలకి విముక్తి లేదు. ప్రజల సమస్యలకి పరిష్కారం లేదు. ప్రజల యొక్క జీవితం మరింత దుర్భరంగా మారే పరిస్థితి వుంది. ఒక్కొక్క గ్రామం చూస్తుంటే కామ్రేడ్స్ మనకు చాలా బాధగా వుంది. అక్కడ దోపిడీ ఎవరు చేస్తున్నారో కనపడటం లేదు. ఈ వ్యాపారస్థులందరూ ఒక్కటయ్యారు. దూరంగా వుంటున్నారు. గ్రామాల్లో పూజ కానీ, ఒక ఫంక్షన్‌గానీ, ఒక పండుగ కానీ ఏది చేసినా ప్రతీ దగ్గర కూడా ప్రతీ అంశంలోనూ ఈ పెత్తందారీ వర్గాల అదుపు, వీళ్ళ పట్టు, వీళ్ళ ఆర్థిక లావాదేవీలన్నీ కూడా సాగుతున్నాయి.

ఇదంతా యాదృచ్ఛికంగా, ఏదో పొర పాటునో లేక అనుకోకుండా జరుగుతున్న విషయాలు కాదు.

మొత్తం మన వ్యవసాయరంగాన్ని ఈ సామ్రాజ్యవాదుల రథచక్రాలకు కట్టి వేయడానికి ఈ పాలకులు పూను కుంటున్నారు. దీనికి వ్యతిరేకంగా రైతాంగం పెద్ద ఎత్తున కదలాలి. ఈ సామ్రాజ్య వాదానికి, ఈ బహుళజాతి సంస్థలకి, ఆ బడా బూర్జువా వర్గానికి, ఇక్కడున్నటువంటి భూస్వామ్య శక్తులకు, వాళ్ళ ఆధిపత్యానికి, దౌర్జన్యాలకి వ్యతిరేకంగా మనం గొంతువిప్పి ప్రజలను చైతన్యవంతం చేసి, ముందు వుండి ప్రజలను నడిపించి ఆ సామ్రాజ్యవాదుల శృంఖలాలను మనం విరగ్గొట్టకపోతే, పగుల గొట్టకపోతే, తిరగబడకపోతే మనది మనం సాధించుకోలేము. అప్పటివరకు కూడా ఈ రైతు ప్రశాంతంగా నిద్రపోలేనటువంటి పరిస్థితి వుంటుంది. కనుక ప్రజల్లోకి వెళదాం. ప్రజలకు వివరిద్దాం. ఎందుకు ఈ రంగం ఇంత సంక్షోభంలో వుంది? సామ్రాజ్యవాదులు ఏం చేస్తున్నారు? ఆ సామ్రాజ్యవాదులు మన పల్లెల్లో వుండే ప్రజల జీవితాల్లో, గుడిసెల్లో, వాళ్ళ జీవితాల్లో దాక్కుని వున్నారు. పీఠం వేసుకొని వున్నారు. వాళ్ళను బయటకు లాగాలి. తరమాలి. తరిమి తరిమికొట్టాలి. తరిమి కొట్టేంత వరకు, ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఈ రోజు ప్రజలు ఐక్యం కాకుండా, కులాల పేరు మీద, ఉపకులాల పేరుమీద, ప్రాంతాల పేరు మీద, రక రకాలుగా ప్రజలను విడివిడిగా వుంచుతున్న ఈ పాలకుల విధానాలను మనం ఎండ గట్టాలి. ప్రజలను ఐక్యం చేసి, ఈ శక్తులకు వ్యతిరేకంగా మనం పోరాటం చేసినపుడే, ఈ సామ్రాజ్యవాద దోపిడీ శక్తులను వ్యతిరేకించినపుడే దున్నేవానికే భూమి అనే విప్లవ భూసంస్కరణల్ని మనం సాధించు కోగలం. అటువంటి ఒక సమాజాన్ని సృష్టించటం కోసం మనం ముమ్ముందుకు వెళ్ళాల్సి వుంటుంది. అదే మన కర్తవ్యం. ఆ కర్తవ్యంలో నిమగ్నం కావటం కోసం ప్రజలందర్నీ ఐక్యం చేయాల్సిన అవసరం వుంది. కనుక ఈ రోజు కనబడని శత్రువులను బయటకు తీసుకురావాలి. ఆ శత్రువులకి వ్యతిరేకంగా మనం పోరాటం చేయాలి. ఆ శత్రువులను తరిమి తరిమి కొట్టే విధంగా మనం ప్రజలందర్నీ కూడా ఒకే మార్గంలో నడిపించాల్సిన ఒక బృహత్తరమైన కర్తవ్యం మన అందరి మీద వుంది.


కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు

**కామ్రేడ్ వనచర్ల సుబ్బారావు చిన్నతనంలోనే జాతీయోద్యమంలో ప్రవేశించి, కమ్యూనిస్టుగా అభివృద్ధి చెంది, అమలాపురం, ముమ్మిడివరం తాలూకాలలో రైతు కూలీ, పీడిత వర్గ ఉద్యమాల కోసం జీవితాంతం తపిస్తూ కృషి చేస్తూ సుమారు 100 సంవత్సరాల వయస్సులో 7-12-2014న మరణించారు. సామాజికంగా బలహీన వర్గ కుటుంబంలో పుట్టినా సుమారు 100 ఎకరాల ఆస్తిలో తన వాటాగా వచ్చిన దాన్నంతటిని స్థానిక భూస్వాముల, పెత్తందారి వ్యతిరేక కార్యక్రమాల కోసం ఖర్చు చేశారు. రైతు-కూలీల సమస్యలపైనా, గీత కార్మికుల, మత్స్యకారుల సమస్యలపైన పార్టీ నాయకుడుగా, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా, తూర్పుగోదావరిజిల్లా నాయకుడుగా చివరి వరకూ ఉత్సాహంగా అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. తన 98వ ఏట శ్రీకాకుళం లక్ష్మింపేట దళితులపై జరిగిన దాడికి నిరసనగా జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. రైతుకూలీ ఉద్యమం కోసం, సంస్థ కోసం చివరి వరకూ కృషి చేసిన మరణించిన కామ్రేడ్ వనచర్ల సుబ్బారావుకి విప్లవ జోహార్లు.**


కామ్రేడ్ కుండ్ల గంగరాజు

**కొండమొదలు గిరిజనోద్యమంలో మొగ్గ తొడిగీ ఉభయగోదావరి, ఖమ్మం జిల్లాల గిరిజనోద్యమ నాయకుడుగా నిలిచిన కామ్రేడ్ కుండ్ల గంగరాజు సుమారు 70 సంవత్సరాలు పైబడిన వయస్సులో 8-7-2016న అంతిమశ్వాస విడిచారు. భూమి కోసం, భుక్తి కోసం సాగిన శ్రీకాకుళ వీరోచిత గిరిజన పోరాటాలు కొనసాగాలనే లక్ష్యంతో తూర్పుగోదావరి ఏజెన్సీలో 1969లో గిరిజనోద్యమ కృషి ఊపందుకుంది. దీనిలో భాగంగా కొండమొదలులో కామ్రేడ్ సింహాద్రి సుబ్బారెడ్డి (విశ్వం) నాయకత్వాన ప్రారంభమైన ఉద్యమంలో నాడు, 1969లో అడుగుపెట్టినది మొదలు చనిపోయేంతవరకూ మడమతిప్పని పోరాట యోధుడు కామ్రేడ్ కుండ్ల గంగరాజు. ఈ క్రమంలో ఎంతో నిర్బంధాలను, చిత్రహింసలను అనుభవించారు. కొండమొదలు గిరిజన ప్రజల ప్రతి సమరశీల ప్రతిఘటనలలో కామ్రేడ్ గంగరాజు ముందు నిలిచారు. ప్రజల ఆపుడుగా, కష్టసుఖాలలో స్పందించే నాయకుడుగా నిలిచారు. కొండమొదలు గిరిజనోద్యమాన్ని అనేక గ్రామాలకు విస్తరింపచేయడంలో తన వంతు పాత్ర నిర్వహించారు. సామాన్యులను అసామాన్యులుగా మార్చే శక్తి ప్రజాపోరాట విధానాలకి, సంఘానికి వుందని నిరూపించిన పోరాటశీలి, ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి, కామ్రేడ్‌గంగరాజుకు విప్లవజోహార్లు.**

# అభివృద్ధి పేరుతో భూమి నుండి, అడవి నుండి గెంటివేయబడుతున్న రైతుకూలీలు, ఆదివాసులు–పెరిగిపోతున్న వలసలు

జె.కిశోర్‌బాబు



అభివృద్ధి సాధించటం పేరిట పాలకులు గత 70 ఏళ్ళుగా చేపడుతున్న పథకాల గురించి చర్చించాల్సి వచ్చినపుడు ఎవర్ని బలిచేసి ఎవరి అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నది పరిశీలించాల్సి వుంది. పాలకులు ఏ ప్రాజెక్టు (రోడ్డు, రైల్వే, నీటిపారుదల, మైనింగ్ వగైరా) చేపట్టాలన్నా భూసేకరణ తప్పదు. బ్రిటీష్ వలస పాలన కాలంలో ఇందుకోసం భూసేకరణ చట్టం (1894)ను రూపొందించారు. ఇందులో ప్రజావసరాల కోసం అని జనరల్‌గా చెప్పింది. 1984లో భారత దోపిడి పాలకులు ఫ్యాక్టరీల నిర్మాణాన్ని కూడా దీనిలో జోడించింది. 2007లో దీనికి చేసిన సవరణలో ప్రైవేటు కంపెనీలను కూడా 'ప్రజావసరాల' నిర్వచనం పరిధిలోకి తెచ్చింది. ప్రైవేటు కంపెనీ తన అవసరం కోసం 70% భూమి స్వంతంగా కొనుక్కొంటే 30% భూమిని ప్రభుత్వం సేకరించి అప్పగించవచ్చునని చేర్చింది.

పాతచట్టం విద్య, ఆరోగ్యం, అవాసం, మురికివాడల పునరావాసం, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి ప్రభుత్వరంగ సంస్థల అవసరాలను ప్రజావసరాలుగా చెప్పగా– 2007లో చేసిన సవరణ "విద్యుత్ ఉత్పత్తి–సరఫరా రహదార్లు, వంతెనలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేలు, గనులు, నీటి సరఫరా ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశుధ్య ప్రాజెక్టులు, మొదలైన మౌలిక సదుపాయాలను, సైనిక అవసరాలను కూడా కలిపి ప్రజావసరాలుగా చెప్పింది.

పాలకులు చేసిన బలవంతపు భూసేకరణలకు భూములు కోల్పోతున్న రైతులనుండి, ఆదివాసులనుండి తీవ్ర ప్రతిఘటన వచ్చింది. భూములను ముందు గుంజుకొని ఎప్పటికో సంవత్సరాల పాటు ఆలస్యం చేసి అది కూడా అతితక్కువ నష్టపరిహారం మాత్రమే చెల్లిస్తూ వచ్చారు. పునరావాసం గురించి పాలకులు బాధ్యత వహించలేదు. ఈ నేపథ్యంలోనే 1984లో ఆంధ్రరాష్ట్రంలో తెలుగుగంగ ప్రాజెక్టు కోసం కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో రిజర్వాయరు నిర్మాణానికి పూనుకోగా ముందు నష్టపరిహారం చెల్లించాకే మా భూములు ఇస్తామని, అప్పటివరకు భూములు వదిలేది లేదని రైతాంగం ప్రతిఘటించారు. అమరులు, మన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥మండ్ల సుబ్బారెడ్డి ఈ ఆందోళనకు నాయకత్వం వహించి సాగించిన పోరాట ఫలితంగా ఆంధ్రరాష్ట్ర చరిత్రలో తొలిసారిగా నష్టపరిహారం చెల్లించి ఆ తర్వాత భూములు సేకరించిన సంగతి మనకందరకూ తెలిసిందే. నష్టపరిహారం పెంపు కోసం కోర్టులను ఆశ్రయించడం, ఈ కేసుల్లో అనేకచోట్ల లాయర్లు రైతులకు వచ్చిన మొత్తాలను దిగమింగిన విషయాలు కూడా మన ఎరుకలోనివే.

ప్రైవేటీకరణ, సరళీకరణ, గ్లోబలీకరణ వంటి పాలకుల సంస్కరణలు రంగంలోకి వచ్చాక ఈ భూసేకరణల క్రమం విచ్చలవిడిగా పెరిగింది. వందలు, వేలు, పదుల వేల ఎకరాల భూసేకరణకు కూడా పాలకులు తలపడ్డారు. టాటావాడి కార్ల పరిశ్రమ కోసమూ, ఇండోనేషియా కంపెనీ కోసమూ బెంగాల్‌లో నందిగ్రాం, సింగూరులలో తలపెట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటు ఎంత తీవ్రపరిణామాలకు దారితీసిందో మనందరికీ తెలుసు.

ఆంధ్రరాష్ట్రంలో ఎగుమతి ప్రోత్సాహక జోన్ల పేరిట, తర్వాత వచ్చిన సెజ్‌ల పేరిట వేలాది ఎకరాల భూసేకరణలకు పాలకులు పూనుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు థర్మల్ ప్లాంట్ల కోసం విశాఖజిల్లా పరవాడలోను, శ్రీకాకుళంజిల్లా సోంపేట, కాకరాపల్లిలోను, విజయనగరంజిల్లా కొమరాడలో భూసేకరణలు చేయడం సోంపేటలో ప్రజల ప్రతిఘటనను అణచడానికి కాల్పులకు కూడా పాలకులు పూనుకొని రైతాంగాన్ని బలిగొనడం నిన్నమొన్నటి ఘటనలే. విశాఖ నుండి కాకినాడ వరకు 603 చ.కి.మీ విస్తీర్ణంలో (1.5 లక్షల ఎకరాలు) పెట్రో కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తుల ప్రాంతం (పిసిపిఐఆర్)గా ప్రకటించి దశల వారీగా భూసేకరణకు పాలకులు పూనుకొన్నారు. విశాఖజిల్లాలో రాంకీ కంపెనీకి అప్పజెప్పిన ఫార్మాసిటీ భూములు, దాని దగ్గరలోనే ప్రస్తుతం మహిళలు పోరాడుతున్న బ్రాండిక్స్ కంపెనీకి కేటాయించిన భూములు ఇందులోవే. కాకినాడ సమీపతీర గ్రామాల్లోని (యు.కొత్తపల్లి, తొండంగి మండలాలు)3 సార్లు పంటలు పండే భూముల సేకరణకు వ్యతిరేకంగా రైతాంగం ఇప్పటికీ పోరాడుతూనే వున్నారు.

గుంటూరు, ప్రకాశంజిల్లాల్లో వాన్‌పిక్ పేర (వాడరేవు, నిజాంపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్) 28 వేల ఎకరాల భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో మనం ప్రముఖ పాత్ర నిర్వహించి వున్నాం. నెల్లూరుజిల్లాలో సెజ్‌ల, కృష్ణపట్నం పోర్టు, దాని పరిసరాల్లో థర్మల్ ప్లాంట్ల కోసం 1200 ఎకరాలు, కడపజిల్లా జమ్మలమడుగులో ఉక్కు కర్మాగారానికి, విమానాశ్రయానికి కలిపి 16 వేల ఎకరాలు,

అనంతపురంజిల్లాలో ఒడిస్సీ సైన్స్ సిటీ పేర 65వేల ఎకరాలు, ఫైరింగ్ రేంజ్ కోసం 15 వేల ఎకరాలు భూసేకరణలకు పాలకులు పూనుకున్నారు.

విశాఖలో విమానాశ్రయం వున్నప్పటికీ దానికి సమీపంలోనే రైతాంగం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నప్పటికీ భోగాపురంలో మరో విమానాశ్రయం కోసం భూసేకరణకు పాలకులు పూనుకుంటున్నారు. ఇక పోలవరం ప్రాజెక్టులో వందలాది గిరిజన గ్రామాలు ముంపుకు వ్యతిరేకంగా మనం గత దశాబ్దానికి పైగా ఆందోళన సాగిస్తూనే వున్నాం.

విశాఖజిల్లాలో ఏజన్సీ ప్రాంతంలో తెలుగుదేశం ప్రభుత్వం కాలంలో బాక్సైట్ నిల్వల తవ్వకానికి పూనుకోగా మనం తీవ్రమైన నిరసన, ఆందోళనలు చేయడంతో ఆనాటి పాలకులు వెనక్కు తగ్గారు. అయితే 2007లో కాంగ్రెసు ప్రభుత్వం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రస్ ఆల్ ఖైమాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఏజన్సీ గిరిజన ప్రాంతంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడం పై నిషేధం వున్న కారణంగా– ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ మైనింగ్ దెవలప్‌మెంట్ కార్పోరేషన్ తవ్వకాలు సాగించి ఖనిజాన్ని వెలికితీసి పై కంపెనీకి అమ్మేలా ఒప్పందం చేసుకున్నాం. అన్‌రాక్ కంపెనీ కోసం మాకవారిపాలంలో నిరసననూ పట్టించుకోకుండా బలవంతంగా ప్రభుత్వం భూసేకరణ చేసి కంపెనీకి అప్పగించింది. అలాగే దేశంలో బడా కంపెనీల్లో ఒకటైన జిందాల్ గ్రూపుకు మరో కంపెనీ పెట్టుకునేందుకు విజయ నగరం జిల్లా ఎస్.కోట మండలంలో అనుమతి ఇచ్చారు. ఈ రెండు కంపెనీలు బాక్సైట్ నుండి అల్యూమినియం తయారు చేస్తాయి. ఈ కంపెనీల కోసం బాక్సైట్ తవ్వకం వల్ల అటవీ ప్రాంతంలో తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తి గిరిజనుల జీవితం దుర్భరమవుతుందనీ, వీటి ఫ్యాక్టరీలు కట్టడానికి ఉపయోగించిన భూములు సారవంతమైనవి కావడం పంటలు ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బతింటుందనీ, కంపెనీలు పెద్ద మొత్తంలో నీటిని వినియోగించుకొంటాయని –ఎంతగానో ఆందోళనలు వ్యక్తమైనా– ఈ కంపెనీలు నిర్మాణాలు సాగించగలిగాయి.

ఇక తీర ప్రాంతంలో నిర్మిస్తున్న పోర్టుల ఫలితంగా మత్స్యకారులు జీవనోపాధి శాశ్వతంగా దెబ్బతింటుంది. విశాఖజిల్లా గంగవరంలో పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా నిరసన తెచ్చిన మత్స్యకారులపై కాల్పులు కూడా సాగించారు. ప్రస్తుతం కృష్ణపట్నం పోర్టు ఫలితంగా ఉపాధి కోల్పోతున్న మత్స్యకారుల నిరసనను కూడా అణచి వేస్తున్నారు.

ఈ భూసేకరణల ఫలితంగా భూములు కోల్పోతున్న రైతాంగపు జీవితాలు ఏమవు తున్నాయన్నది పాలకులకు పట్టడం లేదు. దేశవ్యాపితంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయిన నేపథ్యంలో యుపిఏ-2 ప్రభుత్వం భూసేకరణ చట్టానికి కొన్ని సవరణలు తెచ్చింది. 20 శాతంపైగా ప్రజలు వ్యతిరేకిస్తే ఆ భూముల సేకరణకు పూనుకోరాదంది. ఈ సేకరణ ఫలితంగా కలుగుతున్న సామాజిక ప్రభావాన్ని మదింపు చేయమంది. అయితే ఎన్.డి.ఎ పాలకులు వచ్చాక తిరిగి మరో చట్టం రూపొం దించారు. అందులో ప్రజాభి ప్రాయంతో సంబంధం లేకుండా ప్రభుత్వం అవసరమని భావిస్తే సేకరణకు పూనుకొనే అవకాశం ఇచ్చింది. సామాజిక ప్రభావం గణించే అంశాన్నే ఎత్తివేసింది. ఆర్డినెన్సు ఒకటికి రెండుసార్లు విడుదల చేసి చట్టం చేసేందుకు పార్లమెంటు ముందుకు తెచ్చే ప్రయత్నాల్లో వుంది.

ఇక ఆంధ్రలోని చంద్రబాబు ప్రభుత్వం రాజధాని కోసమంటూ భూసేకరణ కంటే భూసమీకరణ రైతులకు లాభం కలిగిస్తుం దంటూ ముక్కారు పంటలు పంటే 33 వేల ఎకరాల భూమిని సేకరించింది.

ఇదంతా సంపన్నులకు, విదేశీ గుత్త కంపెనీలకు ప్రయోజనం చేకూర్చి రైతాంగపు సేద్యాన్ని, ఇతర వ్యవసాయకూలీల, గ్రామీణ వృత్తుల వారి జీవనాన్ని దెబ్బతీసే చర్యలే.

2007 నాటికి తీసిన లెక్కల ప్రకారం అప్పటికి గడిచిన 60 సం॥లో 6 కోట్ల మందిని నిర్వాసితుల్ని చేశారు. ఇప్పటి లెక్కల ప్రకారం ఇది 10 కోట్లకు చేరి వుండవచ్చు. ఇందులో 40 శాతంమంది ఆదివాసులే. దేశ జనాభాలో ఆదివాసులు 7.5 శాతం అయితే ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులైన మొత్తం నిర్వాసితుల్లో వీరిది 40 శాతం. దేశంలోని ఆదివాసుల్లో 30 శాతం మంది (ప్రతిముగ్గురిలో ఒకరు) ఏదో ఒక ప్రాజెక్టు కింద నిర్వాసితులైన వారేనంటే ఈ అభివృద్ధి రధచక్రాల క్రింద వీరెంతగా నలిగిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

అందుకే రైతాంగాన్ని, ఆదివాసులను, మత్స్యకారులను బలిచేసే ఈ 'అభివృద్ధి' మనకొద్దని నినదిద్దాం. వలసబాట పట్టి పనికోసం ఎక్కడెక్కడికో వెళ్ళి రోగాలు, అకాల మరణాల బారినపడే దుస్థితిని ప్రతిఘటిద్దాం. నిరంకుశ భూసేకరణ చట్టాల రద్దుకోసం సంఘటితంగా పోరాడుదాం.





# కునారిల్లుతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు- ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతుకూలీలు, కార్మికులు

ఎస్.ఝాన్సీ



మహాసభల సందర్భంగా రెండోరోజు సదస్సులో రెండవ అంశం గురించి మాట్లాడుకోబోతున్నాము. కునారిల్లిపోతున్న వ్యవసాయధారిత పరిశ్రమలు–ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతుకూలీలు, కార్మికులు–అంశాన్ని మనం ప్రత్యేకంగా చర్చించుకుంటున్నాము. ప్రస్తుతం మన రాష్ట్రంలో జూట్ పరిశ్రమలన్నీ మూతపడి పోయి వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు. స్పిన్నింగ్ మిల్లులు మూతపడిపోయాయి. సహకార సంస్థల క్రింద నడుస్తున్న పంచదార ఫ్యాక్టరీలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోయి సరైన వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. పొగాకు పండించే రైతు, కంపెనీలు సకాలంలో కొనకపోవటంతో అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలన్నీ సంక్షోభాలలో చిక్కుకుని కార్మికులు అవస్థలు పడుతుంటే ఈ పరిశ్రమలకు ముడిసరుకును ఉత్పత్తిచేసే (పండించే) రైతులు అప్పుల పాలై తీవ్ర సంక్షోభంలో వున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తులన్నీ ప్రజలకు నిత్యజీవితంలో కావాల్సినవే. (పొగాకు తప్ప) అయినా ఎందుకు సంక్షోభాలలో ఉంటున్నాయని మనం చెప్పుకోవాల్సి వస్తే పాలకులు కార్మికుల పట్ల రైతుల పట్ల అదే విధంగా ప్రజలకు అందించవలసిన నిత్యావసర సరుకు లభ్యం మరియు వీటి ధరలపట్ల ఎంతటి నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారో మనకు అర్ధమవుతున్నది.

**జూట్ పరిశ్రమ:**

మన రాష్ట్రంలో 50,000 మంది కార్మికులు 30 జూట్ మిల్లులలో పని చేస్తున్నారు. ఒక్కొక్క కార్మికుడిపై ఐదుగురు ఆధారపడుతున్నారు. ప్రత్యక్షంగా రెండు లక్షల యాభై వేలమంది, పరోక్షంగా రెండు లక్షలమంది మొత్తంగా నాలుగు లక్షల యాభై వేలమంది ఈ మిల్లుల మీద ఆధారపడి బతుకుతున్నారు. ఈ మిల్లులు గ్రామీణ ప్రాంతాల్లో వుండటం వల్ల ఈ కార్మికులంతా పల్లెల్లో జీవిస్తున్నారు. అత్యధిక శాతం పేదవాళ్ళే. 1980ల తర్వాత పి.పి (పాలిథీన్ పిలిప్) దారాలతో గోనె సంచులు తయారవ్వటంతో వీటిని సిమెంటు, ఎరువులు మొదలగు వాటికి ఉప యోగిస్తున్నారు. ఇది జూట్ పరిశ్రమకు సగానికి సగం నష్టం కలిగిస్తున్నది. వీటి వాడకంతోటి జూట్‌తో తయారయ్యే సంచుల వాడకాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇది జూట్ పరిశ్రమకు సగానికి సగం నష్టం కలిగించింది. ఇది పర్యావరణ సమస్యను సృష్టించింది. పర్యావరణానికి హాని కలగ కుండా వుండాలంటే జూట్ వాడకమే వుండాలి. కానీ మన పాలకులు విదేశీ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం జూట్‌ను ప్రక్కనపెట్టి పిపి దారాలతో తయారుచేసే సంచులు వాడటంతో ఇటు రైతుకు, అటు కార్మికుడికి మొత్తం దేశానికి పర్యావరణ సమస్య కూడా ప్రధానమైన సమస్యగా వుంది.

1947లో జరిగిన దేశ విభజన సందర్భంగా జనపనార, గోగునార పండించే భూములలో అత్యధిక భాగం పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్ళిపోయాయి. తర్వాత క్రమంలో మనదేశంలో జనపనార పంట రైతాంగం అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. మనదేశంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, అస్సాం, బీహార్, మేఘాలయ, త్రిపుర, ఒరిస్సాలలో ఈ పంట పండిస్తున్నప్పటికీ దీనికి నాణ్యత తక్కువని ఇది నాసిరకమైన పంట అని చెప్తున్నారు. మెట్ట భూముల్లో పండే ఈ పంటను నాణ్యమైన పంటగా పండించ డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోలేదు. ఈ పంట పండించ డానికి చెరువులు చాలా అవసరం. ఉత్తరాంధ్రలో అత్యధిక భాగం చెరువులన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారు. పెద్ద పెద్ద కాలేజీలు, తమ వ్యాపారాల కోసం వ్యాపారస్థులకు ఉపయోగపడే పెద్ద పెద్ద బిల్డింగులను కట్టుకున్నారు. దీనితో ఈ పంట పండించే రైతులకు నాటి సదుపాయాలు రోజురోజుకు కొరవడుతూ వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో వున్న జూట్ మిల్లులు పనిచేయటానికి కావలసిన ముడిసరుకులు ప్రధానంగా ఈనాటికి బంగ్లాదేశ్ నుండే దిగుమతి చేసుకోవలసి వుంటున్నది. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాల్లో భాగంగా ఇతర దేశాల్లో తయారైన సరుకు భారతదేశాన్ని ముంచివేశాయి. పాలిథీన్ చౌకగా దొరకడంతో జూట్ పరిశ్రమ మరింత సంక్షోభంలోకి వెళ్ళింది. పాలకుల యొక్క ఈ నిర్లక్ష్య వైఖరితో జూట్ పండించే రైతు సంక్షోభంలో పడ్డాడు. జూట్ పరిశ్రమల్లో ముడి సరుకు మార్కెట్ సదుపాయాలు లేవనే నెపంతో జూట్ యాజమాన్యం కార్మికులకు కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయటం లేదు. పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమలన్నింటినీ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసుకుంటూ కార్మికులను రోడ్ల మీద పడవేశారు. ఇటీవల కాలంలో ఉత్తరాంధ్రలో 25,000 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఇటీవల అక్రమంగా మూతవేసిన విజయనగరంజిల్లా –అరుణా జూట్‌మిల్‌ను వెంటనే తెరిపించాలని, కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని, జూట్ రైతుల నుండి

న్యాయమైన ధర చెల్లించి జూట్ కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల నాయకత్వంలో జరిగిన ఆందోళనలో రైతుకూలీసంఘం భుజం భుజం కలిపి నిలిచింది. పరిశ్రమ మూతవేసి ఫలితంగా రోడ్డున పడిన కార్మికులకు పాలకులు ప్రత్యామ్నాయం చూపించలేదు. ప్రభుత్వం ఈ మూతపడిన పరిశ్రమలను తెరిపించ టానికి 15 లేక 20 కోట్లు సహాయం చేయగలిగితే పరిశ్రమలు నడుస్తాయి. కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. కానీ ఈ కార్మికులందరినీ వలస కూలీలుగా మార్చి విజయనగరం జిల్లాలోని భోగాపురం వద్ద రైతులు పంటలు పండిస్తున్న 5 వేల ఎకరాల భూమిని తీసుకుని వేల కోట్ల రూపాయలతో విమానాశ్రయాన్ని కట్టటానికి పూనుకుంటుంది. మా భూములు మేం ఇవ్వమంటూ ఆందోళన చేస్తున్న పేద, రైతు కూలీల వేదనలు వినదలచుకోలేదు. మూతబడిన పరిశ్రమలను తెరిపించి కార్మికులకు జీవనాన్ని కల్పించే పనులను ఉద్దేశ్యపూర్వకంగానే ప్రక్కకు పెట్టి విమానాశ్రయాలు, ఓడరేవులు కటట్టడమే అభివృద్ధి అంటూ చెప్పుకుంటూ బహుళజాతి సంస్థలకు దాసోహం చేస్తూ, దేశాభివృద్ధి కోసం కోట్ల రూపాయలతో కొత్త కొత్త పరిశ్రమలు నెలకొల్పి వుద్యోగాలు కల్పిస్తామంటూ బూటకపు ప్రచారాలకు పూను కుంటున్నారు. సామ్రాజ్యవాదుల కనుసన్నలలో వారి ప్రయోజనాల కోసం మాత్రమే విమానాశ్రయాలు, ఓడరేవులు కడుతున్నారనేది మరింత స్పష్టం.

## ప్రత్తి:

వరి తరువాత పండిస్తున్న పంటలలో ప్రత్తిదే అగ్రస్థానం. ప్రత్తిసాగు విస్తీర్ణంలో బారతదేశం 1వ స్థానంలో వుంది. పండించే రైతుకు కానీ ప్రత్తి రైతు సంక్షోభం ప్రతి ఏటా తీవ్రతరమౌతున్నది. విత్తనరంగంలో సామ్రాజ్యవాదులకు లాభాలు చేకూర్చిపెట్టే ప్రభుత్వ విధానాల వలన ప్రత్తి పంటకే విత్తన సమస్య ప్రధానంగా వుంది. ప్రత్తి విత్తనాలను విదేశీ కంపెనీలు తమ గుత్తాధిపత్యం తీసుకుని తమ లాభాపేక్ష కోసం రైతును సుడిగుండంలోకి నెట్టివేస్తున్నాయి. ప్రత్తి పండించే రైతు విత్తనాలు కొనుక్కోవటంలో దోపిడీకి గురికాబడుతున్నాడు. ఎరువులు, పురుగుమందులు వీటన్నింటిలోనూ తీవ్రంగా దోపిడీకి గురవుతున్నాడు. ప్రతీ సంవత్సరం ఉత్పత్తి ఖర్చులు పెరిగి పోవటంతో హెక్టారు సాగుకి 50,000 రూ॥ ఖర్చు పెడుతున్నారు. ఇంత ఖర్చుపెట్టి ప్రత్తి దిగుబడి వచ్చేసరికి గిట్టుబాటు రేటు కనీసంగా లభించక అప్పులపాలై ఆత్మ హత్యలు చేసుకోవటం, కిడ్నీలు అమ్ము కోవటం మనం నిత్యం చూస్తున్నాం. సామ్రాజ్య వాదుల పిడికిళ్ళలో చిక్కుకుని ప్రత్తి రైతు దివాళా తీస్తున్నాడు. మరొకప్రక్క ప్రత్తి విత్తనాలు మరియు క్రిమిసంహారక మందులు అమ్మే కంపెనీలు కోట్ల రూపాయలు లాభాలార్జిస్తున్నాయి.

అమెరికాలో ప్రత్తి రైతులు 300 కోట్ల డాలర్ల విలువైన ప్రత్తిని పండిస్తుంటే వారికి అమెరికా ప్రభుత్వం 400 కోట్లు సబ్సిడీ ఇచ్చి అంతర్జాతీయ మార్కెట్‌లో మనలాంటి వెనకబడిన దేశాల్ని దెబ్బతీయటం సామ్రాజ్యవాద దేశాల ఎత్తుగడ. విదేశాల నుండి మన దేశానికి ప్రత్తి దిగుమతి ప్రతీ సంవత్సరం పెరిగిపోతుంది. ఈ సంవత్సరం 20 లక్షల బేళ్ళ ప్రత్తి దిగుమతి జరుగు తుందని ప్రత్తి సలహా సంస్థ పేర్కొంటుంది. అంతర్జాతీయ మార్కెట్ కన్నా మన దేశంలో ధరలు తక్కువగా వున్నపుడు ఎగుమతులు నిషేధించాలని ప్రభుత్వంపై ఒత్తిడిచేసే బడా వ్యాపారవర్గం అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తక్కువగా వున్నపుడు దిగుమతులు చేయాలని సుంకాలను తగ్గించాలని కోరు తున్నారు. అసమాన ఎగుమతుల, దిగుమతుల విధానంతో భారత రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది.

ప్రత్తిపంటలో గింజను, దూదిని వేరు చేసేది జిన్నింగ్ మిల్లు, దూది నుండి దారం తయారుచేసేది స్పిన్నింగ్ మిల్లు. ప్రత్తి పంట సంక్షోభంలో పడటంతో జిన్నింగ్ మిల్లులు, స్పిన్నింగ్ మిల్లులు కూడా మూతబడినాయి. ప్రత్తి నుండి దూది, దూది నుండి రకరకాల దారాలు తయారవుతాయి. ఇందులో మరలా పొడుగు పింజప్రత్తి, పొట్టి పింజప్రత్తి; పొడుగు పింజ ప్రత్తి నుండి 120 నెంబరు దారం తయారుచేస్తారు. పొట్టి పింజ ప్రత్తి నుండి ముతక దారాలు, మరలా దీనిలో వ్యర్ధాల నుండి నవ్వారు, దుప్పట్లు, జంపకానాలు, తివాచీలు తయారుచేస్తారు. ఈ నాసికరం నుండి కుళ్ళుగుడ్డ, నాసిగుడ్డ, ముతక పరుపులు తయారుచేస్తారు.

ప్రత్తి గింజలనుండి నూనె తీస్తారు. మిగిలిన పిట్టూ లేక చెక్క, పశువులదాణా, కోళ్ళదాణా, చేపల చెరువులకు దాణాగా తయారు చేస్తారు. ప్రత్తిగింజల నుండి తీసే వంటనూనె ఎంతో విలువైనది. ప్రత్తి పెంకు నుండి కార్డుబోర్డులు తయారుచేస్తారు. ఇక మిగిలిపోయిన ప్రత్తిని వంటచెరకుగా, మిగిలిన చెత్తను బయోగ్యాస్‌కు ఉప యోగిస్తారు. కనుక ప్రత్తి పండించే దానిలో ప్రతీ ఒక్కటి కూడా ప్రజల యొక్క కనీస అవసరాలు తీర్చుకోవడానికి ఉపయోగపడే పంట. ఈ పంటను కాపాడుకోవడం, ఈ విత్తనాన్ని ఎరువులు, పురుగుమందులను మన దేశాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగించుకోవటం, మన ప్రయోజనాలకు అనుగుణంగా మనమే తయారుచేసుకోవాలి. ప్రత్తి నుండి తయారయ్యే దారం, నూలు దుస్తులు మన దేశ వాతావరణానికి, మన దేశ ప్రజలకు అత్యవసరం. వీటన్నింటిని వదిలేసి మొత్తం ప్రత్తి పంటను సామ్రాజ్య వాదులకు ధారాదత్తం చేయటం వలన రైతు తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుని పోతున్నాడు. ఈ మిల్లులలో పనిచేసే కార్మికులు జీవన భృతి కోల్పోతున్నారు. వీటితో తయారుచేసుకునే నాణ్యమైన దుస్తులు మన ప్రజలకు అందించ లేని స్థితిలో పాలకవర్గాల విధానాలు సాగుతూ వున్నాయి.

## చెరకు:

మన రాష్ట్రంలో చెరకు పంట కూడా ప్రధానమైన పంట. చెరకు నుండి పంచదార, బెల్లం తయారుచేసే ఫ్యాక్టరీలు కానీ, ఎకరా చెరకు పండించటానికి రైతుకి 65,000 రూ॥ఖర్చు అవుతుంది. దీని నుండి వచ్చే దిగుబడి 30 లేక 35 టన్నులు. ఒక ఎకరాలో పండించే చెరకు వల్ల చెరకు

ఫ్యాక్టరీకి 60,000 రూ॥ లాభం వస్తుంది. ఆంధ్రప్రదేశ్ (సమైక్య) సహకార రంగంలో 13, ప్రైవేటు రంగంలో 19 చెరకు ఫ్యాక్టరీలున్నాయి. సహకార రంగంలో నడుస్తున్న ఫ్యాక్టరీలన్నీ నష్టాల సాకుతో ప్రైవేటురంగానికి అప్పచెప్పారు. ఈ ఫ్యాక్టరీలన్నీ ప్రైవేటు రంగం చేతుల్లోకి వెళ్ళిపోవటంతో ఇటు రైతులను, కార్మికులను ఇష్టం వచ్చినట్టు దోపిడీ చేస్తున్నారు. ఒక టన్ను చెరకుపై కంపెనీకొచ్చే ఆదాయం 6,500. రైతుకి చెల్లించేది మాత్రం 2,500. ఫ్యాక్టరీ యజమానికి టన్నుకి 2000. ఈ ఫ్యాక్టరీలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా వడ్డీలేని అప్పు. 7,500 కోట్లు ఇచ్చింది. ఒక టన్ను చెరకు సగటు దిగుబడి 100 కిలోల చక్కెర, ఇవిగాక ఉప ఉత్పత్తుల ద్వారా కోట్లాది రూపాయలు మిల్లులు లాభాలు గడిస్తున్నాయి. మిల్లు యజమానులు కార్మికులకు తక్కువ జీతాలు ఇవ్వటమో లేక రైతులకు సుదీర్ఘకాలం బకాయిలు పెట్టటమో సాగుతూ వస్తున్నది. ఉదా: సీతానగరం షుగర్ ఫ్యాక్టరీలలో రైతుల భూములపై బినామీల పేరుతో బ్యాంకులలో కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని వేరే వ్యాపారానికి ఉపయోగించింది. చెరకు రైతులకు సకాలంలో చెల్లించక అప్పులు, మరొకప్రక్క కార్మికుల వేతనాలు ఎగ్గొట్టటం మూడు రకాల దోపిడీ చేస్తూ ఆ డబ్బును ఇతర వ్యాపారాలోకి మళ్ళించి కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. చెరకు ఫ్యాక్టరీలు సంక్షోభంలో వున్నాయంటు రైతులకు సకాలంలో బకాయిలు చెల్లించకుండా కార్మికులకు జీతాలు చెల్లించకుండా కృత్రిమ సంక్షోభాలను సృష్టిస్తున్నారు.

చెరకు ఫ్యాక్టరీ సంక్షోభాల గురించి రంగరాజన్ కమిటీ ఒక నివేదిక తయారు చేసింది. ఈ నివేదిక సహకార రంగాన్ని నిర్వీర్యం చేసి బడా యజమానులకు ఇందులో లెవీ విధానాన్ని రద్దు చేసింది. మిల్లులు రైతులకు చెల్లించవలసిన బకాయిలు వడ్డీలేని అప్పుగా బ్యాంకుల ద్వారా ఇవ్వటానికి ఒప్పుకుంది. పెట్రోల్‌లో మిథనాల్ కలపటానికి 5 నుండి 10 శాతానికి పెంచుతూ పూర్తిగా యజమాన్యానికి అనుకూలంగా రైతాంగానికి వ్యతిరేకంగా నివేదికను తయారుచేసింది.

చక్కెర ఫ్యాక్టరీల మనుగడ ప్రధానంగా చెరకు పండించే రైతుపై ఆధారపడి వుంటుంది. కానీ పాలకులు, ఫ్యాక్టరీ యజమానులకు రాయితీలిచ్చి వారి లాభాలను మరింత పెంచుతూ, చెరకు పంట పండించే రైతును అప్పులపాలు చేస్తున్నారు.

చెరకు పంట నుండి వచ్చే ఉత్పత్తి ప్రతిదీ సామాన్యులకు నిత్యజీవిత అవసర వస్తువులలో ఉపయోగపడేదే. దీని నుండి వచ్చే పంచదార, బెల్లం ప్రజల యొక్క పోషక విలువలను పెంచేదే. సమాజంలో అందరికీ అత్యవసరమైన పంట పండించే రైతును పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేయటం వలన ఇటు రైతులకు, పనిచేసే కార్మికులకు దేశ ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం కలుగుతుంది.

**పొగాకు:**

రెండో ప్రపంచ యుద్ధం తరువాత పొగాకు పంట వ్యాప్తి చెందింది. పొగాకు పంటను రైతు అత్యంత నైపుణ్యంతో పండిస్తాడు. ఈ పొగాకు పంట ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని తెస్తున్నది. ఈ పొగాకు నుండే చుట్ట, బీడీ, సిగరెట్, మినిసిగరెట్, గుట్కా, ఖైనీ, జరదా ఇది గాక పీల్చే పొగాకు తయారవుతాయి. రైతు పండించిన పొగాకు పంటకు ధరను నిర్ణయించేవి ఐటిసి లాంటి కంపెనీలే. పొగాకు వ్యాపారంతో కోట్లాది రూపాయలు సంపాదించిన ఐటిసి కంపెనీ అనేక రంగాలలో కోట్లాది రూపాయలతో తన వ్యాపారాన్ని విస్తరించింది. ఈ రోజుకీ పొగాకు మార్కెట్‌లో ఐటిసి వాడిదే అధిపత్యం, వివరాలలోకి వెళ్ళటానికి సమయం లేనందువలన ఒకటి రెండు విషయాలు చెప్పి ముగిస్తాను. పొగాకు పండిస్తున్న రైతుకు పాలకుల సహాయం ఏ మాత్రం లేదు. పసిపిల్ల కంటే జాగ్రత్తగా పండించీ, పంటకు మార్కెట్‌లో రేటు నిర్ణయించేదీ మాత్రం బహుళజాతి కంపెనీ అయిన ఈ ఐటిసి. రైతాంగం యొక్క రక్తం పీల్చి తాగే ఈ కంపెనీ రైతాంగం పెట్టిన పెట్టుబడులను అప్పులను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోదు. రైతాంగానికి న్యాయం చేయవలసిన పాలకులు ప్రభుత్వం, ఐటిసి యొక్క లాభాలను వృద్ధి చేయటానికి వున్నారే తప్ప రైతాంగాన్ని కాపాడుకోవటం, రక్షించుకోవటం అనేది ఏ మాత్రం వీరికి లేదు. 83లో ప్రకాశంజిల్లా టంగుటూరులో పొగాకు రైతు గిట్టుబాటు ధర కావాలంటూ రోడ్లపైకి వస్తే ఆ రైతులపై కాల్పులు జరిపి వారిని పొట్టన పెట్టుకున్న విధానమే ఈ పాలకులది. అదే నేటికి సాగుతుంది. పొగాకు పండించే రైతుకు ప్రత్యామ్నాయం పంటలని గురించి ఏ మాత్రం చెప్పకుండా, వివరించకుండా పొగాకు పంట పండించ వద్దని వ్యవసాయ మంత్రి ప్రకటనలు చేయటం ఆశ్చర్యంగానే వుంది.

వ్యవసాయరంగ సంక్షోభ పరిష్కారానికి, ప్రజల యొక్క ఆహార భద్రతకు, ప్రజలయొక్క నిత్యావసర వస్తువుల ధరల అదుపుకు, వ్యవసాయాధారిత పరిశ్రమలు నిలబెట్టడం, అభివృద్ధి చేయడం అత్యంత అవసరం. ఈ వ్యవసాయాధారిత పరిశ్రమలను కాపాడుకోవటంలో భాగంగా మూసివేసిన జూట్ ఫ్యాక్టరీలను తెరిపించి గ్రామాల్లో వున్న యువకులకు భృతి కల్పించాలి, ప్రత్తిపంటపై ఆధారపడి నడుస్తున్న జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులను వెంటనే తెరిపించాలి. ఈ ఉత్పత్తులు నిత్యజీవితంలో ఎంతో అవసరం. రైతులు, కార్మికులు తమ దైనందిన జీవితాన్ని సాఫీగా గడుపుతూ ఆత్మగౌరవంతో జీవించగలుగుతారు. కనుక కామ్రేడ్స్ మనం తక్షణం ఆందోళన చేపట్టవలసింది. వ్యవసాయాధారిత పరిశ్రమలను తెరిపించండి. కార్మికులకు తక్షణం భృతి కల్పించండి. ప్రత్తి, పొగాకు, చెరకు మొదగలకు పంటలను కాపాడండి అంటూ ఉద్యమించాల్సిన అవసరం వుంది. వ్యవసాయాధారిత పరిశ్రమలను కాపాడాలంటూ కార్మికులు, రైతుకూలీలు ఐక్యంగా ఉద్యమించాలి.

# విప్లవ భూసంస్కరణల ఆవశ్యకతను తెలుపుతున్న వ్యవసాయరంగ సంక్షోభం

పి.జశ్వంతరావు

రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభకు విచ్చేసిన మీకందరకూ అభినందలను తెలుపుతున్నాను. ఈనాడు వ్యవసాయరంగ మెదుర్కొంటున్న సంక్షోభం మీకందరకూ తెలిసినదే. దున్నేవానికే భూమి ప్రాతిపదికగా భూసంస్కరణలు అమలు చేయకుండా, భూమిలో ఫ్యూడలు సంబంధాలను రద్దు చేయకుండా ఈ సంక్షోభం పరిష్కారం దిశగా సాగదన్నది చారిత్రక అనుభవం.

1947 నాటికి దేశంలో భూమికోసం రైతాంగ పోరాటాలు సాగుతున్నాయి. తెలంగాణాలో రైతాంగం భూస్వాములకు గరిష్ట పరిమితి విధించి మిగిలిన భూమిని పంపకం చేసుకుని, దానిని నిలుపు కునేందుకు సాయుధ పోరాటం సాగిస్తున్నారు. బ్రిటీషు వలసవాదుల నుండి అధికారం పొందిన భారత పాలకవర్గాలు జమీందారీల రద్దు, కౌలుదారీ రక్షణ చట్టాలూ చేశాయి. ఆ తర్వాత భూగరిష్ట పరిమితి చట్టాలు చేశాయి. ఇది ఏనాడూ అమలు జరపలేదు.

ప్రభుత్వ గణాంకాలను తీసుకున్నా 2005 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 73.4 లక్షల ఎకరాలు మిగులు భూమిగా ప్రకటించాయి. ఇది మొత్తం సాగుభూమిలో 1.8 శాతం మాత్రమే. దీనిలో 65 లక్షల ఎకరాలు మాత్రమే స్వాధీనం చేసుకొని 58 లక్షల ఎకరాలు పంపకం చేశాయి. అయితే దీనిలో ఎన్ని ఎకరాలు లబ్ధిదారులకు అప్పగించారన్నది మాత్రం జాతీయ భూవినియోగ విధానం 2013 చెప్పలేదు. ఈ పంపకం కూడా 60 శాతంపైగా పశ్చిమబెంగాలు, కేరళ, జమ్ముకాశ్మీర్, అస్సాంలలో జరిగింది. ఇది కాక ప్రభుత్వ భూమి 1.4 కోట్ల ఎకరాలు పంపకం చేసినట్లు పేర్కొన్నారు. కానీ యిందులో అధికభాగం పెత్తందారుల ఆధీనంలోనే వుంది. ఏది ఏమైనా 1 శాతం భూమి 4 శాతం గ్రామీణ కుటుంబాలకు పంచినట్లయింది. అలాగే 5 శాతం వ్యవసాయ భూమిలో 1.2 కోట్లు కౌలు దారులకు రక్షణ కల్పించినట్లు చెప్పు కున్నారు. కానీ ఆచరణలో మూజువాణీ కౌలు పెరిగిపోయింది. భూమి కోసం పోరాడుతున్న రైతాంగానికి భ్రమలు కల్పించి వారిని పోరాటపథం నుంచి మళ్లించటమే లక్ష్యంగా పాలకవర్గాలు ఈ చట్టాలను చేశాయి.



దీని కొనసాగింపుగా భారత పాలకులు పైరుపచ్చ విప్లవాన్ని ప్రారంభించారు. అధికంగా ఎరువులు, నీరు, పురుగు మందులు వాడితేనే దిగుబడులను పెంచే అధిక దిగుబడి వంగడాలను ప్రవేశపెట్టారు. దేశం మొత్తం మీద కొంత ప్రాంతానికే నీటి పారుదలా సౌకర్యం కల్పించి, అక్కడ అమలు జరిపిన పైరుపచ్చ విప్లవం వరి, గోధమ, దిగుబడులను పెంచింది. అదే సమయంలో ఉత్పాదకాల సరఫరాతో సామ్రాజ్యవాద పెట్టుబడి వ్యవసాయ రంగంలోకి చొచ్చుకువచ్చి, పెరిగిన దిగుబడులలో అధికభాగాన్ని ఉత్పాదకాల అధిక రేట్లతో తరలించుకుపోయింది. ఈ దిగుబడుల పెరుగుదల కూడా పేద, మధ్య తరగతి రైతాంగం శ్రమ వల్లనే సాధ్యమైంది. వారి శ్రమ ఫలితాన్ని సామ్రాజ్యవాదం దోచు కోవటంతో వారి పరిస్థితి అస్తుబిస్తుగానే వుంటూ వచ్చింది. రెండు దశాబ్దాలు గడిచేసరికి దిగుబడులు స్థంభించిపోయి ఉత్పాదకాల ధరలు పెరిగిపోతూ రైతాంగం పరిస్థితి దిగనాసిల్లింది.

ఈ సమయంలో ప్రభుత్వం నూతన ఆర్థిక సంస్కరణలను చేపట్టింది. సబ్సిడీలతో వ్యవసాయరంగాన్ని పోషించే బదులు ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవటమే చౌక అన్న ప్రపంచబ్యాంకు సలహాను పాటించి రైతాంగానికి అందిస్తూ వచ్చిన మద్దతును క్రమంగా ఉపసంహరిస్తూ వచ్చారు. దీనితో సాగునీటి ఛార్జీలు పెరిగాయి, ఎరువుల ధరలు పెరిగాయి; విత్తనాల ధరలు పెరిగాయి. మరోవైపున ప్రభుత్వ ధాన్య సేకరణ సంస్థలను రంగం నుండి తప్పించింది. కనీస మద్దతు ధర ప్రకటనలు తప్ప రైతాంగం తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ అజమాయిషీలోని మార్కెట్టు యార్డుల ప్రైవేటీకరణతో రైతాంగాన్ని బడావాణిజ్యం ముందు నిస్సహాయులుగా నిలబెట్టింది. ఫలితంగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకు పోయారు. తమ ఉత్పాదక ఆస్తులు (భూమి తదితరాలు) అప్పులు తీర్చాల్సిన స్థితి ఏర్పడింది. దాదాపు 3 లక్షల మంది రైతాంగాన్ని బలవన్మరణాలకు నెట్టిన విధానాలివి. ఇవి రైతాంగాన్ని భూమి నుండి తొలగించాయి. గ్రామీణ పేదరికాన్ని పెంచాయి.

2014లో యుపిఏ ప్రభుత్వం ప్రకటించిన భూసంస్కరణల ముసాయిదా విధానంలో ఈ క్రింది వివరాలను పేర్కొంది. గ్రామీణ కుటుంబాలలో మూడవ వంతుకు భూమి లేదు. ఒక ఎకరం, ఆ లోపు భూమిగల కుటుంబాలు మరీ మూడవ వంతు మరో 20 శాతానికి ఒక హెక్టారు లోపు భూమి మాత్రమే వుంది. మరో విధంగా చెప్పాలంటే 60 శాతం జనాభాకు 5 శాతం భూమి మాత్రమే వుంది. కాగా 10 శాతం జనాభా చేతిలో 55 శాతం భూమి వుంది.

అదే విధంగా గ్రామాలలో వుండి భూమి కలిగి వుండి సాగు చెయ్యని కుటుంబాల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. అలాగే పట్టణాలలో వుంటూ, భూమి కలిగి వుండి

సాగు చెయ్యని కుటుంబాల సంఖ్య పెరుగుతూ వుంది. వీరి చేతిలోని భూవిస్తీర్ణం కూడా పెరుగుతూ వుంది. ఇది గ్రామాలలో భూమిలేని కుటుంబాల సంఖ్యను పెంచింది. వీరంతా కౌలుదారులుగా సాగు చేస్తున్నారు. సాగుచెయ్యని భూయజమానులు భూమిని మదుపు సాధనంగా చూస్తున్నారు. వ్యవసాయేతర అవసరాలకు తరలిస్తున్నారు. ఇది సాగుభూమి విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నది.

సాగుచెయ్యని భూయజమానులకు భూమిలో ఉత్పాదకతను పెంచేందుకు పెట్టుబడి మదుపు పెట్టడం వృధాగా కన్పిస్తుంది. వచ్చిన మేరకు అధిక కౌలు వసూలు చేసుకోవటం, వీలయితే భూమిని వ్యవసాయేతర కార్యాలకు తరలించటం పైనే వారి శ్రద్ధ అంతా వుంటుంది.

మరో ఉపాధి సౌకర్యం లేనందున, భూమిపైనే శ్రమిస్తున్న, కౌలుదారులకు భూమి ఉత్పాదకతను పెంచే పెట్టుబడిని మదుపు చేయగల స్థోమత లేదు. వీరికి, పేద రైతాంగానికి ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతూ లేదు. కాగా వున్న మద్దతును కూడా తొలగించి వేశారు.

భారత వ్యవసాయరంగ సంక్షోభమంటే రైతాంగ సంక్షోభమే సాగుభూమిపై శ్రమిస్తున్న రైతాంగానికి ఆ భూమిపై హక్కు లేదు. వారి శ్రమ ఫలితం వారికందకుండా పోతున్నది. అది కూడా దేశ సరిహద్దులు దాటి వెళ్ళిపోవటంతో దేశంలో పారిశ్రామికాభివృద్ధి కుంటినడకనే వుంది. ఫలితంగా వ్యవసాయ ఆధారిత జనాభాను ఇతర ఉపాధి రంగాలకు తరలించటం సాధ్యపడదు. దున్నేవానికే భూమి కేంద్రంగా భూసంస్కరణలు అమలు జరిగినప్పుడు మాత్రమే ఈ పరిస్థితి మౌలికంగా మారుతుంది.

ఈ సూటైన పరిష్కారాన్ని అమలు జరపటానికి భారత పాలకవర్గాలు సిద్ధంగా లేవని గత 60 ఏళ్లుగా వీరమలు జరిగిపిన విధానాలే తెలుపుతున్నాయి. అందుకనే వర్గసంబంధాల సమస్యను దాచిపెట్టి, ఇతర సమస్యలను చూపెట్టి వాటి పరిష్కరించ బోతున్నట్లు చెబుతున్నాయి. ఆహారధాన్యాల వల్ల నష్టపోతున్నందున వాణిజ్య పంటలకు తరలమనీ, రసాయనిక ఎరువులు వాడకుండా ఆర్గానిక్ ఎరువులు వాడమనీ, యంత్రాలను వాడమనీ, ఆధునిక సాగు పద్ధతులు నేర్చుకొమ్మనీ రైతాంగానికి చెబుతున్నారు. మళ్లీ సామ్రాజ్యవాదులకు లాభాల పంట పండించే జన్యుమార్పిడి విత్తనాలను ప్రవేశపెడుతున్నారు. వీరు బోధిస్తున్న ఈ "ఆధునిక" సేద్యాన్ని అమలు చేయాలంటే కనీసం 50 ఎకరాల కమతం ఉన్నవారికే సాధ్యమౌతుంది. కనుక భారత పాలకవర్గాలు కోరుకున్న విధంగా "ఆధునిక" సాగుపద్ధతుల అమలు జాగాలంటే పేద, మధ్యతరగతి రైతాంగ భూముల నుండి తొలగిపోవాలి; ఆ భూమి భూస్వామ్య వర్గాలకు చేరాలి. ప్రకటిత విధానాల చాటున వున్న అసలు లక్ష్యం ఇది.

గత 2 ఏళ్లుగా దీనినే మనం చూస్తున్నాం. ఆర్థిక మీటల ద్వారా రైతాంగాన్ని భూమి నుండి తొలగిస్తున్నారు. కా॥టి.ఎన్ చెప్పినట్లు భారత వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలను పెంచి పోషించే, ఆ విధంగా భూస్వామ్య వ్యవస్థను మార్చేందుకు భారత పాలకులు పూనుకున్నారు. ఈ క్రమ పరిణామాన్ని అత్యంత నెమ్మదిగా సాగిస్తారనీ, దీనివల్ల రైతాంగం దుర్భర దారిద్ర్యాన్నికి లోనవుతారనీ, ఇది అనేక దశాబ్దాల పాటు సాగిస్తారనీ ఆయన వివరించారు. దీనిని తిరస్కరించి, విప్లవ భూసంస్కరణలకు రైతాంగాన్ని సిద్ధం చేయటమే మన కర్తవ్యమని చెప్పారు.

రైతాంగం ఆత్మహత్యలు, భూమిలేని వ్యవసాయ కుటుంబాల పెరుగుదల, భూమిని కోల్పోతున్న పేద, మధ్యతరగతి రైతాంగం, గ్రామసీమలలో దళితలపై సాగుతున్న హింసాకాండ, భూస్వామ్య సంస్కృతి, విలువలు పెచ్చరిల్లిపోవటం, గ్రామీణ యువతలో మతవిద్వేషాలు పెరగటం–ఇవన్నీ ఈ క్రమ పరివర్తన దశాబ్దాల పాటు సాగుతూ గ్రామాలను అతలాకుతలం చేస్తున్న ఫలితమే.

ఈ క్రమ పరివర్తన దేశ ప్రజల సర్వతో ముఖాభివృద్ధికి అవరోధంగా వున్నది. దేశ పారిశ్రామిక ప్రగతికి ఆటంకంగా వుంది. దేశాన్ని సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్ల చేస్తున్నది. దేశం నుండి సామ్రాజ్య వాద పెట్టుబడినీ, దాని ఆధిపత్యాన్ని తొలగించ లనంతవరకూ, దేశంలోని భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసే విప్లవ భూసంస్కరణలను అమలు చేయనంత వరకూ దేశ ప్రజల జీవనంలో యీషణ్మాత్రపు అభివృద్ధి కూడా సాధ్యపడదు. పైరుపచ్చ విప్లవాల దశల సంఖ్యలు మారతాయి తప్ప ప్రగతి సాధ్యపడదు.

దున్నేవానికే భూమి ప్రాతిపదికన విప్లవ భూసంస్కరణల అమలు కొరకు రైతాంగాన్ని సంసిద్ధం చేయటం నేటి మన కర్తవ్యంగా చేపట్టాలని కోరుతూ సెలవు తీసు కుంటున్నాను.






# రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యకలాపాల నివేదిక
## (2010 మే నుండి 2016 మే వరకు)

**కామ్రేడ్స్,**

2010 ఏప్రిల్ నెలలో, ఒంగోలులో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) గత రాష్ట్ర మహాసభలను నిర్వహించుకున్నాం. కేంద్రంలో ఆనాడు కాంగ్రెస్ నాయకత్వంలో యుపిఏ-2 అధికారంలో ఉండగా, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. గత మహాసభల నుండి ఈ సభల మధ్యకాలంలో 2014 మేలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో కేంద్రంలో మోడీ నాయకత్వంలో బిజెపి సారధ్యంలో ఎన్‌డిఏ, రాష్ట్రంలో బిజెపితో పొత్తుతో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాయి. రైతాంగ రుణాలు మాఫీ చేస్తామని, వ్యవసాయరంగానికి పెద్దపీట వేసి రైతాంగాన్ని సంక్షోభం నుండి బయటపడ వేస్తామంటూ వాగ్దానాలు చేస్తూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాయి.

1991లో ప్రపంచ వాణిజ్యసంస్థలో భారతదేశాన్ని సభ్యదేశంగా చేరుస్తూ కేంద్ర పాలకులు అంగీకరించిన తర్వాత, దేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు వేగం పుంజుకుంది. సామ్రాజ్యవాదులు, వారి బహుళజాతి కంపెనీలు సమస్త రంగాలనీ తమ దోపిడీ ప్రయోజనాల కనుగుణంగా మలిచే విధానాలను పాలకులచే అమలుచేయిస్తూ వస్తున్నారు.

చుట్టుముట్టిన సర్వవ్యాపిత సంక్షోభంలో భాగంగా దేశంలో అత్యంత కీలకమైన వ్యవసాయరంగం సామ్రాజ్యవాదుల రథ చక్రాలకు కట్టివేయబడింది. 1960లలో పైరుపచ్చ విప్లవం పేరుతో వ్యవసాయంలో సంకరజాతి విత్తనాలు, వ్యవసాయ యంత్ర సామాగ్రి వాడకాన్ని పెద్ద స్థాయిలో పెంచి, వ్యవసాయంలో సామ్రాజ్యవాదుల మార్కెట్టును పెంచుకునే వాహకంగా పైరుపచ్చ విప్లవాన్ని ముందుకు తెచ్చారు. వ్యవసాయ దిగుబడులు పెరిగినట్లు కనిపించినా, వ్యవసాయ మదుపు పెరిగిపోయి, భారమై, రైతులు రుణగ్రస్తులై ఆత్మహత్యలు చేసుకునే క్రమం 1980ల నాటికి పెరుగుతూ వచ్చింది.

ప్రస్తుతం రెండో పైరుపచ్చ విప్లవం పేరున ప్రమాదకరమైన, విషపూరితమైన జన్యుమార్పిడి విత్తనాల ప్రవేశాన్ని కొన్ని పంటలలో పాలకులు అనుమతించారు. మోన్‌శాంటో వంటి సామ్రాజ్యవాద వ్యవసాయ వాణిజ్య కంపెనీలు దీనితో వేలకోట్ల రూపాయలు లాభాలనార్జిస్తున్నాయి. వ్యవసాయంలో అనేక పంటలకు వీటిని విస్తరించటం ద్వారా వ్యవసాయ వాణిజ్యాన్ని మరింత విస్తరింపజూస్తున్నారు.

వలస పాలకుల కాలంనాటి 'భూసేకరణ చట్టం-1894'నే నిన్నమొన్నటి దాకా పాలకులు అమలు చేస్తూ 'ప్రజా ప్రయోజనం' పేరున తమ చిత్తమొచ్చిన విధంగా రైతాంగం నుండి భూములను గుంజివేసుకొని, బడా-బహుళజాతి కంపెనీల పరంచేస్తూ వచ్చారు. ప్రభుత్వాల ఈ భూసేకరణకు వ్యతిరేకంగా నానాటికీ ప్రజలలో అసంతృప్తి, ప్రతిఘటన పెరుగుతూ రావటంతో యుపిఏ-2 ప్రభుత్వం తన పాలన చివరి రోజుల్లో 'భూసేకరణ-పునరావాస చట్టం-2014'ను చేసింది. నష్టపరిహారం చెల్లింపు, ప్రజాభిప్రాయ సేకరణ, సామాజిక ప్రభావ అంచనా, ఆ భూములపై ఆధారపడిన ప్రజలకు పరిహారం -వంటి అంశాలతో తామెంతో గొప్ప ప్రయోజనకరమైన చట్టాన్ని చేసినట్లుగా కాంగ్రెస్ పాలకులు ప్రచారం చేసుకున్నారు. ఈ చట్టం అసలు ఉద్దేశ్యం ప్రశ్నిస్తున్న ప్రజలకు నష్టపరిహారం పేరుతో లక్షల రూపాయలు ఇచ్చి వారి వద్దనున్న విలువైన భూములను లాక్కొని కోట్లాది రూపాయల విలువైన భూములను బహుళ జాతి కంపెనీలకు అప్పచెప్పటమే.

తదనంతర కాలంలో అధికారం చేపట్టిన ఎన్‌డిఏ పాలకులు ప్రజలకు ఏదో మేరకు ప్రశ్నించటానికుండే అంశాలన్నింటినీ రద్దు చేస్తూ భూములను బడా సంపన్నులకు కట్టబెట్టేందుకు ఈ కనీసపాటి అడ్డంకులన్నింటినీ తొలగించివేస్తూ ఆర్డినెన్స్ చేశారు. ఈపాటికే దేశవ్యాపితంగా లక్షలాది ఎకరాల భూములను సెజ్‌లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, భారీ ప్రాజెక్టులు, బహుళ వరుసల రహదార్లు, అభయారణ్యాలు, టైగర్ పార్క్‌ల వంటి సవాలక్ష పేర్లతో చిన్న, మధ్య తరగతి రైతులచేతుల్లో నుండి గుంజివేసుకుంది. గిరిజనులను అడవుల నుండి గెంటివేసింది.

మరోవైపున వ్యవసాయ పంటల సాగు ఖర్చులను విపరీతంగా పెంచివేసి, రైతులకు సంస్థాగత రుణాలను నామమాత్రం చేసి, సబ్సిడీలను రద్దుచేసి, పండించిన పంటలకు న్యాయమైన ధర కూడా కల్పించకుండా సామ్రాజ్యవాద, బడా మార్కెట్ కంపెనీల దయాదాక్షిణ్యాల కొదిలివేసి-రైతాంగాన్ని నిండా రుణాల ఊబిలో పీకల్లోతు పూడ్చి వేసింది. ఈ విధంగా ఆర్థిక మీటలతో వ్యవసాయం గిట్టుబాటు కాదని రైతులనోటే చెప్పించి, వీరు-భూములను తెగనమ్ముకునే వారిగానో, వ్యవసాయాన్నొదలి పారిపోయే వారిగానో లేదా రుణభారం నుండి బయట పడలేక ఆత్మహత్యలకు పాల్పడేవారిగానో నెట్టబడుతున్నారు.

కేంద్రంలో, రాష్ట్రంలో పాలనా అధికారం చేతులుమారినా, పై విధానాల అమలులో ఎవరికెవరూ తీసిపోరని ఈ కాలంలో మన అనుభవాలు రుజువుపరుస్తున్నాయి.

గత రాష్ట్ర మహాసభల నాటికే 'ప్రత్యేక తెలంగాణా' రాష్ట్ర డిమాండ్‌తో ఆందోళన సాగుతూ వుంది. దశాబ్దాల కాలంగా ఉద్దేశ్యపూర్వకంగా కొన్ని ప్రాంతాలను తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిన పాలకులే, వారి అధికార ప్రయోజనాల కోసం ఆ ప్రాంతాల వెనుకబాటుకు మరో ప్రాంత ప్రజలను కారణంగా చూపెడుతూ ప్రాంతీయ విబేధాలను, విద్వేషాలను ఎగదోశారు.

ఒకవైపున ప్రత్యేక తెలంగాణా, మరోవైపున 'సమైక్య ఆంధ్ర' ఉద్యమాలంటూ సాగుతున్న నేపథ్యంలో దోపిడీ వర్గ పాలకులు సృష్టించే విద్వేషాలకు లోనుకాకుండా, వారి దోపిడీ విధానాలపై ప్రజలంతా ఐక్యంగా పోరాడాలనే విస్పష్ట వైఖరితో ప్రజల మధ్యకు వెళ్ళి, ఎంతోమందిని ఒప్పించగలిగాము, ఆలోచింప చేయగలిగాము. ఆనాడు అనేకానేక కారణాలతో విభజన-సమైక్య వాదాల వెంట నడిచిన వారు, ఈ రోజు ఆ వాస్తవాలను గుర్తించక తప్పటం లేదు.

విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలెదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించటానికి పూనుకోలేదు. తాము ఎన్నికలవేళ ఇచ్చిన హామీలైన రైతాంగ రుణాల రద్దు, చేనేత డ్వాక్రా రుణాల రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగాల కల్పన-వంటి అంశాలన్నింటినీ మోసపు మాటల మాటున ఎగవేసేందుకు పూనుకుంది. 'రాజధాని' నిర్మాణాన్ని ఏకైక ఎజెండాగా పెట్టి ప్రభుత్వ యంత్రాంగా న్నంతా దీనిపై మోహరించింది. కేంద్ర ప్రభుత్వ భూసేకరణ విధానం కంటే తాము రూపొందించిన 'భూసమీకరణే' ప్రజలకెంతో ప్రయోజకరమని ఊదరగొట్టింది. తుళ్ళూరు కేంద్రంగా గుంటూరు, కృష్ణా జిల్లాలలోని 29 గ్రామాల పరిధిలో 33 వేల ఎకరాలను సమీకరించేందుకు ఆఘమేఘాలపై పూను కుంది. క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిఆర్‌డిఏ)ను ఏర్పరచి, రైతుల నుండి భూములను 'సమీకరించింది'. సమీకరణకు సిద్ధం కాకపోతే, భూసేకరణ చట్టాన్ని ప్రయోగించైనా భూములను గుంజుకుంటామని బెదిరింపులకు గురి చేసింది. లోటు బడ్జెట్‌లో ఉన్నామంటూనే లక్షల కోట్ల రూ॥ ప్రణాళికలను సిద్ధం చేసి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెడు తోంది. రాజధాని నిర్మాణానికి ముక్కారు పంటలు పండే 33 వేల ఎకరాల భూములు ఎందుకని అందరొక్క గొంతుకై నిలదీసి నిలువరించలేకపోయాం.

ఇంతేగాక, చంద్రబాబు ప్రభుత్వం జిల్లాకొక లక్ష ఎకరాల భూములను సేకరించి 'భూబ్యాంకు' నేర్పరచి, బడా కార్పోరేట్లు అడిగిందే తడవుగా భూములిచ్చి వేయటానికి సిద్ధమని ప్రకటించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షంగా వుండి కోస్టల్, పెట్రో కారిడార్లను, బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ కార్యాచరణ చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం, అవే విధానాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తోంది.

ఈ కాలంలో రైతాంగం నీలం తుఫాన్, హుద్ హుద్ తుపాను వంటి పలు విపత్తులకు గురయ్యారు. కరువు, వర్షాభావం, అకాలవర్షాలతో చేతికొచ్చిన విలువైన పంటలను నష్టపోయారు. రైతుల- ముఖ్యంగా కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగాయి. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటాయి. వ్యవసాయమే ప్రశ్నార్థకం కాగా, గ్రామాల నుండి పొట్టచేత పట్టుకుని పెద్ద సంఖ్యలో గ్రామీణ పేదలు వలస పోతున్నారు. తీవ్ర అభద్రత నడుమ, వెట్టి చాకిరీ చేస్తూ నగరాల్లో, గల్ఫ్ దేశాల్లో దుర్భర జీవితం గడుపుతున్నారు. నిరుపేదలకు ప్రధాన జీవనాధారంగా వున్న ఉత్తరాంధ్రలో జూట్, చక్కెర, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటంతో వేలాదిమంది కార్మికులు వీధిన పడ్డారు.

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ప్రజానీకంపై పోలీసులు విరుచుకుపడి లాఠీఛార్జీలు, అరెస్టులు సాగించి, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. మరోవైపున ప్రజలను మభ్యపుచ్చే, మోసగించే పలు రకాల పథకాలతో నిరంతరం ప్రజలను వాటికోసం ఎదురుచూసే వారిగా, ప్రభుత్వ కార్యా లయాల చుట్టూ తిరిగే వారుగా మలుస్తున్నారు. అదే విధంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పేరుతో పెద్ద ఎత్తున అసభ్య, అశ్లీల సంస్కృతిని వ్యాప్తి చేస్తూ, మద్యం అమ్మకాలను పెంచివేస్తూ, ప్రజల మెదళ్ళను మొద్దుబారుస్తున్నారు. మత మైనారిటీలపై, దళితులపై మతోన్మాదుల, అగ్రకుల దురహంకారుల దాడులు, దౌర్జన్యాలు, వివక్ష రోజురోజుకీ పెరుగు తున్నాయి. కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి బాహాటంగా హిందు మతోన్మాదాన్ని రెచ్చగొడ్తూ, ప్రజల మధ్య అనైక్యతను పెంచి పోషించటానికి విద్యా సిలబస్‌లో మార్పుల నుండి రామజన్మభూమి అంశం వరకు లేవ నెత్తుతోంది. ఈ రోజు మైదానం మరియు ఏజన్సీ ప్రాంతాలతో సహా అన్ని ప్రాంతాల లోనీ ప్రజలను మతం పేరిట చీల్చి వేస్తున్నారు. మూఢనమ్మకాలను, అంధ విశ్వాసాలనీ టివిల ద్వారా విస్తృతమైన ప్రచారాన్ని సాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో - రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)గా పాలకుల అన్ని రకాల కుటిల ఎత్తుగడల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండటంతోపాటు, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడ్తూ, నిరంత రాయంగా నిలకడగా ఉద్యమ నిర్మాణ కృషిని సాగిస్తూ వస్తున్నాం.

ఈ రాష్ట్ర మహాసభలకు ముందుగా జిల్లాలలో సభ్యత్వం నమోదు చేసుకొని, 8 జిల్లాలలో మహాసభలను నిర్వహించుకొని, జిల్లా కార్యవర్గాలను ఎన్నుకున్నాం. ఆయా జిల్లాల మహాసభల కార్యవర్గ నివేదికలలో, ఆయా జిల్లాలలో సాగిస్తున్న కృషిని వివరంగా పేర్కొన్నాం. రాష్ట్ర కార్యకలాపాల నివేదికలో ఆయా జిల్లాలలో సాగించిన కొన్ని ముఖ్యమైన అంశాలకే పరిమితమౌతూ, రాష్ట్ర వ్యాపితంగా మనం సాగించిన కృషిని క్లుప్తంగా మీ ముందుంచుతున్నాం.

## రాష్ట్ర జనరల్ కౌన్సిల్

కాలుష్యకారక పెట్రో రిఫైనరీల నిర్మాణానికి వ్యతిరేకంగా, సెజ్‌లకు, పెట్రో కారిడార్‌లకు వ్యతిరేకంగా ఆందోళన సాగుతున్న నేపథ్యంలో; రాష్ట్రంలో కౌలు రైతాంగ హత్యలు తీవ్రమౌతూ, వారిని కనీసం రైతులుగా పరిగణించి సంస్థాగత రుణాలకు అర్హులుగా కూడా గుర్తించని నేపథ్యంలో, కోనసీమ ప్రాంతంలో 'పంట విరామం' అనే నినాదం ముందుకు తేబడిన నేపథ్యంలో **2011 అక్టోబర్ 24, 25 తేదీలలో** కాకినాడలో సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించుకున్నాం. ఈ సమావేశాలకు డా॥బి.డిశర్మ, ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, ఏఐకెఎమ్‌కెఎస్, కన్వీనర్

సుభోద్ మిత్రా, కా॥కానేటి మోహనరావు తదితరులు హాజరై ప్రసంగించారు. విరామం లేని పోరుబాటే రైతాంగం ముందున్న కర్తవ్యమని నొక్కి చెప్పారు. వివిధ సోదర సంఘాల సందేశాల అనంతరం కాకినాడలో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించు కున్నాం.

రెండవ రోజు జరిగిన ప్రతినిధుల సమావేశంలో 11 రాష్ట్రాలలో ఉద్యమ నిర్మాణాలలో పనిచేస్తున్న ఎఐకెఎమ్‌కెఎస్‌కు రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)ను అనుబంధం చేస్తూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని జనరల్‌కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనేకమంది ప్రజాస్వామిక వాదులను కలుపుకురాగలిగాం. కార్మిక, రైతాంగ అఖిల భారత సమ్మేళనంకు సన్నాహకంగా జనరల్ కౌన్సిల్ తోడ్పడింది.

'పంట విరామం' నినాదం వెనుక వ్యవసాయంలో యాంత్రీకరణను పెంచి సాంకేతిక యంత్ర సామాగ్రి వాడకాన్ని పెంచడం కోసం; గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు వర్తింపజేసే డిమాండ్లను స్థానిక భూస్వామ్యవర్గాలు ముందుకు తెస్తున్నారని; ఈ విధంగా ఒక వైపున వ్యవసాయ కూలీలను, మరోవైపున కౌలురైతులను చావుదెబ్బతీసే ఈ నినాదం -రైతాంగాన్ని సాగు నుండి దూరం చేసి భూములను కార్పోరేటు వ్యవసాయానికి అప్పగించేందుకు ఉద్దేశించినదేననే స్పష్టమైన అవగాహనతో జనరల్ కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించింది.

కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, వారిని రైతులుగా నమోదు చేసి సంస్థాగత రుణసౌకర్యాన్ని, సబ్సిడీల్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ చేసిన వివరణాత్మకమైన తీర్మానాలను జనరల్ కౌన్సిల్ ఆమోదించింది.

**సెజ్ బాధిత గ్రామాలలో రాష్ట్ర బృందం పరిశీలన**

తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడ, కొత్తపల్లి, తొండంగి మండలాల్లో కాకినాడ సెజ్ పేరిట 7500 ఎకరాలు సేకరించారు. ఈ భూముల నుండి రైతులను గెంటివేయటానికి పోలీసు నిర్బంధం ప్రయోగించారు. దీనిని ప్రతిఘటించిన రైతాంగంపై, ప్రజలపై 360కిపైగా అక్రమ కేసులు బనాయించారు.

ఈ నేపథ్యంలో మన సంఘం రాష్ట్ర నాయకత్వంతో పాటుగా డా॥బి.డి.శర్మ, ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరిలతో కలసి **2011 అక్టోబరు 23న** ఆయా గ్రామాలలో బృందం పర్యటించి బాధిత ప్రజానీకంతో పలు సమావేశాల్లో మాట్లాడారు. ఈ సందర్భంగా "తలపాగాలు చుట్టండి-కర్రలు పట్టండి. ఐక్యంగా సెజ్ అధికారులను తరిమి కొట్టండి" అని డా॥బి.డి.శర్మ పిలుపు నిచ్చారు. దళిత బహుజన వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఐ.సూర్యనారాయణ, బాధిత గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**2012 ఫిబ్రవరి 14, 15** తేదీలలో మరో పర్యాయం మన సంఘం రాష్ట్ర స్థాయి బృందం సెజ్ బాధిత గ్రామాలలో ప్రజలను కలిసి సంఘీభావం తెలిపారు. భూములపై హక్కు కోసం పోరాడుతున్న వారిపై సాగుతున్న దాడులను ఖండించారు.

## థర్మల్, అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా......

### సోంపేట

శ్రీకాకుళంజిల్లా సోంపేట, సంతబొమ్మాళి మండలాలలో మెగా థర్మల్ విద్యుత్తు కేంద్ర నిర్మాణాలకు; రణస్థలం మండలం కొవ్వాడలో అణువిద్యుత్తు కేంద్ర నిర్మాణానికి పాలకులు అనుమతించి, అందుకొరకు పెద్ద ఎత్తున రైతుల భూములను సేకరించేందుకు పూనుకున్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వివిధ రూపాల్లో తమ నిరసనను, అసమ్మతిని తెలియపరుస్తున్న నేపథ్యంలో రైతుకూలీ సంఘం, కార్మిక, మహిళా సంఘ ప్రతినిధులతో కూడిన రాష్ట్రస్థాయి బృందం **2010 జులై 9, 10** తేదీల్లో సోంపేట, సంతబొమ్మాళి, రణస్థలం ప్రాంతాలలో పర్యటించింది. ప్రజలు ఆగ్రహంతో బద్దల వటానికి సిద్ధంగా వున్నారని హెచ్చరిస్తూ నివేదికను పత్రికలకు విడుదల చేసింది.

సరిగ్గా దీనికనుగుణంగానే **2010 జులై 14న** సోంపేట బీల గ్రామాల్లోకి పోలీసులు ఎన్‌సిసి తరపున రంగంలోకి దిగి ప్రజలపై లాఠీఛార్జీ జరిపి, కాల్పులు జరిపి ఇద్దర్ని అక్కడికక్కడే బలిగొన్నారు. వందలాది మందిని లాఠీఛార్జీలో గాయపరిచారు.

ఈ ఘటన వెనువెంటనే ఇతర ప్రజాసంఘాలతో కలిసి రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ప్రతినిధి బృందం **జులై 15న** సోంపేట చేరుకుని మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించింది. ప్రజల ప్రతిఘటనను అభినందించింది.

సోంపేటలో పోలీసుల కాల్పులను నిరసిస్తూ **జులై 14వ తేదీ** రాత్రి వేళలోనే శ్రీకాకుళం పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించాం. రాష్ట్రంలోని వివిధ కేంద్రాలలో సోంపేట కాల్పులను నిరసిస్తూ ప్రదర్శన, రాస్తారోకో, ధర్నా కార్యక్రమాలు నిర్వహించాం. ఈ సమస్యలకున్న ప్రధాన రాజకీయ కారణాలను ప్రజలముందు పెట్టటానికి ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న వారు సంసిద్ధంగా లేరు. కనుక అసలు కారణాలను వివరించటానికే ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు రైతుకూలీసంఘం (ఆం.ప్ర), ఎపిఎఫ్‌టియుల ఆధ్వర్యంలో సోంపేట కాల్పులను నిరసిస్తూ, ఆ ప్రాంత ప్రజానీకపు ఆందోళనకు మద్దతుగా ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును **2010 సెప్టెంబరు 5న** విశాఖపట్నంలో నిర్వహించాం. మన సంఘ నాయకత్వంతో పాటు, డా॥బి.డి.శర్మ, డా॥పి.జస్వంతరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అప్పటికి కా॥అర్జున్‌ను మావోయిస్టులు చంపి నెలరోజులు అయింది. అంతటి దుఃఖంలో కూడా ఈ సదస్సుని నిర్వహించు కున్నాం.

### కాకరాపల్లి

శ్రీకాకుళంజిల్లా సంతబొమ్మాళి మండలంలో 2468 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం చేయతలపెట్టిన మెగా థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిరసిస్తూ ప్రభావిత గ్రామాల ప్రజలు ఆందోళన సాగించారు.

**2011 ఫిబ్రవరి 25న** ఆందోళనకారులపై వడ్డితాండ్ర గ్రామంలో పోలీసులు లాఠీఛార్జీ జరిపి బాష్పవాయువు ప్రయోగించారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ప్రభుత్వం ఫిబ్రవరి 28న వేలాదిమంది పోలీసులను

వడ్డితాండ్ర, కాకరాపల్లి గ్రామాల్లో మోహరించింది. బీభత్సం సృష్టించింది. పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు ఆందోళనాకారులు మృతి చెందారు. అనేకమందికి తీవ్ర గాయాలయ్యాయి.

పోలీసు కాల్పులను నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో మర్నాడు శ్రీకాకుళం బంద్‌లో పాల్గొన్నాం. బాధిత గ్రామాలను, మృతుల కుటుంబాలను పరామర్శించాం. రాష్ట్రంలోని వివిధ కేంద్రాలలో ఈ ఘటనను నిరసిస్తూ కార్యక్రమాలు నిర్వహిచాము.

ఈ నేపథ్యంలో **'ప్రజల జీవనాన్నీ, పర్యావరణాన్నీ విధ్వంసం చేసే పాలకుల అభివృద్ధి నమూనా'** అంశంపై రైతుకూలీ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు **2011 జులై 10న** శ్రీకాకుళంలో నిర్వహించాం. మన సంఘ రాష్ట్ర నాయకత్వంతోపాటు ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి ఈ సదస్సులో పాల్గొని, నీటి వనరులు పుష్కలంగా ఉండి పంటలు పండే ప్రాంతాలలో, కాలుష్యం వెదజల్లే ఈ కర్మాగారాలను నిర్మించటాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఉత్తరాంధ్రలో భారీ పరిశ్రమలు పెట్టి అభివృద్ధి చేస్తామంటున్న పాలకులు చిన్న చిన్న పరిశ్రమలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు నిలదొక్కుకోవటానికి కనీస సహాయం చేయటం లేదు. కనుక వ్యవసాయాధారిత పరిశ్రమలను వెంటనే కాపాడాలి. అదే విధంగా మినీ రిజర్వాయర్లు కట్టి వ్యవసాయానికి ఉపయోగమైన భూములకు సాగునీరు అందించి సాగు విస్తీర్ణం పెంచాలని డిమాండ్ చేశాం. సోంపేట థర్మల్ పవర్ ప్లాంటు పేరుతో స్వాధీనం చేసుకున్న భూములన్నింటినీ భూమిలేని నిరుపేదలకు పంచాలంటూ సదస్సులో సందేశాన్నిచ్చాం.

### కోటిపాం

విజయనగరంజిల్లా, కొమరాడ మండలం, కోటిపాం వద్ద 1675 ఎకరాల విస్తీర్ణంలో భారీ ప్రైవేటు థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి నిచ్చింది. బడా పెట్టుబడిదారీ, బహుళజాతి కార్పోరేటు సంస్థల విద్యుత్తు అవసరాల కోసం పంట భూములను, ప్రజావనరులన్నింటినీ కట్టబెట్టే ఈ మెగా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో బాధిత గ్రామాలన్నింటా వివిధ రూపాల్లో నిరసనాందోళనలు సాగించారు. **2010 జులై 16, 17** తేదీల్లో రై.కూ.సం, కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర బృందం బాధిత గ్రామాలలో ప్రజలను కలిసి సంఘీభావం తెలిపారు.

కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ **2011 మే 13న** పార్వతీపురం మార్కెట్ యార్డులో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించాం. డా॥బి.డి.శర్మ ఈ సదస్సుకు హాజరై ప్రజల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

ప్రజల నిరసనాందోళనను బేఖాతరు చేస్తూ, ప్రజల సాగుభూములను చుట్టుముట్టి **2012 జనవరి 3న** కోటిపాంలో థర్మల్ ప్లాంటు యాజమాన్యం కంచె నిర్మాణానికి పూనుకుంది. ఈ ప్రయత్నాలను మన సంఘం ఆధ్వర్యంలో ప్రజలు మిలిటెంట్‌గా అడ్డుకుని కంచెను పీకి పారేశారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సీ నేతృత్వంలో **2012 జనవరి 6న** రాష్ట్రస్థాయి పరిశీలనా బృందం బాధిత గ్రామాలన్నింటా పర్యటించింది. విద్యుత్తు కేంద్రానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, ఆందోళనాకారులపై కంపెనీ యాజమాన్యం బనాయించిన తప్పుడు కేసులు రద్దు చేయాలని పరిశీలనా బృందం డిమాండ్ చేసింది.

ఈ ఉద్యమాన్ని విస్తృతపరిచి ముందుకు తీసుకువెళ్ళేందుకు మన సంఘం చొరవతో వివిధ పార్టీల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ నాయకత్వంలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన రెవిన్యూ సదస్సులను ప్రజలు అడ్డుకున్నారు. రోడ్లను దిగ్బంధించి అధికారులను గ్రామంలోకే రానీయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో సంఘ నాయకత్వం, ప్రజలు అనేక అక్రమ అరెస్టులను, కేసులను ఎదుర్కొన్నాం.

థర్మల్, అణువిద్యుత్ కేంద్రాల నిర్మాణం సమస్యను కొన్ని స్వచ్ఛంద సంస్థలు కేవలం పర్యావరణ సమస్య మేరకే పరిమితం చేస్తూ వచ్చారు. ఈ అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం వెనుకనున్న సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను, వాని ప్రజావ్యతిరేక స్వభావాన్ని మనం విస్తృతంగా ప్రచారం చేశాము. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు థర్మల్ విద్యుత్ కేంద్రాలను వ్యతిరేకించటానికే పరిమితమై అంతకు ఎన్నో రెట్లు ప్రమాదకరమైన అణువిద్యుత్ (కొవ్వాడ) కేంద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా నోరుమెదపకపోవటాన్ని మనం ఎత్తి చూపి మన శ్రేణులకు సరైన అవగాహనను అందించటానికి ప్రయత్నించాం. ఈ ఆందోళనలో ఐక్యకార్యాచరణలో మనతో కలిసి వచ్చిన రాజకీయ పార్టీలకు ఈ ఉద్యమాన్ని దీర్ఘకాలికంగా కొనసాగించే ఓపిక లేదు. ఏవో కొన్ని అద్భుతాలతో ప్రచారంలో వుంటే చాలు అనే ఆలోచనలలో వున్న వ్యక్తులు, శక్తులు కూడా వున్నారంటే ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. ఈ ఆందోళనలో పాల్గొన్న కార్యకర్తలపై అనేక తప్పుడు కేసులు బనాయించి ఈ రోజుకూ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు.

### కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా సదస్సు

**2015 జనవరి 4న** శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో ప్రజా జీవనాన్ని ధ్వంసం చేసే కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జిల్లా స్థాయి సదస్సు జరిగింది. కా॥టి.అరుణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డా॥పి.జశ్వంతరావు, ఝాన్సీ, వర్మ, భానుమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సామ్రాజ్యవాద దేశాలు వారి వారి దేశాల్లో నిషేధించిన అణు రియాక్టర్లను మన దేశంలో నెలకొల్పడానికి భారత పాలకులు సిద్ధమౌతున్నారన్నారు. శ్రీకాకుళం నుండి ఉపాధ్యాయులు, ఉద్యోగవర్గాలు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల నుండి 300 మంది బాధిత గ్రామాల ప్రజలు ఈ సదస్సుకు హాజరయ్యారు.

### అఖిల భారత కార్మిక, రైతు-కూలీ సమ్మేళనం

నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికి కార్మిక, రైతు-కూలీ ఐక్య ఉద్యమ

ఆవశ్యకతను నొక్కి చెపుతూ **2011 డిసెంబరు 18న విశాఖపట్నంలో** ఏఐఎఫ్‌టియు(న్యూ), ఏఐకెఎమ్‌కెఎస్‌ల ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనానికి మన రాష్ట్ర సంఘం ఆతిధ్యమివ్వటంతోపాటు, పెద్ద సంఖ్యలో ప్రజాసమీకరణతో కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించుకున్నాం. రెండు సంఘాలకు చెందిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు.

సమ్మేళనం అనంతరం ఉత్తేజకరంగా ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించుకున్నాం. "కాలం చెల్లింది-దున్నేవానికే భూమి' నినాదానికి కాదు! కాలం చెల్లింది భూస్వామ్య, సామ్రాజ్యవాదానికేనని" వక్తలు తమ ప్రసంగాల్లో నొక్కి చెప్పారు. ఇంగ్లీషు, హిందీ భాషల్లో ఈ సమ్మేళనం విశేషాలతో సావనీర్‌ను తీసుకువచ్చాం.

## ఏఐకెఎమ్‌కెఎస్ అఖిల భారత సదస్సు

**2011 డిసెంబరు 19న** ఏఐకెఎమ్‌కెఎస్ అఖిల భారత సదస్సు **శ్రీకాకుళంలో** నిర్వహించుకున్నాం. సదస్సు ప్రారంభానికి ముందుగా శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరుల స్మారక స్థూపం వద్ద కా॥కానూసన్యాల్ సహచరుడు, పశ్చిమ బెంగాల్ రైతాంగ ఉద్యమ నాయకులు కా॥ఖుదన్ మల్లిక్ ఏఐకెఎమ్‌కెఎస్ జెండాను ఆవిష్కరించారు. అమరులకు జోహార్లర్పించారు. 13 రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులందరూ స్థూపం వద్ద నివాళులర్పిస్తూ ఉద్వేగభరితులయ్యారు.

**'ఏఐకెఎమ్‌కెఎస్ లక్ష్యాలు-కర్తవ్యాలు'** మరియు **'ఏఐకెఎమ్‌కెఎస్ నిబంధనావళి'** పత్రాలను సదస్సు చర్చించింది. ప్రతినిధుల సూచనలు, సవరణల అనంతరం పత్రాలను సదస్సు ఆమోదించింది. కా॥సుబోధ్ మిత్రా కన్వీనర్‌గా కా॥యస్.ఝాన్సీ కో-కన్వీనర్‌గా, కా॥ఎన్.డి.బోస్‌ను కోశాధికారిగా ఎన్నుకోవటం జరిగింది. వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే 19మంది సభ్యులతో కార్యవర్గాన్ని ప్రతినిధులు ఎన్నుకున్నారు. కార్మిక-రైతాంగ ఐక్యతను సాధిద్దామనే పిలుపుతోపాటు పలు అంతర్జాతీయ, జాతీయ రాజకీయార్థిక, వ్యవసాయ విధానాలపై సదస్సు తీర్మానాలను ఆమోదించింది.

## రైతుకూలీసంఘాల సంయుక్త సదస్సు

**'వ్యవసాయరంగ సంక్షోభం-భూమి సమస్య-పాలకుల విధానాలు'** అనే అంశంపై రైతుకూలీసంఘం(ఆం.ప్ర) మరియు ఆంధ్ర ప్రదేశ్ రైతుకూలీసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో **2013 జూన్ 4న హైదరాబాద్‌లో** రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించుకున్నాం.

ఇరు సంస్థల రాష్ట్ర అధ్యక్షుల అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విశ్రాంత ఐఎఎస్ అధికారి శ్రీ యుగంధర్, ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భూమి సమస్య, కౌలుదార్ల సమస్య, పంట విరామ సమస్య, గిట్టుబాటు ధరల సమస్య వంటి సమస్యల మూలాల్లోకి వెళ్ళకుండా, ఏ సమస్యకు ఆ సమస్యను విడగొట్టి పరిష్కారాన్ని కనుగొనటం సాధ్యం కాదని, దళితుల ఆత్మగౌరవ సమస్యతో సహా గ్రామీణ పేదలందరి సమస్యలు భూమి సమస్య చుట్టూతా కేంద్రీకరించబడి వున్నాయని, 'దున్నేవానికే భూమి' నినాదానికి కాలం చెల్లిందనే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, **'రైతుకూలీసంఘం వార్షిక సంచిక-2012'** ను ఆవిష్కరించారు. పోరాడుతున్న ప్రజల గొంతుకగా పేర్కొంటూ, ఆయన ఈ సంచికను పరిచయం చేశారు.

## రైతుకూలీసంఘం ఐక్యతా కృషి

రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)గా వున్న మనం కామ్రేడ్ భూతం వీరయ్య, నల్లాన స్వామీరావు అధ్యక్ష కార్యదర్శులుగా వున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం-రెండూ ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చాం. మన రాష్ట్ర కార్యవర్గంలో ఈ రెండు రైతుకూలీసంఘాల ఐక్యతపై చర్చించాము. ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘంతో ప్రణాళికా ప్రాతిపదికపై ఐక్యతా క్రమంలోకి వెళ్ళటానికి 2013 జులైలో జరిగిన మన రాష్ట్ర కార్యవర్గంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశాం.

రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేథప్యంలో 2014 జూన్ నాటికి రెండు రాష్ట్రాలుగా విడివడ్డాము. దీనితో రెండు రాష్ట్రాలలోని మన మన సంఘాల కామ్రేడ్స్‌తో రెండు సంఘాలుగా ఏర్పడి, ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధంగా కొనసాగాలని నిర్ణయించుకున్నాము.

రెండు సంఘాలుగా ఏర్పడిన తరువాత రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తరఫున గుంటూరులో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలనుకున్నాం. అదే విధంగా వరంగల్‌లో కూడా రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గంగా నిర్ణయించుకున్నాం.

## లక్షింపేట దళితులపై కులదురహంకార పెత్తందార్ల దాడిని ఖండిస్తూ తీసుకున్న ప్రచారాందోళనా కార్యక్రమాలు

శ్రీకాకుళంజిల్లా లక్షింపేట దళితులపై కులదురహంకార పెత్తందార్లు 2012 జూన్ 12న మారణాయుధాలతో దాడికి పాల్పడి ఐదుగురిని హతమార్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సీ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బృందం లక్షింపేట వెళ్ళి, దాడులలో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పాము. దాడులలో క్షతగాత్రులై శ్రీకాకుళం, విశాఖ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించాము. రాష్ట్ర పరిశీలనా బృంద నివేదికను పత్రికలకు వెల్లడి చేశాము.

కరపత్రాలు, పోస్టర్లతో ఈ హత్యాకాండను ఎలుగెత్తి ఖండించాము. లక్షింపేట ఉద్యమవార్తలు, వ్యాసాలతో రెండు బులిటెన్‌లను తీసుకువచ్చి విస్తృత ప్రచారం చేశాము. రైతుకూలీసంఘంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరస ప్రదర్శనలు నిర్వహించాం. హైద్రాబాదులో లక్షింపేట దళితులకు సంఘీభావంగా **2012 జులై 14న 'లక్షింపేట దళితన్న చిందించిన రక్తం-పీడిత, దళిత ప్రజానీకం ముందుంచుతున్న కర్తవ్యం'** కేంద్ర అంశంగా రాష్ట్ర సదస్సు నిర్వహించాము. **'అణచబడ్డ దళితులంతా తిరగబడండి'** (144 పేజీలు) అనే రైతుకూలీసంఘం ప్రచురణను

'లక్ష్మింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ' కన్వీనర్ బొజ్జా తారకంగారు ఈ సదస్సులో ఆవిష్కరించారు.

లక్షింపేట దళితులకు భూమిపై హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ సదస్సు అనంతరం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ప్రదర్శన నిర్వహించాము.

ఈ ఘటనపై రాష్ట్రవ్యాపితంగా ఇతర దళిత, ప్రజాసంఘాలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టాము. ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయవాది, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి బొజ్జా తారకంగారు కన్వీనర్‌గా అనేక దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ'లో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) భాగస్వామ్య సంఘంగా, మన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సీ ఆ కమిటీకి ఓ కో-కన్వీనర్‌గా-సంఘీభావ కమిటి పిలుపుల అమలులో చురుకైన పాత్ర నిర్వహించాము.

సంఘీభావ కమిటి పిలుపు మేరకు 2012 జులై 4న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగిన ధర్నాలలో చురుగ్గా పాల్గొన్నాం. 2012 జులై 21న 'చలో తిరుపతి', జులై 28న 'చలో విశాఖ', ఆగస్టు 6న చుండూరు దళిత మృతవీరుల వేదికపై 'చలో విజయవాడ', సెప్టెంబర్ 2న 'చలో వరంగల్-సదస్సులలో క్రియాశీలకంగా పాల్గొన్నాం.

అనంతరం 2012 సెప్టెంబర్ 6వ తేదీన సంఘీభావ కమిటి పిలుపు మేరకు 'చలో ఢిల్లీ'లో పాల్గొని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించి కమిటీ తరపున కేంద్ర హోం శాఖా మంత్రికి మెమోరాండం అందజేశాం.

దాడికి గురైన లక్షింపేట దళితులకు న్యాయం చేయాలంటూ లక్షింపేట నుండి 100 కిలోమీటర్లు 4 రోజులపాటు అక్టోబర్ 13 నుండి 16 వరకు పాదయాత్ర చేశాం. రైతుకూలీసంఘంగా 25మంది కళాకారులతో మరో 25మంది కార్యకర్తలతో పాదయాత్రలో పాల్గొన్నాం. పాదయాత్ర అనంతరం శ్రీకాకుళంలో జరిగిన బహిరంగ సభలో వందలాదిమందిని సమీకరించాం. 92 సంవత్సరాల వృద్ధులు, 12 సంవత్సరాల బాలులు రైతుకూలీసంఘం తరపున ఈ పాదయాత్రలో పాల్గొనటం ఒక ప్రత్యేకతను తెలియజేసింది.

2012 నవంబర్ 12న సంఘీభావ కమిటి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లా కేంద్రాలలో ప్రదర్శనలు నిర్వహించి, కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు.

2012 డిశంబర్ 20న హైదరాబాద్‌లో సంఘీభావ కమిటీ అధ్వర్యంలో వేలాది మందితో ప్రదర్శన అనంతరం ఇందిరా పార్కు వద్ద 'మహాధర్నా' నిర్వహించారు.

సంఘీభావ కమిటి ఆధ్వర్యంలో సుదీర్ఘ కాలం సాగిన అనేక ఆందోళన, నిరసన కార్యక్రమాల ఫలితంగా దళితులపై దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేయక ప్రభుత్వ, పోలీసు యంత్రాంగానికి తప్పలేదు. అలాగే సత్వరం దోషులను విచారించేందుకు లక్షింపేటలో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను సాధించుకోగల్గాం. ముఖ్యంగా -మడ్డువలస రిజర్వాయర్ మునక భూములపై దళితులకు హక్కు కల్పించాలనే డిమాండ్ సాధించుకోవలసే వుంది.

ఈ డిమాండ్స్‌ను నెరవేర్చాలంటూ 2013 ఏప్రిల్ 11 నుండి ఏప్రిల్ 14 వరకు సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా ధర్నా నిర్వహించాం. ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణతో పాటుగా సంఘీభావ కమిటీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చుండూరు దళిత హంతకులను నిర్దోషులని హైకోర్టు తీర్పునివ్వటంపై

1991 ఆగస్టు 6న గుంటూరుజిల్లా చుండూరులో దళితవాడపై అగ్రకుల భూస్వాములు జరిపిన హత్యాకాండలో 8 మంది దళితులు బలయ్యారు. 16 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం, చుండూరులోనే ఏర్పరచిన ప్రత్యేక కోర్టు 2007లో 21మందికి జీవిత ఖైదు, 35 మందికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది. ఈ తీర్పే అన్యాయమైనది కాగా, రాష్ట్ర హైకోర్టు వీరందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ 2014 ఏప్రిల్ 22న తీర్పు నిచ్చింది. వీరు చెల్లించిన జరిమానాలను తిరిగి ఇచ్చివేయాలని, అనవసరంగా జైళ్ళలో ఉన్నందుకు విచారం వ్యక్తం చేసింది కూడా! ఈ దుర్మార్గమైన తీర్పును ఖండిస్తూ మనం తీర్పు వెలువడిన రోజే కరపత్రం తీసుకొచ్చి విస్తృత ప్రచారం చేశాం. 'న్యాయ' పోరాటాలకే పరిమితమైతే దళితులకు, పీడితులకు న్యాయం దక్కదని, పీడిత ప్రజానీకమంతా సంఘటిత పోరాటాల ద్వారానే దానిని సాధించుకోగలరని వివరించాం.

సహజ న్యాయ సూత్రాలకే భిన్నంగా ఏకపక్షంగా హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును నిరసిస్తూ బొజ్జా తారకంగారు ఛైర్మన్‌గా రైతుకూలీ సంఘంతో సహా దాదాపు 40 దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో **'చుండూరు దళితుల న్యాయ పోరాట కమిటీ'** ఏర్పడి పలు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో వుంచుకొని ఈ కమిటీలో భాగస్వామ్య సంఘాలు పరస్పరం దూషించుకోకూడదనే షరతుపై ఈ కమిటీలో చేరి, కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా పాల్గొన్నాం. గుంటూరు, అనంతపురం జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాల నిర్వహణకు బాధ్యత తీసుకొని సమర్ధవంతంగా నిర్వహించాము.

**'జడ్జీల నియామకం-జవాబుదారీతనం'** అఖిల భారత అంశంగా తీసుకొని ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలనే నిర్ణయానికను గుణంగా **తిరుపతి, విశాఖ, విజయవాడలలో** జరిగిన **ప్రాంతీయ సదస్సులలో** పెద్ద సంఖ్యలో జనసమీకరణతో పాల్గొన్నాం. న్యాయస్థానాలలో పోరాటం ద్వారా మాత్రమే దళిత, పీడిత ప్రజానీకానికి న్యాయం జరగదని, దీనికి కారణమైన దోపిడీ వ్యవస్థ రద్దుకై పోరాడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తూ మన అవగాహనను ఈ వేదికలపై నుండి శక్తివంతంగా విన్పించాం.

రాష్ట్రంలోని వివిధ దళిత, ప్రజాస్వామిక శక్తుల నడుమ మన రాజకీయ అవగాహన, ఆచరణలను విస్తృతంగానే తీసుకెళ్ళేందుకు సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో దీర్ఘకాలం సాగిన ఐక్యకార్యాచరణ తోడ్పడింది. కమ్యూనిస్టు, విప్లవ శక్తులపై బహిరంగంగా, అకారణంగా దూషణలకు పాల్పడే కొన్ని

సంఘాలు/ కొందరు వ్యక్తులపై సంఘర్షణ పడి కొంతమేరకు నిలువరించగలిగాం. రాష్ట్రంలో వివిధ రూపాల్లో సాగుతున్న ఫ్యూడల్ అణచివేతలకు వ్యతిరేకంగా ఆధిపత్య కులదురహంకారుల నుండి విడ గొట్టుకొని అన్ని కులాల్లోని పీడితులు, శ్రమ జీవులైన పేదలు, కులద్వేషాలకు గురి గాకుండా దళిత శక్తులతో కలగలసి ఐక్య ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకతను ఈ ఆందోళనా క్రమంలో విస్తృతంగా తీసుకు వెళ్ళగలిగాము.

****

## వ్యవసాయరంగ సంక్షోభంపై రాష్ట్ర సదస్సు

**'పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుతో తీవ్రమౌతున్న వ్యవసాయ రంగ సంక్షోభం-రైతు కూలీ, దళిత, ఆదివాసీ ప్రజలముందున్న కర్తవ్యాలు'** అంశంపై **2012 డిసెంబరు 18, 19 తేదీల్లో విజయవాడలో** సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించాం. రాష్ట్ర వ్యాపితంగా వెయ్యిమంది హాజరైన ఈ సదస్సుకు ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, ప్రొఫెసర్ గోలక్ బీహారీనాథ్ (సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం -ఒరిస్సా) హాజరై ప్రసంగించారు.

ఈ సదస్సులో **'తీవ్రమౌతున్న వ్యవసాయ రంగసంక్షోభం-దళితులు, ఆదివాసులపై సాగుతున్న దోపిడీ అణచివేత- కర్తవ్యాలు', 'కోస్టల్, పెట్రో కారిడార్లు-సెజ్‌లు, థర్మల్-అణువిద్యుత్ కేంద్రాలు-పాలకుల విధానాలు-ప్రజల కర్తవ్యాలు'** అనే అంశాలపై రాష్ట్ర నాయకత్వం ప్రసంగించింది. టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన ఫ్రెడెరిక్ ఎంగెల్స్ రచన **'జర్మనీలో రైతు యుద్ధం'** పుస్తకాన్ని డా॥పి.జశ్వంతరావు ఈ సదస్సులో పరిచయం చేస్తూ ప్రసంగించారు. ఈ కాలంలో మనం చేసిన కార్యక్రమాలనే మదింపు చేసుకుంటూ మన రాజకీయ అవగాహనను మరొకసారి నొక్కి వక్కాణించాం.

****

## రుణమాఫీ బూటకత్వాన్ని వెల్లడి చేస్తూ

తాము అధికారంలోకి వస్తే రైతాంగం యొక్క అన్ని రకాల అప్పులు రద్దు చేస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నమైన ప్రకటనలు చేస్తూ రైతాంగంలో గందరగోళం, ఆందోళన సృష్టించింది. రైతాంగం రుణమాఫీపై అనేక చర్చలకు అవకాశం కల్పించింది.

పాలకుల విధానాల ఫలితంగా వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో పడింది. దుర్భిక్ష పరిస్థితులతోపాటు, సాగునీరు అందకపోవటం, సంస్థాగత రుణాలు, పంటలకు న్యాయమైన ధరలు, మార్కెట్ సౌకర్యం లేకపోవటం రైతాంగానికి సేద్యం నష్టదాయకంగా మారింది. ఫలితంగా అప్పుల పాలైన రైతాంగం దాన్నుండి బయట పడలేక బలవన్మరణాలను ఆశ్రయిస్తున్నారు. దుర్భిక్ష పరిస్థితుల వలన గ్రామీణ పేదలతోపాటు, చిన్న, సన్నకారు రైతులు వలస పోతున్నారు.

వ్యవసాయ సంక్షోభానికి, రుణమాఫీ ఎడల పాలకుల విధానాల గురించి, దుర్భిక్ష పరిస్థితుల గురించి ఒక స్పష్టతను కల్పించేందుకు **2014 జులై 27, 28 తేదీల్లో గుంటూరులో రాష్ట్ర సదస్సును** విజయవంతంగా నిర్వహించాము.

వ్యవసాయ సంక్షోభానికి కారణాలు, రైతుల ఆత్మహత్యలకు కారణాలు వివరించారు. పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటం, సాగునీరు, సంస్థాగత రుణాలు, మార్కెట్ సౌకర్యం లేకపోవటం వలన రైతాంగం అప్పుల పాలౌతున్నారని, ఈ మౌలిక సమస్యలు పరిష్కారం అయినప్పుడే రైతాంగం అప్పుల నుండి బయటపడతారని, 57 సంవత్సరాల రాష్ట్ర అవతరణలో రైతాంగం ఎదుర్కొంటున్న ఈ సమస్యల్లో ఒక్క దాన్ని కూడా పాలకులు పరిష్కరించలేదని సదస్సులో ప్రసంగించిన వక్తలు ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, డా॥కొల్లా రాజమోహన్, సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటీ సభ్యులు కా॥పి.జస్వంతరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సీ తదితరులు వివరించారు.

కౌలు రైతులతో సహా రైతుల రుణాలన్నింటినీ రద్దు చేయాలనీ, కౌలు రైతులకు రక్షణ కల్పించాలనీ, గ్రామీణ పేదల వలసలు నివారించాలనీ, పేదలకు భూపంపిణీ చేయాలనీ, నిర్బంధ భూసేకరణను ఆపివేయాలనీ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలనీ, గ్రామీణ ఉపాధి హామీ పనులను, వ్యవసాయ పనులకు జోడించరాదనీ తదితర తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సదస్సులో ప్రజాకర్షణ పథకాలు ప్రజలను మభ్య పెట్టటానికి తప్ప ఏ విధంగా ఉపయోగపడటం లేదనే అవగాహనకు రాగలిగాం.

సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు రుణమాఫీతోపాటు రైతాంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలకు కారణాలపై స్పష్టత ఏర్పడింది. ఈ అంశాల్ని అధ్యయనం చెయ్యాలని సదస్సు పిలుపునిచ్చింది. దాని ప్రకారం ప్రతిజిల్లాలో సర్వే నిర్వహించాము.

****

## భూసేకరణ-భూసమీకరణ రాజధాని అంశంపై

ఆంధ్రప్రదేశ్ రెండు (ఆంధ్రప్రదేశ్-తెలంగాణ) రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, తెలంగాణాలో టి.ఆర్.యస్ పార్టీలు ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి.

ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని ఏర్పాటుకి గుంటూరుజిల్లాలోని తుళ్ళూరు ప్రాంతాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. సింగపూర్ తరహా రాజధానిని ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అందుకోసం లక్ష ఎకరాలు అవసరమన్నాడు. రాజధానికి భూమి ఎంత కావాలన్న దానిపై చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. రైతాంగం నుండి భూసమీకరణ అన్న ప్రభుత్వ విధానంపైనా ఇలాంటి చర్చలే జరిగాయి. ప్రభుత్వం బలవంతపు భూసమీకరణకు పూనుకొన్నది. పరిశ్రమాధిపతులకు యిచ్చేందుకు రాష్ట్ర వ్యాపితంగా 10 లక్షల ఎకరాలతో భూ బ్యాంక్ ఏర్పాటును ప్రభుత్వం ప్రకటించింది. అనేక పంటలు పండే సారవంతమైన భూములు తీసుకోవటాన్ని అనేక గ్రామాల రైతులు వ్యతిరేకించారు. ఉద్యమ బాట పట్టారు. 2013 భూసేకరణ చట్టానికి

ఎన్.డి.ఎ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా సవరణ చేసి రైతుల అనుమతి లేకుండానే భూసేకరణ చేస్తానన్నది. ఈ సవరణలపైనా, ఏది మంచిదన్న దానిపైనా వాదనలు జరిగాయి.

ఇలాంటి నేపథ్యంలో భూసేకరణ చట్టం, భూసమీకరణ, రాజధాని ఏర్పాటుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించటానికి **19-4-2015న రైతుకూలీసంఘం మంగళగిరిలో రాష్ట్రస్థాయి సదస్సు** నిర్వహించింది. ప్రముఖ హైకోర్టు న్యాయవాది, ఆర్.పి.ఐ జాతీయ అధ్యక్షులు బొజ్జా తారకం, సిపిఐ(ఎం-ఎల్) కేంద్ర కమిటీ సభ్యులు కా॥పి.జస్వంతరావు, గుర్రం విజయకుమార్, మన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సీ, శ్రీ వడ్డే శోభానాద్రీశ్వరరావు తదితరులు భూసేకరణపై అనేక కోణాల నుండి వివరించారు.

సదస్సు ముగింపుగా మన సంఘం అభిప్రాయాన్ని స్పష్టపర్చాము. 1894లో బ్రిటీష్ వలస పాలకులు చేసిన భూసేకరణ చట్టాన్ని ఎటువంటి మార్పులు లేకుండా 1980 వరకు భారత దోపిడీ పాలకులు అమలుపర్చారని, రైతాంగ ఉద్యమాల ఫలితంగా 1980లో నష్టపరిహారం, పునరావాసం గురించి చట్టంలో చేర్చటం జరిగిందని, ఆ తర్వాత 2013 వరకు ఎటువంటి మార్పులూ చట్టంలో చేయలేదని పేర్కొంది. భూసేకరణకు వ్యతిరేకంగా రైతాంగం ఆందోళన బాటపట్టిన ఫలితంగా యు.పి.ఎ ప్రభుత్వం కొన్ని సవరణలు చేసిందని, దానివలన ప్రభుత్వ భూసేకరణకు 60 శాతం, ప్రైవేట్ భూసేకరణకు 80 శాతం ఆ ప్రాంత ప్రజల ఆమోదం అవసరమని, పరిహారం రెండింతలు పెంచుతామని చట్టంలో పేర్కొనటం జరిగిందని చెప్పింది. వలసపాలకులు చేసిన, రైతాంగ వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయలేదని వివరించింది. ప్రస్తుత ఎన్.డి.ఎ ప్రభుత్వం 2013 చట్టానికి రెండు సవరణలను ఆర్డినెన్స్ ద్వారా చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు భూసేకరణకు ప్రజల ఆమోదం లేకుండానే స్వాధీనపర్చుకోవచ్చని ఆర్డినెన్స్‌లో పేర్కొనటం వలన చట్టంలో రైతులకు కనీస అనుకూలమైన అంశం కూడా లేకుండా పోయింది. దీనికి వ్యతిరేకంగా రైతాంగం ఉద్యమించటంతో ఆర్డినెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నాం.

తెలుగుదేశం ప్రభుత్వం ఎటువంటి పరిహారం ఇవ్వకుండానే ఉచితంగా రైతాంగం నుండి భూములు లాక్కొంది. ఎక్కువలో ఎక్కువగా రాజధానికి 3 వేల ఎకరాలకు మించి భూములు అవసరం లేదని చెప్పింది. బడా పారిశ్రామికవేత్తలకు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకే లక్షలాది ఎకరాల సేకరణ అని పేర్కొంది. బహుళజాతి సంస్థలకు భూములు కట్టబెట్టటం వలన ఆహారధాన్యాల కొరతతో పాటు, రైతాంగం, గ్రామీణ పేదలు ఉపాధిని కోల్పోతారని వివరించింది.

భూసమీకరణ, భూసేకరణ, ఏదైనా రైతుల భూములను గుంజుకోవటమేనని దాన్ని వ్యతిరేకించాలని, రైతాంగం నుండి బలవంతంగా భూములు గుంజుకొనే అధికారాన్ని పాలకులకు కల్పించిన భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని రైతాంగానికి పిలుపు యిచ్చింది.

మన సంఘం అభిప్రాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్ళటంలో వెనకబడ్డామనే అంశాన్ని ఈ సందర్భంగా అంగీకరించాల్సిన అంశం.

గుంటూరుజిల్లా రాజధాని భూసేకరణ సమస్యపై జిల్లా రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో పలు కరపత్రాలు ప్రచురించి, రాజధాని ప్రాంత గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. భూసేకరణ చట్టం-2013 ప్రయోజనకరమైనదని, దీనిని అమలు చేయటమా, 'భూసమీకరణ' మెరుగైనదా? అనే చర్చల నడుమ ఒక్క గొంతుతో వేలాది ఎకరాల ముక్కారు పంటలు పండే రైతాంగ భూములను రాజధాని నిర్మాణం పేరిట గుంజుకోవటం దుర్మార్గమని ఎలుగెత్తి చాటడంలో విఫలమయ్యామనేది పరిశీలించుకోవలసిన అంశం.

****

## పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత సమస్య-నష్టపరిహార-పునరావాసాలకై పోరాటం

పోలవరం ప్రాజెక్టు కొత్త ఆయకట్టును సృష్టించదు. ఉన్న ఆయకట్టుకి నీరందించాల్సి వస్తే ప్రతి చుక్క నీటికి ధర నిర్ణయించి వసూలు చేయాల్సిన బాధ్యత నీటి సంఘాలది. ఇక ప్రాజెక్టు ద్వారా ప్రవహించే నీరు పట్టణాల, మహానగరాల వాణిజ్య అవసరాలు తీర్చాలి. గనుల, ఫ్యాక్టరీల నీటి అవసరాలను తీర్చాలి. అవి చేతుల్లో వున్న బడా, బహుళజాతి కంపెనీల లాభంగా మారాలి. ఇదీ పోలవరం ప్రాజెక్టు వెనుక ఉన్న విధానంలో ఒక ముఖ్యమైన విధానం. గనులు, ఫ్యాక్టరీలు వాణిజ్య నిర్వహణా అవసరాల కోసం చౌక మానవ వనరులు కావాలి. దీనికోసం అడవులలో తమ మానాన తాము బతుకుతున్న గిరిజన, గిరిజనేతరులను తరలించాలి. ఈ విధంగా మనుషులందర్నీ తరలించాక అడవులను మానవరహితం చేసి బహుళజాతి కంపెనీలుగా ఉన్న భద్రాచలం ఐటిసి, రాజమండ్రి ఇంటర్నేషనల్ పేపరు మిల్లులకి అప్పగించటం చేయాలి. ఈలోపు సామ్రాజ్యవాదులు, బడా నిర్మాణ కంపెనీల దోపిడీకి ఒక పాడిగేదె లాగా నిరంతరం ప్రజాధనాన్ని పితుక్కునే విధంగా అతి నెమ్మదిగా ప్రాజెక్టు నిర్మాణం జరగాలి. లేదా జరుగుతూ ఉన్నట్లు కనిపింపచేయాలి. అందుకే 7 వేల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో మొదలైన పోలవరం ప్రాజెక్టు ఇప్పటికి 26 వేల కోట్ల రూ॥ల ఖర్చు అంచనాకి చేరింది. మరోపక్క ఇది పాలక ముఠాల ఆటస్థలంగా, నదీ వివాదాల, నదుల అనుసంధాన సమస్యగా నలుగుతూ ఉండాలి. ఇంతటి ప్రజా వ్యతిరేక బహుళార్థక సాధక వ్యూహాలతో పోలవరం ప్రాజెక్టు ముడిపడి వుంది. కనుకనే ప్రాజెక్టు ప్రారంభించిన ఈ 12 సం॥లలో ప్రాజెక్టు నిర్మాణం 10 శాతం కూడా పూర్తి కాలేదు. పునరావాసం ఒక్క గ్రామానికీ సమగ్రంగా కల్పించలేదు. కానీ భూసేకరణ మాత్రం 90 శాతం పూర్తి అయిపోయింది. ప్రజలను తరిమివేయడం ఒక్కటే మిగిలి ఉంది.

దీనికి మరో వర్గ దృక్పథ కోణం ఉంది. అది భూస్వాముల వైపు నుంచి. 2004లో రాష్ట్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ప్రకటించే నాటికే తూర్పు, పశ్చిమ అప్పటి ఖమ్మంజిల్లా అటవీ ప్రాంతాలన్నీ ఎన్నో ఆదివాసీ భూపోరాటాలకు కేంద్రాలు. భూమికోసం, అడవికోసం పోరాడని గ్రామం, ప్రాంతం అక్కడ లేనేలేదు. కానీ భూపోరాటం ప్రారంభమై నేటికీ కొనసాగుతున్న ఉద్యమ ప్రాంతాలు మన నాయకత్వాన ఉన్నాయి. దేవీపట్నం, పోలవరం మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల పైబడిన భూమి గత 20 సం॥ల నుండి 40 సంవత్సరాలు వివిధ గ్రామాలలో గిరిజనుల భూమి గిరిజనేతర భూస్వాముల నుంచి తిరిగి స్వాధీనపరుచుకొని ప్రజల సాగుబడిలో ఉంది. 1917 నుంచి ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనుల భూముల్ని గిరిజనేతరులు ముందస్తు కలెక్టరు అనుమతి లేకుండా స్వాధీనపర్చుకోరాదన్న చట్టం ఉన్నా గిరిజనేతర భూస్వాములు ఒక పంచెల చాపుకి 14 ఎకరాల చొప్పున ఒకచోట, అధిక వడ్డీలతో, రకరకాల మోసాలతో భూములు కాజేశారు. భూములపై వారి అధికారం తిరుగులేదని వారు భావించారు. కానీ 1969 తర్వాత భూపోరాటాలు ప్రారంభమైనాక, శ్రీకాకుళ గిరిజనోద్యమం ప్రభావం పడ్డాక, గ్రామ గ్రామాన గిరిజన సంఘాలు వెలిసాక పరిస్థితి మారి పోయిందని భూస్వాములు గ్రహించారు. భూముల కోసం ప్రజలు కదిలాకే భూస్వాములు ఆ భూములపై దొంగ పట్టాలు పుట్టించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆ విధంగా 70-80 సం॥లలో భూములు గిరిజనుల సాగులలో ఉండగా భూస్వాములకి ప్రభుత్వం సెటిల్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి వారి దోపిడీని చట్టబద్ధం చేసే ప్రయత్నం చేసింది. మరోపక్క గిరిజన భూపోరాటాలను క్రూరంగా అణచేందుకు ప్రయత్నించింది. కొండమొదలులో కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్య, మనుగోపాలలో కారం పార్వతిలు అమరులైనా భూపోరాటాలు కొనసాగి భూములు ప్రజల చేతుల్లోనే నిలిచాయి. మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట ఫలితంగా పాలకులు చేసిన 1/70 చట్టాన్ని పాలకులే అతిక్రమించి గిరిజనుల భూములను లాక్కొని బహుళజాతి సంస్థలకు అప్పగించే విధానాన్ని చేపట్టారు. పీసా చట్టం కూడా ఇదే విధంగా గిరిజనులకు వ్యతిరేకంగా పాలకులచే చేయబడుతున్నది. కానీ ప్రభుత్వాలు మొదట 1/70ని రద్దు చేయాలని అనుకున్నాయి. గిరిజనుల, ప్రజాతంత్రవాదుల ఆందోళనల వల్ల 1/70 రద్దు పూర్తిగా సాధ్యం కావటం లేదు. దీనితో 1/70ని అమలు చేయడాన్ని ఆపివేశారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఒక ప్రతిష్టంభన కొనసాగించారు. అది ఏమంటే భూములు గిరిజనుల సాగులో ఉంటాయి. కానీ వాటి పట్టాలు గిరిజనేతర భూస్వాముల చేతుల్లో ఉంటాయి. ఈ రకంగా ఏజెన్సీ ప్రాంత భూమి సాగుదారులు, అడవితల్లి బిడ్డలైన గిరిజనులదా? లంచాలతో, పలుకుబడితో పట్టాలు కలిగివున్న గిరిజనేతర భూస్వాములదా? ఈ ప్రతిష్టంభన గత 30 సం॥లుగా కొనసాగుతూనే వుంది. పోలవరం ప్రాజెక్టు ప్రకటనతో భూస్వాములకి అనుకూలంగా ఈ ప్రతిష్టంభనను బద్దలు కొట్టేందుకు భూస్వాములు, అధికార యంత్రాంగం బయల్దేరారు. అధికార యంత్రాంగం, ప్రాజెక్టు కాంట్రాక్టర్లు, భూస్వామ్య పెత్తందారీ శక్తులు ఒకవైపు; 3 జిల్లాలలో గిరిజన ప్రాంతాల్లో తరతమ స్థాయిల్లో సంఘటితంగానూ, అసంఘటితం గానూ ఉన్న గిరిజన, గిరిజనేతర పేదలు, చేతివృత్తుల, మత్స్యకార సమూహాలు ఒకవైపు నిలిచిన నేపథ్యంలో సమగ్ర శాస్త్రీయ పునరావాసం కోసం సాగిన మన కృషి, పోరాటాలను పరిశీలించాలి.

గత 12 సంవత్సరాలుగా రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకత్వంగానూ, రైతుకూలీ సంఘం నేతృత్వంలో ఏజెన్సీ గిరిజన సంఘంగా అసంఖ్యాకమైన కార్యక్రమాలు జరిగాయి. వాటన్నింటినీ ఇక్కడ పేర్కొనడం సాధ్యం కాదు. విధానపరంగా తీసుకొన్న నిర్ణయాలు, ముఖ్య కార్యక్రమాలు-వాటి పర్యవసానాలను ఇక్కడ పేర్కొందాం. వివిధ ఇతర ప్రజాసంఘాలకు, మనకి విధానంలో, ఆచరణలో వచ్చిన తేడాలు, వాటి అనుభవాలను పరిశీలిద్దాం. ముఖ్యంగా 2010 మహాసభల నుండి నేటి వరకూ ముఖ్య కార్యక్రమాలను పరిశీలిద్దాం.

మనం మొదటి నుంచి స్పష్టంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వెనక వున్న పాలకుల ప్రయోజనాలను వెల్లడి చేయడంలో ముందున్నాం. రాజకీయంగా నినదిన్నానే సమగ్ర, శాస్త్రీయ పునరావాసంను ఒక షరతుగా మనం ప్రభుత్వం ముందుంచాము. ముందు సమగ్ర పునరావాసం తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం అన్నది మనమిచ్చిన నినాదం. ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కింద నిర్వాసితులౌతున్న అసంఖ్యాక గిరిజన, గిరిజనేతర ప్రజలకు, కరువుపీడిత, డెల్టా ప్రాంత రైతాంగానికి మధ్య ఒక వైరుధ్యంను మోసపూరితంగా సృష్టించి ఉంచింది. కరువు పీడిత ప్రాంతాలకు నీరందాలంటే పోలవరం కట్టాల్సిందేనని, కడితే నిర్వాసితులు అవక తప్పదని అభివృద్ధి వెర్సస్ ఆదివాసులు అన్నదాన్ని ముందుకు తెచ్చింది. దీన్ని తిప్పికొట్టేందుకే మనం పోలవరం ప్రాజెక్టు వెనక ఉన్న నిజ ఉద్దేశాలను వెల్లడిచేస్తూనే సమగ్ర, శాస్త్రీయ పునరావాస విధానం అవసరాన్ని ముందుకు తెచ్చాం. మనం, ఇంకా అనేక ప్రజాతంత్ర శక్తుల ఆందోళన ఫలితంగా 2005లో ప్రభుత్వ పునరావాస జీవో 68 నుంచి 2013 కేంద్ర ప్రభుత్వ పునరావాస చట్టం వరకూ నిర్వాసితుల హక్కులను గుర్తించవలసిన పరిస్థితి పాలకులకేర్పడింది. కనీసం కాగితాలపై నిర్వాసితుల హక్కులను గుర్తిస్తూ చట్టాలు చేయాల్సి వచ్చింది.

ప్రారంభం నుంచి మనం కృషి సాగిస్తున్న క్రమంలో ఎంతో నిర్బంధాన్ని ఎదుర్కొన్నాం. మన కామ్రేడ్స్ సున్నం రాజు, కుంజం రామారావు తదితరులపై రాజద్రోహ నేరం కేసులు మోపబడ్డాయి. నెలల తరబడి బెయిలు దొరకక జైళ్ళలో మగ్గుతూనే మనం పోరాటం కొనసాగించాం. గత డిసెంబరు వరకూ మన కామ్రేడ్స్ వాయిదాలకి అనారోగ్యాల మధ్య తిరిగారు. 2015 డిసెంబరులో కేసు కొట్టివేయబడింది.

అందోళనలలో పాల్గొంటూ జరిగిన ప్రమాదాలలో కామ్రేడ్స్ మూడే శిరమయ్య, తామి భవాని, చింతలాడ సుధాకరరెడ్డిలను కోల్పోయాం. ప్రభుత్వ విచ్ఛిన్నాలకు ఎదురొడ్డి నిలబడ్డాం.

2012లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రజలకి సంఘీభావంగా రాష్ట్రవ్యాపితంగా ధర్నాలకు పిలుపు ఇచ్చాం. **2015లో జులై 5న రాజమండ్రిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర సదస్సు** నిర్వహించాం. పునరావాస విధానం-దాని డొల్లతనాన్ని ఎండగట్టాం.

2016 ఏప్రిల్ 4న రంపచోడవరంలో వేలాదిమంది గిరిజనులు సమగ్ర శాస్త్రీయ పునరావాసంను డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనేక ప్రాంతాల నుంచి గిరిజన, గిరిజనేతర పేదలు స్వచ్ఛందంగా ధర్నాకి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు హాజరైన ఈ ధర్నా ఒక మంచి ప్రభావం వేసింది.

పునరావాసం కోసం పోరాడటం అంటే ప్రభుత్వ యంత్రాంగపు విభజించి పాలించే కుట్రలకు వ్యతిరేకంగా పోరాడటం. దానికోసం మన ఉద్యమమున్న ప్రాంతాలలో ప్రజలతో కలిసి వచ్చిన గిరిజన, గిరిజనేతర పేదలనందర్నీ కలుపుకొని పోతున్నాం. గోదావరి ఒడ్డుకు, గడ్డకు దూరంగా ఎక్కడో ఉంటూ కేవలం "నష్టపరిహారం" పేరిట తమ అక్రమ పట్టాలకు పునరావాసం కోరుతున్న నివాసేతర భూస్వాములకి-ఆ గడ్డ మీదే జీవిస్తూ అది పోతే బతకటం ఎలాగని కలత చెందుతున్న గిరిజన-గిరిజనేతర పేదలకి సంబంధం లేదని స్పష్టం చేశాము. ఒకే గడ్డ మీద జీవిస్తున్న గిరిజన-గిరిజనేతర, మత్స్యకార, చేతివృత్తుల ప్రజలంతా ఒక్కటేనని ప్రకటించాం. వీరి సమస్యలన్నింటినీ ఏప్రిల్ 4న ధర్నాలో ప్రకటించాం.

ప్రభుత్వం 1894 భూసేకరణ చట్టం కింద కొంతమందికి భూసేకరణ, 2013 చట్టం కింద కొంత భూసేకరణ జరుపుతూ వేరు వేరు నష్టపరిహారాలు ప్రకటిస్తున్న సమయంలో నిర్వాసితులందరికీ కాని భూమికి భూమి కావాలనే డిమాండు తీసుకుని పునరావాసం సమస్యపై పోరాటం చేస్తున్నది మనమే. ఇది పాలకులకు కష్టంగా వుంది.

### కరువు-అధిక ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపిత ధర్నాలు

గత సంవత్సరం వ్యవసాయ సీజన్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. లక్షలాది ఎకరాల్లో సాగునీరు అందక సేద్యం జరగలేదు. త్రాగునీరు, పశుగ్రాసం కరువైంది. ఉపాధిలేక అందుకోసం గ్రామాలకు గ్రామాలే వలసలు వెళ్లాయి. పాలకులు కరువు పరిస్థితులను ఎదుర్కొనే విధానాలు అమలు పర్చటంలోనూ, సహాయక చర్యలు చేపట్టటంలోనూ విఫలమయ్యారు. కరువు పరిస్థితులకు తోడు నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించకపోవటం వలన ధరల పెరుగుదలకు పగ్గాలు లేకుండా పోయాయి.

కరువు-ధరల పెరుగుదల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, ధరలను అదుపు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 14-9-2015న రాష్ట్రవ్యాపితంగా జిల్లాల, మండల కేంద్రాల్లో ధర్నాలు, పికెటింగ్‌లు, ఊరేగింపులు చెయ్యాలని రాష్ట్ర కమిటీ పిలుపు యిచ్చింది. ఆ పిలుపునందుకొని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరులు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద, మండల కేంద్రాల వద్ద వందలాది మందితో ధర్నాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర కమిటీ యిచ్చిన పిలుపు జయప్రదం అయ్యింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమస్యలను, స్థానిక సమస్యలను జోడించి కరపత్రాలు వేసి జిల్లా కమిటీలు విస్తృతంగా పంపిణీ చేశాయి.

****

### నివాస స్థలాలకై దొండపూడి ప్రాంత దళిత, ఆదివాసీల ఆందోళన

పశ్చిమగోదావరిజిల్లా-దొండపూడి గ్రామంలో నివాస స్థలాలు లేని నిరుపేదలంతా ఏజన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ల ఆధ్వర్యంలో సంఘటితమై 'దొండపూడి గిరిజన, దళిత, పేదల ఇళ్ళ స్థలాల సాధన కమిటీ'గా ఏర్పడి నిరంతరాయ ఆందోళన చేశారు.

ప్రభుత్వం స్పందించకపోవటంతో 2012 మే 28న తమ కాలనీకి ఆనుకునే వున్న ప్రభుత్వ స్థలంలో గుడిశెలు వేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని సైతం ధిక్కరించి జులై 4 నాటికి పేదలు గుడిశెలు వేసుకొని నివాసముండటం ప్రారంభించారు. చర్చల పేరుతో పేదలను అక్కడ నుండి తొలగించేందుకు అనేక కుట్రలు, కుయుక్తులు ప్రయోగించారు. చివరకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో ప్రజలపై దాడికి తెగబడ్డారు. ఆరుగంటల పాటు ప్రజలు ప్రతిఘటించారు. పోలీసులు దొడ్డిదోవన 13మంది నాయకులను అరెస్టు చేసి గోపాలపురం స్టేషన్‌కి తరలించారు. తమ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జోరున వర్షంలో వందలాది మంది అర్ధరాత్రి వరకు స్టేషన్ ముందు బైఠాయించి, వారిని విడిపించుకు వెళ్ళారు.

2012 సెప్టెంబర్ 29న గ్రామంలో 12 వందలమంది దళిత, గిరిజన పేదలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వివిధ దళిత, ప్రజాసంఘాల ప్రతినిధులు పేదల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. రియల్ ఎస్టేట్ పెత్తందారులతో కుమ్మక్కు అయిన ప్రభుత్వ, పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా దొండపూడి ప్రాంత ప్రజానీకం దృఢంగా నిలబడి పోరాడటం ద్వారానే ఈ భూములను దక్కించుకోగలిగారు.

****

### పల్నాడు ప్రాంతంలో నివాస స్థలాల కొరకు ఆందోళన

గుంటూరుజిల్లా-పల్నాడు ప్రాంతం, రెంటచింతల గ్రామంలో నివాసస్థలాల సమస్యపై సంఘం పిలుపు మేరకు వందలాదిమంది కదలి ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోవటంతో, 2012 జూన్ 24న ప్రభుత్వ భూమిని ప్రజలే స్వాధీనం చేసుకొని ఎర్రజెండాలు పాతి గుడిశెలు వేసుకున్నారు. స్థానిక భూస్వామ్య, పెత్తందార్లు పేదల గుడిశెలనన్నింటినీ ట్రాక్టర్లతో నేలమట్టం చేసి

పత్తి విత్తనాలు ఎదపెట్టారు. అయినప్పటికీ పేదలు పట్టువీడక అదే ప్రాంతంలో మరోమారు గుడిశెలు వేసుకున్నారు. ఈ క్రమంలో పోలీసు, రెవిన్యూ సిబ్బంది ప్రజలను అటకాయించినా ప్రజలు ఖాతరు చేయలేదు. ఇళ్ళస్థలాలకై కదిలిన ప్రజానీకాన్ని స్థానిక పెత్తందార్లు-పనులకు పిలవకుండా, అద్దె ఇళ్ళను ఖాళీ చేయమని, అప్పులు చెల్లించవలసిందిగా వివిధ రూపాల్లో సాంఘిక బెదిరింపులకు పాల్పడ్డారు.

ఈ నేపథ్యంలో పేదల ఉద్యమానికి మరింత సంఘీభావాన్ని కూడగట్టేందుకు 2012 ఆగస్టు 26న వివిధ పీడిత కుల, వృత్తి, దళిత, బహుజన సంఘాలు, ప్రజాపౌరహక్కుల సంఘాల ప్రతినిధులతో రెంటచింతలలో సభ నిర్వహించారు. అయితే, సరిగ్గా ఈ సభకు ముందురోజే రెవిన్యూ, పోలీసు అధికారులు కలగలిసి అర్థరాత్రి 2 గంటల నుండి తెల్లవారుఝాము వరకు పేదల గుడిశెలను ప్రొక్లెయినర్లతో పీకివేయించి భయానక వాతావరణాన్ని సృష్టించారు. దీనికి బెదిరిపోకుండా గుడిశవాసులంతా గ్రామంలో కదం తొక్కుతూ ప్రదర్శన నిర్వహించారు. నిర్ణయించుకున్న విధంగా బహిరంగ సభను జరుపుకున్నారు. జోరున కురిసే వర్షంలో తడుస్తూనే సభను విజయవంతం చేసుకున్నారు. ఈ సంఘర్షణ ఓ వైపు భూస్వామ్య పెత్తందారీ శక్తులతోనూ, అదే సమయంలో దోపిడీ వర్గాలకు కొమ్ముగాసే ప్రభుత్వాల ఆచరణతోనూ కొనసాగింది.

## ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటించాలని దీర్ఘకాల ఆందోళన

రాష్ట్రంలో షెడ్యూల్డు ప్రాంతంగా గుర్తించాల్సినవి 800 గిరిజన గ్రామాలున్నాయి. విజయనగరం జిల్లాలో 169 గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంలో చేర్చాల్సినవిగా అంగీకరిస్తూనే, ప్రభుత్వం ఆ విధంగా ఆ గ్రామాలను గుర్తించటానికి నిరాకరిస్తోంది.

గిరిజన గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతంలో కలపాలనే డిమాండ్‌తో సంఘం ఇచ్చిన పిలుపు మేరకు కొమరాడ, మక్కువ, పార్వతీపురం మండలాలలో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

2011 అక్టోబర్ 3న కొమరాడలో 8 పంచాయితీల పరిధిలోని 40 గ్రామాల నుండి 700 మందితో మండల కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

2011 అక్టోబర్ 10న మక్కువ తహశీల్దార్ కార్యాలయం వద్ద 600 మంది గిరిజనులు ఆందోళన చేశారు.

పార్వతీపురం మండలంలోని 48 గ్రామాల నుండి 500 మంది గిరిజనులు తరలివచ్చి మండల కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

ఈ ప్రాంతాల ఆందోళనలన్నింటినీ సమన్వయం చేస్తూ

2012 మార్చి 5న పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయం ఎదుట ధర్నాకు 100 గ్రామాల నుండి 20వేలమందికి పైగా ఆదివాసులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో పాల్గొనేందుకు మన రాష్ట్ర నాయకత్వంతో పాటు ప్రత్యేకించి డా॥బి.డి.శర్మ వచ్చారు. పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. పి.ఓ వచ్చి విజ్ఞాపన పత్రం తీసుకోవాలని ఆదివాసులు డిమాండ్ చేశారు. పిఓ నిరాకరించి, మొండి వైఖరి ప్రదర్శించాడు. దీనిని నిరసిస్తూ పోస్టరును గోడపై అంటించి డా॥బి.డి.శర్మ ఇచ్చిన నినాదాలకు ప్రజలు గొంతు కలిపారు. గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాగా ప్రకటించటమనేది పాలకులు ఎత్తివేసుకుంటున్నారు.

****

## అనంతపురం జిల్లా-శాతవాహన ఇస్పాత్ యాజమాన్య దురాగతాలకు వ్యతిరేకంగా ప్రజాందోళన

అనంతపురంజిల్లా బొమ్మనహాళ్ మండలంలో శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్ యాజమాన్యం అక్రమంగా రైతుల నుండి పెద్దఎత్తున భూములను సొంతం చేసుకొని 1992లో పరిశ్రమను నిర్మించింది. పైగా పరిశ్రమ నుండి వెలువడే కాలుష్యాల నివారణకు చర్యలు చేపట్టలేదు. దీనితో బొమ్మనహాళ్ పరిసర ప్రాంత గ్రామాలలో 1500 ఎకరాలు తీవ్ర కాలుష్యానికి గురయ్యాయి; పంటలు దెబ్బతిన్నాయి; ప్రజలు అనేక వ్యాధులకు గురయ్యారు. కంపెనీ భారీ బోర్లతో నీటిని తోడివేయటం ఫలితంగా భూగర్భజలాలు అడుగంటాయి.

ఈ నేపథ్యంలో ప్రజల్లో అసంతృప్తి, ఆందోళన వ్యక్తమౌతున్న పరిస్థితుల్లోనే యాజమాన్యం 350 కోట్ల వ్యయంతో స్టీల్‌ప్లాంట్ ఆధునీకరణకు పూనుకుంది. ప్రజాభిప్రాయ సేకరణను తంతుగా ముగించింది. దీనిని వ్యతిరేకించిన రైతులపై తప్పుడు కేసులు బనాయించి, నిర్బంధించారు. ప్రజల ఆందోళన, వత్తిడుల ఫలితంగా శాతవాహన ఇస్పాత్ యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించిందని, భారీ కాలుష్యానికి కారక మైందనీ ప్రభుత్వం ప్రకటించక తప్పలేదు. రైతులు పొందిన నష్టాలను అంచనా వేసేందుకు అధికారుల బృందాన్ని నియమించారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న శాతవాహన ఇస్పాత్ లిమిటెడ్‌ను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాయదుర్గం ప్రాంతంలో విస్తృత ప్రచారం సాగించింది.

****

## వరంగల్‌జిల్లాలో పోడు భూముల పంపిణీ

వరంగల్‌జిల్లా-ఖానాపురం మండలం చిలకలగుట్ట వద్ద 20సం॥ల క్రితం 'చిలకమ్మ నగర్' పేరిట కాలనీని నిర్మించుకొని, పోడు సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. దాదాపు వెయ్యి ఎకరాలు పోడు భూములను సాగులోకి తెచ్చారు. రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో తలా రెండెకరాల చొప్పున పంపిణీకి పూనుకున్నారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దీనికి ఇష్టపడని పెత్తందార్లు ఈ పంపిణీని అడ్డుకునేందుకు రాత్రిపూట ప్రజలపై గొడ్డళ్ళతో దాడికి వచ్చారు. ప్రజలు దీనిని తిప్పికొట్టడంతో తమ పలుకుబడితో పోలీసు యంత్రాంగాన్ని వుపయోగించి ప్రజలపై, నాయకత్వంపై

తప్పుడు కేసులు బనాయించారు. జామీన్లపై బయటకు వచ్చిన తర్వాత మరలా భూముల పంపిణీకి సంఘం నాయకత్వంలో ప్రజలు పూనుకున్నారు. మరలా పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకత్వాన్ని అరెస్టుచేసి, జీపుల్లో తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు. వందలాదిమంది ప్రజలు పోలీసు జీపులకు అడ్డుగా నిలిచి దీనిని ఎదుర్కొన్నారు.

తమ న్యాయమైన డిమాండ్లను ఎలుగెత్తి చాటుతూ వందలాదిమంది ప్రజలు ప్రదర్శను నిర్వహించి ప్రభుత్వ, పోలీసు అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందచేశారు. తాము పోడుజేసిన భూమిని పంపిణీ చేసుకున్నారు. తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రజల పోరాట ఫలితాలను బలిపెట్టాలనుకునే వారు ఏ పార్టీల పేరుతో వున్నప్పటికీ, ప్రజా వ్యతిరేకులేనని ప్రజలు ఆచరణలో అర్ధం చేసుకున్నారు.

****

## చిత్తూరుజిల్లాలో భూమికోసం షికారీల ఆందోళన

షెడ్యూల్డ్ తెగలో భాగమైన షికారీలు (నక్కలోళ్లు) వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తుంటారు. చిత్తూరుజిల్లా ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని అటవీ ప్రాంతంలో 500 ఎకరాల భూమిని 112 షికారీ కుటుంబాలు పంపిణీ చేసుకున్నారు. ప్రభుత్వం వీటికి పట్టాలు మంజూరు చేసింది.

1998-2004 సంవత్సరాల మధ్య వరుసగా వర్షాభావ పరిస్థితుల నెలకొని పంటలు పండకపోవటంతో జీవనానికై వారు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వర్షాలుపడి తిరిగి పంటలు వేసుకుందామని వారి గ్రామానికి వచ్చేసరికి వారి భూములను భూస్వాములు, బయటి ప్రాంతాలవారు ఒక్కొక్కరు 20 నుండి 50 ఎకరాల వరకు కబ్జా చేశారు. భూముల రికార్డులను తారుమారు చేసిన భూస్వాముల కుట్రలను షికారీలు అడ్డుకొని 2006 సంవత్సరంలో వారే పంటలు వేసుకున్నారు.

ఐనప్పటికీ భూస్వాములతో కుమ్మక్కైన స్థానిక పోలీసులు, రెవిన్యూ అధికారులు ఈ భూముల్లో షికారీలను సాగుచేయనీయ కుండా అడ్డుకున్నారు.

ఈ దశలో షికారీలు తమ భూములను సాధించుకునేందుకు వివిధ ఆందోళనా కార్యక్రమాలను చేపట్టారు. 2015 నవంబర్ 30న సామూహికంగా చిత్తూరుజిల్లా ప్రభుత్వ అధికారులను కలిసారు. డిశంబర్ 2న ఏర్పేడు తహశీల్దారు కార్యాలయం వద్ద 200మంది షికారీలు ధర్నా చేశారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) అండతో 2015 డిశంబర్ 10న 200 మంది షికారీ మహిళలు, పురుషులు తమ 500 ఎకరాల భూమిని అంతటినీ తిరిగి స్వాధీనం చేసుకున్నారు. భూస్వాముల ఫిర్యాదు మేరకు డిశంబర్ 12న పోలీస్ అధికారులు షికారీల వద్ద తుపాకులున్నాయంటూ బెదిరింపులకు గురిచేశారు.

డిశంబర్ 14న షికారీలకు రక్షణ కల్పించాలని నినదిస్తూ షికారీలు తిరుపతిలో ప్రదర్శన నిర్వహించి భూములపై తమ హక్కును పునరుద్ఘాటించారు.

****

## జిల్లా మహాసభలు:

రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గం రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని 2015లో నిర్ణయించటం జరిగింది. జిల్లాల్లో ప్రతి రెండు సంవత్సరాల కొకసారి సభ్యత్వం చేర్పించాలని, ప్రతి సంవత్సరం ఎఐకెఎమ్‌కెస్‌కి 1/3 వంతు అనుబంధ రుసుము చెల్లించాలని నిర్ణయించాం. జిల్లా మహాసభలకు ముందు సభ్యత్వాలు చేర్పించాలని రైతుకూలీ సంఘానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలనుకున్నాం. ఈ కృషి సాగిస్తూ జిల్లా మహాసభలకు సన్నద్ధం కావాలనుకున్నాము. అన్నిజిల్లా కమిటీ సమావేశాలు జరిపి, జిల్లా రిపోర్టులు వ్రాతపూర్వకంగా పెట్టుకుని మహాసభల ప్రతినిధులతో చర్చించి సలహాలు, సూచనల మేరకు రిపోర్టులకు తుదిరూపం ఇవ్వాలనుకున్నాం. ఈ నిర్ణయాలను అన్ని జిల్లాల నాయకత్వం అమలు చేశాయి. అన్ని జిల్లాల్లోను మహాసభలు పూర్తి చేసుకుని జిల్లా కమిటీలను ఎన్నుకోవటం జరిగింది. అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మహా సభలు పూర్తి చేసుకున్నాం. పోలవరం పునరావాసం సమస్యల వత్తిడితో పశ్చిమ గోదావరి జిల్లా మహాసభలు నిర్వహించు కోలేకపోయాం. మహాసభల్లో ఆయా జిల్లాల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లాల స్థాయిల్లో ఆందోళనలకు పిలుపు నిచ్చాము.

ఈ కార్యక్రమాల నిర్వహణ క్రమంలోనే అమరులైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు సంతాపసభలు జరిపాం. కా॥మంద జార్జిగారి సంస్మరణ సభ 2.4.2016న నందిగామలో నిర్వహించాం. కా॥వనచర్ల సుబ్బారావుగారి సంతాపసభ కాకినాడలో 23.12.2014న నిర్వహించాం. కా॥మానం రామారావుగారి సంతాపసభ 1.4.13న గుంటూరులో నిర్వహించాం.

ఉత్తరాంధ్రలో జూట్ మిల్లులు మూతపడి పోవటంతో వేలాదిమంది కార్మికులు వలసకూలీలుగా మారిపోయారు. జూట్ మిల్లులను వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలంటూ ఎఐఎఫ్‌టియు (న్యూ) తో కలిసి సదస్సు నిర్వహించాం. ఈ సదస్సులో కార్మికులకు సంఘీభావంగా వందలాదిమంది రైతుకూలీలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇంకా అనేక సమస్యలపై రైతుసంఘాలతో ఐక్యకార్యాచరణలో కలిసి పనిచేశాం.

2014లో జరిగిన ఎంపిటిసి ఎన్నికలలోను, పంచాయితీ ఎన్నికలలోను సంఘ నాయకత్వం క్రింద వున్న ప్రజలను చీల్చకుండా అవసరమయితే గెలుపు ఓటములతో సంబంధం లేకుండా మన అభ్యర్ధులను నిలబెట్టాం. పంచాయితీ ఎన్నికలలో ఆయా గ్రామాలలో వున్న, డబ్బుండి ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న బడాబాబులు స్థానిక ఎన్నికలలో లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పంచాయితీలను, మండలాలను వాళ్ళ అధీనంలో వుంచు కుంటున్నారు. మన రాష్ట్రంలో స్థానిక ఎన్నికలలో ఇది ఒక విధానంగా మారింది. ఈ పరిస్థితులలో మన సంఘంతో వున్న ప్రజలను నిలబెట్టుకోవటం కేవలం సంఘ

చైతన్యంతో తప్ప మరే మార్గంలోనూ సాధ్యపడదు. ఇక ప్రజాకర్షణ పథకాలు, స్థానిక ఎన్నికలు, పాలకులకి తమ ఓటు బ్యాంకును కాపాడుకోవటం కోసం తప్ప మరో రకంగా కాదు.

## డా॥బి.డి.శర్మకు నివాళి

ప్రజాతంత్ర మేధావి, ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు డా॥బి.డి.శర్మ 2015 డిసెంబర్ 6న మరణించారు. నిజమైన ప్రజాతంత్రవాది, గొప్ప మేధావి, పీడిత ప్రజల పక్షపాతి– మీదుమిక్కిలి, మన సంఘ నాయకత్వంలో సాగుతున్న కొండమొదలు, దుగ్గేరు గిరిజనోద్యమాలకు పోలవరం, మనుగోపాల ఉద్యమానికి చిరపరిచితుడు, సన్నిహితుడు అయిన డా॥బి.డి.శర్మ మృతి మన సంఘానికి, పీడిత ప్రజా ఉద్యమాలకు తీరని లోటు.

డా॥బి.డి.శర్మ మరణవార్త తెలిసిన వెంటనే ఆయనకు నివాళులర్పిస్తూ, మన సంఘంతో, సంఘ నాయకత్వంతో ఆయనకున్న అనుబంధాన్ని తెలియజేస్తూ రాష్ట్ర కరపత్రం తేవడంతోపాటు విజయవాడ, విశాఖపట్నం, హైద్రాబాద్‌లలో రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో డా॥బి.డి.శర్మ సంతాప సభలను నిర్వహించాం. ఈ సంతాప సభలకు ప్రజాతంత్రవాదులను, మేధావులను కలుపుకు రాగలిగాం. రంపచోడవరం, పోలవరం, పార్వతీపురం ఉద్యమ ప్రాంతాలలో నిర్వహించిన సభల్లో ప్రజానీకం జోహార్లర్పించారు. ఈ సభలలో డా॥బి.డి.శర్మతోపాటు దాదాపు మన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సభలన్నింటిలోనూ పాల్గొంటూ వస్తున్న ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, మరెందరో దళిత, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాతంత్రవాదులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

2016 జనవరిలో **'ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు డా॥బి.డి.శర్మ'** అనే 100 పేజీల పుస్తకాన్ని ప్రొ॥కె.ఆర్.చౌదరిగారి ముందుమాటతో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రచురణగా వెలువరించాం. గత రెండు దశాబ్దాల కాలంలో సంఘం సభలు, సమావేశాలు, ఆందోళనల సందర్భంగా డా॥బి.డి.శర్మ ప్రసంగ వ్యాసాలతో, ఆయా కార్యక్రమాల సందర్భంగా ఆయనతో కూడిన ఫోటోలతో ఒక గొప్ప ప్రజాతంత్రవాది నమూనా కృషిని నమోదు చేశాం. దీనిని సమర్థవంతంగా ప్రజాఉద్యమాల మధ్యకేగాక, మేధావులు, ప్రజాతంత్రవాదుల మధ్యకు తీసుకు వెళ్ళాల్సిన అవసరముంది. ఈ పుస్తక ఆవిష్కరణ సభను విజయవాడలో నిర్వహించాం.

****

## సాహిత్యం

2010లో ఒంగోలులో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల అనంతరం మహాసభల విశేషాలు, ఉపన్యాసాలు, ఫోటోలతో **ప్రత్యేక సంచికను** తీసుకువచ్చాము.

**'రైతుకూలీసంఘం వార్షిక సంచిక-2012'**ను ఉద్యమ కార్యక్రమాల రిపోర్టులతో విలువైన సంచికగా వెలువరించాము.

లక్షింపేట దళితుల ఆందోళన సాగుతున్న కాలమంతటా రైతుకూలీసంఘం బులిటెన్లను మూడు ప్రచురించి, విస్తృతంగా ప్రజా రాశుల మధ్యకు తీసుకువెళ్ళాము.

ఏఐకెఎమ్‌కెఎస్, ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిల భారత సమ్మేళనం విశేషాలతో ఇంగ్లీషులో సావనీర్‌ను ప్రచురించాం.

భూమి సమస్యతో ముడిబడిన దళితుల ఆత్మగౌరవ అంశాన్ని, దేశంలో ఈనాటికీ దళితులపై సాగుతున్న దాడులు, దౌర్జన్యాలకు మూలమైన వ్యవస్థ స్వభావాన్ని విశ్లేషించే వ్యాసాలతో **'అణచబడ్డ దళితులంతా తిరగబడండి'** అనే 144 పేజీల పుస్తకాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించాం.

డా॥బి.డి.శర్మ స్మృతిలో **'ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు డా॥బి.డి.శర్మ'** అనే పుస్తకాన్ని ప్రచురించాం.

రాష్ట్రస్థాయిలో వివిధ సమస్యలపై ఎప్పటికప్పుడు కరపత్రాలు, ప్రకటనల రూపంలో, పోస్టర్లు ముద్రించి సంఘం అవగాహనను విస్తృతంగా ప్రజానీకం మధ్యకు తీసుకువెళ్ళాం.

## కామ్రేడ్స్,

వ్యవసాయాన్ని పాలకులు ప్రశ్నార్థకంగా మార్చివేశారు. దీని ఫలితంగా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీలు, పేద, మధ్య తరగతి రైతాంగం అనేక కష్టాలపాలవుతున్నారు. గ్రామీణ జీవితం సంక్లిష్టంగా మారుతున్నది. ప్రభుత్వ ప్రజాకర్షణ పథకాల ద్వారా కొంతమంది ప్రజల చేతుల్లో ఎంతో కొంత డబ్బు కనిపిస్తున్నా అది ప్రజల జీవనాభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. ప్రజలను తమ స్వంత కాళ్ళపై ఆధారపడే విధంగా భూసంస్కరణలను అమలుచేసి, భూపంపిణీ చేసి, ఉపాధిని గ్యారంటీ చేయటం కాకుండా ప్రజలకు కనీసం తోడ్పడే 1/70, పీసా వంటి చట్టాలను సైతం పూర్తిగా ప్రక్కకు పెడ్తున్నారు. మద్యం వ్యాపారమే ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్న పాలకులు మద్యాన్ని గ్రామాల్లో ఏరులై పారిస్తున్నారు. ఈ దురలవాటుకు బానిసలైపోతున్న పేదవర్గాలు జీవితంలో నిత్యం అశాంతితోటి, అనారోగ్యంతోటి అకాలంగా మృతి చెందుతున్నారు. ప్రైవేటు రుణాల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్న పేద రైతులు తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. వ్యవసాయమే దండగ అనే మానసిక స్థితికి చేరుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే వ్యవసాయానికి పెట్టుబడి అధికంగా పెట్టాల్సిరావటంతో ప్రైవేటుగా రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడుతున్నారు. మరొకప్రక్క విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రకృతితో పోరాడుతూ పంట పండించుకున్నప్పటికీ చివరకు చేతికొచ్చిన ఆ పంటకు కూడా గిట్టుబాటు ధర కల్పించబడటం లేదు. పాలకుల విధానాల వల్లే రైతాంగం ఇంతటి తీవ్రమైన సుడిగుండంలోకి నెట్టివేయ బడుతున్నారు. మరొకప్రక్క ప్రైవేటు రుణాలిచ్చే వారే పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్లతో సహా గ్రామాల్లో అరువు రూపంలో పెట్టుబడులు పెడుతూ పండించిన పంటనంతా వారు నిర్ణయించిన రేటుకే అప్పు క్రింద జమ

కట్టుకుంటున్న కొత్త రూపంలో ఫ్యూడల్ దోపిడీ పద్ధతులు గ్రామాల్లో సాగుతూ వున్నాయి. వ్యవసాయం దండగగా చూపిస్తానే మధ్యతరగతికి కూడా అందుబాటులో లేకుండా చేశారు. మరో వైపున వ్యవసాయం గిట్టుబాటు కాకపోవ టానికి వ్యవసాయ కూలీల కూలిరేట్లు పెరగటమే కారణమనే తప్పుడు భావనను వ్యాప్తి చేస్తూ రైతులకు, కూలీలకు మధ్య విద్వేషాలను పెంచజూస్తున్నారు. పెట్టుబడి దారులు భూములను వేల ఎకరాల్లో కొంటున్నారు. భూముల రేట్లు విపరీతంగా పెంచి గ్రామాల్లో కుల తగాదాలు పెంచుతూ ప్రజలను ఐక్యంగానీయవకుండా కులాల మధ్య, ఉపకులాల మధ్య తగాదాలు పెంచు తున్నారు. మారుమూల గ్రామాల్లో కూడా టివిల ద్వారా విషసంస్కృతిని ప్రచారం చేస్తున్నారు. ఈ సంస్కృతి వల్ల వస్తున్న అనర్ధాలు యువతీ, యువకుల జీవితాల్ని సర్వనాశనం చేస్తున్నాయి. తోటల పేరుతోటి వందల ఎకరాలు పట్టణాల్లో వున్న డబ్బున్న వాళ్ళు కొనుక్కోవడంతో అబ్సెంటీ లాండ్‌లార్డ్స్ పెరుగుతోన్నారు. ఈ వర్గం ప్రజలను తమ పట్టులో వుంచుకోవటం కోసం గుళ్ళూ, గోపురాలు కట్టించటం, అమ్మతల్లి పండుగలంటూ లక్షలాది రూపాయలు వెదజల్లుతూ యువతీ, యువకులను తమను ప్రశ్నించకుండా, తమకు అడ్డురాకుండా చేసుకుంటున్నారు. పచ్చని పంటపొలాలతో నిండుగా వుండ వలసిన గ్రామసీమలు, ఈ కొత్త దోపిడీ రూపాలతో నాశనమైపోతున్నాయి. తమ నాశనానికి ఎవరు కారణమో అర్ధం కాని విధంగా గ్రామాల్లో పరిస్థితి వుంది. పాలక వర్గాలు తమ ఓటు బ్యాంకును ఖరారు చేసుకోవటం కోసం అనేక ప్రజాకర్షణ చిట్కాలతో యువతీ, యువకులను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటూ తమ ఓటు బ్యాంకును గ్యారంటీ చేసుకుంటున్నారు.

ఈ పరిస్థితుల్లో రైతుకూలీసంఘం కార్యకర్తలు ప్రజల్లో చొరబడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్ధం చేసుకొని దోపిడీ రూపాలను, దోపిడీ స్వభావాలను అర్ధమయ్యే విధంగా చైతన్యవంతం చేస్తూ సంఘాల్లోకి, అంతిమంగా పోరాటాల్లోకి సమీకరించాల్సిన అవసరం వుంది. మరొక ప్రక్కన విదేశీ నిధులతో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో డబ్బులను వెదజల్లుతూ చురుకైన వారిని డబ్బులతో తమవైపు తిప్పుకుంటూ సంఘాలకు, పోరాటాలకు ముఖ్యంగా వామపక్ష భావాలకు వ్యతిరేకంగా నిలుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మన రైతుకూలీసంఘం కార్యకర్తలు అంకిత భావంతో ప్రజలలో పనిచేయవలసిన అవసరం ఎంతైనా వుంది. ప్రజలను రాజకీయంగా చైతన్యయుతం చేసు కోవటానికి, ఓపికగా వారికి రాజకీయాలను విడమరచవలసి వుంది. గ్రామీణ పేదలను, వ్యవసాయకూలీలను, పేదరైతాంగానికి ప్రాధాన్యతనిస్తూ, మధ్యతరగతి రైతాంగంతో సహా సంఘ నిర్మాణాలలోకి సంఘటితం చేయాలి. గ్రామకమిటీల ఏర్పాటు ద్వారా సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవటం ద్వారా మన లక్ష్యమైన వ్యవసాయక విప్లవం దిశగా రైతు,కూలీలను నడిపించటం సాధ్యమౌతుంది. అందుకు ఈ మహాసభల నుండి మరోసారి అందరం పూనిక వహిద్దాం.

**వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి!**
**నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!**
**అమరవీరులకు జోహార్లు!**

**గుంటూరు**
**12-6-2016**

విప్లవాభినందనలతో
**యస్.ఝాన్సీ**
అధ్యక్షులు
రైతుకూలీసంఘం(ఆం.ప్ర)

**ప్రభుత్వం ఎప్పుడూ భూస్వాముల పక్షమే వహించడం ద్వారా ఎప్పుడూ వారి ఆదేశానుసారమే వ్యవహరించడం ద్వారా భూస్వాముల గూండాగిరీ నుంచి ప్రజలను రక్షించకపోవడమే గాక ఈ ప్రభుత్వం భూస్వాముల ప్రయోజనాలను రక్షించడానికి అంతకంటే దారుణమైన పద్ధతులను అనుసరిస్తుందన్న పాఠాన్ని అమాయకులైన గిరిజనులకు బోధించింది.**

**కమ్యూనిస్టులు నేర్పినదానికంటే గిరిజనుల స్వానుభవమే అత్యుత్తమ ఉపాధ్యాయుడులా పనిచేసింది. బహుముఖమైన గిరిజనుల అనుభవాల ఆధారంగా ఈ సత్యాలని ప్రత్యేకించి ఎత్తి చూపడమే విప్లవకారులు చేసిందల్లా.**

**'గౌరవనీయమైన' పత్రికల్లో ప్రచురించిన కొన్ని వాస్తవాలను పునశ్చరణ చేయడం మార్క్స్ చెప్పిన ఈ మాటల్లోని సత్యాన్ని వెల్లడి చేస్తాయి: "ఎవరో కొందదరు ఆందోళనకారుల దుర్బుద్ధివల్ల విప్లవాలు జరుగుతాయన్న మూఢనమ్మకాల రోజులు ఎప్పుడో గతించాయి. విప్లవకర అలజడులు ఎక్కడ ఉన్నా, వాటి వెనుక ఏదో ఒక సాంఘిక కోర్కె ఉండి తీరుతుందనీ, అది తీరకుండా కాలం చెల్లిన వ్యవస్థా నిర్మాణాలు అడ్డగిస్తున్నాయనీ ఈ రోజుల్లో అందరికీ తెలుసు." (మార్క్స్-రివల్యూషన్ అండ్ కౌంటర్ రివల్యూషన్ (విప్లవం-ప్రతీఘాత విప్లవం)**

**'తాకట్టులో భారతదేశం'- తరిమెల నాగిరెడ్డి**

# తీర్మానాలు

## రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఉపాధి పనులు ముమ్మరం చేయాలి

గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు–కరువు తీవ్ర రూపం దాల్చింది. లక్షలాది ఎకరాల్లో సేద్యం జరగలేదు. వేసిన పంటలు ఎండిపోయాయి. త్రాగటానికి కూడా నీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. వ్యవసాయం కుంటుపడి ఉపాధి లభించక గ్రామీణ పేదలు అల్లాడుతున్నారు. పోషణ భారమై పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ఉపాధి వెతుక్కొంటూ గ్రామాలకు గ్రామాలే వలస పోతున్నాయి. తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా దాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కరువు పనులు కల్పించేందుకు నిధులు కేటాయించకుండా వుండటంలో కేంద్ర–రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. మూడువంతుల గ్రామీణప్రాంతం కరువు బారినపడితే 230 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించటం ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాన్నీ కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువును ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులు కేటాయించి, వెంటనే ఉపాధి పనులు కల్పించాలనీ, త్రాగునీరు, పశువుల మేత అందచేయాలని, చౌకడిపోల ద్వారా నిత్యావసర వస్తువులు అందించాలనీ ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

## పరిహారం, పునరావాసం ముందే చెల్లించాలి

నీటి ప్రాజెక్టులు, పోర్టులు, విమానాశ్రయాలు, సెజ్‌ల పేరుతో రైతుల, గిరిజనుల భూములను బలవంతంగా ప్రభుత్వం గుంజుకొంటున్నది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వందలాది గిరిజన గ్రామాలు, లక్షలాది ఎకరాలు ముంపుకి గురౌతాయి. పునరావాసం, పరిహారం ముందుగానే కల్పించాలని గిరిజనులు, మైదాన ప్రాంత గిరిజనులు కోరుతున్నారు. అందుకు అంగీకరించిన పాలకులు, ఆచరణలో వాటిని కల్పించకుండానే బలవంతంగా, నిర్బంధంగా గ్రామాలను తొలగిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో రైతులు భూములకు సరైన పరిహారం చెల్లించడం లేదు. చెల్లిస్తామన్నది కూడా పూర్తిగా ఇవ్వటం లేదు.

పోలవరం ప్రాజెక్టు క్రింద ముంపుకి గురయ్యే భూములకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలనీ, గిరిజనులకు పునరావాసం కల్పించిన తర్వాతే గ్రామాలను తొలగించాలనీ, నిర్బంధంగా గ్రామాల తొలగింపుని ఆపివేయాలని, ఇతర ప్రాజెక్టుల కోసం తీసుకొన్న రైతులకూ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

## కౌలుదారీ చట్టాలను అమలుపర్చి సంస్థాగత రుణాలు ఇవ్వాలి

కౌలు రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. కౌలుదారీ చట్టాలను పాలకులు అమలు చేయటం లేదు. ఫలితంగా ఎటువంటి హక్కులూ కౌలుదారులకు లేవు. సేద్యానికి సంస్థాగత రుణాలు బ్యాంక్‌ల నుండి లభించటం లేదు. పంటభీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వీరికి వర్తించటం లేదు. బ్యాంక్‌ల నుండి కౌలు రైతులకు రుణాలు అందిస్తామని చెప్పినా, కౌలు ఆధారం లేకుండా రుణాలు ఇవ్వటానికి బ్యాంక్‌లు నిరాకరించాయి. రైతు మిత్ర గ్రూపులు ఏర్పాటు చేసినా, రుణఅర్హత కార్డులు ఇచ్చినా అతికొద్దిమందికి మాత్రమే బ్యాంక్‌ల నుండి రుణాలు అందాయి. సేద్యపు ఖర్చులకు అధిక వడ్డీలకు వడ్డీ వ్యాపారులను కౌలు రైతులు ఆశ్రయించక తప్పటం లేదు.

కౌలుదారీ చట్టాలను అమలు పర్చి, కౌలు రైతులందరికీ సంస్థాగత రుణాలు అందించాలనీ, బీమా సౌకర్యంతోపాటు, పంట నష్టపరిహారం వారికీ ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

## భూపరాయికరణను ఆపాలి-గ్రామీణ పేదలకు భూపంపిణీ చేయాలి

వ్యవసాయక దేశమైన మన దేశంలో ఇప్పటికే నూటికి 68 శాతం ప్రజలు గ్రామాల్లో నివశిస్తున్నారు. వారి ప్రధాన వృత్తి వ్యవసాయం. అందుకు అవసరమైన భూమి కొద్దిమంది భూస్వాముల వద్ద ఎక్కువగా ఉంది. అత్యధిక మంది గ్రామీణ పేదలకు ఏ మాత్రం భూమి లేదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, శ్రీకాకుళ గిరిజనోద్యమాలు పాలకులచే భూసంస్కరణ చట్టాలు చేయించినా, అవి కూడా పేదలకు భూపంపిణీ చేయలేకపోయాయి. పేదల అసైన్డ్ భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయి. పేదలకు పంపిణీ చేయటానికి సేద్యానికి అనుకూలమైన 60 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని కోనేరు భూకమీషన్ చెప్పినా వాటి పంపిణీకి పాలకులు చర్యలు తీసుకోలేదు.

పేదలకు భూపంపిణీ అన్న నినాదాన్ని ప్రస్తుత పాలకులు అందుకు విరుద్ధంగా సూత్రీకరిస్తున్నారు. సెజ్‌లు, వాన్‌పిక్, పోర్టులు, కారిడార్‌ల పేరుతో విదేశీ పెట్టుబడిదారులకు ఎర్రతివాచీలు పరిచి వారు కోరినంత భూములను ప్రభుత్వం కట్టబెడుతున్నది. చిన్న, సన్నకారు రైతుల భూములను కార్పోరేట్ కాంట్రాక్టు సేద్యానికి అప్పగించేలా చేస్తున్నది. ఈ విధంగా విదేశీ వరిశ్రమదారులకు కట్టబెడుతూ భూపరాయీకరణకు పాల్పడుతున్నది. 10 లక్షల ఎకరాల భూబ్యాంక్‌ని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ పేదలు భూమికి దూరమౌతున్నారు.

భూపరాయికరణను తక్షణమే ఆపివేయాలనీ, అలా అయిన భూములను స్వాధీనం చేసుకోవాలనీ, విప్లవ భూ

సంస్కరణలు అమలు పర్చి గ్రామీణ పేదలకు భూములు పంపిణీ చేయాలనీ ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**ఆహార ధాన్యాలకు న్యాయమైన ధరలు ప్రకటించాలి**

ప్రతిసంవత్సరం సేద్యపు ఖర్చులు పెరిగి రైతాంగానికి భారంగా మారుతున్నది. రైతాంగం పండించే పంటలకు మాత్రం న్యాయమైన ధరలు లభించటం లేదు. వరి ధాన్యం క్వింటాల్ ఉత్పత్తికి 2150రూ॥ ఖర్చు అవుతుందని అనేక నివేదికలు ప్రకటించాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల సాధికారిక కమిటీ క్వింటాల్ వరి ధాన్యానికి 1921 రూ॥ మద్దతు ధర ప్రకటించాలనీ సిఫార్సు చేసినా దాన్ని కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోలేదు. కంటితుడుపుగా మద్దతు ధరను పెంచి చేతులు దులుపు కొంటున్నది. ఈ వ్యవసాయ సీజన్‌కి సాధారణ-మేలు రకానికి 60రూ॥ మాత్రమే పెంచింది. కందులు, పెసలు, మినుములు, వేరుశనగ పంటలకు ఆశించిన మేరకు మద్దతు ధర ప్రకటించలేదు. ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు రైతు ప్రయోజనాలకు అనుగుణంగా లేవు.

సేద్యపు ఖర్చులు, రైతుకుటుంబ అవసరాలు, పంటల దిగుబడులను పరిగణలోకి తీసుకొని న్యాయమైన ధరలు ప్రకటించి, ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

**అభివృద్ధి పేరుతో అడవి నుండి ఆదివాసీల తొలగింపు**

తరతరాలుగా అడవినే కన్నతల్లిగా భావించి, అడవిపై హక్కు కలిగి ఆదివాసీలు జీవనం సాగించారు. అడవిపై వారి హక్కులను అణిచేందుకు వలస పాలకులు, వారి నుండి అధికారాన్ని బదలాయించు కొన్న దేశీయ దళారీ పాలకులు అనేక చట్టాలు చేశారు. ఆదివాసీల అభివృద్ధి పేరుతో అడవిని, అటవీ భూముల్ని, ఖనిజ సంపదను సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు జరుపుతున్నారు. బాక్సైట్ వెలికితీతకు బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని, ఖనిజ సంపదను విదేశాల పరం చేస్తున్నారు. ఖనిజ సంపదను బయటకు తీసి గిరిజన జీవితాలు అభివృద్ధి పరుస్తామంటూ ఆదివాసీలను అడవి నుండి తరలించేందుకు పూనుకున్నారు. పాలకులు అనుసరిస్తున్న ఈ విధానం దేశ ప్రయోజనాలకు, ఆదివాసీల ప్రయోజనాలకు వ్యతిరేకమైంది.

అడవిపై ఆదివాసీల హక్కును గుర్తించాలనీ, ఖనిజ సంపదలను సామ్రాజ్యవాదుల పరం చేసే విధానాలను విడనాడాలనీ, అడవి నుండి ఆదివాసీలను తొలగించరాదని, ఖనిజ సంపదను దేశ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

**కుంటలు, గడ్డలు, వాగుల నీటిని నిల్వ చేయాలి**

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వర్షాలపైనే సేద్యం ఆధారపడింది. వర్షం, వరదల నీరు రాష్ట్రంలో పుష్కలంగా లభిస్తుంది. వాటిని నిల్వచేసే రిజర్వాయర్లు లేకపోవటం వలన ఆ నీరు అంతా వృథాగా సముద్రంలో కలిసి పోతున్నది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అనేక జిల్లాల్లోని కుంటలు, గడ్డలు, వాగులు, చెరువుల్లో వర్షపునీటిని నిల్వ చేయవచ్చు. అందుకు చెరువు కట్టలు పటిష్ట పర్చటం, కరకట్టలు నిర్మిస్తే సరిపోతుంది. వీటిల్లో సామర్థ్యం మేరకు నిల్వచేసిన నీటిని సాగుకి మళ్లించటం ద్వారా కొంతమేర సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. తక్షణమే ఇందుకు చర్యలు తీసుకోవాలని ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**దళితులపై పెచ్చుమీరుతున్న హంతక దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ**

దేశవ్యాపితంగానూ, రాష్ట్రంలోనూ దళితులపై భూస్వామ్య, అగ్రకుల దురహంకారదాడులు, దౌర్జన్యాలు; దళిత మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెచ్చుమీరుతున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగమించామని చెపుతున్న ఈ రోజుల్లో అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఈనాటికీ రెండు గ్లాసుల విధానం, అంటరానితనం, వెట్టిచాకిరీ వంటి ఫ్యూడల్ దోపిడీ, దురహంకార విధానాలు అమలవుతున్నాయి. లక్షింపేట ఘటనలో కులదురహంకారులు ఐదుగురు దళితులను బలిగొనటం మనందరికీ తెలిసిందే. దళితులపై రాష్ట్రవ్యాపితంగా సాగుతోన్న దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలను ఈ మహాసభ తీవ్రంగా ఖండిస్తూ, ఈ దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు, ఈ దాడులకు మూలమైన దళితుల భూమి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నది.

**నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలి**

ప్రజల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని దాటిపోతున్నాయి. బియ్యం, కూరగాయలు, చింతపండు, కందిపప్పు, మినపపప్పు, నూనెల ధరలు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి సమతుల్యత లేకపోవటం, ఎగుమతి వ్యాపార పంటల విస్తీర్ణం పెరగటం, కార్పోరేట్-కాంట్రాక్టు వ్యవసాయం అందుకు కారణంగా ఉంది. దీనికి తోడు ఫ్యూచర్ ట్రేడింగ్, ద్రవ్యోల్బణం, చీకటి వ్యాపారం ధరల పెరుగుదలకు కారణాలుగా ఉన్నాయి. ధరల పెరుగుదల వలన కుటుంబ వ్యయం మూడు రెట్లు పెరిగింది. ఫలితంగా సామాన్య కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక యిబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితిని తీవ్ర సమస్యగా పరిగణించి ఫ్యూచర్ ట్రేడింగ్ వ్యాపారులపై ఆంక్షలు విధించి, ఆహార ధాన్యాలు స్వాధీనం చేసుకొని చౌక ధరలకు ప్రభుత్వమే సరఫరా చేయాలని ఈ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**కుల, మతతత్వాలను పెంచుతోన్న పాలకుల విధానాలను ఖండిస్తూ**

వాస్తవికమైన, న్యాయమైన ప్రజల సమస్యలను పరిష్కరించటానికి పూనుకోని

పాలకులు, ప్రజలపై నిర్బంధం ప్రయోగించటం ద్వారా వారి ఉద్యమాలను అణచి వేయజూస్తున్నారు. ఏకకాలంలో దీనితోపాటే మధ్యయుగాలనాటి కుల, మతతత్వాలను పెంచి పోషిస్తూ, ప్రజల మధ్య విద్వేషాలను రగిలిస్తున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక బాహాటంగా మతతత్వాన్ని, మత విద్వేషాలను రెచ్చ గొడుతూ, దళిత, మైనారిటీ ప్రజలపై హంతకదాడులకు తెగబడ్తోంది. పాఠ్యాంశాలను, చరిత్రను సైతం మతతత్వీ కరించేందుకు చర్యలు చేబడుతోంది. అధునాతన సాంకేతికను, టీవీ, ప్రసార మాధ్యమాలనుపయోగించి మూఢ నమ్మకాలను, మతఛాందసత్వాన్ని పెంచుతోంది. మతాన్ని, మతవిశ్వాసాలను వ్యక్తిగతంగా పరిమితం చేయకుండా, మతాతీతంగా వ్యవహరించాల్సిన రాజ్యం నిన్నటి గోదావరి పుష్కరాలను, నేటి కృష్ణా పుష్కరాలను వందల కోట్లు వెచ్చించి నిర్వహించటంతోపాటు మత ఛాందసత్వాన్ని పెంచుతోంది. పాలకులు పెంచి పోషిస్తున్న కుల, మతత్వాలను ఖండిస్తూ; ప్రజల, ప్రగతిశీల, లౌకికవాదులందరూ ఈ విధానాలకు వ్యతిరేకంగా గొంతు విప్ప వలసిందిగా మహాసభ విజ్ఞప్తి చేస్తోంది.

### కునారిల్లుతున్న వ్యవసాయాధారిత పరిశ్రమలు-ఉపాధి కోల్పోతున్న రైతులు -రైతుకూలీలు-కార్మికులు

పాలకులు సృష్టించిన ఒక కృత్రిమ సంక్షోభం వ్యవసాయ, వ్యవసాయాధారిత పారిశ్రామిక రంగాలను కబళించి కునారిల్ల చేస్తున్నది.

నిజానికి వ్యవసాయరంగం, వ్యవసాయ ధారిత పారిశ్రామికరంగం ఒకదాన్ని మరొకటి బలపరుస్తూ అభివృద్ధి చేసు కొంటూ సాగాల్సివి. రెండూ ఉపాధి, ఉత్పా దకతలను పెంపొందించి గ్రామీణ, పట్టణ, శ్రమజీవులను, మేధోపరులను ఇముడ్చుకొని వలసలను నిరోధించాల్సినవి. పాలకులు సామ్రాజ్యవాదుల కనుసన్నలలో గత 60 సంవత్సరాలుగా స్వతంత్ర వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను అమలు చేయ నందున ఉత్పత్తి శక్తుల పెరుగుదల మందగించిపోయింది. పెరిగిన మేరకు సామ్రాజ్యవాదులు, బడాపెట్టుబడిదారుల లాభాలకు ఒక గ్యారంటీ వనరుగా మార్చబడి సాగింది.

1990ల తర్వాత ప్రత్యేకించి నేటికి నూతన ఆర్థిక విధానాల కాలంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో ద్రవ్య పెట్టుబడి దాడి వ్యవసాయ, వ్యవసాయా ధారిత పారిశ్రామిక రంగాలను మరింత ఘోరమైన సంక్షోభంలోకి నెడుతున్నది. ఎక్కువమంది శ్రామికులు, ఎక్కువ పెట్టుబడితో నడిచే వ్యవసాయాధారిత పరిశ్రమలను ఆధునీకరణ పేరుతో ఎక్కువ పెట్టుబడి, యాంత్రీకరణతో ముడిపడిన తక్కువ శ్రమశక్తిని వినియోగించే విధానాన్ని పాలకులు రుద్దుతున్నారు. దీనికి బ్యాంకుల పరపతి విధానం, పన్నుల విధానం అన్న రెండు ఆయుధాలతో చిన్న, మధ్యతరగతి పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీస్తున్నారు. రుణాల చెల్లింపులో తక్కువ కాలపరిమితి విధించి, అలా వాయిదాలు చెల్లించని పరిశ్రమలను నిరర్ధక ఆస్తుల క్రింద పరిగణించాలన్నది రిజర్వు బ్యాంకు నిర్ణయం. వ్యాట్, సేవా పన్నుల భారం పెంపు, రక్షణల తొలగింపు వంటివి చిన్న, మధ్యతరగతి వ్యవసాయాధారిత రంగంపై గొడ్డలిపెట్టుగా మారాయి.

ఫలితంగా ఉత్తరాంధ్ర జూట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో పడింది. నడిచే మిల్లుల కంటే మూతపడి ఉన్నవే ఎక్కువ. కృష్ణాజిల్లాలో సగం రైసు మిల్లులు మూతపడి పోయాయి. నాణ్యమైన పత్తికి పెట్టిన పేరైన గుంటూరు, ప్రకాశం జిల్లాలో స్పిన్నింగ్, జిన్నింగు మిల్లులు మూతపడి వున్నాయి. ప్రసిద్ధి చెందిన గుంతకల్లు సహకార స్పిన్నింగుమిల్లు మూతపడ్డాక, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల పత్తి మిల్లులు మూసి వేతకు గురయ్యాయి. సిగరెట్టు పెట్టెలపై 85 శాతం గుర్తుల పేరుతో ప్రభుత్వం, ఐటిసి వంటి బహుళజాతి కంపెనీలు రైతులు పండించే పొగాకును కొనకుండా వేధిస్తూ ధరలు దిగ్గొస్తున్నారు. కోళ్ళ పరిశ్రమ రంగాన్ని చావుదెబ్బతీసేలా విదేశీకోళ్ళు దిగుమతులకి సిద్ధంగా ఉన్నాయి. సహకార చక్కెర కర్మాగారాలు, ప్రైవేటు కర్మాగారాలు రైతులకి బాకీలు పెడుతూ అభివృద్ధి లేక గిడసబారుతున్నాయి. సహకార చక్కెర మిల్లులను నడిపించటానికి పాలకులు తక్షణ చర్యలు తీసుకోవాలి. చెరకు పండించే రైతులను ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను ఆదుకోవాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది. ఉత్తరాంధ్రలోను, గుంటూరులోని భజరంగ్ జూట్‌మిల్లులను తక్షణమే తెరిపించి ఉపాధి కోల్పోయిన కార్మికులను ఆదుకోవాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

ఉత్పత్తి, ఉత్పాదకత, పెట్టుబడికి పునరుత్పత్తికి అవకాశంలేని విధానాలు, మానవ వనరుల వలసలు, విధ్వంసం- ఇదీ నేటి సంక్షోభపు చిత్రం. ఫలితంగా వేలకోట్ల సంపదలు సృష్టించబడుతున్నాయి. కానీ తరలిపోతున్నాయి. అందుకే ఉపాధి కోసం, జీవించే హక్కుకోసం వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో కంపెనీల దోపిడీ, పీడనలకు తావులేని విధానాల అమలుకోసం రైతులు, రైతుకూలీలు, కార్మికులు, యువకులు ఒక్కటవ్వాలి. మన గ్రామాల సంపద, పరిశ్రమల ఉత్పత్తి, మన మానవ వనరుల సద్వినియోగం మన ప్రాంత, మన ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడాలని పాలకులను నిలదీయాలి. మూతపడ్డ వ్యవసాయాధారిత పరిశ్రమలన్నింటిని తెరిపించి కార్మికులకు రైతాంగానికి తక్షణమే ఉపాధి కల్పించాలని ఈ మహాసభ తీర్మానిస్తున్నది.

# వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాద రథచక్రాలకు కట్టివేస్తున్న పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమించుదాం!

*మిత్రులారా!*

తరతరాలుగా భూమిని నమ్ముకుని, ప్రజలందరికీ ఆహారాన్ని అందించే 'అన్నదాత' పరిస్థితి నేడు మరింత అధ్వాన్నమైపోయింది. వ్యవసాయంపై ఆధారపడిన రైతుకూలీల, గ్రామీణపేదల జీవితాలన్నీ దుర్భరంగా మారాయి. రైతాంగ ఆత్మహత్యలతో, భూమిని కోల్పోయిన రైతులతో, పెద్దఎత్తున సాగుతున్న వలసలతో –దేశ వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

**రైతుల, వ్యవసాయకూలీల జీవితాలు –గ్రామీణ జీవన విధ్వంసం – పాలకుల విధానాలు**

స్వయంగా విత్తనాలు సమకూర్చుకునే రైతు నుండి పాలకులు విత్తనాలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. సంకరజాతి విత్తనాలన్నారు; జన్యుమార్పిడి విత్తనాలంటు న్నారు. ఏతా వాతా విత్తనాలపై హక్కును బడా, బహుళజాతి కంపెనీలపరం చేశారు. ఏటేటా వాటి ధరలు పెంచుతూ పోతున్నారు. స్థానికంగా లభ్యమయ్యే సేంద్రియ ఎరువులతో, పంటమార్పిడి విధానంతో సాగుచేసే రైతుకు ప్రోత్సాహకాలు అందించి, వాతావరణ మార్పులు, భూసారం ఆధారంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచే చర్యలను పాలకులు విస్మరించారు; దిగుబడి పెంచే వాణిజ్య పంటల ఆశజూపారు. కంపెనీ విత్తనాలతోపాటు రసాయన ఎరువుల, పురుగుమందుల వాడకాన్ని అనివార్యం చేశారు. వీటన్నింటి ధరలను అనూహ్యంగా పెంచుకుంటూ పోతున్నారు.

చిన్న నీటిపారుదల ప్రాజెక్టులు, చెరువుల – కుంటల అభివృద్ధి, వరద నీటిని నిల్వజేసుకొనే రిజర్వాయర్ల నిర్మాణాన్ని పాలకులు చేపట్టదలచుకోలేదు. బోర్ల వ్యవసాయానికి నాణ్యమైన, ఉచిత విద్యుత్తు వాగ్దానాన్ని గాలికొదిలారు. కొన ఊపిరితోనున్న మొక్కల గొంతు తడిపేందుకు రైతులు నానా వ్యయ ప్రయాసలు పడ్తున్నారు. సాగునీరూ రైతుకు ఖరీదైపోయింది. ఇక, వ్యవసాయానికిచ్చే సబ్సిడీలను పాలకులు ప్రతిఏటా దిగ్గోస్తూ వస్తున్నారు. బ్యాంకుల ద్వారా రైతులకిస్తా మన్న రుణాల వాటాను కుదిస్తున్నారు. ఈ రుణాలను కూడా నోరుగల సంపన్నులు 'వ్యవసాయం' పేరుతో తన్నుకు పోతున్నారు. దీనితో 80 శాతంపైగా రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, సాగుకోసం వెచ్చిస్తున్నారు. రైతు పరిస్థితే ఇలా వుంటే, స్వంత భూమిలేని కౌలురైతును 'రైతు'గానే బ్యాంకులు గుర్తించటం లేదు. వీరికి బ్యాంకు రుణాలు ఎండమావిగా మిగిలాయి.

ఇంతాజేసి, 'ఈ సంవత్సరమన్నా పంట సరిగ్గా రాకపోతుందా' అని గంపెడాశతో ఎదురుజూస్తున్నంతలోనే తుపాన్లో, వరదలో, అకాలవర్షాలో, వర్షాభావమో, పంట తెగుళ్ళో ప్రతి ఏటా రైతును పట్టి పీడిస్తున్నాయి. ఇలా, అడుగడుగున అడ్డంకులనెదుర్కొని రైతు పండించిన పంటకు పాలకులు మద్దతు ధరనైనా కల్పించి, కొనుగోలు చేయించి ఆదుకుంటున్నారా... అంటే అదీ లేదు. పైగా కార్పొరేటు, మార్కెట్ దళారీలతో చేతులు గలిపి రైతుల నిస్సహాయతను, అవసరాల వత్తిడిని అనువుగా చేసుకొని వారిని నిలువునా కొల్లగొడుతున్నారు.

ఫలితంగా, సాగుకు వెచ్చించిన ఖర్చు కూడా గిట్టుబాటుగాక, తన శ్రమ నిష్ఫలమై పీకలలోతు రుణభారంలో రైతులు కూరుకు పోతున్నారు. దాని నుండి బయటపడే మార్గం కానక, ఆత్మహత్యలను మార్గాం తరంగా ఎంచుకుంటున్నారు. లక్షలాదిమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడటం హృదయాలను కలచివేస్తోంది. సామ్రాజ్య వాదుల ప్రయోజనాలకు లోబడి పాలకులు సృష్టించిన వ్యవసాయరంగ సంక్షోభానికి ఈ పరిస్థితి అద్దం పడుతోంది. పెద్దఎత్తున పాలకులు ప్రచారం చేసుకుంటున్న పంటల బీమా పథకాలు, రుణమాఫీలు, 'వ్యవసాయానుకూల బడ్జెట్లు, 'ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ల' వంటివేమీ రైతులకు కనీస భరోసాను కల్పించలేకపోతున్నాయి.

**రైతాంగాన్ని, ఆదివాసులను భూముల నుండి, అడవి నుండి గెంటివేస్తున్న పాలకులు**

1970ల వరకు మాటవరసగానైనా 'భూ గరిష్ట పరిమితి', 'మిగులు భూమి పంపిణీ' వంటి మాటలను మాట్లాడే పాలకులు ఆ తర్వాత క్రమంగా వాటి ఊసెత్తటం మానివేశారు. వ్యవసాయ ఖర్చులను భారీగా పెంచి, రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాకుండా చేసిన పాలకులు, 'పొమ్మన కుండానే పొగబెట్టిన చందంగా' ఆర్థిక మీటలతో రైతాంగాన్ని భూముల నుండి తరిమివేస్తున్నారు. భూములనే అంటి పెట్టుకొని ఉందామనుకున్న రైతులను అభద్రతకు గురిచేసి వారి భూములను గుంజివేసుకుంటున్నారు. కాంట్రాక్టు, కార్పొరేటు వ్యవసాయాల పేరుతో వేలాది ఎకరాల భూఖండాలను బడా, బహుళజాతి కార్పొరేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, భారీ ప్రాజెక్టులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక అవసరాలు, బహుళ వరుసల రహదార్ల వంటి ఎన్నో పేర్లతో లక్షల ఎకరాల భూములను అడిగిందే తడవుగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడ్తున్నారు. రాజధాని నిర్మాణం కోసమని రైతులను భయపెట్టి, ప్రలోభపెట్టి మంగళగిరి ప్రాంతంలో 3 పంటలు పండే 33 వేల ఎకరాల భూములను 'సమీకరించారు'!

బడా కంపెనీల విద్యుత్తు అవసరాలు, నీటి అవసరాలు, జలరవాణా కోసం ఉద్దేశించిన పోలవరం ప్రాజెక్టు క్రింద వేలాది గిరిజన గ్రామాలే ముంపుకు గురవుతూ లక్షలాది మంది ఆదివాసీ ప్రజానీకం నిర్వాసితులు కానున్నారు. నిర్వాసితులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పిస్తామంటూనే, నిర్దాక్షిణ్యంగా, బలవంతంగా ఆదివాసులను అడవితల్లి ఒడిలో నుండి విసిరివేస్తున్నారు. బాక్సైటు, ఇతర ఖనిజాల తవ్వకాలకు అనుమతించిన పాలకులు, ఆదివాసుల జీవితాలతో ఆడుకుంటున్నారు.

**తీవ్రమౌతోన్న వ్యవసాయ కూలీల, గ్రామీణ పేదల వలసలు**

వ్యవసాయరంగమే కుదేలై వుండగా, వ్యవసాయ పనులపై ఆధారపడి జీవనం సాగించే వ్యవసాయ కూలీలు, పేద రైతులు ఇతర గ్రామీణ పేదలందరికీ ఉపాధి కరువై జీవితాలు దుర్భరమౌతున్నాయి. అయిన కాడికి తెగనమ్ముకొనో, పాలకుల బలవంతపు భూసేకరణతోనో రైతులెందరో గ్రామాలను

వీడి, బ్రతుకుతెరువుకు వలస వెళుతున్నారు. ఉపాధి కరువైన వ్యవసాయ కూలీలు, ఇతర గ్రామీణ పేదలు పొట్ట చేతపట్టుకొని సుదూర తీరాలకు వలస పోతున్నారు. వలస కూలీలెవ్వరూ పారిశ్రామిక వేతన కార్మికులుగా స్థిరపడక పోగా, అక్కడ తీవ్ర అభద్రత, అమానవీయ పరిస్థితుల నడుమ, కారుచౌక శ్రమశక్తి దోపిడీకి గురౌతూ దుర్భర జీవితాలతో తల్లడిల్లుతున్నారు. వేల కోట్ల రూపాయల కేటాయింపులతో, ప్రచారార్భాటంతో సాగుతోన్న ఉపాధిహామీ పథకం, పీకలలోతు అవినీతిలో కూరుకుపోయి, పాలక రాజకీయ నేతలకు పలహార పథకంగా మారిపోయింది. గ్రామీణ పేదల వలసలను ఈ పథకం ఏ మాత్రం నిరోధించలేకపోతోంది.

**ప్రాధాన్యత పెరుగుతోన్న 'దున్నేవానికే భూమి' నినాదం**

నేడు అనేక గ్రామాలలో ప్రత్యక్షంగా భూస్వాములు కనబడకపోవడం, వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ పద్ధతులు వ్యాప్తి గావటం, గ్రామాల నుండి పట్టణ ప్రాంతాలకు పేదలు వలస పోవటాన్నే - కొందరు అమాయకంగా, మరికొందరు ఉద్దేశపూర్వకంగా - భూస్వామ్య విధానం రద్దయిపోయి పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిగా పేర్కొంటున్నారు. ఆధునిక 'బానిసత్వం', నిర్బంధ వెట్టిచాకిరి, ఘోరమైన వడ్డీ దోపిడీ, కులవివక్ష, అంటరానితనం, అగ్రకుల దురహంకార దాడులు, మతతత్వం వంటి అనేకానేక భూస్వామ్య దోపిడీ విధానాలు బలీయంగా అమలవుతూండటాన్ని వీరు దాటవేస్తున్నారు. 'దున్నేవానికే భూమి' నినాదానికి కాలం చెల్లిపోయిందని ప్రవచిస్తున్నారు.

వాస్తవానికి, గ్రామాల్లో అత్యధిక భూములన్నీ రూపం మారి బడా సంపన్న వర్గాలు, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు, ప్రభుత్వ యాజమాన్య సంస్థల వద్ద వివిధ రూపాల్లో కేంద్రీకృతమౌతున్నాయి. నిజమైన అర్థంలో విప్లవ భూ సంస్కరణలను అమలు జరిపి, 'దున్నేవానికే భూమి' పంపిణీతో పాటు వ్యవసాయం సజావుగా సాగటానికి అవసరమైన సాగునీటి వనరులు, విత్తనాలు, సంస్థాగత రుణాలు, సస్యరక్షణ మెలకువలు సమకూర్చగలిగితే, దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు అనూహ్యంగా పెరుగుతాయి. ఈ ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి అమ్మకాలలో దళారుల దోపిడీని అరికట్టి, రైతుల పంటలకు న్యాయమైన ధరను అందించటం ద్వారానే వారి జీవితాలలో నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుంది.

వ్యవసాయోత్పత్తులపై ఆధారపడి ప్రభుత్వ రంగంలో పరిశ్రమల స్థాపనతోపాటు, మౌలికరంగ పరిశ్రమలను దేశీయంగా స్థాపించటం ద్వారా నిరుద్యోగ యువత అందరికీ ఉపాధి లభిస్తుంది. కీలకమైన వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధితో వాస్తవికంగా స్థూలజాతీయోత్పత్తి పెరుగుదల సాధ్యమౌతుంది.

కానీ దీనికి భిన్నంగా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలమేరకు వారి అదుపాజ్ఞలలో భూస్వామ్య, బడా పెట్టుబడిదారీ వర్గ పాలకులు అనుసరిస్తోన్న విధానాలే, నేటి వ్యవసాయరంగ వినాశనమంతటికీ కారణం. కనుక వ్యవసాయ ప్రధానమైన, గ్రామీణ జనాభా అధికంగా వున్న మన దేశంలో ప్రజలందరి జీవన ప్రమాణాల సమగ్ర పెరుగుదలకు భూ సంస్కరణలను అమలు జరిపే వ్యవసాయక విప్లవం నేడు మరింత జరూరు కర్తవ్యంగా వుంది. గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో ప్రభుత్వ బంజరు, దేవాదాయ భూములు, అటవీ భూములతో సహా వివిధ ప్రాజెక్టుల పేర్లతో కార్పొరేట్లు, బడా సంపన్నుల ఆధీనంలోనున్న భూమి అంతటిపై భూమిలేని నిరుపేదలు, పేద రైతులు, గ్రామీణ పేదలు ఆదివాసులంతా హక్కు సాధించుకోవాలి. ఇందుకు 'దున్నేవానికే భూమి' నినాదంగా సాగిన వీరోచిత తెలంగాణా పోరాట వారసత్వాన్ని; నగ్జల్బరీ, శ్రీకాకుళ పోరాటాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని ముందుకు సాగాలి.

**పోరాట పథంలో రైతుకూలీసంఘం**

వీరోచిత రైతాంగ పోరాటాల వారసత్వంతో ముందుకు సాగుతోన్న రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్), గత రాష్ట్ర మహాసభలను 2010 ఏప్రిల్‌లో ఒంగోలులో జరుపుకుంది. తదనంతర కాలంలో- రైతుకూలీసంఘం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతాంగ సమస్యలపై ఆందోళనోద్యమాలు నిర్మించింది. సాగునీరు, తాగునీటి సమస్యలపై, గిట్టుబాటు ధరల కోసం, రుణమాఫీని సక్రమంగా అమలు చేయాలని, కౌలురైతులకు రుణాలివ్వాలని, కౌలు రైతులతో సహా విపత్తులలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టింది. రైతుకూలీలకు, గ్రామీణ పేదలకు నివాస స్థలాల కోసం, వారి కూలిరేట్లు పెంపుకోసం, ఉపాధిహామీ పథకం సక్రమ అమలు కోసం ఆందోళనలు సాగించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దళితులపై, మహిళలపై వేధింపులు, దౌర్జన్యాలు, దాడులకు వ్యతిరేకంగా దళితులకు దన్నుగా నిలిచింది. 2012 జూన్ 12న శ్రీకాకుళం జిల్లా లక్షింపేట దళితులపై కుల దురహంకారుల హంతక దాడులను వ్యతిరేకిస్తూ వారికి అండగా నిలిచింది. బొజ్జా తారకంగారి నేతృత్వంలో ఏర్పడిన 'లక్షింపేట దళితపోరాట సంఘీభావ కమిటి'లో రాష్ట్ర వ్యాపితంగా క్రియా శీలంగా పాల్గొంది. చుండూరు మారణ కాండ హంతకులను నిర్దోషులుగా ప్రకటించ టాన్ని నిరసిస్తూ 'చుండూరు దళిత న్యాయ పోరాట కమిటి' ఆధ్వర్యంలో చురుగ్గా పాల్గొంది. రాజధాని నిర్మాణానికి రైతుల భూముల బలవంతపు భూ సమీకరణను వ్యతిరేకిస్తూ, భూములపై ఆధారపడిన వ్యవసాయ కూలీలకు, చేతివృత్తుల, గ్రామీణ పేదలకు అండగా ప్రచార, ఆందోళనలతోపాటుగా మంగళగిరిలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి, రాజధాని ప్రాంత ప్రజల ఆందోళనకు సంఘీభావంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో వివిధ జిల్లాల్లో సేకరించిన సమాచారం ఆధారంగా రైతాంగ రుణమాఫీ బూటకత్వాన్ని ఎండగడుతూ గుంటూరులో 2014 జులై 27న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి, రుణమాఫీ అమలుకై ఆందోళనకు పిలుపునిచ్చింది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంత ప్రజానీకానికి సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరంతరాయ ఆందోళనోద్యమం నిర్మించటంతోపాటుగా 2015 జులై 5న రాజమండ్రిలో రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించింది. ఈ క్రమంలో సంఘ నాయకత్వం, కార్యకర్తలు ప్రజలు ఎన్నిమార్లు ప్రభుత్వ, పోలీసు నిర్బంధాలకు, స్థానిక పెత్తందార్ల, గూండాల దౌర్జన్యాలకు గురైనా, మొక్కవోని ధైర్యంతో నిలిచింది. సంఘం కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్ళే క్రమంలో **గుంటూరులో 2016 జూన్ 10, 11, 12 తేదీలలో నిర్వహించే రాష్ట్ర మహాసభకు** ఆర్థికంగా, హార్దికంగా సహాయ సహకారాలందజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

# రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)
# రాష్ట్ర మహాసభలను విజయవంతం చేద్దాం
# ఆహ్వానసంఘం విజ్ఞప్తి

*మిత్రులారా!*

చారిత్రక ప్రాధాన్యతను, వామపక్ష, పోరాట వారసత్వాన్ని కలిగి వున్న గుంటూరు జిల్లాలో-గుంటూరు నగరంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలు నిర్వహించబూనుకోవటం ముదావహం.

ప్రభుత్వాల వ్యవసాయ విధానాల ఫలితంగా చిన్న, మధ్యతరగతి రైతాంగమే కాక, ధనిక రైతాంగంసైతం ఎన్నో అవస్థల నెదుర్కొంటున్నారు. వ్యవసాయం కోసం చేసిన అప్పుల భారం పెరిగిపోయి సన్న, చిన్న కారు రైతులు - ముఖ్యంగా కౌలు రైతులు దేశవ్యాపితంగా లక్షల సంఖ్యలో బలవన్మరణాలకు పాల్పడటం బుద్ధి జీవులందరినీ ఆందోళనకు గురిచేస్తున్నది.

రైతాంగం వ్యవసాయాన్ని వదులుకోని వెళ్ళాల్సిన పరిస్థితులకు నెట్టబడుతున్నారు. మరోవైపున భూములు భారీగా బడా సంపన్నుల వద్దనో, కార్పొరేటుసంస్థల చేతుల్లోనో పలురూపాల్లో పోగుబడ్తున్నాయి.

వ్యవసాయం కుదేలవటంతో గ్రామీణ జనజీవనం కకావికలమౌ తున్నది. ఉపాధికరవైన వ్యవసాయకూలీలు, గ్రామీణ పేదలు నగరాలకో, గల్ఫ్ దేశాలకో కూలిపనులు వెతుక్కుంటూ వలసలు పోతున్నారు. అక్కడ మరింత దుర్భర పరిస్థితుల మధ్య, తీవ్ర అభద్రతల నడుమ బ్రతుకులీడుస్తున్నారు. అనేకమంది అక్కడే దిక్కులేని చావు చస్తున్నారు.

దేశంలోని ప్రజలందరూ సాగుచేసు కోవటానికి కావలసినంత భూమి, గంగ నుండి కావేరి వరకూ ఏడాది పొడవునా పారే జీవనదులు, తరతరాల వ్యవసాయంతో గడించిన విశేష అనుభవ సంపదా-మీదు మిక్కిలి బీళ్ళను సైతం బంగారు భూములుగా మార్చగలిగే అసంఖ్యాక శ్రమశక్తి - ఇన్ని వున్నా రైతాంగానికి ఈ దురవస్థ ఎందుకు ఈనాడు దాపురించింది? సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంతో పురోగమించామను కుంటున్న ఈ రోజుల్లో కూడా అగ్రకుల భూస్వామ్య, పెత్తందారీ, దౌర్జన్యాలు, దాడులు నిత్యకృత్యమైపోవటం వాస్తవం కాదా?

ఈ వాస్తవిక నేపథ్యంలో రైతాంగం, గ్రామీణ ప్రజలందరి జీవితాల్లో సమూల మార్పుకోసం రాష్ట్రవ్యాపితంగా కృషి సాగిస్తున్న రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) గుంటూరులో జరపనున్న రాష్ట్ర మహాసభలను స్వాగతిద్దాం.

బ్రిటిష్ పాలకులు విధించిన పన్నులను నిరాకరిస్తూ జాతీయోద్యమంలో భాగంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నేతృత్వంలో సాగిన చీరాల-పేరాల పన్నుల నిరాకరణ ఉద్యమం; గ్రామాధికారుల హోదాలకు సామూహిక రాజీనామాలు ఇచ్చి సాగించిన పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం; కన్నెగంటి హనుమంతు నాయకత్వాన నడచిన పుల్లరి వ్యతిరేక పోరాటం; భూమికోసం గట్ల ఉద్యమంగా సాగిన గాజుల్లంక జమిందారీ వ్యతిరేక పోరాటం; కుల అసమానతలు, వివక్షలకు వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు, పేదరైతులు సాగించిన ఉద్యమాలు; జమిందారీ విధానాలకు వ్యతిరేకంగా కౌలురైతుల రక్షణ కోసం 1935లో నిర్వహించిన 1500 మైళ్ళు సాగిన చారిత్రాత్మక రైతురక్షణ యాత్రలో ఈ ప్రాంత రైతాంగ భాగస్వామ్యం, ఇంకా మరెన్నో వీరోచిత రైతాంగ, కార్మిక పోరాటాలకు ఆలవాలమైన గుంటూరు జిల్లాలో-ఈ ప్రాంతంలో నిర్వహించనున్న రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలు విజయవంతంకావడానికి అన్ని విధాలా సహకరించవలసిందిగా ఆహ్వాన సంఘం తరపున యావన్మంది ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

## ఆహ్వాన సంఘం

<u>గౌరవాధ్యక్షులు</u>

**దావులూరి రామకోటయ్య,** మాజీ వైస్‌ఛాన్సలర్, ఏఎన్‌యు

<u>అధ్యక్షులు</u>

**డా॥ కొల్లా రాజమోహన్,** నల్లమడ రైతుసంఘం నాయకులు

<u>కార్యదర్శి</u>

**ఉల్లిగడ్డల నాగేశ్వరరావు,**
రై.కూ.సం.(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గసభ్యులు

<u>కోశాధికారి</u>

**పాటిబండ్ల కోటేశ్వరరావు,**
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి

<u>సభ్యులు</u>

**ముత్తిరెడ్డి శ్రీరాములు,**
రై.కూ.సం.(ఆం.ప్ర.) సీనియర్ నాయకులు

**భీమిరెడ్డి సుబ్బారెడ్డి,**
సీనియర్ అడ్వకేట్, గుంటూరు

**మోదుగుల పాపిరెడ్డి,** ప్రజాతంత్రవాది

**ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా,**
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ

**చదలవాడ జగన్నాథం,**
మాజీ కార్పొరేటర్, గుంటూరు

**సిహెచ్.ఎల్. కాంతారావు,**
సీనియర్ న్యాయవాది, నర్సరావుపేట

**ముత్తేవి రవీంద్రనాథ్,** రచయిత

**చెరుకూరి సత్యానారాయణ,**
సీనియర్ న్యాయవాది, గుంటూరు

**ఆతుకూరి ఆంజనేయులు,**
అధ్యక్షులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్

**జె. నరసింహారావు,**
న్యాయవాది, ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు

**ప్రొఫెసర్ ఎన్. అంజయ్య,**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ పాపినేని శివశంకర్,** కవి, రచయిత

**రావెల సాంబశివరావు,** విశ్రాంత రిజిస్ట్రార్, ఏఎన్‌యు

**గుత్తా వెంకటేశ్వరరావు,** అధ్యక్షులు, బార్ అసోసియేషన్, గుంటూరు

**సిహెచ్. మల్లిఖార్జునరావు,** ఉపాధ్యక్షులు, బార్ అసోసియేషన్

**బి. చంద్రశేఖర్,** ప్రధానకార్యదర్శి, బార్ అసోసియేషన్, గుంటూరు

**శానంపూడి వెంకటేశ్వరరెడ్డి,** అడ్వకేట్, ఓపిడిఆర్, గురజాల

**నడిపల్లె గురుదత్తు,** అడ్వకేట్

**పి.జె.లూకా,** అడ్వకేట్, వినుకొండ

**వి. పాపారావు,** అడ్వకేట్, డిఫెన్స్ లాయర్స్ యూనియన్, సత్తెనపల్లి

**జె. పాపారావు,** అడ్వకేట్, ఓపిడిఆర్, మంగళగిరి

**కృషిబాబు,** అడ్వకేట్, బాపట్ల

**పెనుగొండ లక్ష్మీనారాయణ,** అడ్వకేట్, జాతీయ కార్యదర్శి, అరసం

**డా॥ అరుణ,** సహాయకార్యదర్శి, స్త్రీ విముక్తి సంఘటన

**షేక్ జిలాని,** ప్రధాన సంపాదకులు, 'ఉపాధ్యాయ' మాసపత్రిక

**జె. సుబ్బారావు,** ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం

**ఎన్. రుక్మిణ,** అడ్వకేట్, రాష్ట్రకార్యవర్గసభ్యులు, విరసం

**దివికుమార్,** జనసాహితి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి

**జి.ఎల్.రాయల్,** అడ్వకేట్, హెచ్ఆర్ఎఫ్, పొన్నూరు

**బి. శివ,** అడ్వకేట్, తెనాలి

**పి. రాజారావు,** అడ్వకేట్, సిఎల్‌సి, గుంటూరు

**జి.ఎస్. నాగేశ్వరరావు,** అడ్వకేట్, తెనాలి

**డి. శివకోటేశ్వరరావు,** అడ్వకేట్, తెనాలి

**జి.ఎస్.ఆర్. కృష్ణయ్య,** అడ్వకేట్, తెనాలి

**టి. శ్రీదేవి,** అడ్వకేట్, స్త్రీ విముక్తి సంఘటన

**డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి,** ప్రముఖ ప్రజావైద్యులు, తెనాలి

**డా॥ భీమవరపు సాంబిరెడ్డి,** కోట్నీస్ వైద్యశాల, తెనాలి

**డా॥ కాటా ప్రమీల,** కోట్నీస్ వైద్యశాల, తెనాలి

**డా॥ టి. రాజారావు,** ప్రజావైద్యశాల, పొన్నూరు

**డా॥ చదలవాడ రవీంద్రనాథ్,** గుంటూరు

**డా॥ హేమంతీదేవి,** ప్రజావైద్యశాల, చిలకలూరిపేట

**డా॥ ఆలూరు మాధవరావు,** మోతడక

**వై. నేతాంజనేయప్రసాద్,** రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపిటిఎఫ్

**సింహాద్రి శ్రీనివాసరెడ్డి,** రాష్ట్ర నాయకులు, ఏపియుడబ్ల్యుజె

**కె.వి. రామిరెడ్డి,** బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు

**కంభం ఆనందకుమార్,** జిల్లా అధ్యక్షులు, ఆర్.పి.ఐ

**డి.వి.ఎన్.స్వామి,** ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు

**ఎస్. లక్ష్మారెడ్డి,** రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు

**పటేల్,** విశ్రాంత అధ్యాపకులు

**డి. రాధాకృష్ణమూర్తి,** లెఫ్టిస్టు స్టడీ సర్కిల్

**నబి,** శ్రామికజన సమాఖ్య, ఊటుకూరు

**ఈదర గోపీచంద్,** అశ్లీలతా ప్రతిఘటనావేదిక అధ్యక్షులు

**కొండా శివరామిరెడ్డి,** కార్యదర్శి, అవగాహన

**ఎన్. వేణుగోపాల్,** రైతురక్షణ వేదిక

**గోగినేని పరశురాం,** పొన్నూరు

**రామకృష్ణ,** ప్రజాతంత్రవాది, పొన్నూరు

**సింగిరెడ్డి హనుమంతరెడ్డి,** అఖిలభారత అభ్యుదయవేదిక కార్యదర్శి

**జొన్నలగడ్డ రామారావు,** ప్రజాతంత్రవాది

**వాకా పేరిరెడ్డి,** విశ్రాంత ప్రధానోపాధ్యాయులు

**చందు నాగేశ్వరరావు,** జనసాహితి, తెనాలి

**బొల్లిముంత వీరయ్య,** తెనాలి

**వద్దిశెట్టి వెంకటకోటయ్య,** తెనాలి

**కొల్లి చలమారెడ్డి,** పెదపలిమి

**చెరకుమల్లి శింగారావు,** అరసం, తెనాలి

**బొల్లిముంత కృష్ణ,** కళాకారులు, తెనాలి

**అబ్రహాం లింకన్,** బాపట్ల

**గుత్తా వెంకటయ్య,** మోతడక

**మాచవరపు రోశయ్య,** పొన్నెకల్లు

**కరిముల్లా,** షేక్ బుడే మెమోరియల్ లైబ్రరీ కమిటి

**షేక్ వలి,** షేక్ బుడే మెమోరియల్ లైబ్రరీ కమిటి

**కుంభా శ్రీను,** జిల్లా అధ్యక్షులు, నవయువ సమాఖ్య

**బొడ్డు సుధాకర్,** నాస్తిక సమాజం ప్రధాన కార్యదర్శి, నిడమర్రు

**బి. రఘు,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర)

**శింగయ్య,** తుర్లపాడు

**రాగి సుబ్బారావు,** ఏఐఎఫ్‌టియు(న్యూ)

**గిడుతూరి చంద్రం,** ఏఐఎఫ్‌టియు(న్యూ)

**మండవ శోభారాణి,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**మారెళ్ళ అంజిరెడ్డి,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**నీలాద్రి రాంబాబు,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**దానబోయిన భాస్కరరావు,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**జె. పద్మ,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**సత్తెయ్య,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**కర్రి మోషే,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

**దేవరశెట్టి వెంకటస్వామి,** ఏఐఎఫ్‌టియు(న్యూ)

**ఉప్పుతల్ల కృష్ణ,** ఏఐఎఫ్‌టియు(న్యూ)

**బైల్ల రంగస్వామి,** ఏఐఎఫ్‌టియు(న్యూ)

**బి. మల్లీశ్వరి,** స్త్రీ విముక్తి సంఘటన

**కె. హనుమంతరావు,** జనసాహితి

# మైత్రి బుక్ హౌస్

## అభ్యుదయ, ప్రగతిశీల, విప్లవ సాహిత్య కేంద్రం

**28-9-1, జలీల్ వీధి, అరండల్‌పేట,**

**కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-520 002**

# రైతుసేవలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ

## వెంకటగిరి మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో రైతుసంక్షేమ కార్యక్రమాలు

1. 12 ఎకరముల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నిర్వహించబడుతున్నది
2. మార్కెట్ యార్డునందు 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాములు వున్నది

   ఎ) వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాములనందు 'రైతుబందు' పథకం క్రింద రైతులకు సరుకు తాకట్టు పెట్టుకుని స్వల్పకాలిక ఋణం మంజూరు చేయబడింది.

   ఏ) మరో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాములను పౌరసరఫరాలశాఖ వారికి అద్దెకు ఇవ్వబడినది.
3. సబ్-మార్కెట్ యార్డుల-నిర్వహణకు; బాలాయపల్లి మరియు ఉపాధి మండల కేంద్రాలయందు స్థలము కేటాయింపుకు ప్రతిపాదనలు పంపివున్నాం.
4. ఆర్‌డిఐఎఫ్ స్కీము క్రింద 2 వేల మెట్రిక్ టన్నుల గోదాము పూర్తికావస్తున్నది.
5. ఆర్‌డిఐఎఫ్ స్కీము క్రింద మరో 15వందల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాము మంజూరు చేయబడి వున్నది. ప్రస్తుతం టెండరు దశలో ఉన్నది.
6. 2015-16 సం॥ మార్కెటింగ్ ఫీజు 60 లక్షల రూపాయలు

   లక్ష్యం నిర్దేశించగా 73.00 లక్షల రూపాయలు వసూలు అయినది.

పై గోదాముల సౌకర్యాన్ని-'రైతుబందు' పథకం క్రింద స్వల్పకాలిక రుణాలుపొంది ఈ మంచి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి

**కార్యదర్శి**
**వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ**
**వెంకటగిరి**

**ఎస్.డి.వి.ప్రసాద్**
**ఛైర్మన్**
**వ్యవసాయ మార్కెట్ కమిటి**
**వెంకటగిరి**

## రైతుకూలీసంఘం (ఆంప్ర) వారికి శుభాకాంక్షలతో............



**మేలాపు విశ్రాంతమ్మ**

సర్పంచ్

కోటిపాం

కొమరాడ మండలం



**రతనాలు పార్వతి**

సర్పంచ్

పనసభద్ర

మక్కువ మండలం



**గంటా అప్పలస్వామి**

ఎంపిటిసి

పనసభద్ర

మక్కువ మండలం



**మండంగి సోములు**

సర్పంచ్

పెదశాఖ

కొమరాడ మండలం

# అమరులకు జోహార్లు

ఏఐకెఎమ్‌కెఎస్ ఉత్తరప్రదేశ్ నాయకులు **కా॥సురేంద్రసింగ్ ఖతియార్** వృద్ధాప్యం, అనారోగ్యంతో 18-4-14న మృతి చెందారు. 2011 డిసెంబర్ 19న విశాఖపట్నంలో జరిగిన ఏఐకెఎమ్‌కెఎస్ అఖిల భారత సదస్సుకు హాజరైన కా॥ఖతియార్ శ్రీకాకుళం అమరస్థూపం వద్ద విప్లవ నివాళులర్పించారు.

ఏఐకెఎమ్‌కెఎస్ నాయకులు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన **కా॥ఉమాశంకర్ సింగ్** వృద్ధాప్యంతో 8-2-14 తేదీన మరణించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) సీనియర్ నాయకులు **కా॥మ్రేడ్ వనచర్ల సుబ్బారావు** 7-12-14న మృతి చెందారు. మృతి చెందటానికి కొద్దికాలం ముందు 2013 అక్టోబర్ 13 నుండి 16 వరకు జరిగిన లక్షింపేట దళిత ప్రజానిరసన యాత్రలో లక్షింపేట నుండి శ్రీకాకుళం వరకు కా॥వనచర్ల సుబ్బారావు 92సం॥ వయస్సులో హుషారుగా పాల్గొని అందరి ప్రశంసలందుకున్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) గుంటూరుజిల్లా నాయకులు **కా॥సింహాద్రి వెంకటరెడ్డి** 27-1-13న మరణించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కృష్ణాజిల్లా కార్యకర్త కా॥పేరిశెట్టి రవికుమార్ 6-7-13న మృతి చెందారు.

ప్రజాతంత్రవాదులుగా, ప్రగతిశీల మేధావులుగా ప్రజా ఉద్యమాలకు వివిధ సందర్భాలలో వెన్నంటి నిలిచిన **జస్టిస్ చిన్నప్పరెడ్డి** 13-4-13న **చాగరి పద్మనాభరెడ్డి** 4-8-13న, **పిఎల్ నాయుడు, జస్టిస్ పి.ఏ.చౌదరి** 17-5-14న **వి.ఆర్.కృష్ణయ్యర్** 4-12-14న మృతి చెందారు. విద్యార్థి దశ నుండి ప్రగతిశీల భావాలతో విప్లవ విద్యార్థి సంస్థలో పనిచేసి, ప్రజాతంత్ర హక్కుల ఉద్యమంలో కృషి చేస్తున్న చిన్న వయసులోనే హైకోర్టు న్యాయవాది **వి.నారాయణరెడ్డి** 23-3-15న హైద్రాబాద్‌లో హఠాత్తుగా మృతి చెందారు.

విప్లవకవిగా, రచయితగా, ఉపాధ్యాయ ఉద్యమనాయకునిగా కృషి సాగించిన **ఛాయరాజ్** అనారోగ్యంతో 20-9-13న శ్రీకాకుళంలో మృతి చెందారు. శ్రీకాకుళ గిరిజనోద్యమం వస్తువుగా ఛాయరాజ్ రాసిన శ్రీకాకుళ వచన కావ్యంలో వినాశకర అతివాద పంథాను, ప్రజాయుద్ధ పంథాను విడమర్చి చర్చ చేశారు. ప్రజాయుద్ధ పంథా విశిష్టతను ఎలుగెత్తి చాటారు. వివిధ ప్రజాఉద్యమాలకు సంఘీభావంగా సాహిత్యాలను సృజించారు.

ప్రజాకళాకారునిగా దశాబ్దాలపాటు తన అరుదైన కంఠంతో పాటలు, కళారూపాలు ప్రదర్శించిన **కోద్రు రామారావు** 12-1-14న విశాఖపట్నంలో మృతి చెందారు. రైతుకూలీ సభల వేదికలపై రామారావు మాట, పాట ప్రజలను విశేషంగా ఆకట్టుకునేవి.

2016 గుంటూరు రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సభ్యునిగా వుంటూ అనారోగ్యానికి గురై ప్రజాకళాకారుడు **కా॥కాట్రగడ్డ హనుమంతరావు** మృతి చెందారు. రైతాంగ ఆత్మహత్యలపై పలు వేదికలపై ఆయన ప్రదర్శించిన ఏకపాత్రాభినయం ప్రేక్షకులను బాగా స్పందించజేసేదిగా వుండేది.

రైతుకూలీ, పీడిత ప్రజా ఉద్యమాలకు చేదోడు వాదోడుగా నిలిచిన **కా॥ముసునూరి సత్యనారాయణ** 2-6-16న గుంటూరులో మరణించారు.

నల్లజాతి ప్రజల తరఫున అవిశ్రాంతంగా పోరాడిన **నెల్సన్ మండేలా** 9-12-13న మరణించారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలను నిలిపిన హ్యుగోఛావెజ్ 5-1-13న మృతి చెందారు.

వివిధ రైతు కూలీ, ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ 9-12-13న **కా॥మాదాల నారాయణ స్వామి**, 9-3-16న **కా॥రాయల సుభాష్ చంద్రబోస్,** 6-6-16న **మొగులూరి సోమాచారి**, 6-6-16న **జె.వి.రాఘవులు,** 23-1-13న **పరకాల పట్టాభిరామారావు,** 29-1-13న **ఆరిక గుంపుస్వామి** మృతి చెందారు. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమ నిర్మాణ కృషిలో రాజ్యహింసకు బలైన వారికి మరియు వృద్ధాప్యం, అనారోగ్యంతో మరణించిన వారందరికీ మహాసభ జోహార్లర్పిస్తోంది.

విషసంస్కృతి మరియు పితృస్వామిక పీడన అణచివేతలకు గురై మరణించిన మహిళలకు, ఆడపిల్లలకు, విశ్వవిద్యా లయంలో కులవివక్షకు గురై మరణించిన రోహిత్ మృతిపట్ల ఈ మహాసభ సంతాపం తెలియజేస్తున్నది.

భూస్వామ్య, అగ్రకుల పెత్తందారుల దాడులలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు; ఆత్మహత్యలకు గురైన రైతాంగ కుటుంబాలకు, ప్రకృతి వైపరీత్యాలలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ సంతాపాన్ని వ్యక్తం చేస్తోంది.

# ప్రజాతంత్రమేధావి ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు డా॥బి.డి.శర్మకు నివాళి

ఆదివాసుల బతుకుల బాగు కోసం బహువిధాల పరితపించిన, విరామమెరుగక పరిశ్రమించిన గిరిజనుల ఆత్మబంధువు డా॥బి.డి.శర్మ(84సం॥) 6-12-15 రాత్రి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో అంతిమ శ్వాస విడిచారు. గాంధేయవాదిగా వుంటూ కూడా కమ్యూనిస్టు, విప్లవోద్యమంతో విడదీయలేని బంధం వేసుకున్న నిజమైన ప్రజాతంత్రవాది, గొప్పమేధావి, పరిపూర్ణ మానవతావాది మీదుమిక్కిలి కొండమొదలు, దుగ్గేరు గిరిజనోద్యమాలకు, అక్కడి ప్రజానీకానికి చిరపరిచితుడు, సన్నిహితుడు డా॥బి.డి.శర్మ.

1956 నాటికి గణితశాస్త్రంలో పి.హెచ్‌డి పట్టా అందుకుని, సివిల్ సీర్వస్ కోర్సు పూర్తి చేసుకొని డా॥బి.డి.శర్మ ఉమ్మడి బస్తురు జిల్లాకు కలెక్టరుగా నియమితులయ్యారు. ఆదివాసులకు, రైతులకు అనుకూలంగా చట్టపరిధుల్లో నిక్కచ్చిగా వ్యవహరించినందుకు ఆగ్రహించిన ఆ ప్రాంత భూస్వాములు ఆయనను, ఎన్నో అవమానాల పాల్జేసినా, మొక్కవోని దీక్షతో కడదాకా పీడిత ప్రజల పక్షమే వహించారు. 1992లో 'భారతజన్ ఆందోళన్' సంస్థను స్థాపించి, 'మా వూళ్ళో మా రాజ్యం' నినాదంతో డా॥బి.డి.శర్మ దేశవ్యాపితంగా పర్యటించి విశేష కృషి చేశారు. పలు గ్రామాల్లో ప్రజలు తమ గ్రామాల ముఖద్వారాల్లో 'హమారా గావ్ హమారా రాజ్' అని రాసి వున్న శిలాఫలాకాలను ప్రతిష్టించుకున్నారు. 2000 సం॥ ఫిబ్రవరిలో రైతుకూలీసంఘం ఏజన్సీ గిరిజన సంఘంతో కలిసి డా॥బి.డి.శర్మ గోదావరి, ఖమ్మం, విజయనగరం జిల్లాలలో పర్యటించి పలుచోట్ల ఈ శిలాఫలకాలను ప్రతిష్టించారు. 'పెసా' చట్టం రూపొందించబడటంలో డా॥బి.డి.శర్మ కీలకమైన పాత్ర పోషించారు.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీలు వికేంద్రీకరణ సంస్థలుగా రూపొందినాక, 'భారతజన్ ఆందోళన్' ఆదివాసుల స్వయంపాలనపై తన దృష్టి కేంద్రీకరించింది 'సంపన్న ఇండియా-పేదల భారత్'గా నిర్వచిస్తూ ఆయన ఇంగ్లీషులో వ్రాసిన 'ది టేల్ ఆఫ్ టు నేషన్స్'ను, నేషనల్ అగ్రికల్చరల్ పాలసీ-హౌఫార్ ఇటీజ్ నేషనల్' అనే పుస్తకాలను తెలుగులోకి అనువదించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రచురించింది.

2001 సం॥ నుండి రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) నిర్వహించిన రాష్ట్ర మహాసభలన్నింటిలో డా॥బి.డి.శర్మ ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. సంఘం నిర్వహించిన అన్ని రాష్ట్రస్థాయి సదస్సులు డా॥బి.డి.శర్మ లేకుండా జరగలేదంటే రైతాంగంతో ఆదివాసులతో, వారి ఉద్యమాలతో ఆయనెంత గాఢ అనుబంధం కలిగి వున్నారో అర్థమౌతుంది.

1996లో పశ్చిమగోదావరిజిల్లా మనుగోపులలో భూస్వాములు కా॥కారంపార్వతిని కాల్చి చంపటాన్ని, 1999లో విజయనగరంజిల్లా దుగ్గేరులో రైతుకూలీ ఉద్యమ కార్యకర్త కా॥జెన్ని తిరుపతిని భూస్వాముల గూండాలు హత్య గావించటాన్ని డా॥బి.డి.శర్మ తీవ్రంగా ఖండించారు. పార్వతీపురంలో కోరన్న, మంగన్నల వర్ధంతి సభకు పోలీసులు అనుమతి నిరాకరించటాన్ని డా॥బి.డి.శర్మ తీవ్రంగా నిరసించటమేగాక, ఆ సందర్భంగా జరిగిన సభలో పాల్గొని స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు.

ఐఏఎస్ ద్వారా లభించిన ఉన్నత ప్రభుత్వ హెూదాను ఆదివాసుల, గ్రామీణ పేదల కొరకు తృణప్రాయంగా త్యజించి, వారితో చేతులు కలపగలిగిన అరుదైన, విశిష్ట ఉన్నతాధికారి డా॥బి.డి.శర్మ, రైతుకూలీసంఘం సాగిస్తున్న కృషికి అండగా నిలుస్తూ, నిరంతర ప్రోత్సాహాన్నిచ్చే డా॥బి.డి.శర్మ మరణం ఆదివాసీ, రైతాంగ ఉద్యమాలకి తీవ్రమైన నష్టం. ఆదివాసీ, రైతుకూలీ, గ్రామీణ పేదల ఉద్యమాలను మరింత పట్టుదలగా ముందుకు తీసుకువెళ్ళటమే డా॥బి.డి.శర్మకు అర్పించే నిజమైన నివాళి.



# జిల్లా మహాసభలు





29.5.2015 అనంతపురంజిల్లా మహాసభ






14.4.2010 రంపచోడవరం
తూర్పుగోదావరి జిల్లా మహాసభ





12.10.2015 పిడుగురాళ్ళ
గుంటూరుజిల్లా మహాసభ






8.7.2015 నందిగామ
కృష్ణాజిల్లా మహాసభ






1.3.2.2015 వెంకటగిరి
నెల్లూరుజిల్లా మహాసభ






30.9.2015 ఒంగోలు
ప్రకాశంజిల్లా మహాసభ






24.4.2015 శ్రీకాకుళం
జిల్లా మహాసభ






2014 సెప్టెంబర్ 29, 30 బొబ్బిలి
విజయనగరంజిల్లా మహాసభ




2016 మహాసభలో ఎన్నికైన నూతన కార్యవర్గం



**1997 మే7న విశాఖలో జరిగిన రైతుకూలీసంఘం బహిరంగసభలో పాల్గొని గిరిజనుల మధ్య కూర్చున్న మహాశ్వేతాదేవికి నివాళులు**



**2003 డిశంబర్‌లో కొమరాడలో జరిగిన రైతుకూలీసంఘం బహిరంగ సభ తదనంతరం ఊరేగింపులో పాల్గొన్న డా॥బి.డి.శర్మకు నివాళులు**

# ప్రకాశంజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి

## ఒంగోలు డెయిరీ, ఒంగోలు





**ఫోన్: 231205, 234919, సెక్యూరిటీ: 234707, ఫ్యాక్స్: 234919**

**రిజిష్టరు నెం: AMC/PKM/DCO/2002/316**

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉత్పత్తిదారులకు అత్యధికంగా పాలు కొనుగోలు ధర చెల్లింపు
- గాలికుంటు మరియు గొంతువాపు వ్యాధి నివారణకు 50% రాయితీపై పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, పాల ఉత్పత్తి పెంచుటకు రైతులకు 50% రాయితీపై మేలు జాతి పశుగ్రాస విత్తనాలు సరఫరా.
- మేలుజాతి పాడిపశువుల అభివృద్ధికి 25% రాయితీతో ముర్రా జాతి విత్తనపు దున్నపోతులను సంఘములకు సరఫరా, పశువులకు ఉచిత వైద్యం కోసం ప్రతిరోజు గ్రామాలకు వైద్యులను పంపటం జరుగుతుంది.
- జిల్లాలో ఇప్పటివరకు 36.95 కోట్లతో 18,479 పాడిపశువుల కొనుగోలుకు ఋణసౌకర్యం 4.5% ప్రీమియంతో 2 సంవత్సరాల పాటు పశువులకు సంక్షేమ సౌకర్యం.
- 2011-12 సంవత్సరములో 500 సంకరజాతి ఆవులను మహారాష్ట్ర నుంచి, 1500 ముర్రాజాతి చూడి పడ్డలను హర్యానా నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై పంపిణీ చేయుటకు సన్నాహము జరుగుతున్నది.
- జిల్లా డెయిరీ ఆధ్వర్యంలో ఉన్న భూమిలో పశుగ్రాసం పెంచి ఉత్పత్తిదారులకు చితంగా పంపిణీ చేయుట జరుగును.
- రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా అత్యవసర పశువైద్యసేవల కోసం 3 అంబులెన్స్‌లతో వైద్య సౌకర్యం కల్పించుట జరుగుచున్నది.
- జిల్లా సమితి ఆధ్వర్యములో ముర్రాజాతి పడ్డలను పెంచి అమలు ధరకే ఉత్పత్తిదారులకు పంపిణీ చేయుట
- సమితి నుండి బహువార్షిక పశుగ్రాస వంగడాలు CO 3, CO 4 మరియు SSG 898 విత్తనముల సరఫరా చేయుట జరుగుచున్నది.

**శ్రీ చల్లా శ్రీనివాసరావు**
చైర్మన్

**శ్రీ.యమ్. శివరామయ్య**
మేనేజింగ్ డైరెక్టర్

# SBT Net Links




నంబూరు

కాజ

చినకాకాని

సెల్: 9492711052

ఆఫీసు: 8712293972

0863-2293977

# AMAR STAR TV

నంబూరు

కాజ

చినకాకాని

సెల్: 9492711052

ఆఫీసు: 8712293972

0863-2293977










- బిఎస్సీ విభాగంలో మూడు గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థిని ఎన్.లక్ష్మి-ప్రియదర్శిని విద్యార్థి
- ప్రముఖ సంస్థల క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు పొందిన వారు 31మంది

రైతుకూలీసంఘం (ఆంప్ర) వారికి శుభాకాంక్షలతో............

# ప్రగతి ఎత్తిపోతల పథక సంక్షేమ సంఘం

## కాజ-చినకాకాని-మంగళగిరి మండలం

రి.జ.నెం.363/1996

అధ్యక్షులు
ఈదా ప్రతాపరెడ్డి

ఉపాధ్యక్షులు
చాగర్లమూడి మధుసూదనరావు

కార్యదర్శి
మారెళ్ళ అంజిరెడ్డి

సహాయ కార్యదర్శి
మర్రి శ్రీరాములు

కోశాధికారి
బుర్రముక్కు శ్రీరామిరెడ్డి

కార్యవర్గ సభ్యులు:

1. బొర్రా సుబ్బారావు
2. ఏటుకూరి గంగాధరరావు
3. సింహాద్రి పాపిరెడ్డి
4. దానబోయిన వరప్రసాద్
5. కారుమూరి గోపాలరెడ్డి
6. ఈదా నాగేంద్రారెడ్డి
7. మారెళ్ళ బాపిరెడ్డి
8. మరియు రైతులు, సిబ్బంది


I Want to become a Teacher
who teaches life
I Want to become a Doctor
who saves life
I Hope my dreams come true
with RAMAKRISHNA
Dr. CHALAPATHI RAO EDUCATIONAL SOCIETY
RAMA KRISHNA PUBLIC SCHOOL
REPALLE
రామకృష్ణ
హాస్టల్ వసతి కలదు
☎ 08648 225914
పబ్లిక్ స్కూల్
నిజాంపట్నం రోడ్, రేపల్లె.


VIKAS SCHOOL
Knowledge by Virtue
V
NIZAMPATNAM
శ్రమయేవ జయతే

S
SNH
H

Cell : 9951299750
Ph : 222250

INDIAN MEDICAL ASSOCIATION
ESTD 1928

Dr. N. B. Rajendra Prasad
B.Sc., M.B.B.S.,Dch.

Regd No. 5666

**SUMA NURSING HOME**

**REPALLE** - 522 265

Guntur Dist. AP.



దేవినేని సురేష్

**CELL, 9848145245**
**939765444, 9849685055**

# లక్ష్మీదుర్గ శ్లాబ్స్ & టైల్స్

సాయిబాబా గుడి ప్రక్కన, రైలుపేట, రేపల్లె

సిమెంటు డీలర్స్

**కె.సి.పి., మహా, JP.JSW. దాల్మియా, నాగార్జున,**
**అల్ట్రాటెక్, ప్రియ, సాగర్‌ప్రియ,**
**వైజాగ్ స్టీల్, టాటా & హైదరాబాద్ స్టీల్**



CELL|: 9849327734
9014925959

# బొమ్మిడి అంతిరాజులు

అడ్వకేట్

పద్మావతి థియేటర్ వెనుక

రేపల్లె - 522 265, గుంటూరుజిల్లా

రైతుకూలీసంఘం (ఆంప్ర) వారికి శుభాకాంక్షలతో............

# జొన్నలగడ్డ సుబ్బారావు

(టీచరు)

బిఎస్ఎస్ఎస్ హైస్కూల్

ఏపిటిఎఫ్ కార్యకర్త

రేపల్లె

**సమాజ శ్రేయస్సే వ్యక్తి శ్రేయస్సు-విద్య వ్యాపార వస్తువు కారాదు.**

విద్యార్థుల సగటు G.P.A పెరుగుదలను సాధిస్తూ పురోగమిస్తున్న....




# బి.వి.సుబ్బయ్య హైస్కూల్

స్థాపితం:1963

**10వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు గల విద్యాసంస్థ**

## పేర్నమిట్ట. ఒంగోలు.

ఫోన్ : 08592-256232, 256295

- విద్యార్థుల సర్వతోముఖ వికాసమే లక్ష్యముగా పనిచేయుచున్న విద్యాసంస్థ
- పూర్తి పారదర్శకతతో నడపబడుతున్న విద్యాసంస్థ
- C.C.E పద్ధతిలో బోధిస్తున్న విద్యాసంస్థ
- సగటు G.P.A ప్రకటించగలుగుచున్న విద్యాసంస్థ.
- ఇది మా విజయానికి ఒక నిదర్శనం

**2016 మార్చి 10వ తరగతి ఉత్తీర్ణతా శాతం 99.18%**

**స్కూల్ గ్రేడ్ పాయింట్స్ యావరేజ్ 8.44**

**పరీక్షకు హాజరైన విద్యార్థులు : 123**

సెక్షన్‌కు సగటున 35 మంది విద్యార్థులనుంచబట్టే ఈ ఫలితాలు సాధించగలిగాము.

ఇది మా సంస్థ సమిష్టి కృషి ఫలితము.

| గ్రేడు | 10/10 | 9.8 | 9.7 | 9.5 | 9-9.3 | 8-8.9 | 7-7.9 | 6-6.9 | 5.5-5.9 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| సంఖ్య | 04 | 04 | 06 | 07 | 28 | 40 | 17 | 12 | 04 |

**అదనపు ఫీజు లేకుండా I.I.T ఫౌండేషన్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ కలదు.**

ముఖ్య సలహాదారు :
యస్. వెంకటేశ్వరరావు

**VI-X E.M. & T.M.**
**తరగతులకు**
**అడ్మిషన్లు జరుగుచున్నవి**

సెక్రటరి & కరస్పాండెంట్ :
బి. కోట్లింగము


సంగం డెయిరి
An ISO 9001:2008 AND ISO 22000:2005 Certified Dairy
సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్
సంగం
నాణ్యతకు, స్వచ్ఛతకు
'సంగం'
పాలు, పాల ఉత్పత్తులు
sangamdairy@gmail.com




రేల, కిందిరి నృత్యాలు






తప్పెటగుళ్ళు

# Rythu Coolie Sangham (A.P.), State Conference - 2016 Guntur




## రైతు కూలీ కార్మిక పీడిత ప్రజల ఐక్యత వర్ధిల్లాలి



